
'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 269

బుధవారం 12-6-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




ఆర్మీ చీఫ్‌గా ఉపేంద్ర ద్వివేది

ఎంపిక చేసిన కేంద్ర ప్రభుత్వం.. జూన్ 30న బాధ్యతల స్వీకరణ - 6లో



గెలిచి నిలిచిన పాక్

రాణించిన రిజ్వాన్, ఆమిర్.. 7 వికెట్ల తేడాతో కెనడాపై విజయం - 12లో



24 నుంచి పార్లమెంట్ సమావేశాలు

పార్లమెంట్ సమావేశాలు ఈ నెల 24 నుంచి జరుగనున్నాయి. సభ్యుల ప్రమాణ స్వీకారం తర్వాత స్పీకర్ ఎంపిక జరుగనుంది.

వివరాలు 6లో ▸



నీట్ గౌరవం దెబ్బతింటుంది

పేపర్ లీకేజీ, నిర్వహణ లోపాల పేరిట నీట్ పరీక్షను మళ్లీ నిర్వహిస్తే దానికున్న గౌరవం దెబ్బతింటుందని సుప్రీంకోర్టు పేర్కొంది.

వివరాలు 6లో ▸



గిరిజన బిడ్డకు సీఎం కిరీటం

ఒడిశా నూతన ముఖ్యమంత్రిగా గిరిజన బిడ్డ మోహన్ చరణ్ మాఝీ బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

వివరాలు 6లో ▸



మలావీ ఉపాధ్యక్షుడు దుర్మరణం

ఆఫ్రికా దేశం మలావీ ఉపాధ్యక్షుడు సాలోస్ చిలిమాతోపాటు మరో 9 మంది విమాన ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు.

వివరాలు 6లో ▸

ప్రజాపాలన అందిస్తాం

రాజధాని అమరావతే.. ఆర్థిక రాజధానిగా విశాఖ

ఎన్డీఏ శాసనసభాపక్ష సమావేశంలో చంద్రబాబు

- కేంద్రం సహకారంతో పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తాం
- నదుల అనుసంధానం ద్వారా ప్రతి ఎకరాకు నీరు అందిద్దాం
- రాష్ట్రం శిథిలమైంది.. సంక్షోభంలో ఉంది
- 93 శాతం సీట్లు, 57 శాతం ఓట్లతో విజయం గతంలో ఎప్పుడూ లేదు
- కక్షపూరిత రాజకీయాలొద్దు.. నిర్మాణాత్మకంగా ముందుకెళదాం
- తప్పు చేసిన వారికి చట్టపరంగానే శిక్ష పడాలి.. నేను, పవన్.. సామాన్యుల్లో ఒకరిగానే ఉంటాం
- చంద్రబాబు అద్భుత పాలన అందివ్వాలి : పవన్‌కళ్యాణ్
- ఉమ్మడి హామీలను బాధ్యతగా ముందుకు తీసుకెళ్లాలి
- ఎన్డీయే శాసనసభాపక్ష నేతగా చంద్రబాబు.. ప్రతిపాదించిన పవన్, బలపరిచిన పురందేశ్వరి
- ప్రభుత్వం ఏర్పాటు చేయాలని చంద్రబాబును ఆహ్వానించిన గవర్నర్



ఎన్డీఏ శాసనసభా పక్ష సమావేశంలో అభివాదం చేస్తున్న చంద్రబాబు. చిత్రంలో పురందేశ్వరి, పవన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రజా పాలన సాగిస్తామని, ప్రతి అడుగు ప్రజల కోసమే వేస్తామని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రజా వేదికలా కూల్చి వేతలు, మూడు రాజధానుల పేరుతో ఆటలు తమ ప్రభుత్వంలో ఉండవని స్పష్టం చేశారు. విజయవాడలోని ఏ కన్వెన్షన్‌లో మంగళవారం ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యేల సమావేశం నిర్వహించారు. ఇందులో ఎన్డీయే శాసనసభాపక్ష నాయకుడిగా చంద్రబాబు ఎన్నికయ్యారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రంలో బాధ్యతాయుతమైన పాజిటివ్ ప్రభుత్వం

మిగతా 2వ పేజీలో ▶

నేడు సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం

- మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసే ఛాన్స్
- గన్నవరం ఐటీ పార్కు వద్ద ఏర్పాట్లు పూర్తి
- హాజరుకానున్న ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా, ఎన్డీఏ నేతలు
- ప్రత్యేక అతిథులుగా రజనీకాంత్, చిరంజీవి

2లో

జనసేన శాసన సభా పక్ష నేతగా పవన్‌కళ్యాణ్

సాక్షి, అమరావతి: జనసేన పార్టీ శాసనసభా పక్ష నాయకుడిగా పవన్‌కళ్యాణ్ ఎన్నికయ్యారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం పవన్ అధ్యక్షతన ఆ పార్టీ శాసనసభా పక్ష సమావేశం జరిగింది. జనసేన తరపున గెలుపొందిన 21మంది ఎమ్మెల్యేలు హాజరయ్యారు. తెనాలి ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ జనసేన పార్టీ శాసనసభా పక్ష నాయకుడిగా పవన్‌కళ్యాణ్ పేరును ప్రతిపాదించగా, మిగిలిన ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

బీజేపీ శాసనసభా పక్ష నేత ఎంపిక బాధ్యత అధిష్టానానికే..



సాక్షి, అమరావతి: బీజేపీ శాసనసభా పక్ష నాయకుడిని ఎంపిక చేసే బాధ్యతను ఆ పార్టీ ఎమ్మెల్యేలు తమ అధిష్టానానికి అప్పగించారు. బీజేపీ తరఫున గెలుపొందిన ఎమ్మెల్యేలు మంగళవారం విజయవాడలోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సమావేశమయ్యారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో శాసనసభా పక్ష నేత ఎంపికపై చర్చించారు. చివరకు శాసనసభా పక్ష నేత ఎంపికపై నిర్ణయం తీసుకునే అధికారం బీజేపీ అధిష్టానానికే అప్పగిస్తూ ఆ పార్టీ ఎమ్మెల్యేలు నిర్ణయం తీసుకున్నారు.

ఊరూరా విధ్వంసాలు, వేధింపులు..

కొనసాగుతున్న దౌర్జన్యకాండ

వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలే లక్ష్యం

- చంద్రబాబు, లోకేశ్‌ల అండతో రెచ్చిపోతున్న టీడీపీ శ్రేణులు
- మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌కు చంపుతామని బెదిరింపు.. ఊరొదిలి వెళ్లాలని పోలీసుల ఉచిత సలహా
- పట్టపగలు అందరూ చూస్తుండగానే గ్రామాల్లో దాడులు
- తెనాలిలో, సత్తెనపల్లి మండలంలో ఇద్దరు నేతలపై హత్యాయత్నం
- టీడీపీ దౌర్జన్యాలు, విధ్వంసాలపై నేడు రాష్ట్రపతికి ఫిర్యాదు చేయనున్న వైఎస్సార్‌సీపీ
- ఢిల్లీ చేరుకుని అపాయింట్‌మెంట్ కోరిన ఎంపీల బృందం
- జాతీయ మీడియాకు ఏపీలో పరిస్థితిని వివరించనున్న ఎంపీలు

10లో



తెనాలిలో టీడీపీ కార్యకర్త దాడిలో తీవ్రంగా గాయపడిన సత్యం



పల్నాడు జిల్లా బట్లూరులో టీడీపీ నేతల దాడిలో తీవ్రంగా గాయపడిన శివయ్య

- రాష్ట్రంలో బీభత్సకాండపై సుప్రీం కోర్టు తలుపు తట్టిన వైఎస్సార్‌సీపీ
- హైకోర్టుకు వెళ్లాలని సూచన.. పిటిషన్ దాఖలు.. 13న విచారణ

ఈవీఎంలలో గోల్‌మాల్!

ఈసీ డేటాను ఉటంకిస్తూ 'ద వైర్' కథనం

- పోలైన, లెక్కించిన ఈవీఎం ఓట్లలో తేడాలు.. దాదాపు అన్ని లోక్‌సభ స్థానాల్లోనూ అంతే
- 140కి పైగా చోట్ల ఎక్కువ ఓట్లు లెక్కించారు
- కారణాలపై పెదవి విప్పని ఎన్నికల సంఘం

6లో

జగన్ ఓటమిని జీర్ణించుకోలేక..

కుటుంబ సమేతంగా ఆత్మహత్యాయత్నం

- వీడియో సందేశంతో గుర్తించిన పోలీసులు, కుటుంబ సభ్యులు..
- అందరూ ఓట్లు వేశామని చెబుతున్నా ఓటమికి కారణం ఏమిటని ప్రశ్న.. ఈవీఎంలలో ఏదో మోసం చేశారని ఆరోపణ
- తన కుటుంబం చావుతోనైనా ప్రజలకు తన ఆవేదన తెలియాలనే ఈ ప్రయత్నమని వెల్లడి

10లో

మంత్రివర్గంపై అర్ధరాత్రి వరకు బాబు కసరత్తు



- వెల్లడి కాని మంత్రుల జాబితా
- ఉప ముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్
- జనసేన నుంచి మంత్రివర్గంలోకి నాదెండ్ల మనోహర్.. జనసేనకు మరో రెండు పదవులు.. ఖరారు కాని పేర్లు
- టీడీపీ నుంచి లోకేశ్, నారాయణ మంత్రివర్గంలో చేరడం ఖాయం
- బీజేపీ నుంచి సత్యకుమార్, సుజనాకి పదవులు దక్కే అవకాశం

3లో

తూర్పు తీరం ఆడపడుచులుగా పిలిచే ఆలివ్ రిడ్లే తాబేళ్ల ప్రయాణం ఈ సీజన్‌లోనూ శుభప్రదంగా ముగిసింది. సంతానోత్పత్తి కోసం సముద్ర జలాల్లో వేల కిలోమీటర్ల దూరం ప్రయాణించి 'తూర్పు' తీరానికి వచ్చిన ఆలివ్ రిడ్లే ఆడ తాబేళ్లు ఇక్కడి ఇసుక తిన్నెల్లో గుడ్లు పెట్టి వెళ్లిపోయాయి. అటవీ శాఖ అధికారులు సుమారు 60 రోజులపాటు ఆ గుడ్లను సంరక్షించి.. వాటినుంచి వచ్చిన 75,596 పిల్ల తాబేళ్లను దశల వారీగా సముద్ర జలాల్లోకి భద్రంగా పంపించారు.




సముద్రంలోకి వెళ్తున్న ఆలివ్ రిడ్లే తాబేలు పిల్ల

వెళ్తున్నాం.. పెద్దయ్యాక వస్తాం!

'తూర్పు' తీరంలో ముగిసిన ఆలివ్ రిడ్లే తాబేళ్ల ప్రయాణం

- సంతానోత్పత్తికి పుట్టింటికొచ్చిన ఆలివ్ రిడ్లే
- ఆరు నెలల అనంతరం కడలిలోకి తిరుగు పయనం
- సముద్ర కాలుష్యానికి చెక్ ఆలివ్ రిడ్లే
- రికార్డు స్థాయిలో 75,596 పిల్లలు సముద్రంలోకి విడుదల
- వలంటీర్ల ద్వారా భద్రంగా పంపించిన అటవీ శాఖ

సాక్షి ప్రతినిధి, కాకినాడ: పురుటి కోసం పుట్టింటికి వచ్చే ఆడబిడ్డల మాదిరిగా ఆలివ్ రిడ్లే తాబేళ్లు సంతానోత్పత్తి కోసం పుట్టిల్లుగా భావించే కోస్తా తీరానికి ఏటా జనవరిలో తరలివస్తుంటాయి. పసిఫిక్, హిందూ మహా సముద్రాల నుంచి వేలాది కిలోమీటర్లు ప్రయాణించి కోస్తా తీరానికి వచ్చే ఆలివ్ రిడ్లే తాబేళ్లు ఈ సీజన్‌లో సైతం గుడ్లు పెట్టి సంతానోత్పత్తి ప్రక్రియ పూర్తి చేసుకున్నాయి. ఇతర జీవుల మాదిరిగానే తాబేళ్లు కూడా జన్మించిన ప్రాంతానికే సంతానోత్పత్తి కోసం తిరిగి రావడం విశేషం. సముద్ర గర్భంలో డిసెంబర్ నెలలో ఆడ, మగ తాబేళ్లు సంపర్కం చెందుతాయి. ఆ తరువాత వారం, పది రోజుల్లో ఆడ తాబేళ్లు గుడ్లు పెట్టేందుకు జనవరి నుంచి తీరంలోని ఇసుక తిన్నెల చెంతకు చేరుకుంటాయి.



రికార్డు స్థాయిలో జననాలు

ఈ సీజన్‌లో కాకినాడ తీరంలోని ఒక్క హోప్ ఐలాండ్ సంరక్షణ కేంద్రానికి వచ్చిన ఆలివ్ రిడ్లే తల్లి తాబేళ్ల సంఖ్య 292గా లెక్కతేల్చారు. అవి పెట్టిన గుడ్లను సంరక్షించడం ద్వారా 23,800 పిల్లలు జన్మించాయి. కోనసీమ తీరంలోని గచ్చకాయలపోర, ఎస్.యానాం, వాసాలతిప్ప సంరక్షణ కేంద్రాలకు 679 తాబేళ్లు ఈ సీజన్‌లో రాగా.. అవి పెట్టిన గుడ్లను రక్షించడం ద్వారా 51,796 తాబేలు పిల్లలు జన్మించాయి. వీటిని కోనసీమ అటవీ అధికారి ఎం.వరప్రసాదరావు సమక్షంలో అటవీ శాఖ సిబ్బంది సముద్రంలోకి విడిచిపెట్టడంతో ఈ సీజన్‌లో ఆలివ్ రిడ్లేల సంతానోత్పత్తి ప్రక్రియ జూన్ 8వ తేదీతో ముగిసింది. ఈ సీజన్‌లో పుట్టిన ఆడ తాబేలు పిల్లలు సుమారు 10 ఏళ్ల తరువాత గుడ్లు పెట్టే దశకు చేరుకుంటాయి. అవి గుడ్లు పెట్టడానికి తిరిగి ఇదే ప్రాంతానికి వస్తాయి.

ఈఏపీ సెట్‌లో బాలురు భళా

ఇంజనీరింగ్ విభాగంలో టాప్-10 ర్యాంకులు కైవసం

ఉత్తీర్ణత శాతంలో అమ్మాయిలదే హవా

- అగ్రికల్చర్ విభాగం టాప్ టెన్‌లో ఆరుగురు బాలురు, నలుగురు అమ్మాయిలు
- ఇంజనీరింగ్‌లో మాకినేని జిష్ణు సాయికి ప్రథమ ర్యాంకు
- అగ్రికల్చర్ విభాగంలో టాపర్‌గా తెలంగాణ కుర్రోడు శ్రీశాంత్‌రెడ్డి
- అడ్వాన్స్‌డ్‌లో 3వ ర్యాంకు సాధించిన సందేశ్‌కు ఈఏపీసెట్‌లోనూ అదే ర్యాంకు
- ఇంజనీరింగ్‌లో సీట్లకు మించి అర్హత సాధించిన విద్యార్థులు
- ఏపీ ఈఏపీసెట్ ఫలితాలు విడుదల

5లో



జిష్ణు సాయి ఇంజనీరింగ్ 1వ ర్యాంకు



దివ్యతేజ అగ్రికల్చర్ 2వ ర్యాంకు

టీడీపీ ఒత్తిళ్లతో వార్తా ఛానెళ్ల నిలిపివేత

ఏపీలో సాక్షి, మరికొన్ని ఛానళ్ల శాశ్వత నిరోధానికి యత్నం

- సుప్రీంకోర్టు తీర్పునకు ఇది విరుద్ధం
- కేబుల్ ఆపరేటర్లపై చర్యలు తీసుకోవాలి
- ట్రాయ్‌కు వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో అధికార టీడీపీ ఒత్తిళ్లతో మీడియా ప్రసారాలు నిలిపివేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. పలు వార్తా ఛానళ్ల ప్రసారాలు శాశ్వతంగా నిలిపివేయాలని ఆ పార్టీ యత్నిస్తోందని పేర్కొంది. ఎలాంటి చట్టబద్ధమైన అనుమతి, విధానపరమైన సమ్మతి లేకుండా అధికార టీడీపీ ఒత్తిళ్ల కారణంగా సాక్షి, టీవీ-9..

మిగతా 14వ పేజీలో ▶

క్లుప్తంగా...

చంద్రబాబుతో అమిత్‌షా భేటీ



సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుతో కేంద్ర హోం మంత్రి అమిత్ షా మంగళవారం రాత్రి భేటీ అయ్యారు. చంద్రబాబు ప్రమాణస్వీకారం కార్యక్రమానికి హాజరయ్యేందుకు గాను షా మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి ఉండవల్లిలో బాబు నివాసానికి ఆయన వెళ్లి అరగంటపాటు బాబుతో సమావేశమయ్యారు. భేటీ అనంతరం ఆయన విజయవాడ నోవాటెల్ హోటల్‌కు చేరుకున్నారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కూడా బాబు ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరుకానున్నట్లు ఏపీ బీజేపీ రాష్ట్ర కార్యాలయం తెలిపింది.

రాష్ట్రంలో నూతన పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తా

కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి శ్రీనివాసవర్మ



సాక్షి, భీమవరం: రాష్ట్రంలో నూతన పరిశ్రమల స్థాపనకు తన శక్తివంచన లేకుండా కృషిచేస్తానని నరసాపురం ఎంపీ, కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. కేంద్ర సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన తొలిసారి మంగళవారం భీమవరం వచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాసవర్మ మీడియాతో మాట్లాడుతూ ప్రధాని మోదీ మంత్రివర్గంలో తనకు స్థానం దక్కడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతానని చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చేవారికి అవసరమైన ప్రోత్సాహాన్ని అందజేస్తామన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు కృషిచేస్తానని తెలిపారు.

రేపు, ఎల్లుండి తెలుగు కేంద్ర మంత్రుల బాధ్యతల స్వీకారం!

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాలకు చెందిన కేంద్ర మంత్రులు బాధ్యతల స్వీకారానికి ముహూర్తాలు దాదాపు ఖరారయ్యాయి. కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ గురువారం లేదా శుక్రవారం బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ శుక్రవారం బాధ్యతలు స్వీకరిస్తారు. కాగా, తెలంగాణకు చెందిన కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

టీడీపీ ఫ్లెక్సీ కడుతుండగా ఘటన



ప్రమాదంలో మృతి చెందిన నరసింహ

కందుకూరు: చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలిపే ఫ్లెక్సీ కడుతూ విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి చెందిన ఘటన శ్రీపొట్టి శ్రీరాములు జిల్లా కందుకూరు మండలం మాచవరంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఇనకొల్లు గజపతి, అనూరాధ దంపతుల కుమారుడు నరసింహ (21) తోటి యువకులతో కలిసి చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలుపుతూ భారీ ఫ్లెక్సీ ఏర్పాటుకు సంకల్పించారు. తన ఇంటి సమీపంలో ఫ్లెక్సీ కట్టేందుకు యత్నిస్తుండగా, ఒక్కసారిగా పెద్ద గాలి వచ్చింది. దీంతో ఫ్లెక్సీ బ్యాలెన్స్ తప్పి పక్కనే వెళ్తున్న 11 కేవీ విద్యుత్ లైన్‌పై పడింది. ప్రమాదంలో ఫ్లెక్సీకి ఉన్న ఇనుప బోర్డుకు విద్యుత్ సరఫరా కావడంతో నరసింహ అక్కడికక్కడే మృతి చెందారు. చేతికి అందివచ్చిన కుమారుడు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు.

ఇదండీ సంగతి







వైఎస్ జగన్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ ముఖ్య నాయకులు, ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు కలిశారు. మంగళవారం తాడేపల్లిలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో ఆయనతో భేటీ అయ్యి పలు అంశాలపై చర్చించారు. వైఎస్ జగన్‌ను కలిసిన వారిలో రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ, ఎమ్మెల్సీలు కుంభా రవిబాబు, వరుదు కల్యాణి, మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, కృష్ణదాస్, కొట్టు సత్యనారాయణ, నాయకులు గంగుల ప్రభాకర్ రెడ్డి, మజ్జి శ్రీనివాసరావు, కేకే రాజు, జక్కంపూడి రాజా, రాపాక వరప్రసాద్, ఇంతియాజ్, అనంత వెంకట్రామిరెడ్డి, ముస్తఫా, బ్రిజేంద్రనాథ్‌రెడ్డి, అన్నా రాంబాబు, తెల్లం బాలరాజు, పాముల రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

నేడు సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం

హాజరుకానున్న ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా, పలువురు ఎన్డీయే నేతలు

ప్రత్యేక అతిథులుగా రజనీకాంత్, చిరంజీవి

మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసే అవకాశం.. గన్నవరం ఐటీ పార్కు వద్ద ఏర్పాట్లు పూర్తి

సాక్షి, అమరావతి/గన్నవరం: ఎన్నికల్లో విజయం సాధించిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు బుధవారం ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా రెండుసార్లు ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర విభజన తర్వాత 2014లో ఆయన మూడోసారి ముఖ్యమంత్రి పీఠం ఎక్కారు. ఇప్పుడు నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. బుధవారం ఉదయం 11.27 గంటలకు ఆయన ప్రమాణ స్వీకారం చేసేందుకు గన్నవరం ఐటీ పార్కు వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయనతోపాటు ఉప ముఖ్యమంత్రిగా జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ప్రమాణ స్వీకారం చేయడం దాదాపు ఖరారైంది. మరికొందరు మంత్రులు కూడా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రమాణ స్వీకారం తర్వాత తొలి సంతకం మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌పై చేసే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఎన్నికల్లో గెలిస్తే తొలి సంతకం మెగా డీఎస్సీపై చేస్తానని చంద్రబాబు ప్రకటించారు. ఆ హామీని నెరవేర్చేలా ప్రమాణ స్వీకార వేదికపైనే సంబంధిత ఫైలుపై సంతకం చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే ల్యాండ్ టైట్లింగ్ చట్టం రద్దుకు సంబంధించిన అంశంపైనా ప్రకటన చేసే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు.



ప్రమాణ స్వీకార ప్రాంగణంలో తనిఖీలు చేస్తున్న బాంబ్ స్క్వాడ్

హాజరుకానున్న ప్రధాని, రాజకీయ ప్రముఖులు

ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, పలువురు కేంద్ర మంత్రులు, రాజకీయ ప్రముఖులు హాజరవుతున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు అమిత్‌షా, నడ్డా ఇప్పటికే విజయవాడ చేరుకున్నారు. సినీ ప్రముఖులు రజనీకాంత్, చిరంజీవి, ఇతర సినీ ప్రముఖులను తన ప్రమాణ స్వీకారానికి చంద్రబాబు అతిథులుగా ఆహ్వానించగా చిరంజీవి కుటుంబంతో సహా ఇప్పటికే విజయవాడ వచ్చారు.

ఐటీ పార్కు ప్రాంగణం సిద్ధం

ప్రమాణ స్వీకారానికి ఐటీ పార్కు వద్ద 14 ఎకరాల ప్రాంగణాన్ని అధికార యంత్రాంగం సిద్ధం చేసింది. 2.5 ఎకరాల్లో ప్రధాన వేదిక, వీఐపీ గ్యాలరీ, మిగిలిన 11.5 ఎకరాల్లో నాయకులు, ప్రజల కోసం గ్యాలరీలు సిద్ధం చేస్తున్నారు. సభా ప్రాంగణం లోపల, వెలుపల ఎల్‌ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. గన్నవరం ఎయిర్‌పోర్ట్ ప్రధాన గేటుకు సమీపంలోనే ఉన్న సభా వేదిక వద్దకు ప్రధాని, కేంద్ర మంత్రులు నేరుగా చేరుకునే సౌకర్యం కల్పించారు. వీఐపీల కోసం ఐదు ప్రత్యేక గ్యాలరీలు సిద్ధం చేశారు. నాయకులు, కార్యకర్తల కోసం 36 గ్యాలరీలుగా విభజించారు. ఈ కార్యక్రమానికి వచ్చే బస్సులు, కార్లు, ఇతర వాహనాల కోసం గన్నవరం పరిసర ప్రాంతాల్లో పలుచోట్ల పార్కింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ప్రముఖుల భద్రత, వేదిక, వసతుల కల్పన, బారికేడ్ల ఏర్పాటు, పారిశుద్ధ్యం వంటి పనులను ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు ఈ కార్యక్రమం కోసం 7 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రమాణ స్వీకార కార్యక్రమ సమన్వయాధికారి ప్రద్యుమ్న ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లతో సమావేశం నిర్వహించారు.

రద్దీగా మారిన గన్నవరం ఎయిర్‌పోర్టు

ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎక్కువ మంది వీఐపీలు వస్తుండడంతో గన్నవరం ఎయిర్ పోర్టు రద్దీగా మారిపోయింది. ఢిల్లీ, హైదరాబాద్ ఎయిర్‌పోర్టుల నుంచి పలు ప్రత్యేక విమానాల్లో అతిథులు రావడంతో గన్నవరం ఎయిర్‌పోర్టు సందడిగా మారింది. బుధవారం ఉదయం ఇంకా రద్దీగా మారే పరిస్థితి ఉండడంతో ఎయిర్‌పోర్టులో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రయాణికుల రాకపోకలపై ఆంక్షలు విధించారు. ఉదయం 9.30 గంటలలోగా ప్రయాణికులు ఎయిర్ పోర్టుకు చేరుకోవాలని ఎయిర్‌పోర్టు అధికారులు సూచించారు. ప్రయాణికుల విమానాల రాకపోకలపై ఆంక్షలు లేవని, కానీ ముందుగా ఎయిర్‌పోర్టుకు చేరుకోవాలని సూచిస్తున్నారు.

తిరుమల వెళ్లనున్న చంద్రబాబు

ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత బుధవారం సాయంత్రం చంద్రబాబు తిరుమల వెళ్లనున్నారు. రాత్రికి అక్కడే బస చేసి గురువారం ఉదయం కుటుంబ సమేతంగా వెంకటేశ్వరస్వామిని దర్శించుకోనున్నారు. అనంతరం అదే రోజు తిరిగి విజయవాడ చేరుకుంటారని టీడీపీ వర్గాలు తెలిపాయి.

ప్రధాని మోదీ పర్యటనకు పటిష్ట భద్రత

10 వేల మందితో భద్రతా ఏర్పాట్లు

భద్రతా వలయంలో విజయవాడ–గన్నవరం



పీఎం కాన్వాయ్ ట్రయల్ రన్

సాక్షి, అమరావతి/విమానాశ్రయం (గన్నవరం): రాష్ట్రానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రానున్న నేపథ్యంలో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. 10 వేల మంది భద్రతా బలగాలతో పటిష్ట బందోబస్తు నెలకొల్పారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బుధవారం ప్రమాణ స్వీకారం చేసే కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రధాని మోదీ రానున్నారు. ఆయనతోపాటు కేంద్ర హోం మంత్రి అమిత్ షా, పలువురు కేంద్ర మంత్రులు, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. అమిత్ షా మంగళవారం రాత్రికే విజయవాడ చేరుకున్నారు. కాగా.. ప్రధాని మోదీ, ఇతర ప్రముఖులు బుధవారం ఉదయం రాష్ట్రానికి రానున్నారు. ప్రధాన మంత్రి మోదీ పర్యటనకు భద్రత కల్పించేందుకు ప్రత్యేక భద్రతా విభాగం (ఎస్పీజీ) బలగాలు రెండు రోజుల క్రితమే రాష్ట్రానికి చేరుకున్నాయి. గన్నవరం సమీపంలోని కేసరపల్లిలో సభా ప్రాంగణాన్ని ఇప్పటికే తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. మరో 10 వేల మంది పోలీసు బలగాలను ప్రధాన మంత్రి పర్యటన కోసం వినియోగిస్తున్నారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసం నుంచి గన్నవరంలోని కేసరపల్లి వరకు 22 కి.మీ. వరకు దారి పొడవునా ఇరువైపులా భద్రతా బలగాలు మోహరించాయి. గన్నవరం విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లోనూ బలగాలు నిఘాను పటిష్టపరిచాయి. కేసరపల్లి ప్రాంతాన్ని నో ఫ్లై జోన్‌గా ప్రకటించారు. డ్రోన్లు గానీ బెలూన్లు గానీ ఎగుర వేయకూడదని స్పష్టం చేశారు. కోల్‌కత్తా–చెన్నై జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. అధికారిక పాస్‌లు ఉన్న వాహనాలు మినహా.. ఇతర వాహనాలను ఆ మార్గంలో అనుమతించబోమని ప్రకటించారు. విజయవాడలోని కమాండ్ కంట్రోల్ కేంద్రంగా భద్రతా ఏర్పాట్లను నిశితంగా పరిశీలిస్తున్నారు. డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, అదనపు డీజీ శంకబ్రాత బాగ్చీ, విజయవాడ పోలీస్ కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ, ఏలూరు, గుంటూరు ఐజీలు అశోక్‌కుమార్, సర్వశ్రేష్ఠ త్రిపాఠి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ఎస్పీజీ ఐజీ సమీక్ష

ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఎస్పీజీ ఐజీ నవనీత్‌కుమార్ మెహతా అధికారులకు సూచించారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో మంగళవారం భద్రతా ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో ముందస్తు భద్రత సమన్వయం (ఏఎస్ఎల్) నిర్వహించారు. అనంతరం ఎయిర్‌పోర్ట్ నుండి ప్రమాణ స్వీకార వేదిక వరకు పీఎం కాన్వాయ్ ట్రయిల్‌రన్ నిర్వహించారు. తొలుత పీఎం కాన్వాయ్ రాకపోకలకు సంబంధించి రూట్‌మ్యాప్‌పై అధికారులతో మెహతా చర్చించారు. వ్యవసాయ శాఖ కమిషనర్ సీహెచ్ హరికిరణ్, డీఐజీ గోపీనాథ్‌జెట్టి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ, అదనపు ఎస్పీ జి.వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని పాల్గొన్నారు.

టీడీపీ బస్సుకు జెండా ఊపిన ప్రభుత్వ అధికారి

రాజకీయ నేత అవతారమెత్తడంపై సర్వత్రా విమర్శలు



టీడీపీ జెండా ఊపి బస్సుయాత్రను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి ఆర్డీవో

ఇచ్ఛాపురం రూరల్: ఎన్నికల అధికారి అంటే రాజకీయాలకతీతంగా, రాజకీయ నాయకులతో సత్సంబంధాలు లేకుండా విధులు నిర్వహించేవాడు. అయితే ఈ ఎన్నికల అధికారి మాత్రం ఏకంగా రాజకీయ జెండాను చేత బట్టుకుని బస్సు యాత్రను ప్రారంభించడం విమర్శలకు దారితీస్తోంది. ఇచ్ఛాపురం నియోజకవర్గం ఎన్నికల అధికారిగా విధులు నిర్వహించిన ఇన్‌చార్జి ఆర్డీవో బి.సుదర్శన్ దొర బుధవారం చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి వెళ్తున్న బస్సును టీడీపీ జెండా ఊపి ప్రారంభించారు. ప్రభుత్వ అధికారిగా ఉండి ఇలా పార్టీ జెండాను ఊపి బస్సును ప్రారంభించడంపై స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రజాపాలన అందిస్తాం



▶ మొదటి పేజీ తరువాయి

ఉంటుందని, అశాంతికి తావుండదని చెప్పారు. రాష్ట్ర చరిత్రలో లేని విధంగా ప్రజలు తీర్పు ఇచ్చారని, ఆ తీర్పును నిలబెట్టుకునే బాధ్యత ఎమ్మెల్యేలందరిపైనా ఉందన్నారు. ప్రమాదంలో ఉన్న రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి ప్రజలు చొరవ చూపారని.. ప్రజలు గెలిచారని, రాష్ట్రాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత తమపై ఉందని చెప్పారు. ఈ ఎన్నికల్లో తాము ఓడింది కేవలం 11 సీట్లలో మాత్రమేనని, 93 శాతం స్ట్రైక్ రేట్‌తో 57 శాతం ఓట్లను కూటమి సాధించిందని తెలిపారు. ఇలాంటి విజయం, ఇంతటి సంతోషం ఎప్పుడూ లేదని, ఫలితాలతో ఏపీ ప్రతిష్ట, గౌరవం పెరిగిందని చెప్పారు. తనను జైల్లో పెట్టినప్పుడు పవన్ కళ్యాణ్ ఇచ్చిన మద్దతును ఎప్పుడూ మరిచిపోనన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని గతంలో చెప్పారని, జైల్లో తనను కలిసిన అనంతరం పొత్తు ప్రకటించారని తెలిపారు. ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెడతామని, మళ్లీ ప్రజల రుణం తీర్చుకునే సమయం ఆసన్నమైందన్నారు. రాష్ట్రం ఉన్న పరిస్థితుల్లో కేంద్ర సహకారం కూడా అవసరమని, ఈ మేరకు కేంద్రం కూడా హామీ ఇచ్చిందని చెప్పారు. రాష్ట్రం పూర్తిగా శిథిలమైందని, దెబ్బతినని వర్గమంటూ లేదన్నారు. పాలన ఎలా ఉండకూడదో, గత పాలన ఒక కేస్ స్టడీ అని చెప్పారు. కక్ష తీర్చుకోవాలని ముందుకెళితే సమస్యలు వస్తాయని, అలాగని తప్పు చేసిన వారిని క్షమించి పూర్తిగా వదిలేస్తే మళ్లీ అదే బాట పడతారన్నారు. చట్ట పరంగా శిక్షించడంతో పాటు విధ్వంసం, కక్ష రాజకీయాలు చేయకుండా సరైన దారిన పెట్టాలన్నారు. తనకు అసెంబ్లీలో అవమానం జరిగిందని, దాన్ని భరించలేక మళ్లీ ముఖ్యమంత్రిగానే అసెంబ్లీలో అడుగుపెడతానని శపథం చేశానని గుర్తు చేశారు. శాసన సభను గౌరవ సభగా మార్చి ప్రజా సమస్యలు పరిష్కరించే వేదికగా మార్చుకుందామన్నారు.

కక్షపూరిత రాజకీయాలు ఉండవు

రాష్ట్రానికి ఎంత అప్పు ఉందో తెలీదని, ఎక్కడ నుండి తెచ్చారో తెలీదని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైందని చంద్రబాబు అన్నారు. సాగునీటి వ్యవస్థ నిర్వీర్యం అయిందని, వ్యవసాయ రంగం పూర్తిగా సంక్షోభంలో ఉందన్నారు. పదేళ్ల తర్వాత కూడా రాజధాని ఏది అంటే చెప్పుకోలేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కక్ష పూరిత రాజకీయాలు కాకుండా నిర్మాణాత్మక రాజకీయాలు పాటిద్దామని చెప్పారు. పోలవరం డయా ఫ్రంవాల్ కొట్టుకుపోయిందని, మళ్లీ కేంద్రం సహకారంతో ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు. నదుల అనుసంధానంతో ప్రతి ఎకరాకు నీళ్లందిస్తామని తెలిపారు.

రాజధానిగా అమరావతి.. ఆర్థిక రాజధానిగా విశాఖ

ఏపీకి రాజధానిగా అమరావతి, ఆర్థిక రాజధానిగా విశాఖ ఉంటుందని బాబు స్పష్టం చేశారు. న్యాయ రాజధాని కర్నూలు అంటూ మోసం చేశారని, రాయలసీమలో వన్ సైడ్‌గా ఎన్నికలు జరిగాయని చెప్పారు. ముఖ్యమంత్రి కూడా మామూలు మనిషేనని, తాను సీఎంగా ఉన్నా, పవన్ కళ్యాణ్ ఏ పదవిలో ఉన్నా సామాన్యుల్లా ప్రజల్లో ఒకరిగానే ఉంటామని తెలిపారు. హోదా, సేవ కోసం తప్ప పెత్తనం కోసం కాదన్నారు. తమ ప్రభుత్వంలో ఏ ఒక్కరి ఆత్మగౌరవానికి భంగం కలగదని, స్టేట్ ఫస్ట్ నినాదంతో ముందుకు వెళతామన్నారు. కేంద్రంలో రాష్ట్రానికి సముచిత గౌరవం దక్కిందన్నారు. పదేళ్ల మోదీ పాలన దేశ ప్రతిష్టను పెంచిందని, గతంలో 11వ స్థానంలో ఉన్న ఆర్థిక వ్యవస్థ 5వ స్థానానికి వచ్చిందని తెలిపారు. ఓట్లు వేసి గెలిపించిన ప్రజలు బాధ్యత తీరిపోయిందనుకోకుండా నిత్యం తమను ఆశీర్వదించి ముందుకు నడపాలన్నారు. తప్పు చేస్తే ఫీడ్ బ్యాక్ ఇవ్వాలని, కలిసి ముందుకు సాగి రాష్ట్రాన్ని పునర్నిర్మించుకుందామని కోరారు. తెలుగు జాతి ప్రపంచంలో నంబర్ వన్‌గా ఉండాలనేది తన కల అని తెలిపారు. నిర్దిష్ట సమయంలోనే ఏపీని నంబర్ వన్‌గా చేసుకుందామన్నారు.

హామీలన్నీ నెరవేర్చేలా పాలన: పవన్ కళ్యాణ్



జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. ఐదు కోట్ల మందికిపైగా ప్రజలు తమపై నమ్మకం పెట్టుకున్నారని, కక్ష సాధింపులు, వ్యక్తిగత దూషణలకు ఇది సమయం కాదన్నారు. అన్నింటా బలంగా నిలబడతామని చెప్పి అధికారంలోకి వచ్చామని, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉందన్నారు. నాలుగు దశాబ్దాల అనుభవం, అభివృద్ధిపై అవగాహన, పెట్టుబడులు తెచ్చే సమర్థత, ప్రతిభ, విదేశాల్లో ఉండే నాయకుల్ని, వివిధ దేశాధి నేతల దృష్టిని సైతం తెలుగు రాష్ట్రాల వైపు మళ్లించే సమర్థత చంద్రబాబుకు ఉందన్నారు. చంద్రబాబు ఎంతో నలిగిపోయారని, జైల్లో ఆయన్ని చూశానని, మంచి రోజులు వస్తాయని చెప్పానని, వచ్చాయని తెలిపారు. ఆయన అద్భుతమైన పాలన ఇవ్వాలని కోరుకుంటున్నానని చెప్పారు. కలసికట్టుగా చేసిన కృషితో ఎన్డీయే కూటమి అద్భుత మెజారిటీతో 164 శాసన సభ స్థానాలు దక్కించుకుందన్నారు. ఒక్క ఓటు చీలకుండా అలయెన్స్ ఎలా ఉండాలో ఆంధ్ర రాష్ట్ర ప్రజలు కలిసికట్టుగా చూపించారని తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి మాట్లాడుతూ.. ఎవరూ ఊహించని విధంగా అనూహ్య విజయం సాధించామన్నారు. ఈ విజయం నుంచి తాము కూడా ఒక గుణపాఠం నేర్చుకోవాలన్నారు. సబ్ కా సాత్, సబ్ కా వికాస్ లక్ష్యంతో పని చేయాలని, మూడు పార్టీల కలయిక త్రివేణి సంగమమని తెలిపారు.

ఎన్డీయే సభాపక్ష నేతగా చంద్రబాబు

ఈ సమావేశంలో చంద్రబాబును ఎన్డీయే శాసనసభా పక్ష నేతగా ఎన్నుకున్నారు. తొలుత టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తమ పార్టీ శాసనసభాపక్ష నేతగా చంద్రబాబును ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నట్లు ప్రకటించారు. అనంతరం పవన్ కళ్యాణ్, చంద్రబాబును ఎన్డీయే శాసనసభా పక్ష నేతగా ప్రతిపాదించగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి బలపరిచారు. సమావేశం తర్వాత అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్, పురందేశ్వరిలు రాజ్‌భవన్‌కు వెళ్లి 164 మంది ఎమ్మెల్యేలు చంద్రబాబును ఎన్డీయే పక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు తెలిపి ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరారు. అనంతరం చంద్రబాబు గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో మంగళవారం రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. దాదాపు 30 నిముషాల పాటు సమావేశమయ్యారు. తనకు మద్దతు ప్రకటించిన 164 మంది ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యేల జాబితాను గవర్నర్‌కు సమర్పించారు. దాంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని గవర్నర్.. చంద్రబాబును లాంఛనంగా ఆహ్వానించారు. చంద్రబాబు ఉండవల్లిలోని తన నివాసానికి బయలుదేరి వెళ్లారు. గన్నవరం సమీపంలోని కేసరపల్లిలో బుధవారం సీఎంగా చంద్రబాబుతో గవర్నర్ పదవీ స్వీకార ప్రమాణం చేయించనున్నారు.

ఇక పిడుగుల మోతతో వానలు

- ఐదు రోజులు ఇదే పరిస్థితి
- మూడు రోజులు మోస్తరు వర్షాలు

సాక్షి, విశాఖపట్నం/అనంతపురం (అగ్రికల్చర్): రాష్ట్రంలో పిడుగులు మోత మోగించనున్నాయి. రానున్న ఐదు రోజులు ఇవి దడ పుట్టించనున్నాయి. రెండు మూడు మినహా మిగిలిన జిల్లాల్లో పిడుగులు ప్రభావం చూపనున్నాయి. మరోవైపు రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయి. ప్రస్తుతం సముద్ర మట్టానికి 3.1, 5.8 కి.మీ. మధ్య ఉన్న గాలుల కోత, షీర్ జోన్ కొనసాగుతున్నాయి. ఫలితంగా బుధ, గురువారాల్లో అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. శుక్రవారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలకు ఆస్కారం ఉందని పేర్కొంది. అదే సమయంలో వానలు,



ఉరుములు, మెరుపులతోపాటు పిడుగులు కూడా సంభవిస్తాయంది.

'అనంత'లో వర్షాలు

జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు జిల్లాలోని 29 మండలాల పరిధిలో వర్షం కురిసింది. ఉరవకొండలో 29.6 మి.మీ., పామిడిలో 20.4 మి.మీ., వజ్రకరూరులో 20.2 మి.మీ., గార్లదిన్నెలో 20 మి.మీ. చొప్పున వర్షపాతాలు నమోదయ్యాయి. పెద్దవడుగూరు, శింగనమల, గుంతకల్లు, యాడికి, పుట్లూరు, యల్లనూరు, గుత్తి, రాయదుర్గం, అనంతపురం, బుక్కరాయసముద్రం, ఆత్మకూరు, నార్పల తదితర మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది.

'స్టూడెంట్ కిట్'గా విద్యాకానుక

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు విద్యాకానుక కిట్లను అందించేందుకు సమగ్ర శిక్ష విభాగం ఏర్పాట్లు చేస్తోంది. గత ప్రభుత్వం ప్రారంభించి, నాలుగేళ్లపాటు అందించిన జగనన్న విద్యాకానుక కిట్లను 2024–25 విద్యా సంవత్సరంలో 'స్టూడెంట్ కిట్'గా అందించనున్నారు. గురువారం నుంచి పాఠశాలలు ప్రారంభంకానున్న నేపథ్యంలో మండల స్టాక్ పాయింట్ల నుంచి స్టూడెంట్ కిట్లను ఆయా పాఠశాలలకు పంపించాలని సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారులు, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్లను ఆదేశించారు. రవాణాకు అవసరమైన నిధులను సైతం విడుదల చేశామని, తరగతి, విద్యార్థుల వారీగా అందించాల్సిన వస్తువులను సిద్ధం చేయాలని సూచించారు.

భక్తిసాగరంలో ముంచెత్తిన అయోధ్యకాండ అఖండ పారాయణం

తిరుమల: లోకకల్యాణం కోసం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమలలోని నాదనీరాజనం వేదికపై మంగళవారం ఉదయం జరిగిన 11వ విడత అయోధ్యకాండ అఖండ పారాయణం భక్తులను భక్తిసాగరంలో ముంచెత్తింది. ఉదయం 7 నుండి 9 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమాన్ని ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేసింది. అయోధ్యకాండలోని 40 నుండి 44వ సర్గ వరకు మొత్తం నాలుగు సర్గల్లో 159 శ్లోకాలు, యోగవాశిష్టం, ధన్వంతరి మహామంత్రంలోని 25 శ్లోకాలు కలిపి మొత్తం 184 శ్లోకాలను పారాయణం చేశారు. ధర్మగిరి వేద పాఠశాల పండితులు రామానుజాచార్యులు, అనంత గోపాలకృష్ణ, మారుతి శ్లోక పారాయణం చేశారు. అఖండ పారాయణంలో ధర్మగిరి వేద పాఠశాల, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం అధ్యాపకులు, ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థకు చెందిన వేదపారాయణదారులు, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్ర పండితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు శ్రీనివాస్ బృందం సంకీర్తనలను రసరమ్యంగా ఆలపించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, పండితులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



అఖండ పారాయణంలో సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయ స్వామికి హారతిస్తున్న అర్చకులు

చిక్కవు.. దొరకవు..

- చేపల కోసం ప్రజల ఎదురుచూపు
- సముద్రంలో వేట నిషేధం అమలు
- నదీపాయలలో తగ్గిన లభ్యత



గోదావరి నదీపాయల్లో సాగుతున్న వేట

సాక్షి, అమలాపురం: ఒకవైపు సముద్రంలో వేట నిలిచిపోయింది. గంగపుత్రులకు రోజు గడవని పరిస్థితి. మరోవైపు మృగశిర మాసం వచ్చేసింది. మాంసాహార ప్రియులకు రుచికరమైన చేపను ఆహారంగా తీసుకోవడం ఆనవాయితీ. ప్రస్తుతం చెరువు చేప, నదీ పాయల మధ్య దొరికే చేపలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. సముద్ర చేపకు ప్రత్యామ్నాయంగా చెరువు చేప వినియోగం పెరిగినా.. ఉన్న కొద్దిపాటి ధర తగ్గడంతో చేపల రైతులు లబోదిబోమంటున్నారు. ఇలా చేప చిక్కక అటు మత్స్యకారులు, మాంసాహార ప్రియులు వాపోతున్నారు.

జూన్ 15 వరకూ వేట నిషేధం

మత్స్య క్రమబద్ధీకరణ చట్టంలో భాగంగా జిల్లాలో సముద్ర వేట నిలిచిపోయింది. ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 తేదీ వరకూ సుమారు 61 రోజులు వేట ఆగింది. ఈ సమయంలో చేపలు, ఇతర సముద్ర జీవాల పునరుత్పత్తి జరిగే అవకాశమున్నందున కన్యాకుమారి నుంచి కోల్‌కతా వరకూ వేటను నిషేధిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. గతంలో అంగుళం, అర అంగుళం వలలతో వేట చేయడం వల్ల చిన్న చేపలు తప్పించుకునేవి. ప్రస్తుతం రింగు వలలు (సూక్ష్మ కన్నాలు ఉండే వల) వాడుతుండడంతో చిన్న చేపలు కూడా వేటకు దొరకుతున్నాయి. దీనిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం వేట నిషేధాన్ని పక్కాగా అమలు చేస్తోంది.

మీనం.. ఔషధం

చేపలు తినడం ఆరోగ్యానికి మంచిదని ఎప్పటి నుంచో వైద్యులు చెబుతున్న విషయం తెలిసిందే. ఈ కారణంగానే చేపలకు డిమాండ్ పెరిగింది. మరీ ముఖ్యంగా మృగశిర కార్తి రోజులలో చేపలు తినడం ఆరోగ్యానికి మేలని నమ్మకం. ఈ కార్తిలో తొలకరి వర్షాలు ఆరంభమవుతాయి. రోగ నిరోధక శక్తి తగ్గి జ్వరం, దగ్గు, శ్వాస సంబంధ వ్యాధులు వస్తాయి. చేపలు ఆహారంగా తీసుకోవడం వల్ల వాటి నుంచి కాపాడుకోవచ్చు. ఇది శాస్త్రీయంగా నిరూపితమైంది. హైదరాబాద్‌లో ఇటీవల చేప మందు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. చేపలలోని ఒమేగా–3 ఫ్యాటీ యాసిడ్స్ వల్ల గుండెకు చాలా ఆరోగ్యం. ఇది రక్తం గడ్డకట్టడాన్ని తగ్గిస్తోంది. మెదడులో గ్రే మ్యాటర్ మెరుగువతోంది. దృష్టి లోపం, అంధత్వాన్ని తగ్గిస్తోంది. ఒమేగా–3 ఫ్యాటీ యాసిడ్స్ సమ్మేళనాలతో కొలెస్ట్రాల్ బిల్డింగ్ లిపిడ్‌లను నియంత్రిస్తోంది.

మంత్రివర్గంపై అర్ధరాత్రి వరకు బాబు కసరత్తు

సాక్షి, అమరావతి: రాష్ట్ర మంత్రివర్గంపై చంద్రబాబు కసరత్తు మంగళవారం అర్ధరాత్రి ఓ కొలిక్కి వచ్చినట్లు సమాచారం. అయితే, మంత్రివర్గంలో ఎవరెవరికి స్థానం దక్కిందన్న వివరాలు బయటకు రాలేదు. చంద్రబాబుతోపాటు ఎన్డీఏ కూటమి నుంచి గెలుపొందిన పలువురు ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణం చేయడం ఖాయమైనప్పటికీ, వారి పేర్లు మాత్రం మంగళవారం అర్ధరాత్రి దాటినా వెల్లడి కాలేదు. కేంద్ర మంత్రి అమిత్‌షా మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో చంద్రబాబు నివాసానికి వెళ్లారు. ఆ సమావేశం తర్వాత కొత్త మంత్రుల వివరాలను వెల్లడించే అవకాశం ఉందని టీడీపీ వర్గాలు తెలిపాయి.

ఉప ముఖ్యమంత్రిగా జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, మంత్రిగా అదే పార్టీకి చెందిన నాదెండ్ల మనోహర్ మంత్రిగా ప్రమాణం చేయడం ఖరారైనట్లు చెబుతున్నారు. జనసేన తరఫున మరో ఇద్దరికి మంత్రులుగా అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. అయితే, ఎవరికి పదవులు దక్కుతాయో తేలలేదు. టీడీపీ తరఫున నారా లోకేశ్, పి. నారాయణ మంత్రివర్గంలో చేరడం ఖాయమని చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలవారీగా జిల్లాకు ఒకటి నుంచి రెండు మంత్రి పదవులు కేటాయించే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. సామాజికవర్గాల వారీగా ఎవరిని మంత్రివర్గంలో తీసుకోవాలనేది నిర్ణయమైనా ఇంకా బయటపెట్టలేదు. కమ్మ, కాపు సామాజిక వర్గాలకు నాలుగు చొప్పున మంత్రి పదవులు ఇస్తారనే ప్రచారం జరుగుతోంది. రెడ్డి సామాజిక వర్గానికి రెండు లేదా మూడు, వైశ్య సామాజిక వర్గం గెలుపొందిన ఎమ్మెల్యేలు శ్రీరాం తాతయ్య, టీజీ భరత్‌లో ఒకరికి అవకాశం లభిస్తుందని సమాచారం. బీసీ వర్గం నుంచి కనీసం ఆరుగురికి మంత్రివర్గంలో చోటు కల్పించవచ్చని చెబుతున్నారు. దళిత వర్గం నుంచి ఇద్దరు, ఎస్టీ, మైనారిటీ వర్గాల నుంచి ఒక్కొక్కరికి ఛాన్స్ ఉండొచ్చని టీడీపీ వర్గాల ద్వారా తెలిసింది. బీజేపీ నుంచి ఇద్దరికి మంత్రి పదవులు ఇవ్వాలని చంద్రబాబు నిర్ణయించినట్లు తెలిసింది. సత్యకుమార్, సుజనా చౌదరి పేర్లు వినిపిస్తున్నాయి.

'మధ్యాహ్న భోజనం' పేరు మార్పు

ఇకపై 'పీఎం–పోషణ్ గోరుముద్ద'గా అందజేత

సాక్షి, అమరావతి: కొత్త విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఇప్పటివరకు 'జగనన్న గోరుముద్ద'గా అందించగా, ఇకపై విద్యార్థులకు 'పీఎం–పోషణ్ గోరుముద్ద'గా అందించనున్నారు. వారంలో ఐదురోజుల పాటు విద్యార్థులకు అందిస్తున్న కోడిగుడ్డు సరఫరాకు మార్గదర్శకాలు జారీచేశారు. ప్రతి వారం ఒక రంగులో గుడ్లను సరఫరా చేయాలని, ఈ మేరకు సప్లయిర్లకు సూచిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని మధ్యాహ్న భోజనం డైరెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మంగళవారం ఆదేశాలు జారీచేశారు. ఇక బెల్లం చిక్కీలను కూడా ప్రతి 15 రోజులకు ఒకసారి పాఠశాలలకు అందించాలని, బడులు తెరిచే నాటికి మధ్యాహ్న భోజనం కోసం అవసరమైన బియ్యం, రాగిపిండి, బెల్లం పొడి సిద్ధం చేయాలని అంబేద్కర్ పేర్కొన్నారు.

నందమూరి లక్ష్మీపార్వతి రాజీనామా

సాక్షి, అమరావతి: తెలుగు–సంస్కృత అకాడమి అధ్యక్ష పదవికి నందమూరి లక్ష్మీపార్వతి మంగళవారం రాజీనామా చేశారు. ఇటీవల రాష్ట్రంలో జరిగిన పరిణామాలను పరిగణనలోకి తీసుకుని, నైతిక బాధ్యతతో తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె తెలిపారు. తన రాజీనామా లేఖను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)కు పంపించిన లక్ష్మీపార్వతి దానిని ఆమోదించాల్సిందిగా సీఎస్‌ను కోరారు.



మనం చెడును పూర్తిగా వదిలేసి అత్యున్నతమైన మంచి పనులు చేస్తున్నప్పుడు కూడా మనను ఏదో ఒక రకమైన కోరికల్ని పట్టుకు వేళ్లాడుతూనే ఉంటుంది. ఈ స్థితిని దాటాలంటే, కోరికల శక్తిని జయించాలంటే... మంచి, చెడు రెంటినీ అధిగమించక తప్పదు.

– బుద్ధదాస భిక్కు (బౌద్ధ ధర్మం)

ఫోకస్

సాక్షి

బుధవారం, 12 జూన్ 2024

పిల్లల భవితకు పరీక్షా?

పరీక్షల్లో విద్యార్థులు పాసవడం, ఫెయిలవడం సహజం. కానీ వ్యవస్థే ఫెయిలవడం, తత్కారణంగా విద్యార్థులు గురి తప్పడం ఎప్పుడన్నా చూస్తామా? వైద్య విద్యాలయాల్లో ప్రవేశానికై జరిపే అఖిల భారత పరీక్ష నేషనల్ ఎలిజిబిలిటీ– కమ్– ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) విషయంలో అదే జరిగింది. పేపర్ లీకులు, గ్రేస్ మార్కులు, పలువురికి నూరుశాతం మార్కులు, కటాఫ్ మార్కుల్లో గణనీయంగా పెరుగుదల... ఇలా ఈ ఏటి 'నీట్' పరీక్షలో వివాదాలు అనేకం. ఈ అవకతవకలన్నీ విద్యార్థుల్లో ఆవేదన, ఆందోళన, నిరాశ రేపుతున్నాయి. ఈసారి పరీక్ష జరిగిన కంగాళీ వ్యవహారంపై కోచింగ్ సంస్థలు, డాక్టర్లు, ప్రతిపక్ష నేతలు గొంతెత్తేలా చేశాయి. చివరకిలాంటి దేశవ్యాప్త పరీక్షలు నిర్వహించే జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ)పై పిల్లలకూ, తల్లితండ్రులకూ నమ్మకమే పోయే పరిస్థితి వచ్చింది. కొన్నిచోట్ల పేపర్ లీకైందన్న వార్తల్ని ఎన్టీఏ కొట్టిపారేసినా, విద్యార్థులు, కోచింగ్ సంస్థల వారు కోర్టుకెక్కారు. ఫలితాలను రద్దు చేయాలన్న వారి పిటిషన్‌పై కేంద్రానికీ, ఎన్టీఏకీ సుప్రీం కోర్ట్ మంగళవారం నోటీసులు జారీ చేసింది. పరీక్ష పవిత్రతే దెబ్బతిన్నదంటూ జవాబు కోరింది. వెరసి కొన్నేళ్ళుగా రచ్చ రేపుతున్న ఈ మెడికల్ ఎంట్రన్స్ ఎగ్జామ్ విశ్వసనీయతకు ఇప్పుడు అగ్నిపరీక్ష ఎదురైంది.

దేశంలోని 700 పైచిలుకు విద్యాలయాల్లో లక్షా 8 వేల చిల్లర ఎంబీబీఎస్ సీట్లున్నాయి. ఎంబీబీఎస్ చదివేందుకు ఏటా కొన్ని లక్షల మంది 'నీట్'కు హాజరవుతారు. 2017లో 12 లక్షల మంది హాజరుకాగా, ఏడేళ్ళలో ఆ సంఖ్య రెట్టింపైంది. ఈ ఏడాది 'నీట్'కు 24 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. మే 5న పరీక్ష జరగగా, తర్వాత నెలరోజులకే, నిర్ణయించిన తేదీ కన్నా పది రోజుల ముందరే జూన్ 4న ఫలితాలను ప్రకటించారు. దేశమంతా ఎన్నికల ఫలితాల హడావిడిలో ఉండగా సందట్లో సడేమియాగా ఈ ఫలితాల వెల్లడి అనుమానాలు రేపింది. పైగా, ఏటా ఈ ప్రవేశ పరీక్షలో ఏ ఒక్కరో నూరు శాతం మార్కులు సాధిస్తారు. ఆ మాటకొస్తే, అసలీ పరీక్షలో 650, ఆ పైన మార్కులు సంపాదించడం సైతం కష్టం. కఠోరసాధనతోనే సాధ్యం. అలాంటిది... ఈసారి ఏకంగా 67 మంది విద్యార్థులకు 720కి 720 మార్కులు వచ్చాయి. ఫలితంగా... గతంలో 650 మార్కుల స్కోరుకు సైతం విద్యార్థులకు పదివేలల్లో ర్యాంకులొస్తే, ఈసారి ఆ మార్కులకు ముప్పై, నలభై వేల మధ్య ర్యాంకులే దక్కడంతో విద్యార్థులు, తల్లితండ్రుల ఆవేదన అంతా ఇంతా కాదు.

ఆన్‌లైన్ పరీక్ష 'క్లాట్'కూ, ఆఫ్‌లైన్‌లో జరిగే 'నీట్'కూ విధానాల్లో తేడాలున్నాయి. కానీ, క్లాట్‌లో లాగా ఇక్కడా 1563 మంది విద్యార్థులకు ఎన్టీఏ గ్రేస్ మార్కులు కలిపింది. అదేమంటే కొన్నిచోట్ల ప్రశ్నపత్రాలు ఆలస్యంగా ఇవ్వడం వల్ల విద్యార్థులకు సమయం వృథా అయిందనీ, వారు చదివిన పాత – కొత్త పాఠ్యపుస్తకాల్లో తేడాలున్నాయనీ, అందుకే అదనపు మార్కులు కలిపామనీ చెప్పింది. కాంపిటీటివ్ పరీక్షల్లో కనీవినీ ఎరుగని గ్రేస్ మార్కులు, ఈ వివరణలు హాస్యాస్పదం. పైగా, సరైన జవాబుకు 4 మార్కులు – తప్పితే ఒక మార్కు మైనస్ గనక, ఏ లెక్కన చూసినా అసంభవమైన 717, 718 లాంటి స్కోర్లు రావడమేమిటో దేవుడికే తెలియాలి. పాట్నాలో పేపర్ లీకైందనీ, రాజస్థాన్, జార్ఖండ్, ఢిల్లీ, గుజరాత్‌లలో ఒకరి బదులు మరొకరు పరీక్షలు రాశారనీ ఫిర్యాదులున్నాయి. హర్యానాలో ఒకే సెంటర్‌లో పరీక్ష రాసిన ఆరుగురికి ఫస్ట్ ర్యాంక్ రావడం, పైగా వారి దరఖాస్తులు ఆరోహణ క్రమంలో ఒకరి తర్వాత మరొకరివి కావడం విడ్డూరం. నీట్‌లో 715 మార్కులొచ్చిన విద్యార్థి తీరా ఇంటరే పాసవని విచిత్రం సరేసరి. అందుకే, అసలు నిజాలను ఎన్టీఏ దాచిపెడుతోందని అనుమానాలొస్తున్నాయి. లీకులు, వివాదాలు కొత్త కాకున్నా ఈసారి జరిగింది పక్కా స్కామ్ అంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. పరీక్ష రద్దు చేసి, మళ్ళీ జరపాలనే డిమాండ్లూ వస్తున్నాయి.

ఇప్పుడు నీట్‌లో మంచి మార్కులొచ్చి కూడా ఎప్పటిలా మంచి ర్యాంక్, కోరుకున్న కాలేజీలో సీటు రాని విచిత్రపరిస్థితి విద్యార్థులది. నిస్పృహతో కొందరు పిల్లలు ఇప్పటికే ఆత్మహత్యలకు పాల్పడడం విషాదం. దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. పేదలకూ, సామాజిక న్యాయానికీ ఈ నీట్ నిర్వహణ పూర్తిగా వ్యతిరేకమని తమిళనాడు ఎప్పటి నుంచో వాదిస్తోంది. 2021లో వచ్చిన స్టాలిన్ సర్కార్ జస్టిస్ రాజన్ సారథ్యంలో ఉన్నత స్థాయి కమిటీ వేసింది. కమిటీ సిఫార్సుల మేరకు లోపభూయిష్ఠమైన నీట్ నుంచి తమ రాష్ట్రాన్ని మినహాయించాలంటూ, అసెంబ్లీలో బిల్లు పాస్ చేసింది. దీర్ఘకాలంగా రాష్ట్రపతి ముద్ర కోసం వేచి చూస్తోంది. ఎన్టీఏ మాత్రం తప్పులు ఒప్పుకొని, దిద్దుబాటుకు సిద్ధం కావట్లేదు. తాజా పరీక్షలో జవాబులు గుర్తుపెట్టే ఓఎంఆర్ షీట్ చినిగిపోయిందంటూ ఎన్టీఏ ఒకరి ఫలితం ఆపేసింది. తీరా చూస్తే ఆ విద్యార్థినికి 715 మార్కులు రావడం గమనార్హం.

ఇలాంటి విచిత్ర విన్యాసాలు చూశాకనైనా... మన పరీక్షా వ్యవస్థలో, ఉపయోగించే సాంకేతికతలో పారదర్శకత తీసుకురాక తప్పదు. అవసరమైతే వైద్య విద్యాలయాల్లో ప్రవేశాల కౌన్సెలింగ్‌ను వాయిదా వేసి, కూలంకషంగా దర్యాప్తు చేయాలి. అవకతవకలు జరిగాయంటూ వస్తున్న ఆరోపణలను పరిశీలిస్తున్న ఉన్నతస్థాయి ప్యానెల్ మరో వారంలో తన నివేదిక ఇవ్వనుంది. అది చేసే సిఫార్సుల మాట అటుంచితే, ఇంత జరుగుతున్నా ప్రభుత్వ పెద్దలు ఈ వివాదంపై ఇప్పటి దాకా నోరు విప్పకపోవడం విషాదం. చదువుల నుంచి ఉద్యోగాల దాకా మన దేశంలో సమస్త పరీక్షలకూ లీకుల జాడ్యం, అవకతవకల మకిలి అంటుకుంది. గత అయిదేళ్ళలో 15 రాష్ట్రాల్లో మొత్తం 41 పేపర్ లీకుల వల్ల 1.4 కోట్ల మంది ఉద్యోగార్థులకు కష్టం, నష్టం కలిగాయి. ఇది మన వ్యవస్థకే సిగ్గుచేటు. బాగా చదువుకోవాలనుకున్న పసివారి భవిష్యత్తుకు సైతం ఈ పీడ తప్పకపోవడమే మరీ బాధాకరం. సమూల ప్రక్షాళనతో ఇలాంటి పరీక్షలను లోపరహితంగా మార్చడమే మార్గం.

మొదటి నూరు రోజులు కీలకం

విశ్లేషణ



ప్రొ॥ అజీత్ రానాడే

ఆర్థిక మాంద్యం నేపథ్యంలో 1933లో అమెరికాలో గద్దెనెక్కిన రూజ్‌వెల్ట్ ప్రభుత్వం తొలి వంద రోజుల్లో కొన్ని మేలైన నిర్ణయాలు తీసుకుంది. అప్పటి నుంచీ ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా తొలి వంద రోజుల్లో ఏం చేస్తుందనే ఆసక్తి మొదలైంది. కేంద్రంలో కొలువుదీరిన ఎన్డీఏ ప్రభుత్వం ముందున్న అతి పెద్ద సవాలు ఉపాధి! దేశవ్యాప్తంగా అప్రెంటిస్‌షిప్ కార్యక్రమం ఒకదాన్ని మొదలుపెట్టడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. చిన్న, సన్నకారు రైతులతోపాటు కౌలు రైతులకూ రుణాలు అందుబాటులోకి తేవాలి. వంద కోట్ల కంటే ఆర్థిక సంపద ఎక్కువగా ఉన్న వారిపై ఒక శాతం పన్ను విధించాలి. దేశంలో పెరిగిపోతున్న ఆర్థిక అంతరాన్ని తగ్గించేందుకు ఈ చర్య ఉపయోగపడుతుంది.

కేంద్రంలో కొత్త ప్రభుత్వం కొలువు దీరింది. ప్రతిసారి మాదిరిగానే ఈసారి కూడా తొలి వంద రోజుల్లో ఏం జరుగుతుందన్న విషయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. కొత్త ప్రభుత్వపు ప్రాథమ్యాలు అర్థమయ్యేదిప్పుడే మరి. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల్లో కొన్నింటినైనా అమలు చేసేందుకు ఇదే మంచి తరుణం కూడా. తద్వారా కొత్త ప్రభుత్వ కార్యకలాపాలు వేగం పుంజుకుంటాయి. ప్రజల్లో విశ్వాసమూ నెలకొంటుంది. అలాగే దేశీ, విదేశీ పెట్టుబడిదారుల నమ్మకం చూరగొనడమూ సాధ్యమవుతుంది. స్పష్టమైన మెజారిటీతో గద్దెనెక్కిన ప్రభుత్వం కూడా కొంత సమయం తరువాత ప్రజా విశ్వాసం కోల్పోవచ్చు. కాబట్టి ఈ తొలి రోజులను సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

నిజానికి ఈ తొలి వంద రోజుల భావన ఎప్పుడో 1933లో అమెరికా అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ డి.రూజ్‌వెల్ట్ మొదలుపెట్టారు. ఆర్థిక మాంద్యం నేపథ్యంలో గద్దెనెక్కిన రూజ్‌వెల్ట్ ప్రభుత్వం తొలి వంద రోజుల్లో కొన్ని మేలైన నిర్ణయాలు తీసుకుంది. రైతులతోపాటు నిరుద్యోగులు, యువత, పరిశ్రమలకు ఉపశమనం కలిగించేలా తక్షణ సాయం ప్రకటించడం, ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టే ఉద్దీపన కార్యక్రమాలు చేపట్టడం వీటిల్లో ఉన్నాయి. ఇదే సమయంలో బంగారంపై ప్రైవేట్ యాజమాన్యాన్ని తొలగించడం వంటి విప్లవాత్మక నిర్ణయాలు ఈ సమయంలోనే జరిగాయి. మనుగడ సాగించలేని బ్యాంకుల బరువును వదిలించుకునేందుకు బ్యాంకింగ్ హాలిడేను ప్రకటించారు. వాణిజ్య, పెట్టుబడులకు వేర్వేరుగా బ్యాంకింగ్ వ్యవస్థల ఏర్పాటుకు దారితీసిన గ్లాస్–స్టీగాల్ చట్టం ఈ సమయంలోనే అమల్లోకి వచ్చింది.

భారత్‌లో కొత్తగా కొలువైన ప్రభుత్వానికి రూజ్‌వెల్ట్ తరహాలో ఆర్థిక మాంద్య సమస్య లేదు. పైగా ఆర్థిక రంగం పటిష్ఠంగానే ఉంది. గత ఆర్థిక సంవత్సరం వృద్ధిరేటు చాలామందిని ఆశ్చర్యపరుస్తూ పైకి ఎగబాకింది. అలాగే ద్రవ్యోల్బణం కూడా ఓ మోస్తరు స్థాయిలో మాత్రమే కొనసాగుతోంది. బ్యాంకింగ్ రంగ ఆరోగ్యం కూడా బాగానే కనబడుతోంది. ప్రభుత్వ రంగ బ్యాంకులు రికార్డు స్థాయిలో రూ.1.4 లక్షల కోట్ల లాభాలు నమోదు చేశాయి. స్టాక్ మార్కెట్ కూడా మెరుగైన ప్రదర్శన కనబరుస్తోంది. ఈ స్థూల ఆర్థికాంశాలన్నీ బాగా ఉన్న నేపథ్యంలో కొత్త ప్రభుత్వం తొలి వంద రోజుల ప్రాథమ్యాలు ఏముంటే బాగుంటుంది? నాలుగు నిర్దిష్టమైన సూచనలు:

కొత్త ప్రభుత్వం ముందున్న అతిపెద్ద సవాలు ఉపాధి కావచ్చు. అంతర్జాతీయ కార్మిక సంఘం, ఇన్‌స్టిట్యూట్ ఫర్ హ్యూమన్ డెవలప్‌మెంట్ నివేదికల ప్రకారం దేశంలోని నిరుద్యోగుల్లో 83 శాతం మంది 29 ఏళ్ల కంటే తక్కువ వయసు కలిగిన వారు. ఇదే సమయంలో దేశం మొత్తమ్మీద నైపుణ్యమున్న, అర్ధ నైపుణ్యమున్న ఉద్యోగుల కొరత చాలా తీవ్రంగా ఉంది. కాబటి నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు దేశవ్యాప్తంగా అప్రెంటిస్‌షిప్ కార్యక్రమం ఒకదాన్ని మొదలుపెట్టడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. ఈ రకమైన కార్యక్రమానికి ప్రస్తుతమున్న వాటి కంటే మెరుగైన చట్టపరమైన మద్దతు అవసరమవుతుంది. ప్రస్తుత కార్మిక చట్టాల ప్రకారం.. అప్రెంటిస్ అయినా, ఇతరులైనా ఆరు నెలలపాటు పనిచేస్తే వారిని శాశ్వత ఉద్యోగులుగా చేయాలి. ఫలితంగా పారిశ్రామిక వేత్తలు అప్రెంటిస్‌లకు కూడా అవకాశాలిచ్చే అవకాశం తక్కువ అవుతోంది. ఈ పరిస్థితిలో మార్పు రావాలి. అప్రెంటిస్ సర్టిఫికెట్ దేశవ్యాప్తంగా చెల్లుబాటయ్యేలా చేయాలి. కేంద్ర ప్రభుత్వ అధికారిక ముద్ర కూడా ఈ సర్టిఫికెట్‌కు అవసరమవుతుంది. జాతీయ అప్రెంటిస్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టి పై అంశాలన్నింటినీ చేర్చడం ద్వారా నిరుద్యోగ సమస్య, నైపుణ్యాల లోటు, ఉద్యోగార్థతల సమస్యలను పరిష్కరించవచ్చు. దీంతోపాటు అగ్నివీర్ కార్యక్రమాన్ని ప్రస్తుతమున్న నాలుగేళ్ల నుంచి ఏడు లేదా ఎనిమిదేళ్లకు పెంచడం (షార్ట్ సర్వీస్ కమిషన్ కార్యకాలానికి దగ్గరగా) కూడా నిరుద్యోగ సమస్య సమసిపోయేందుకు ఉపయోగపడుతుంది.



ఇక రెండో సూచన... పంట ఉత్పత్తులకిచ్చే కనీస మద్దతు ధరకు చట్టపరమైన రక్షణ కల్పించడం గురించి. కనీస మద్దతు ధర సాఫల్యానికి మార్కెట్ ధరలన్నీ గణనీయంగా తగ్గాలి. అయితే కనీస మద్దతు ధర వల్ల ధరలపై ఒత్తిడి పెరిగే అవకాశమూ ఉంటుంది. కానీ మొత్తమ్మీద అటు రైతుకు, ఇటు ప్రభుత్వానికి ఉభయ తారకం. కొత్త ప్రభుత్వం కనీస మద్దతు ధరతోపాటు వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి, దిగుమతులపై నియంత్రణలకు దూరంగా ఉంటామన్న సూచన కూడా చేయాల్సి ఉంటుంది. నియంత్రణలు రైతుల ప్రయోజనాలను దెబ్బతీస్తున్నాయి.

మూడవ సూచన: చిన్న, సన్నకారు రైతులతోపాటు కౌలు రైతులకూ రుణాలు అందుబాటులోకి తేవాలి. దేశంలో వ్యవసాయ ఉత్పత్తుల్లో 40 శాతం కౌలు రైతులే పండిస్తున్నారు. భూయజమానులతో వీరికి నామమాత్రపు ఒప్పందం మాత్రమే ఉంటుంది. ఈ కారణంగా రుణ సౌకర్యం లభించడం కష్టమవుతుంది. కొన్ని రాష్ట్రాల్లో ఈ సమస్యను అధిగమించేందుకు కొన్ని వినూత్న పద్ధతుల ఆవిష్కరణ జరిగింది. ఇలాంటి ప్రయత్నాల మదింపు జరిపి జాతీయ స్థాయి విధానాన్ని రూపొందించి అమలు చేయాల్సిన అవసరముంది. సాధారణంగా పంట రుణాలన్నవి నాలుగు నుంచి ఆరు నెలల కాలానికి అవసరమవుతుంటాయి. ఇంత చిన్న కాలావధి అనేది నిరర్థక ఆస్తుల నిర్వచనం కిందకు రాదు. దీనికి తగిన నమూనా రూపొందించాలి. అలాగే చిన్న, సన్నకారు రైతులు, ఔత్సాహిక చిన్నస్థాయి పారిశ్రామిక వేత్తలకూ రుణ సౌకర్యం పెద్దగా ఉండటం లేదు. అకౌంట్ అగ్రిగేటర్స్ వంటివి అందుబాటులో ఉన్న ఈ కాలంలో కేవలం కొలాటరల్ ఆధారంగా కాకుండా... క్యాష్ ఫ్లో ఆధారంగా రుణాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయాలి. పైగా... చాలామంది చిన్నస్థాయి పారిశ్రామిక వేత్తలకు ఆర్థికాంశాలపై అవగాహన తక్కువే. ఈ అంతరాన్ని భర్తీ చేసేందుకు గట్టి ప్రయత్నమే జరగాలి. అంతేకాకుండా... చిన్న చిన్న పారిశ్రామికవేత్తలకు వర్కింగ్ క్యాపిటల్ లభ్యత పెరిగేందుకు 2006 నాటి చిన్న, మధ్యతరహా పరిశ్రమల చట్టంలోని 45 రోజుల నిబంధనను కఠినంగా అమలు చేసే ప్రయత్నం జరగాలి.

నాలుగో సూచన... ఫైనాన్షియల్ వెల్త్ (స్టాక్స్, బాండ్లు, మ్యూచువల్ ఫండ్స్ వంటివి– అన్నీ 'పాన్'తో అనుసంధానించి ఉంటాయి) విలువ రూ.వంద కోట్ల కంటే ఎక్కువగా ఉన్న వారిపై కొద్దిగా ఒక శాతం పన్ను విధించడం. దేశంలో పెరిగిపోతున్న ఆర్థిక అంతరాన్ని తగ్గించేందుకు ఈ చర్య ఉపయోగపడుతుంది. ఈ పన్ను ద్వారా సేకరించిన మొత్తాలను గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక విద్యాభివృద్ధికి కేటాయించవచ్చు. ఈ నిధులు రాష్ట్ర ప్రభుత్వాలకు కాకుండా... నేరుగా గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలకు చేరాలి. ఫైనాన్స్ కమిషన్ ఇప్పటికే ఇలా నేరుగా ఆర్థిక వనరులను అందిస్తున్న విషయం తెలిసిందే.

వ్యాసకర్త పుణెలోని 'గోఖలే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాలిటిక్స్ అండ్ ఎకనామిక్స్' వైస్ ఛాన్స్‌లర్ ('ద మింట్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సమకాలీనం



గిరీష్ కర్నాడ్ మహత్తర నాటకం 'తుగ్లక్'ను గుర్తు చేసుకుంటున్నాను. సుల్తాన్ మహమ్మద్ బిన్ తుగ్లక్ పాలనలోని సంక్లిష్టతలను అత్యంత చారిత్రక లోతులతో, సమకాలీనపు ప్రాసంగికతతో అది చూపుతుంది. సూక్ష్మాంశాలతో కర్నాడ్ పాత్రలను చిత్రించిన విధం ఆ నాటకాన్ని భారతీయ రంగస్థలంపై ఒక మైలురాయిగా నిలిపింది. (జూన్ 10న కర్నాడ్ వర్ధంతి)

– ఇర్ఫాన్, ఆర్కైవిస్ట్

అదుపు తెలీదు!



పాకిస్తాన్ మాజీ క్రికెటర్లు, ప్రత్యేకించి కమ్రాన్ అక్మల్, సయీద్ అజ్మల్, షోయబ్ అఖ్తర్, తన్వీర్, షాహిద్, వఖార్ లాంటివాళ్లు తమ అభిప్రాయాలను వెల్లడించకూడదు. అది టీవీల్లోగానీ, తమ యూట్యూబ్ వీడియోల్లో గానీ! ఎందుకంటే వాళ్లకు ఎక్కడ ఆపాలో, ఏది చెప్పకూడదో తెలియదు. (అర్షదీప్ సింగ్ బౌలింగ్‌ను ఉద్దేశించి సిక్కుల మీద అక్మల్ చేసిన వ్యాఖ్య వైరల్ కావడం, అనంతరం క్షమాపణ చెప్పడం జరిగింది.)

– గౌహర్ గిలానీ, కాలమిస్ట్

సరైన విశ్లేషణ



బీజేపీకి సంపూర్ణ మెజారిటీని గెలుచుకోవడంలో మోదీ ఎందుకు విఫలమయ్యారో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ సరిగ్గా విశ్లేషించారు. అహంకారం కూడదని ఆయన హెచ్చరించారు. ఎన్నికలను ఒక యుద్ధంగా, ప్రత్యర్థులను శత్రువులుగా చూడకూడదన్నారు. బాగా చెప్పారు మోహన్ భాగవత్!

– తవ్లీన్ సింగ్, కాలమిస్ట్

ఇంత బహిరంగంగానా?



ఆఖరికి లెఫ్ట్ వర్గాల్లో సైతం కశ్మీర్ గురించి మాట్లాడడమే మహాపాపం అన్నట్టు చేశారు. కానీ రైట్‌వింగ్ మాత్రం బహిరంగంగానే నరమేధానికి పిలుపునిస్తోంది. దశాబ్దాలుగా ఉన్నట్టుగానే కశ్మీర్ ఉన్నంతవరకూ ఇండియా నుంచి ఇస్లామోఫోబియా అనేది పోదు. (కశ్మీర్‌లో ఇజ్రాయెల్ తరహా పరిష్కారం అమలు చేయాలన్న ఆనంద్ రంగనాథన్ వ్యాఖ్యల నేపథ్యంలో).

– సారా ఎథర్, ఆర్కిటెక్ట్

నరమేధం కాదు!



కశ్మీర్ సమస్యకు ఇజ్రాయెల్ తరహా పరిష్కారం అంటే– బాధితుల పునరావాసం, ఆవాసాలు నిర్మించడం, తీవ్రవాదాన్ని ఎదుర్కోవడం, సరిహద్దులను కాపాడుకోవడం. ఇది నరమేధానికి పిలుపునివ్వడం కాదు. ఇది మరో నరమేధాన్ని ఆపటం. నేను ఇజ్రాయెల్‌కు మద్దతిస్తాను. కశ్మీరీ హిందువులకు మద్దతిస్తాను. నా ప్రతి మాటకూ కట్టుబడి ఉంటాను.

– ఆనంద్ రంగనాథన్, 'స్వరాజ్య' గౌరవ సంపాదకుడు

ఇన్ బాక్స్

ఇదెలా సాధ్యం ?

18వ లోక్ సభ ఎన్నికల్లో... పోలైన ఓట్ల కన్నా ఎక్కువ ఓట్లు కనిపించడం విడ్డూరం! ఇవి ఎలా వచ్చాయి? ఈ సందర్భంగా ఎన్నికలు నిర్వహించిన ఏడు దశల్లోనూ ఎన్నికల రోజు పోలైన ఓట్ల శాతాన్ని ప్రకటించారు తప్ప పోలైన ఓట్లను ప్రకటించకపోవడం గమనార్హం. సాక్షాత్తు ప్రధానమంత్రి పోటీ చేసిన వారణాసి నియోజకవర్గం కౌంటింగ్‌లో పోలైన ఓట్ల కన్నా ఎక్కువ సంఖ్యలో ఓట్లు కనిపించడం విస్మయాన్ని కలిగిస్తోంది. వారణాసిలో పోలైన ఓట్లు 11 లక్షలు. లెక్కించిన ఓట్లు 12.87 లక్షలు. తేడా 1.87 లక్షలు. మోదీ మెజారిటీ 1.52 లక్షలు. ఈ రకంగా చూసుకుంటే దేశం మొత్తం మీద 373 నియోజకవర్గాల్లో తేడాలు ఉన్నట్లు పలువురు భావిస్తున్నారు. ఈ అక్రమాలపై నిష్పాక్షిక విచారణ జరపాలని న్యాయస్థానాలను ఆశ్రయించాలని ప్రజాసంఘాలు ప్రయత్నిస్తున్నాయి.

ఉత్తరప్రదేశ్‌లో బహుజన సమాజ్ పార్టీ బీజేపీతో కుమ్మక్కై ఒంటరిగా పోటీ చేసి ఒక్క సీటు కూడా గెలవలేదు. ఇండియా కూటమిని ఓడించి ఎన్డీఏకు 15 సీట్లు వచ్చేలా చేసింది. ఈవీఎంలు మోసం చేస్తాయనీ, బ్యాలెట్ విధానమే కావాలనీ గతంలో ప్రకటించిన పార్టీలు నేడు నోరు మెదపకపోవడానికి కారణం వారు ఎన్డీఏలో భాగస్వాములు కావటమే. మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ... మంత్రి వర్గ ఏర్పాటు సమయంలోనే అసంతృప్తి రాగాలు మొదలయ్యాయి. అంతకు ముందు కేబినెట్ మంత్రి పదవి నిర్వహించిన ఎన్సీపీ (అజిత్‌పవార్ వర్గం) నాయకుడు ప్రఫుల్ పటేల్‌కు ఈసారి సహాయ మంత్రి పదవి ఇస్తే మంత్రివర్గంలో చేరడానికి నిరాకరించారు. వీరికి పార్లమెంట్‌లో కేవలం రెండు స్థానాలు మాత్రమే ఉన్నాయి. ఈ రకంగా చూసుకుంటే తెలుగుదేశానికి 16 పార్లమెంటు సీట్లు ఉన్నాయి, కనీసం నాలుగైదన్నా మంత్రి పదవులు దక్కుతాయనుకున్నారు. కానీ మూడింటికే పరిమితమయ్యారు. ఏపీ నుండి గెలిచిన బీజేపీ, జనసేనవారికి అసలు చోటే కల్పించలేదు. ఎన్డీఏ కూటమిలోని సంకీర్ణ భాగస్వాముల అసంతృప్తి పెరిగితే మోదీ ప్రభుత్వానికి ప్రమాదమే.

– దినవహి హరినాథ్

మోదీ హయాంలో బలమైన ప్రతిపక్షం

అభిప్రాయం



ఎమ్.డి. మునీర్

ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో మొదటిసారిగా ఒక అధికార ప్రతిపక్ష నాయకుని హోదా పొందిన విపక్ష నాయకుడు పార్లమెంట్‌లో కనిపించబోతున్నారు. 2024 ఎన్నికల ఫలితాలు మోదీకి ఇవ్వబోతున్న కొత్త అనుభవం ఇది. గత పది ఏండ్ల పాలనలో అధికారికంగా అసలు విపక్షమే లేకుండా ఏక పక్షంగా సభను నడిపించారు. ఇప్పుడు ప్రధానిగా నరేంద్ర మోదీ మూడో సారి ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్డీఏ కూటమిలోని చంద్రబాబు, నితీష్ కుమార్ తదితరుల సపోర్ట్‌తో ప్రభుత్వం ఏర్పాటు చేశారు. అదే తరుణంలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో 'ఇండియా' కూటమి రూపంలో ప్రతిపక్షం... పదేండ్ల తర్వాత అధికార పక్ష వ్యవహారశైలిని సమర్థవంతంగా నియంత్రించే స్థాయికి చేరడం గమనార్హం.

కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రతిపక్ష నేత హోదాలో రాహుల్ గాంధీ లోక్ సభలో ప్రవేశించనున్నారు. మోదీకి ఈ విషయం మింగుడు పడనిదే. రాహుల్ విపక్ష నేతగా రావడం లౌకిక, ప్రజాస్వామ్య భారతదేశానికి ఒక మంచి పరిణామంగా పేర్కొనక తప్పదు. రాహుల్ వయసు ఉన్నన్ని సీట్లు కూడా కాంగ్రెస్‌కూ, 'ఇండియా' కూటమికీ రావని ఎద్దేవా చేసిన మోదీకి ప్రస్తుత ఎన్నికల ఫలితాలు కనువిప్పు కలిగించాయి. కాంగ్రెస్ సొంతంగా 99 సీట్లు, దాని నాయకత్వంలోని ఇండియా కూటమి మొత్తం 234 సీట్లు గెలవడం లౌకికవాదానికి తిరిగి ఊపిరులూదినట్లయ్యింది. ఇద్దరు ఇండిపెండెట్లూ 'ఇండియా'కు మద్దతు ప్రకటించడంతో ఈ కూటమి బలం 236కు చేరడం గమనార్హం.

2024 ఎన్నికల ఫలితంగా మొట్టమొదటిసారిగా మోదీ ముందు అధికార హోదా కలిగిన ప్రతిపక్ష నాయకుడు కూర్చోబోతున్నారు. ఆయన రాహుల్ గాంధీయే అని రాజకీయ విశ్లేషకుల మాట. సీడబ్ల్యూసీ సమావేశంలో నిర్ణయించిన అనంతరం నిర్వహించే కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో రాహుల్‌ను పార్టీ సభానాయకునిగా ఎన్నుకోవడం కేవలం లాంఛనప్రాయం అనే భావిస్తున్నారు. కాబట్టి మోదీ, ఆయన పార్టీవారు గేలిచేసిన రాహుల్ గాంధీయే ప్రధాన ప్రతిపక్ష నాయకునిగా మోదీకి లోక్ సభలో సవాల్ విసరబోతున్నారు. గత పదేళ్లుగా లోక్ సభ సీట్లలో పదిశాతం సీట్లు కూడా గెలవలేదనే నెపంతో కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా కూడా స్పీకర్ ఇవ్వలేదు. నిజానికి విపక్షంలో అత్యధిక సీట్లు వచ్చిన పార్టీకి పది శాతం సీట్లతో సంబంధం లేకుండా ప్రతిపక్ష హోదా ఇవ్వాలి. ఇప్పుడు కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా ఇవ్వడం స్పీకర్‌కు అనివార్యం.



'ఇండియా' కూటమి సమావేశం

బీజేపీకి సొంతంగా 240 సీట్లు మాత్రమే వచ్చాయి. అందువల్ల ఇప్పుడు తన భాగస్వామ్య పక్షాలపై ప్రభుత్వ ఏర్పాటుకు తప్పనిసరిగా ఆధారపడవలసి వచ్చింది. ఫలితంగా మోదీ ఇప్పుడు ఏకపక్ష నిర్ణయాలు తీసుకునే అవకాశమే లేదు. ప్రతిపక్ష హోదా కూడా లేని ప్రతిపక్షాలను ఉత్సవ విగ్రహాలను చేసి ఆడిన ఆటలు ఇక సాగకపోవచ్చు.


మోదీ ఈ ఎన్నికల్లో గెలవడానికి అత్యంత ప్రమాదకరమైన ఉపన్యాసాలు ఇచ్చారు. 'టైమ్స్' లాంటి విదేశీ పత్రికలు మోదీని 'డివైడర్ ఇన్ చీఫ్' అని అభివర్ణించాయి. మోదీ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ ఉపన్యాసం ఒక నేరం అనీ, ప్రతిదానికీ, చట్ట ప్రకారం శిక్ష పడే పరిస్థితి ఉందనీ ప్రముఖ న్యాయ కోవిదుడు ఆశోక్ అరోరా అంటారు. హిందూ, ముస్లింల మధ్య విద్వేషాలు రేపే ఉపన్యాసాలు (తాళిబొట్లు గుంజుకుపోతారనీ, బర్రెలను తీసుకెళతారనీ), వ్యాఖ్యలూ చేసిన వ్యక్తికి ప్రధాని అయ్యే అర్హత లేదని ఆయన అంటారు. ఈ మేరకు ఆయన రాష్ట్రపతికి లేఖ రాసినట్లు, ఒక వీడియో విడుదల అయ్యింది. అది ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది.

ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రతిపక్ష కూటమి బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ప్రజల ఆశలను, ఆకాంక్షలను వారు వమ్ము చేయబోరని ఆశిద్దాం! ఆకలి, అసమానతలు, నిరుద్యోగం లేని; కుల, మతాలకు అతీతమైన భారతదేశ నిర్మాణం కోసం వీరంతా కృషి చేస్తారని, చేయాలని ఆశిద్దాం!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
। 99518 65223

సాధుసేవ

సాధు సేవ ప్రాధాన్యాన్ని తెలిపే ఉదంతం ఒకటి మనకు 'శ్రీరామకృష్ణ లీలామృతం'లో లభిస్తుంది. స్వామి బ్రహ్మానంద కలకత్తాలోని వారణాసి ఘోష్ వీధిలో నివసిస్తూ ఉండేవారు. ఆయన రామకృష్ణుని తరచూ దర్శించి వచ్చేవారు. ఒక రోజు అపరాహ్న వేళ రామకృష్ణుని దర్శించటానికి దక్షిణేశ్వరం వెళ్ళి భోజనానంతరం విశ్రాంతి తీసుకొంటున్న రామకృష్ణుని గదిలోకి వెళ్ళారు. రామకృష్ణుడు తాను శయనించిన పరుపుపైనే ఆయన్ను కూర్చోమన్నారు. స్వామి బ్రహ్మానంద అలాగే కూర్చున్నాడు. కొంతసేపు మాట్లాడిన తర్వాత తన పాదాలను ఒత్తమని ఆయనకు చెప్పాడు. 'మహాశయా! క్షమించండి, ఆ పని నేను చేయలేను' అన్నారు బ్రహ్మానంద. అప్పుడు రామకృష్ణుడు ఆయనతో, 'చూడు, కాసేపు ఒత్తు. ఒక సాధువును సేవిస్తే నువ్వు లబ్ధి పొందుతావు' అని అన్నారు. రెండు, మూడు సార్లు రామకృష్ణుడు అలా చెప్పినా బ్రహ్మానంద వినలేదు. చివరకు ఆయన పాదాలను స్పృశించారు. అలా ముట్టారో లేదో హఠాత్తుగా ఒక విచిత్రం జరిగింది. ఆయనకు ఒక దృశ్యం స్పష్టంగా గోచరించింది. నోట మాట రాక అలా చూస్తూ ఉండి పోయారు. ఒక ఏడెనిమిదేళ్ళ బాలిక రూపంలో కాళీ మాత వేగంగా ఆయనున్న గదిలోకి ప్రవేశించింది. ఆమె రామకృష్ణ పరమహంస చుట్టూ కొన్ని సార్లు ప్రదక్షిణ చేసింది. ఆమె కాలి అందెలు ఘల్లు ఘల్లు మన్నాయి. తరువాత ఆమె గురుదేవుల దేహంలో విలీనమై పోయింది. రామకృష్ణుడు చిన్నగా నవ్వుతూ, 'చూశావా! ఒక సాధువును సేవించిన తక్షణమే ప్రతిఫలం పొందావు' అన్నారు. ('శ్రీరామకృష్ణ లీలామృతం' – పుటలు 16, 17).



జ్యోతిర్మయం

అంటే స్వామి బ్రహ్మానంద... రామకృష్ణ పరమహంస పాదాలను అనిష్టంగానే ఒత్తాలని అనుకొని ముట్టినా, వెంటనే ఆయనకు కాళికాదేవి దివ్యదర్శనం లభించింది. ఇక భక్తి, శ్రద్ధలతో సేవించాలని, ఆయన పాదాలను ఒత్తి ఉంటే ఇంకెంతటి శ్రేయస్సు ఆయనకు కలిగేదో మనం ఊహించలేం. సాధుసేవ అంత మంచిది. అట్లని బజారులో సాధువుగా కనపడే ప్రతివానిని నిజమైన సాధువుగా తలంచి, ఇంటికి ఆహ్వానించి, సకల మర్యాదలు చేసి ఆయన కాళ్ళను ఒత్తి లబ్ధి పొందాలని మనం అనుకొంటే లబ్ధి చేకూరే మాట అటుంచండి, మన కొంపల్నే ముంచేస్తారు ఆ కపట సాధు, సన్యాసులు.

కాషాయం వేసుకొన్న వారు, నుదుట నామాలు, విభూతి రేఖలు పెట్టుకొన్న వారు; రుద్రాక్ష మాలలు ధరించినవాళ్ళు, గడ్డాలు, మీసాలు, జుత్తులు పెంచినవారు అందరూ నిజమైన సాధువులు కాకపోవచ్చు. వారి మాటల్ని చూసి కూడా మనం మోసపోరాదు. చాలా జాగ్రత్తగా వారి జీవితాన్ని గమనించిన తర్వాతే, వారిలో కామ, క్రోధాదులు లేవని తెలుసుకొన్న తర్వాతే, వారిలో స్వార్థం ఏ కోశానా లేదని ఋజువు చేసుకొన్న తర్వాతే వారిని సాధువుగా గ్రహించాలి. అలాంటి వారికి ఏ కొంచెం సేవ చేసినా సత్ఫలితం కలిగి తీరుతుంది. అయితే దాన్ని కూడా మనం ఆశించరాదు.

– రాచమడుగు శ్రీనివాసులు

గ్రహం అనుగ్రహం శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.షష్ఠి రా.7.11 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** మఖ రా.2.23 వరకు, తదుపరి పుబ్బ, **వర్జ్యం:** ప.1.19 నుండి 3.03 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.33 నుండి 12.25 వరకు, **అమృతఘడియలు:** రా.11.56 నుండి 1.39 వరకు; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.28, **సూర్యాస్తమయం:** 6.30.

జపాన్‌కు చేరుకున్న భారత నౌక

సింథియా(విశాఖ పశ్చిమ): జిమెక్స్ 8వ ఎడిషన్ జపాన్-ఇండియా మారిటైమ్ ఎక్సర్‌సైజ్-2024 (జిమెక్స్-24)లో పాల్గొనేందుకు భారత నౌకాదళానికి చెందిన స్వదేశీ స్టెల్త్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ శివాలిక్ జపాన్‌లోని యోకోసుకు చేరుకుంది. ఈ నౌకకు జపాన్ మారిటైమ్ సెల్ఫ్ డిఫెన్స్ ఫోర్స్ కమాండర్, వైస్ అడ్మిరల్ హిరోషి, అంబాసిడర్ సిబి జార్జ్ జపాన్‌లోని భారత రాయబారి ద్వారా ఘన స్వాగతం పలికారు. ఈ వ్యాయామంలో నౌకాశ్రయ దశ, సముద్ర దశ అనే రెండు దశాలుగా రెండు దేశాల నౌకాదళాలు పాల్గొంటాయని, నౌకాశ్రయ దశలో వృత్తిపరమైన కార్యక్రమాలు, క్రీడలు, సామాజిక పరస్పర చర్యలను కలిగి ఉంటాయని, అ తర్వాత రెండు నౌకాదళాలు సముద్ర దశలో భాగంగా సముద్రంలో తమ యుద్ధ నైపుణ్యాలను సంయుక్తంగా ప్రదర్శిస్తాయని నేవీ వర్గాలు తెలిపాయి. భారత నౌకాదళానికి ఐఎన్ఎస్ శివాలిక్ ప్రాతినిధ్యం వహించగా, జపాన్ మారిటైమ్ సెల్ఫ్ డిఫెన్స్ ఫోర్స్‌కు గైడెడ్ మిస్సైల్ డిస్ట్రాయర్ జెఎస్ యుగిరి ప్రాతినిధ్యం వహిస్తుంది. రెండు నౌకాదళాలకు చెందిన సమగ్ర హెలికాప్టర్లు కూడా ఉమ్మడి వ్యాయామంలో పాల్గొంటాయి.



జిమెక్స్-24కు సిద్ధమవుతున్న రెండు దేశాల నౌకాదళాల సిబ్బంది

దుర్గమ్మ సేవలో మాజీ సీఎం సెల్వం

ఇంద్రకీలాద్రి (విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం మంగళవారం దర్శించుకున్నారు.ఆయనకు ఆలయాధికారులు స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనాన్ని, ఈవో కేఎస్ రామరావు అమ్మవారి చిత్రపటం,ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

జొన్నగిరిలో వజ్రం లభ్యం

తుగ్గలి: కర్నూలు జిల్లాలో వజ్రాల అన్వేషణ కొనసాగుతోంది. తుగ్గలి మండలంలోని జొన్నగిరి పొలాల్లో ఓ వ్యక్తికి వజ్రం లభ్యమైనట్లు సమాచారం. ఈ వజ్రాన్ని రూ.1.60 లక్షలకు ఓ వ్యాపారి మంగళవారం కొనుగోలు చేసినట్లు తెలిసింది.

4 ట్రిపుల్ ఐటీలకు 48 వేల దరఖాస్తులు

- 2024-25 విద్యా సంవత్సరానికి కొనసాగుతున్న అడ్మిషన్లు
- ఆర్జీయూకేటీ పరిధిలో మొత్తం సీట్లు 4,400
- ఈ నెల 25 వరకు గడువు.. 50 వేలకు చేరనున్న దరఖాస్తులు



నూజివీడు: రాష్ట్రంలోని రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీలకు సంబంధించిన అడ్మిషన్లలో భాగంగా మంగళవారం వరకు 48 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో 2024-25 అడ్మిషన్ల ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ఆర్జీయూకేటీ ఉన్నతాధికారులు మే 6న విడుదల చేశారు. ఈ నెల 8 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. దరఖాస్తుకు ఈ నెల 25వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు గడువుంది. ఇంతవరకూ నాలుగు ట్రిపుల్ ఐటీల్లో కలిపి 4,000 సీట్లతో పాటు ఈడబ్ల్యూఎస్ కింద మరో 400 సీట్లు ఉన్నాయి. మొత్తం 4,400 సీట్లు అందుబాటులో ఉన్నాయి. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన వారికి రిజర్వేషన్ అనుసరించి ట్రిపుల్ ఐటీల్లో సీట్లు భర్తీ చేస్తారు. దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసే నాటికి 50 వేల మందికి పైగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ట్రిపుల్ఐటీ ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

జూలై ఒకటి నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్

సీటు కోసం దరఖాస్తు చేసుకున్న ప్రత్యేక కేటగిరి అభ్యర్థులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జూలై ఒకటి నుంచి నిర్వహించనున్నారు. సైనిక ఉద్యోగుల పిల్లలకు జూలై ఒకటి నుంచి 3 వరకు, క్రీడా కోటా అభ్యర్థులకు జూలై 3 నుంచి 6వ తేదీ వరకు, దివ్యాంగుల కోటా అభ్యర్థులకు జూలై 3న, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటా అభ్యర్థులకు జూలై 2, 3 తేదీల్లో, ఎన్‌సీసీ కోటా అభ్యర్థులకు జూలై 3 నుంచి 5వ తేదీ వరకు పరిశీలించనున్నట్లు ట్రిపుల్ ఐటీ అధికార వర్గాలు తెలిపాయి. జూలై 11న ఎంపికైన అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారు. 22, 23 తేదీల్లో నూజివీడు, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీల్లో, 24, 25 తేదీల్లో ఒంగోలు ట్రిపుల్ ఐటీలో, 26, 27 తేదీల్లో శ్రీకాకుళం ట్రిపుల్ఐటీలో ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తారు.

ఆరేళ్ల చిన్నారిపై అఘాయిత్యం

- బాలికపై యువకుల సామూహిక లైంగికదాడి
- పాడేరు మోదకొండమ్మ జాతరలో దారుణం

పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): పాడేరు మోదకొండమ్మ జాతరలో దారుణం జరిగింది. ఆరేళ్ల చిన్నారిపై కొంతమంది యువకులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం... సోమవారం రాత్రి మోదకొండమ్మ జాతరను తిలకించేందు ఓ కుటుంబం వచ్చింది. సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో జాతర వద్దే తల్లిదండ్రులతో కలిసి ఆరేళ్ల చిన్నారి నిద్రించింది. కొంతమంది యువకులు ఆ చిన్నారిని ఎత్తుకుని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానం పక్కనే ఓ సందు వద్దకు తీసుకువెళ్లారు. అక్కడ చిన్నారిపై సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. అనంతరం ఏడుస్తున్న ఆ చిన్నారిని అక్కడే వదిలేసి పరారయ్యారు. బాలిక ఏడుస్తుండటంతో స్థానికులు వచ్చి ఆరా తీశారు. బాలిక నుంచి ఈ దారుణం గురించి తెలుసుకుని సమీపంలో ఉన్న తల్లిదండ్రులకు తెలియజేశారు. వారు తమ కుమార్తె వద్దకు చేరుకుని రక్తస్రావంతో బాధపడుతున్న చిన్నారిని స్థానిక జిల్లా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. మాతా, శిశు విభాగంలో ఆ బాలికకు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నంలోని కేజీహెచ్‌కి తరలించారు. ఈ ఘటనపై మెడికో లీగల్ కేసు నమోదైంది. పోలీసు సిబ్బంది మోదకొండమ్మ అమ్మవారి ఉత్సవాల బందోబస్తులో ఉన్నందున పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానానికి ఆనుకుని ఉన్న భవనం వద్ద ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల్లో ఈ అఘాయిత్యానికి సంబంధించిన దృశ్యాలు రికార్డు అయినట్టుగా తెలుస్తోంది.

విజయవాడ మీదుగా వెళ్లు పలు రైళ్లు రద్దు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో జరుగుతున్న ట్రాఫిక్ బ్లాక్ పనుల కారణంగా పలు రైళ్లను పూర్తిగాను, మరికొన్నిటిని పాక్షికంగా రద్దు చేస్తున్నట్లు విజయవాడ డివిజన్ పీఆర్ఓ నుస్రత్ మండ్రుప్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రద్దు చేసిన రైళ్లు....

ఈ నెల 24 నుంచి జూలై 28 వరకు విజయవాడ-బిట్రగుంట (07977/07978), 24-28 వరకు, జూలై 1-5 వరకు, 8-12 వరకు, 15-19 వరకు, 22-26 వరకు బిట్రగుంట-చెన్నై సెంట్రల్ (17237/17238), ఈ నెల 21-23 వరకు, ఆగస్టు 11-12 వరకు కాకినాడ పోర్టు-విజయవాడ (17258), ఈ నెల 21 నుంచి ఆగస్టు 12 వరకు విజయవాడ-గుంటూరు (07628), గుంటూరు-రేపల్లె (07786), రేపల్లె-నాలి (07873), తెనాలి-విజయవాడ (07630), విజయవాడ-గూడూరు (07500), ఈ నెల 22-ఆగస్టు 13 వరకు గూడూరు-విజయవాడ (07458), విజయవాడ-మాచర్ల (07781), ఈ నెల 23-ఆగస్టు 14 వరకు మాచర్ల-విజయవాడ (07782), విజయవాడ-తెనాలి (07629), తెనాలి-రేపల్లె (07874/07875/07876), రేపల్లె-గుంటూరు (07787), గుంటూరు-తెనాలి (07887), తెనాలి-రేపల్లె (078863), ఈ నెల 24-ఆగస్టు 15 వరకు రేపల్లె-మార్కాపురం (07889/07890), తెనాలి-గుంటూరు (07282), గుంటూరు-విజయవాడ (07864), ఈ నెల 21-23 వరకు, ఆగస్టు 11-15 వరకు విజయవాడ-కాకినాడ పోర్టు రైళ్లను పూర్తిగా రద్దు చేశారు.

పాక్షికంగా రద్దు చేసిన రైళ్లు...

ఈ నెల 24-జూలై 28 వరకు మచిలీపట్నం-విజయవాడ (07896/ 07769/ 07866/ 07770/ 07870), నర్సాపూర్--విజయవాడ (07863/07861), విజయవాడ-భీమవరం జంక్షన్ (07283) రైళ్లను విజయవాడ-రామవరప్పాడు స్టేషన్‌ల మధ్య పాక్షికంగా రద్దు చేశారు.

చెన్నై విమానాశ్రయంలో కొకైన్ స్వాధీనం

- విలువ రూ.33 కోట్లు
- ఇండోనేషియా యువకుడి అరెస్టు

అన్నానగర్: చెన్నై విమానాశ్రయంలో మంగళవారం రూ.33 కోట్ల విలువైన 3.3 కిలోల కొకైన్‌ను స్వాధీనం చేసుకుని ఇండోనేషియాకు చెందిన యువకుడిని అధికారులు అరెస్టు చేశారు. విదేశాల నుంచి చెన్నై మీనంబాక్కం అన్నా అంతర్జాతీయ విమానాశ్రయానికి వస్తున్న విమానంలో భారీఎత్తున మాదక ద్రవ్యాలు తరలిస్తున్నట్లు సెంట్రల్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ విభాగం అధికారులకు మంగళవారం సమాచారం అందింది. దీంతో మరింత నిఘా పెంచారు. ఆ సమయంలో ఓ ఇండోనేషియా యువకుడు టూరిస్ట్ వీసాపై చెన్నైకి వచ్చినట్లు గుర్తించారు. అతని సూట్‌కేస్‌లో 3.3 కిలోల ఖరీదైన కొకైన్‌ను గుర్తించారు. దీని విలువ రూ.33 కోట్లు ఉంటుందని భావిస్తున్నారు. అనంతరం యువకుడిని అరెస్టు చేసి విచారణ చేపట్టారు. చెన్నైలో ఈ కొకైన్ ఎవరికి ఇచ్చేందుకు ప్రయత్నించాడు అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వాస్పత్రిపై వైఎస్సార్ పేరు తొలగించిన టీడీపీ

- మందుల షాపునకు టీడీపీ నేతల ఫ్లెక్సీలు
- ఆస్పత్రి వద్ద శిలాఫలకం ధ్వంసం



ప్రభుత్వ వైద్యశాలకు వైఎస్సార్ పేరు తొలగించి కోడెల శివప్రసాదరావు పేరుతో పెట్టిన బోర్డు

నరసరావుపేట: నరసరావుపేటలోని వైఎస్సార్ జిల్లా ప్రభుత్వ వైద్యశాల పేరును టీడీపీ నాయకులు, కార్యకర్తలు తొలగించి.. కోడెల శివప్రసాదరావు ప్రభుత్వ వైద్యశాల పేరిట ఫ్లెక్సీ అతికించారు. నాబార్డు నిధులు రూ.20 కోట్లతో ఈ వైద్యశాలను నిర్మించారు. టీడీపీ హయాంలో వైద్యశాల పనులు పూర్తికాకపోవడంతో పనిచేయని స్థితిలో ఉండేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాగానే అప్పటి ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి రాష్ట్ర ప్రభుత్వం నుంచి సుమారు రూ.4 కోట్ల నిధులు విడుదల చేయించి మౌలిక వసతులు కల్పించి వినియోగంలోకి తెచ్చారు. 200 పడకల వైద్యశాలగా అభివృద్ధి చేసి డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ వైద్యశాలగా నామకరణం చేయగా.. 2022 అక్టోబరు 26న అప్పటి వైద్యశాఖ మంత్రి విడదల రజిని ప్రారంభించారు. రోజుకు 1000 మందికి పైగా ఓపీతో నెలకు 300 ప్రసవాలు చేస్తూ వైద్యులు అంకిత భావంతో సేవలందిస్తున్నారు. దీని పేరు మార్చిన టీడీపీ కార్యకర్తలు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. ఆస్పత్రి ఆవరణలో మూడు నెలల క్రితం ఏర్పాటు చేసిన జనరిక్ మందుల షాపునకు టీడీపీ నేతల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలు అతికించారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయండి

- దక్షిణ మధ్య రైల్వే ఏజీఎం ధనుంజయులు



నెల్లూరు స్టేషన్‌లో అభివృద్ధి పనులను తనిఖీ చేస్తున్న ఏజీఎం ధనుంజయులు

రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని దక్షిణ మధ్య రైల్వే ఏజీఎం ధనుంజయులు అధికారులను ఆదేశించారు. మంగళవారం విజయవాడ డివిజన్‌లో ఆయన విస్తృతంగా పర్యటించారు. నెల్లూరు స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై ఏడీఆర్ఎం కొండ శ్రీనివాసరావుతో కలసి సమీక్షించారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యాలు, రైళ్ల నిర్వహణ, పొడిగించిన సబ్‌వే పనులను పరిశీలించారు. అదే విధంగా కృష్ణపట్నం పోర్టు, వెంకటాచలం రోడ్ జంక్షన్, గూడూరు జంక్షన్‌లను తనిఖీ చేశారు. నిత్యం ట్రాఫిక్ రద్దీగా ఉండే ఆయా స్టేషన్లలో సిగ్నలింగ్ వ్యవస్థ, ట్రాక్‌ల పరిస్థితి, ప్రయాణికుల సౌకర్యాలు, సరుకు రవాణా చర్యలపై అధికారులతో సమీక్షించారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించే దిశగా సిబ్బంది, ప్రయాణికులతో మాట్లాడి పలు సూచనలు స్వీకరించారు. రైళ్ల నిర్వహణలో భద్రత ప్రమాణాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, సరుకు రవాణా సామర్థ్యాన్ని మెరుగుపర్చాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం జరుగుతున్న పలు ప్రాజెక్ట్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, రైళ్ల సమయపాలనను అధిక ప్రాధాన్యతతో పర్యవేక్షించాలని ఆదేశించారు.

డీసీఐఎల్‌కు భారీ ఆర్డర్

విశాఖ సిటీ: డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (డీసీఐఎల్), కోల్‌కతాలోని శ్యామా ప్రసాద్ ముఖర్జీ పోర్ట్ అథారిటీ (ఎస్ఎంపీఏ)కి చెందిన భారీ ఆర్డర్‌ను చేజిక్కించుకుంది. పోర్టులో హల్దీ ఎస్ట్యూరీలో ఐదేళ్ల పాటు డ్రెడ్జింగ్ నిర్వహణ నిమిత్తం రూ.2,015.88 కోట్లు విలువైన ఒప్పందాన్ని సొంతం చేసుకుంది. తూర్పు తీరంలో హల్దీ ఎస్ట్యూరీ సముద్ర వాణిజ్యానికి ఒక ముఖ్యమైన జలమార్గం. ఇక్కడ సముద్ర కార్యకలాపాల సులభతరానికి, సురక్షితంగా నౌకల రాకపోకలకు లోతును నిర్వహించడం అత్యంత కీలకం. దీంతో ఈ ఛానెల్ నిర్వహణ బాధ్యతలను ఎస్ఎంపీఏ.. డ్రెడ్జింగ్ పరిశ్రమలో అగ్రగామిగా ఉన్న డీసీఐఎల్‌కు అప్పగించింది. ఈ కాంట్రాక్టు సాధించడంపై విశాఖ పోర్ట్ అథారిటీ, డీసీఐఎల్ చైర్‌పర్సన్ డాక్టర్ మాదయ్యన్ అంగముత్తు, పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ దుబే సంస్థ అధికారులను అభినందించారు.

ఏపీ ఈఏపీ సెట్-2024 ఫలితాల్లో శ్రీచైతన్య విజయభేరి

విజయవాడ: ఏపీ ఈఏపీ సెట్-2024 ఫలితాల్లో తమ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో విజయభేరి మోగించారని శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ తెలిపారు. అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో ఎల్లు శ్రీకాంత్‌రెడ్డి 1వ ర్యాంకు, పూల దివ్యతేజ 2, వడ్లపూడి ముకేశ్ చౌదరి 3, పేర సాత్విక్ 4, ఆలూర్ ప్రణీత 5, గట్టు భానుతేజ సాయి 6, పి.నిహారికారెడ్డి 7, శంబంగి మనోఅభిరాం 8, శరగడం పావని 9వ ర్యాంకు సాధించారని చెప్పారు. అలాగే ఇంజినీరింగ్ విభాగంలో పలగిరి సతీష్‌రెడ్డి 4, గొల్ల లేఖహర్ష 7, పుట్టి కుశాల్ కుమార్ 8వ ర్యాంకు కైవసం చేసుకున్నారని తెలిపారు. అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో 10లోపు తొమ్మిది, 100లోపు 50 మంది, ఇంజినీరింగ్ విభాగంలో పదిలోపు ముగ్గురు, 100 లోపు 55 మంది ర్యాంకులు సాధించారని వివరించారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను సుష్మ అభినందించారు.

భాష్యం ప్రభంజనం

గుంటూరు (ఎడ్యుకేషన్): ఏపీ ఈఏపీ సెట్-2024 ఫలితాల్లో భాష్యం విద్యాసంస్థల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రభంజనం సృష్టించారని విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. ఇంజినీరింగ్ విభాగం నుంచి ఎం.జిష్ణుసాయి స్టేట్ ఫస్ట్ ర్యాంకుతో పాటు ఎం.సాయి యశ్వంత్‌రెడ్డి 2, కె.మనీష్ చౌదరి 5, కె.ప్రభాస్ 10, కె.హర్షిత 16వ ర్యాంకు సాధించారని చెప్పారు. అదే విధంగా అగ్రికల్చర్ అండ్ ఫార్మసీలో ఎస్.ప్రణయ్ విక్టర్ 25, ఎం.చరిత సాయి 29వ ర్యాంకు పొందినట్లు తెలిపారు. వీరితో పాటు టి.ముని కార్తీక్ 35, పి.శ్యామ్ 49, కె.చైతన్య 54, ఎం.సాయి యశ్వంత్‌రెడ్డి 61, ఆర్.రాజ్ వర్ధన్ 83వ ర్యాంకు కై వసం చేసుకున్నారన్నారు. 100లోపు 12 స్టేట్ ర్యాంకులతో భాష్యం ది బెస్ట్ అని నిరూపించారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను భాష్యం రామకృష్ణ, డైరెక్టర్ హనుమంతరావు అభినందించారు.

కాకినాడ ఆదిత్య ప్రతిభ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఏపీ ఈఏపీ సెట్-2024 ఫలితాల్లో కాకినాడ ఆదిత్య విద్యార్థులు ప్రతిభ చూపారని ఆదిత్య విద్యాసంస్థల కార్యదర్శి ఎన్.కృష్ణ దీపక్‌రెడ్డి తెలిపారు. అగ్రికల్చర్, ఫార్మసీలో ఎస్‌హెచ్‌డీ రవికిరణ్ 13వ ర్యాంకు, వై.నైమితారాణి 31, కేఎస్‌బీ త్రిపుర సుందరి 67, వి.సృజన్ 76, ఎం.విశ్వంత్ 79వ ర్యాంకు సాధించారని చెప్పారు. ఇంజినీరింగ్ విభాగంలో రఘురామ సాహన్ 25, జి.ఫణీంద్ర 47, బి.రోహిత్ చౌదరి 57, కేబీ కల్కి సువర్ణ 100వ ర్యాంకు కైవసం చేసుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, హాస్టల్ డైరెక్టర్ లక్ష్మీరాజ్యం, డైరెక్టర్లు శృతి, సుగుణ అభినందించారు.

శశి వేలివెన్ను జయభేరి

ఉండ్రాజవరం: ఏపీ ఈఏపీ సెట్-2024 ఫలితాల్లో శశి వేలివెన్ను విద్యార్థులు వివిధ కేటగిరీల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించారని శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ తెలిపారు. ఎం.ప్రణవ్‌సాయి 12వ ర్యాంకు, బి.గౌతమి 24, కె.అనిరుధ్ 30, పి.శ్రీలలితాదేవి 36, ఎల్.సత్యవర్ధన్ 37, జి.సాయి మనోజ్ 54, పి.లిఖిత 65, జీవీవీ శరణ్య 94వ ర్యాంకు సాధించారని చెప్పారు. 50లోపు ఐదుగురు, 100 లోపు ఎనిమిది మంది, 500 లోపు 33 మంది, 1,000 లోపు 81 మంది, 5,000 లోపు 290 మంది, 10,000 లోపు 488 మంది, 20,000 లోపు 698 మంది ర్యాంకులు పొందారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను శశి విద్యా సంస్థల వైస్ చైర్‌పర్సన్ బూరుగుపల్లి లక్ష్మీ సుప్రియ అభినందించారు.

విజ్ఞాన్ విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు

చేబ్రోలు: ఏపీ ఈఏపీ సెట్-2024 ఫలితాల్లో చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు విజ్ఞాన్ జూనియర్ కళాశాలల సమన్వయకర్త గుదిమెళ్ల శ్రీకూర్మనాథ్ తెలిపారు. విద్యార్థులు ఐ.హనీత్ 387వ ర్యాంకు, టి.సంజయ్ తేజ 494, ఏ.రోహన్ 904, సీ.రేవంత్ 957, పి.అమర లోకేష్ 1,015, పి.గౌతమ్ 1,195, కె.కారుణ్య 1,206, ఎం.నాగసాయి ప్రకాష్ 1,219, బి.యోగ విజయ్‌కుమార్ 1,369, సిహెచ్.వెంకట ఉదయ్ ఆదిత్య 1,377, కె.దక్షిణ్ 1,777, ఎం.వివేక్ పూజిత్ కుమార్ 1,964వ ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ శ్రీకృష్ణదేవరాయలు, ప్రిన్సిపాల్ జె.మోహనరావు అభినందించారు.

ఈఏపీ సెట్‌లో బాలురు భళా

ఇంజనీరింగ్ విభాగంలో టాప్-10 ర్యాంకులు కైవసం

ఉత్తీర్ణత శాతంలో అమ్మాయిలదే హవా



సాయి యశ్వంత్‌రెడ్డి



మనీష్ చౌదరి



రాధాకృష్ణ



కె. ప్రభాస్

సాక్షి, అమరావతి/గుంటూరు (ఎడ్యుకేషన్)/పుల్లలచెరువు/బలిజిపేట/ఆదోని సెంట్రల్: ఆంధ్రప్రదేశ్‌లో బీటెక్, బీఫార్మసీ, బీఎస్సీ అగ్రికల్చర్, బీఎస్సీ హార్టికల్చర్, ఫార్మ్ డీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఏపీ ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ ఈఏపీసెట్) ఫలితాల్లో అబ్బాయిలు సత్తా చాటారు. ఇంజనీరింగ్ విభాగంలో టాప్ టెన్ ర్యాంకులను కొల్లగొట్టారు. అగ్రికల్చర్ విభాగంలో టాప్ టెన్‌లో ఆరుగురు అబ్బాయిలు, నలుగురు అమ్మాయిలు ర్యాంకులు సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో గుంటూరుకు చెందిన మాకినేని జిష్ణుసాయి 97 మార్కులతో ప్రథమ ర్యాంకు దక్కించుకున్నాడు. అగ్రికల్చర్ విభాగంలో హైదరాబాద్‌కు చెందిన ఎల్లు శ్రీకాంత్‌రెడ్డి 93.44 మార్కులతో మొదటి ర్యాంకు సాధించాడు. విజయవాడలో మంగళవారం ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి శ్యామలరావు ఏపీ ఈఏపీసెట్ ఫలితాలను విడుదల చేశారు. ఇంజనీరింగ్ విభాగంలో గతేడాదితో పోలిస్తే అత్యధికంగా 24వేల మందికిపైగా ఉత్తీర్ణత సాధించారు. టాప్ టెన్‌లో 8 మంది ఏపీ విద్యార్థులు కాగా ఇద్దరు తెలంగాణకు చెందినవారున్నారు. ఈఏపీసెట్‌కు 3,62,851 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇంజనీరింగ్ విభాగానికి 2,74,213 మంది రిజిస్టర్ చేసుకోగా 2,58,374 మంది పరీక్షకు హాజరయ్యారు. ఇందులో 1,95,092 (75.51 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. అగ్రికల్చర్ విభాగంలో 88,638 మంది దరఖాస్తు చేసుకుంటే 80,766 మంది పరీక్ష రాశారు. వీరిలో 70,352 (87.11 శాతం) మంది అర్హత సాధించారు. తెలంగాణ ఈఏపీ సెట్‌లో రెండు విభాగాల్లోనూ టాప్-10లో నిలిచిన వారిలో నలుగురు విద్యార్థులు చొప్పున ఏపీ ఈఏపీసెట్‌లోనూ ర్యాంకులు సాధించడం విశేషం. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో జాతీయ స్థాయిలో 3వ ర్యాంకు సాధించిన నంద్యాల జిల్లా గోస్పాడ మండలం నెహ్రూనగర్‌కు చెందిన భోగలపల్లి సందేశ్ తెలంగాణ ఈఏపీసెట్‌లో 4వ ర్యాంకు సాధించగా తాజాగా ఏపీ ఈఏపీసెట్‌లో 3వ ర్యాంకు దక్కించుకున్నాడు. గతేడాది మాదిరిగానే ఇంజనీరింగ్‌కు అత్యధికంగా బాలురు, అగ్రికల్చర్ వైపు బాలికలు మొగ్గు చూపారు. వెబ్‌సైట్‌లో ర్యాంకు కార్డులను అందుబాటులో ఉంచామని, త్వరలోనే కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ప్రకటిస్తామని తెలిపారు. వీలైనంత వేగంగా ప్రవేశాలు కల్పించి.. తరగతులను నిర్వహించేలా చర్యలు చేపడతామన్నారు.

25 శాతం వెయిటేజీతో ర్యాంకులు

మే 16 నుంచి 23 వరకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో ఈఏపీసెట్ పరీక్షలను నిర్వహించినట్టు సెట్ చైర్మన్, జేఎన్‌టీయూ-కాకినాడ వీసీ ప్రసాదరాజు చెప్పారు. ఈఏపీసెట్ పూర్తయిన అనంతరం ప్రాథమిక కీ విడుదల చేశామన్నారు. విద్యార్థుల నుంచి అభ్యంతరాలను స్వీకరించేందుకు కీ అబ్జర్వేషన్స్ వెరిఫికేషన్ కమిటీని నియమించామన్నారు. ఇందులో కేవలం మూడు ప్రశ్నలకు మాత్రమే పూర్తి మార్కులు కేటాయించామన్నారు. రాష్ట్రంలో రెగ్యులర్ ఇంటర్మీడియెట్‌లో ఉత్తీర్ణులై ఈఏపీసెట్‌లో అర్హత సాధించిన వారందరికీ ఇంటర్ మార్కుల ఆధారంగా 25 శాతం వెయిటేజీ ఇచ్చి ర్యాంకులు ప్రకటించామని తెలిపారు. కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ (ఇన్‌చార్జి) కె.రామ్మోహనరావు, వైస్ చైర్‌పర్సన్ ఉమా మహేశ్వరిదేవి, సెట్స్ ప్రత్యేక అధికారి సుధీర్‌రెడ్డి, సెట్ కన్వీనర్ వెంకటరెడ్డి, సాంకేతిక విద్యాశాఖ జేడీ పద్మారావు పాల్గొన్నారు.

సీట్లకు మించిన ఉత్తీర్ణత

రాష్ట్రంలో ఇంజనీరింగ్ సీట్లు 1.60 లక్షలు ఉండగా ఈ ఏడాది అత్యధికంగా 1.95 లక్షల మందికిపైగా ఉత్తీర్ణత సాధించారు. బాలుర కంటే బాలికలే ఉత్తీర్ణతలో ముందున్నారు. 1,48,696 మంది బాలురు పరీక్ష రాస్తే 1,09,926 (73.93 శాతం) మంది, 1,09,678 మంది బాలికలు పరీక్ష రాస్తే 85,166 (77.65 శాతం) ఉత్తీర్ణులయ్యారు.

ఇంజనీరింగ్ విభాగంలో టాపర్లు

పేరు	ర్యాంకు (స్కోరు)	ప్రాంతం
మాకినేని జిష్ణుసాయి	1(97.00)	గుంటూరు
మురసాని సాయి యశ్వంత్ రెడ్డి	2(96.83)	స్టాంటన్ పురం, కర్నూలు
భోగలపల్లి సందేశ్	3(96.42)	నెహ్రూనగర్, నంద్యాల జిల్లా
పలగిరి సతీష్ రెడ్డి	4(96.03)	చెన్నంపల్లి, అనంతపురం
కోమటినేని మనీష్ చౌదరి	5(95.33)	గోరంట్ల, గుంటూరు
ఇప్పా లక్ష్మీనరసింహారెడ్డి	6(95.25)	సిద్దిపేట్, తెలంగాణ
గొల్లలేఖ హర్ష	7(95.11)	కర్నూలు
పుట్టి కుశాల్‌కుమార్	8(94.35)	అనంతపురం
పరమారాధ్యుల సుశాంత్	9(94.21)	హన్మకొండ, తెలంగాణ
కొమిరిశెట్టి ప్రభాస్	10(93.91)	పుల్లలచెరువు, ప్రకాశం

అగ్రికల్చర్ విభాగంలో టాపర్లు

పేరు	ర్యాంకు(స్కోరు)	ప్రాంతం
ఎల్లు శ్రీకాంత్‌రెడ్డి	1(93.44)	హైదరాబాద్
పూల దివ్యతేజ	2(92.92)	బాలాజీపేట, శ్రీసత్యసాయి జిల్లా
వడ్లపూడి ముకేశ్ చౌదరి	3(92.79)	వెంగమాంబపురం, తిరుపతి
పీర సాత్విక్	4(92.62)	పెరవాండ్లపల్లి, చిత్తూరు
ఆలూరు ప్రణీత	5(91.88)	మదనపల్లె, అన్నమయ్య జిల్లా
గట్టు భానుతేజసాయి	6(91.41)	పాపంపేట, అనంతపురం
పెన్నామాడ నిహారిక రెడ్డి	7(90.93)	హైదరాబాద్
సంబంగి మనో అభిరామ్	8(90.65)	గాజువాక, విశాఖపట్నం
సరగడం పావని	9(90.45)	గాజువాక, విశాఖపట్నం
నగుదాసరి రాధాకృష్ణ	10(90.33)	చిలకలపల్లి, పార్వతీపురం మన్యం

జిష్ణుసాయికి ప్రథమ ర్యాంకు

ఏపీ ఈఏపీసెట్ ఇంజనీరింగ్ విభాగంలో గుంటూరు నగరానికి చెందిన మాకినేని జిష్ణుసాయి మొదటి ర్యాంకు సాధించి సత్తా చాటాడు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో అఖిల భారత స్థాయిలో 62వ ర్యాంకు సాధించాడు. గుంటూరు నగరానికి చెందిన మరో విద్యార్థి కోమటినేని మనీష్ చౌదరికి ఈఏపీసెట్‌లో 5వ ర్యాంకు లభించింది.

సాయి యశ్వంత్‌రెడ్డికి రెండో ర్యాంక్

6వ తరగతి నుంచి ఇంటర్ వరకు గుంటూరులోనే చదివిన కర్నూలుకు చెందిన మరో విద్యార్థి సాయి యశ్వంత్‌రెడ్డికి ఈఏపీసెట్ ఇంజనీరింగ్ విభాగంలో 2వ ర్యాంకు లభించింది. ఇటీవల జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 50వ ర్యాంకు దక్కించుకున్నాడు. తనది చాలా పేద కుటుంబమని.. ఐఐటీ బాంబేలో ఇంజనీరింగ్ చదువుతానని యశ్వంత్ తెలిపాడు. జీవితంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా స్థిరపడడమే తన లక్ష్యమని వెల్లడించాడు.

సందేశ్‌కు మూడో ర్యాంక్

కర్నూలు జిల్లా ఆదోని పట్టణానికి చెందిన బి.రామసుబ్బారెడ్డి, వి.రాజేశ్వరిల కుమారుడు బి.సందేశ్ ఏపీఈఏసెట్ ఇంజనీరింగ్ విభాగంలో రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంకు సాధించాడు. ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌డ్‌లోనూ అఖిల భారత స్థాయిలో 3వ ర్యాంకును సాధించడం విశేషం. సందేశ్ 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు హైదరాబాద్ నారాయణ కళాశాలలో పూర్తి చేశాడు. ఐఐటీ బాంబేలో కంప్యూటర్ సైన్స్ చదువుతానని తెలిపాడు. ఆ తర్వాత సివిల్స్ రాసి ఐఏఎస్ కావాలన్నదే తన లక్ష్యమన్నాడు.

ఇద్దరికి 10వ ర్యాంక్

ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం అక్కపాలెం గ్రామానికి చెందిన కొమిరిశెట్టి ప్రభాస్ 10వ ర్యాంకు కైవసం చేసుకున్నాడు. అతడి తండ్రి కొమ్మరిశెట్టి పోలయ్య గుంటూరు మిర్చి యార్డులో పనిచేస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం చిలకలపల్లికి చెందిన నగుదాసరి రాధాకృష్ణ ఈఏపీసెట్ అగ్రికల్చర్ విభాగంలో 10వ ర్యాంకు సాధించాడు. కుమారుడు మంచి ర్యాంకు సాధించడంతో వ్యవసాయ కుటుంబానికి చెందిన తల్లిదండ్రులు నారాయణ రావు, కృష్ణవేణి సంతోషం వ్యక్తం చేశారు.

తిరుమల విద్యా సంస్థల విజయకేతనం

రాజమహేంద్రవరం రూరల్: ఏపీ ఈఏపీ సెట్-2024 ఫలితాల్లో తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు సంచలన విజయాలు నమోదు చేశారని తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. అగ్రికల్చర్ విభాగంలో ఎన్.రాధాకృష్ణ 10వ ర్యాంకు, పీఎస్ సంపత్‌నాయుడు 28, డి.ప్రభాస్ 41, ఎస్.సాకేత్ రాఘవ్ 43, జి.సాయికృష్ణశ్రీ 64, పి.బేబీ అభిఘ్న 87, డి.తేజస్విని 96, టి.జనన్య 97, ఆర్ఎల్ నాగ వెంకట దుర్గాప్రసాద్ 100వ ర్యాంకు కైవసం చేసుకున్నారని చెప్పారు. తొమ్మిది మంది 100 లోపు, 78 మంది 1,000 లోపు, 127 మంది 2,000 లోపు, 253 మంది 5,000 లోపు, 407 మంది 10,000 లోపు ర్యాంకులు సాధించారని తెలిపారు. ఇంజినీరింగ్ విభాగంలో బి.సాయి నరేన్ 51, జి.సత్యనారాయణ 56, ఆర్.పవిత్ర 74, కె.ప్రవీణ్ సిద్దార్థ్ 76, పి.రాహుల్ 79వ ర్యాంకులు సాధించారన్నారు. ఐదుగురు 100 లోపు, 166 మంది 1,000 లోపు, 373 మంది 2,000 లోపు, 833 మంది 5,000 లోపు, 1,333 మంది 10,000 లోపు ర్యాంకులు పొందారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.

సత్తా చాటిన సంగివలస శశి విద్యార్థులు

తగరపువలస(విశాఖ): ఏపీ ఈఏపీ సెట్-2024 ఫలితాల్లో సంగివలస శశి విద్యా సంస్థల విద్యార్థులకు అత్యుత్తమ ర్యాంకులు లభించాయని చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. ఇంజినీరింగ్ విభాగంలో ఎస్.దిలీప్ వెంకటసతీష్ 165వ ర్యాంకు, సీహెచ్.వరుణ్ నాగసాయి నారాయణ 331, జి.పృథ్వితేజ 414, జి.విశాల్‌కుమార్ 521, సీహెచ్.శ్యామ్‌సుందర్ 636, కె.పావన రామ మణికంఠ 666, జి.గిరి కార్తీక్ సాయి 705, కె.హెచ్.ఎస్.ఎస్.వి.సాగర్ 730వ ర్యాంకు సాధించారని చెప్పారు. వెయ్యిలోపు ర్యాంకులు 15 మంది, రెండు వేల లోపు 43 మంది, మూడు వేలలోపు 73 మంది, ఐదు వేల లోపు 110 మంది, 10వేల లోపు 173 మంది, 15వేల లోపు 220 మంది, 20వేల లోపు 260 మంది విద్యార్థులు ర్యాంకులు పొందారని తెలిపారు. అగ్రికల్చర్ విభాగంలో కేఎండీఎస్ ఫణికుమార్ 59, కె.టి.షణ్ముఖశ్రీ సాయి 108, పి.హర్షిత 154, పి.చైతన్యకుమార్ 182వ ర్యాంకు సాధించారన్నారు. వెయ్యిలోపు 17 మంది, రెండు వేలలోపు 27 మంది, మూడు వేలలోపు 39 మంది, 5వేల లోపు 53 మంది ర్యాంకులు పొందారని వివరించారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ క్రాంతి సుధ అభినందించారు.








బాధ్యతలు స్వీకరించిన మహిళా మంత్రులు: రక్షా ఖడ్సే • అన్నపూర్ణాదేవి • అనుప్రియా పటేల్ • నిమూబెన్ • సావిత్రీ ఠాకూర్ • శోభా కరంద్లాజె (ఎడమ నుంచి కుడికి)

ఈవీఎంలలో గోల్‌మాల్?!

పోలైన, లెక్కించిన ఈవీఎం ఓట్లలో తేడాలు

- దేశవ్యాప్తంగా దాదాపు అన్ని లోక్‌సభ స్థానాల్లోనూ అంతే
- 140కి పైగా లోక్‌సభ స్థానాల్లో ఎక్కువ ఓట్లు లెక్కించారు
- కారణాలపై పెదవి విప్పని కేంద్ర ఎన్నికల సంఘం
- ఎన్నికల ప్రక్రియ సమగ్రతపై ముసురుకుంటున్న సందేహాలు
- ఈసీ డేటాను ఉటంకిస్తూ 'ద వైర్' వార్తా సంస్థ కథనం

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికలు ముగిసి ఫలితాలు వెల్లడైనా ఎన్నికల ప్రక్రియపై నెలకొన్న వివాదాలకు మాత్రం తెర పడటం లేదు. పైగా మొత్తం ఎన్నికల ప్రక్రియ సమగ్రతపైనే నానాటికీ మరిన్ని అనుమానాలు తలెత్తుతున్నాయి. 2024 ఎన్నికల్లో అత్యధిక లోక్‌సభ స్థానాల్లో పోలైన, లెక్కించిన ఈవీఎం ఓట్ల సంఖ్యలో తేడా నమోదైనట్టు 'ద వైర్' వార్తా సంస్థ పేర్కొంది! కేంద్ర ఎన్నికల సంఘం అధికారిక గణాంకాలనే ఉటంకిస్తూ ఈ మేరకు కథనం ప్రచురించింది. మొత్తం 543 లోక్‌సభ స్థానాల డేటాను పరిశీలిస్తే డామన్–డయ్యూ, లక్షద్వీప్, అట్టింగల్ వంటి కొన్నింటిని మినహాయిస్తే అత్యధిక స్థానాల్లో నమోదైన మొత్తం ఈవీఎం ఓట్ల సంఖ్య అంతిమంగా లెక్కించిన ఈవీఎం ఓట్లతో సరిపోలడం లేదని వెల్లడించింది. ఏకంగా 140 పైచిలుకు స్థానాల్లో పోలైన ఈవీఎం ఓట్ల కంటే లెక్కించిన వాటి సంఖ్య ఎక్కువగా ఉన్నట్టు పేర్కొనడం విశేషం! ఇలా 2 నుంచి 3,811 ఓట్ల దాకా అదనంగా లెక్కించినట్టు వెల్లడించింది. ''పలు లోక్‌సభ స్థానాల్లోనేమో లెక్కించిన ఈవీఎం ఓట్ల సంఖ్య మొత్తం ఈవీఎం ఓట్ల కంటే తక్కువగా ఉంది. ఒక లోక్‌సభ స్థానంలో ఏకంగా 16,791 ఓట్లు తక్కువగా లెక్కించారు! ఇలా తగ్గడానికి దారితీసిన కారణాలపై ఈసీ ఇచ్చిన ఇచ్చిన వివరణ పొంతన లేకుండా ఉంది. ఎక్కువ ఓట్లను లెక్కించడం ఎలా సాధ్యమన్న ప్రశ్నపై మాత్రం ఈసీ పూర్తిగా మౌనం దాల్చింది. ఈ మొత్తం ఉదంతంపై వివరణ కోరుతూ ఈసీకి ఈ మెయిల్ పంపితే ఇప్పటిదాకా స్పందన రాలేదు'' అని తెలిపింది. కథనంలో ద వైర్ ఏం చెప్పిందంటే...

ఫలితాల వెల్లడిలో లోక్‌సభ స్థానాలవారీగా లెక్కించిన ఈవీఎం ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ల సంఖ్యను ఈసీ విడిగానే పేర్కొంది. అంతేగాక ఈసారి పోలైన మొత్తం ఈవీఎం ఓట్ల సంఖ్యను కూడా స్పష్టంగా పేర్కొంది. ఆ సంఖ్యలో ఇక మార్పుచేర్పులకు అవకాశం లేదని కూడా స్పష్టం చేసింది. పోస్టల్ బ్యాలెట్లతో వీటికి సంబంధం లేదని కూడా చెప్పింది. అలా పలు లోక్‌సభ స్థానాల్లో ఈసీ వెల్లడించిన మొత్తం ఈవీఎం ఓట్ల సంఖ్య కంటే లెక్కించిన ఈవీఎం ఓట్ల సంఖ్య తక్కువగా ఉండటంపై సోషల్ మీడియాలో కొద్ది రోజులుగా చర్చకు తెర లేచింది. దాంతో అది అసహజమేమీ కాదంటూ ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివరణ ఇచ్చారు. ''కొన్నిచోట్ల అలా జరుగుతుంటుంది. ఒక్కోసారి ప్రిసైడింగ్ అధికారి పొరపాటున కంట్రోల్ యూనిట్/వీవీప్యాట్ యూనిట్ నుంచి మాక్ పోలింగ్ స్లిప్పులను తొలగించకుండానే పోలింగ్ ప్రక్రియ ప్రారంభిస్తారు. కొన్నిసార్లు ఫామ్ 17–సీలో ఓట్ల సంఖ్యను తప్పుగా నమోదు చేస్తారు. దాంతో అవి కంట్రోల్ యూనిట్‌లోని ఓట్ల సంఖ్యతో సరిపోలవు. ఈ రెండు సందర్భాల్లోనూ సదరు పోలింగ్ స్టేషన్లలో నమోదయ్యే ఓట్లను చివరిదాకా లెక్కించరు. అలాంటి మొత్తం ఓట్ల సంఖ్య విజేతకు లభించిన మెజారిటీ కంటే తక్కువగా ఉంటే ఇక వాటిని పూర్తిగా పక్కన పెట్టేస్తారు. అలాంటప్పుడు పోలైన ఈవీఎం ఓట్ల కంటే లెక్కించిన వాటి సంఖ్య తక్కువగానే ఉంటుంది'' అని పేర్కొన్నారు. నమోదైన ఈవీఎం ఓట్ల కంటే ఎక్కువ ఓట్లు లెక్కించడంపై మాత్రం ఈసీ నుంచి స్పందన లేదు. ఒక లోక్‌సభ స్థానంలో విజేతకు కేవలం 48 ఓట్ల మెజారిటీ వచ్చింది. అక్కడ పోలైన ఈవీఎం ఓట్ల కంటే రెండు ఈవీఎం ఓట్లను అదనంగా లెక్కించారు! విజేతకు 1,615 ఓట్ల మెజారిటీ వచ్చిన మరో స్థానంలో 852; 1,884 ఓట్ల మెజారిటీ వచ్చిన ఇంకో చోట 950 ఓట్లు అదనంగా లెక్కించారు.

ఇవీ సందేహాలు..

- నమోదైన మొత్తం ఈవీఎం ఓట్ల కంటే లెక్కించిన ఈవీఎం ఓట్ల సంఖ్య ఎక్కువగా ఉండటం ఎలా సాధ్యం?
- లెక్కించిన ఈవీఎం ఓట్ల సంఖ్య పోలైన వాటికంటే తగ్గడానికి మాక్ పోలింగ్ డాటాను తొలగించకపోవడమే కారణమన్న నిర్ధారణకు ప్రాతిపదిక ఏమిటి?
- ఇలా ఈవీఎం ఓట్ల కంటే లెక్కించిన ఓట్ల సంఖ్య ఎక్కువ/తక్కువగా నమోదైన లోక్‌సభ స్థానాలవారీగా ఈసీ స్పష్టమైన వివరణ ఎందుకివ్వడం లేదు?
- ఈ ఎన్నికల్లో మొత్తమ్మీద ఎన్ని ఈవీఎంలను, ఏ కారణాలతో పక్కన పెట్టారో ఈసీ వెల్లడించగలదా?

వివరణ ఇవ్వాల్సిందే
ప్రశాంత్ భూషణ్

ఓట్ల లెక్కింపులో గోల్‌మాల్‌కు సంబంధించి 'ద వైర్' కథనంపై ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ స్పందించారు. ''దేశవ్యాప్తంగా 140కి పైగా లోక్‌సభ స్థానాల్లో పోలైన మొత్తం ఈవీఎం ఓట్ల కంటే ఎక్కువ ఈవీఎం ఓట్లను లెక్కించారు! అసలేం జరుగుతోంది?'' అని 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. 'ద వైర్' కథనాన్ని ట్యాగ్ చేశారు. ''అహంకారంతో ప్రవర్తిస్తున్న ఈసీఐ ఈ విషయంలో దేశ ప్రజలకు కచ్చితంగా వివరణ ఇవ్వాల్సిందే'' అని డిమాండ్ చేశారు.

తదుపరి ఆర్మీ చీఫ్‌గా ఉపేంద్ర ద్వివేది

న్యూఢిల్లీ: భారత సైన్యం నూతన సారథిగా లెఫ్టినెంట్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం రాత్రి రక్షణ శాఖ ప్రకటన విడుదల చేసింది. ఆయన వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా ఉన్నారు. జూన్ 30న మధ్యాహ్నం చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా బాధ్యతలు స్వీకరిస్తారు. ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ సి.పాండే అదే రోజు ఉదయం పదవీవిరమణ చేయనున్నారు. ఆయన మే 31నే రిటైరవాల్సి ఉండగా అసాధారణ రీతిలో నెల పాటు పదవీ కాలాన్ని కేంద్రం పొడిగించింది.

'మోదీ కా పరివార్' క్యాప్షన్ తీసేయండి

బీజేపీ శ్రేణులకు మోదీ సూచన

న్యూఢిల్లీ: సామాజిక మాధ్యమ ఖాతాల్లో 'మోదీ కా పరివార్' క్యాప్షన్ తొలగించాలని బీజేపీ కార్యకర్తలకు ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం విజ్ఞప్తి చేశారు. ''దేశవ్యాప్తంగా ప్రజలు నాపై అభిమానానికి గుర్తుగా వారి సోషల్ మీడియా ఖాతాల్లో 'మోదీ కా పరివార్'ను జత చేశారు. వాటిని చూసి ఎంతో శక్తిని, ఉత్సాహాన్ని పొందాను. ఇందుకు ప్రజలకు కృతజ్ఞతలు. లోక్‌సభ ఎన్నికల విజయం ద్వారా ఆ క్యాప్షన్ ఉద్దేశాన్ని సాధించాం. కను మీ సోషల్ అకౌంట్ల నుంచి 'మోదీ కా పరివార్'ను తొలగించాలని అభ్యర్థిస్తున్నా. ఆ క్యాప్షన్ లేకున్నా దేశం కోసం పనిచేస్తున్న కుటుంబంగా మన బంధం కొనసాగుతుంది'' అని పేర్కొన్నారు. మోదీకి కుటుంబమే లేదంటూ ఎన్నికల ప్రచారంలో ఆర్జేడీ నేత లాలు ప్రసాద్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో బీజేపీ శ్రేణులు తామంతా మోదీ కుటుంబమే (మోదీ కా పరివార్) అంటూ సామాజిక మాధ్యమ ఖాతాల్లో క్యాప్షన్ పెట్టుకోవడం తెలిసిందే.

ఉగ్ర దుర్భేద్యంగా భారత్‌ను నిర్మిస్తా

కేంద్ర హోం మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వేళ అమిత్ షా వ్యాఖ్య

న్యూఢిల్లీ: భారత దేశాన్ని అజేయ శక్తిగా మలుస్తానని నూతన హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. మంగళవారం ఢిల్లీలో హోం శాఖ కార్యాలయంలో అమిత్ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ' దేశం, దేశ ప్రజల భద్రతే నాకు అత్యున్నతం. మోదీ 3.0 ప్రభుత్వం దేశాన్ని భద్రత విషయంలో సమున్నత శిఖరాలకు చేరుస్తుంది. ఉగ్రవాదం, వేర్పాటువాదం, నక్సల్ ప్రభావం బారిన పడకుండా దుర్భేద్యంగా మారుస్తా' అని అన్నారు. మరోసారి కేంద్ర హోం మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో దేశంలో కొత్తగా అమల్లోకి వచ్చిన మూడు నేర చట్టాలు.. భారతీయ న్యాయ సంహిత–2023, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత–2023, భారతీయ సాక్ష్యా అధినియం–2023ల సమర్థ అమలును అమిత్‌షా పర్యవేక్షించనున్నారు.

బాధ్యతలు స్వీకరించిన కేంద్ర మంత్రులు

మంత్రులుగా ప్రమాణంచేసిన నేతలు మంగళవారం ఢిల్లీలో తమతమ శాఖల కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించి కర్తవ్య నిర్వహణ మొదలెట్టారు. కొందరు నేతలు పూజాకార్యక్రమాలు చేసి మంత్రి కుర్చీల్లో కూర్చుంటే కొందరు కమలదళ నినాదాలు చేస్తూ కుర్చీల్లో ఆసీనులయ్యారు. జైశంకర్ భారత విదేశాంగ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. గతంలో బీజేపీ అధ్యక్షుడిగా ఉన్న జేపీ నడ్డా ఆరోగ్య శాఖ మంత్రిగా, అశ్వనీ వైష్ణవ్ రైల్వే, ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. కమ్యూనికేషన్ శాఖ మంత్రిగా జ్యోతిరాదిత్య సింధియా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిగా కిరెన్ రిజిజు, వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజాపంపిణీ మంత్రిగా ప్రహ్లాద్ జోషి, విద్యుత్ శాఖ మంత్రిగా మనోహర్ లాల్ ఖట్టర్, పర్యావరణ మంత్రిగా భూపేంద్ర యాదవ్ బాధ్యతలు స్వీకరించారు. ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ మంత్రిగా ఎల్‌జేపీ(రాంవిలాస్) చీఫ్ చిరాగ్ పాశ్వాన్ తన కుటుంబసభ్యుల సమక్షంలో మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. శివరాజ్ సింగ్ చౌహాన్ తదితరులూ మంత్రులుగా బాధ్యతలు స్వీకరించారు.



మహిళా మంత్రులూ..

వికసిత్ భారత్ లక్ష్యంగా పనిచేస్తానని మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రిగా బాధ్యతలు చేపడుతూ అన్నపూర్ణాదేవి చెప్పారు. ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రిగా అనుప్రియా పటేల్, క్రీడలు, యువజన వ్యవహారాల సహాయ మంత్రిగా రక్షా ఖడ్సే, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రిగా శోభా కరంద్లాజె, మహిళా, శిశు సంక్షేమ శాఖ సహాయ మంత్రిగా సావిత్రీ ఠాకూర్, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రిగా నిమూబెన్ బంభానియా బాధ్యతలు స్వీకరించారు.



వేదికపై రాహుల్, ప్రియాంక

ప్రియాంక పోటీచేస్తే ప్రధాని ఓడేవారు

వారణాసిలో పోటీపై రాహుల్ గాంధీ వ్యాఖ్య

రాయ్‌బరేలీ: ప్రధాని మోదీ పోటీచేసిన వారణాసి లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ పోటీచేస్తే ఆమె రెండు, మూడు లక్షల ఓట్ల మెజారిటీతో నెగ్గేవారని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. రాయ్‌బరేలీలో తనను, అమేథీలో కిశోరీలాల్ శర్మను గెలిపించినందుకు గుర్తుగా మంగళవారం రాయ్‌బరేలీలో ఏర్పాటుచేసిన 'కృతజ్ఞత కార్యక్రమం'లో అమేథీ, రాయ్‌బరేలీ ఓటర్లనుద్దేశించి రాహుల్ కొద్దిసేపు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ప్రియాంక, అమేథీ ఎంపీ కిశోరీలాల్ శర్మ పాల్గొన్నారు. ''పార్లమెంట్‌లో ఎన్డీఏ బలాన్ని తగ్గించేందుకే రాయ్‌బరేలీ, అమేథీ సహా దేశవ్యాప్తంగా నియోజకవర్గాల్లో విపక్షాల 'ఇండియా' కూటమి పార్టీలు ఉమ్మడిగా పోరాడాయి. '' బీజేపీ నాయకుల గెలుపు అహంకారాన్ని మేం పట్టించుకోం. మా ఆలోచనంతా ప్రజా సమస్యల గురించే. అయోధ్యలో రామమందిరం ప్రాణప్రతిష్ఠ, ఇతరత్రా కార్యక్రమాల్లో బడా పారిశ్రామికవేత్తలకు అతి విలువ ఇచ్చి సాధారణ జనాలను మోదీ గాలికొదిలేశారు. వారి సమస్యలను పట్టించుకోలేదు. అందుకే ఏకంగా అయోధ్యలోనూ బీజేపీకి ఓటమి రుచి చూపించి ఓటర్లు బుద్ధి చెప్పారు'' అని అన్నారు.

అవధ్ గొప్ప సందేశమిచ్చింది: ప్రియాంక

అమేథీ, రాయ్‌బరేలీలో బీజేపీని ఓడించి ఇక్కడి అవధ్ ప్రాంతం ఉత్తరప్రదేశ్‌కేకాదు యావత్‌భారతానికి చక్కటి సందేశం ఇచ్చిందని, మనకు వాస్తవికమైన స్వచ్ఛమైన రాజకీయాల అవసరం ఉందని ప్రియాంకా అన్నారు.

24 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

ప్రమాణ స్వీకారం చేయనున్న నూతన ఎంపీలు

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఈ నెల 24 నుంచి జూలై 3వ తేదీ వరకూ జరగనున్నాయి. కేంద్రంలో నూతన ప్రభుత్వం కొలువుదీరడంతో లోక్‌సభ కార్యకలాపాలు నిర్వహించడానికి స్పీకర్‌ను ఎంపిక చేయడంతోపాటు నూతన సభ్యులు ప్రమాణ స్వీకారం చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఎనిమిది రోజులపాటు నిర్వహించే ప్రత్యేక సమావేశాల్లో తొలి రెండు రోజులు సభ్యులతో ప్రొటెం స్పీకర్ ప్రమాణం చేయిస్తారు. ప్రొటెం స్పీకర్‌గా కాంగ్రెస్ సభ్యుడు కొడికొన్నిల్ సురేశ్ వ్యవహరించనున్నట్లు సమాచారం. లోక్‌సభలో ప్రొటెం స్పీకర్‌గా సీనియర్ సభ్యుడు వ్యవహరించడం ఆనవాయితీగా వస్తోంది. ఈసారి లోక్‌సభకు ఎన్నికైన వారిలో కొడికున్నిల్ సురేశ్, గత సమావేశాల్లో ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరించిన వీరేంద్రకుమార్ ఖతిక్(బీజేపీ) ఎనిమిదేసి పర్యాయాలు ఎంపీలుగా నెగ్గారు. వీరేంద్రకుమార్ కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కారణంగా కొడికున్నిల్ సురేశ్‌కు ప్రొటెం స్పీకర్‌గా అవకాశం దక్కనున్నట్లు తెలుస్తోంది. సభ్యుల ప్రమాణ స్వీకారం అనంతరం స్పీకర్ ఎంపిక జరగనుంది. ఎన్డీయే భాగస్వామ్య పక్షాలైన తెలుగుదేశం పార్టీ, జేడీ(యూ)ల లోక్‌సభ సభాపతి పదవి కోసం పట్టుపడుతున్నప్పటికీ ఆ స్థానానికి ఉన్న ప్రాధాన్యం దృష్ట్యా కూటమిలో అతిపెద్ద పార్టీ అయిన బీజేపీ అందుకు అంగీకరించడం లేదు. స్పీకర్ పోస్టును వదులుకోబోమని చెబుతోంది. గత సమావేశాలకు సభాపతిగా పనిచేసిన ఓం బిర్లాతోపాటు పలువురి పేర్లను బీజేపీ అగ్రనాయకత్వం పరిశీలిస్తోంది. మరోవైపు, బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పేరు పరిశీలనలో ఉందన్న వార్తలు వస్తున్నాయి.

కాల్పుల విరమణ తీర్మానానికి ఐరాస ఆమోదం

ఐక్యరాజ్య సమితి: గాజాలో ఎనిమిది నెలలుగా కొనసాగుతున్న హమాస్, ఇజ్రాయెల్ యుద్ధానికి ముగింపు పలకడమే లక్ష్యంగా అమెరికా తీసుకొచ్చిన కాల్పుల విరమణ తీర్మానాన్ని ఐరాస భద్రతా మండలి ఆమోదించింది. ఈ తీర్మానాన్ని ఇజ్రాయెల్ సైతం ఆమోదించిందని అమెరికా పేర్కొంది. భద్రతా మండలిలో 15 సభ్యదేశాలకుగాను 14 దేశాలు ఈ తీర్మానికి అనుకూలంగా ఓటేశాయి. రష్యా మాత్రం దూరంగా ఉండిపోయింది. ఇకనైనా ఆలస్యం చేయకుండా ఇజ్రాయెల్, హమాస్‌లు కాల్పుల విరమణను బేషరతుగా అమల్లోకి తేవాలని తీర్మానంలో పేర్కొన్నారు. మరోవైపు, 'సార్వభౌమ పాలస్తీనా దేశం' డిమాండ్ నుంచి వెనక్కి తగ్గబోమని హమాస్ తేల్చిచెప్పింది.



బీజేపీ శాసన సభా పక్షనేతగా ఎన్నికయ్యాక మాట్లాడుతున్న మాఝీ

గిరిజన బిడ్డకు ముఖ్యమంత్రి కిరీటం

ఒడిశా నూతన సీఎంగా మోహన్ చరణ్ మాఝీ

భువనేశ్వర్: ఉత్కంఠకు తెరపడింది. ఒడిశా నూతన ముఖ్యమంత్రిగా గిరిజన బిడ్డ మోహన్ చరణ్ మాఝీ(52) బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కొత్త సీఎంగా మాంఝీని ఎంపిక చేసినట్లు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మంగళవారం ప్రకటించారు. ఉప ముఖ్యమంత్రులుగా కె.వి.సింగ్‌దేవ్, ప్రవాతి పరీడా బాధ్యతలు చేపడతారని వెల్లడించారు. సార్వత్రిక ఎన్నికలతో పాటు జరిగిన ఒడిశా శాసనసభ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించిన సంగతి తెలిసిందే. 147 స్థానాలున్న అసెంబ్లీలో బీజేపీ 78 స్థానాలు గెలుచుకుంది. తదుపరి ముఖ్యమంత్రి ఎవరన్నదానిపై రకరకాల ఊహాగానాలు వినిపించాయి. పలువురు సీనియర్ల పేర్లు తెరపైకి వచ్చింది అయితే, ఎవరూ ఊహించని విధంగా మోహన్ చరణ్ మాఝీని బీజేపీ అధిష్టానం ఎంపిక చేసింది. మాఝీ నాలుగు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. బుధవారం భువనేశ్వర్‌లోని జనతా మైదాన్‌లో ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరవుతారు.

సర్పంచ్ నుంచి సీఎం దాకా..

బీజేపీ గిరిజన నేత మోహన్ చరణ్ మాఝీ మూడు దశాబ్దాల క్రితం గ్రామ సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. కెంజార్ జిల్లాలోని రైకాలా గ్రామంలో జన్మించారు. ఆయన తండ్రి వాచ్‌మన్‌గా పనిచేసేవారు. మాఝీ గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. 1997 నుంచి 2000 సంవత్సరం దాకా సర్పంచ్‌గా సేవలందించారు. బీజేపీ ఆదివాసీ మోర్చా కార్యదర్శిగా వ్యవహరించారు. 2000, 2004, 2019, 2024లో కెంజార్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

అలా చేస్తే నీట్-యూజీ గౌరవం దెబ్బతింటుంది

పేపర్ లీకేజీ పేరిట మళ్లీ పరీక్ష పెట్టాలన్న పిటిషన్‌పై సుప్రీం వ్యాఖ్య

సాక్షి, న్యూఢిల్లీ: పేపర్ లీకేజీ, పరీక్ష నిర్వహణలో లోపాలు పేరిట మళ్లీ నీట్–యూజీ పరీక్ష నిర్వహిస్తే ఈ పరీక్షకున్న గౌరవం దెబ్బతింటుందని సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం వ్యాఖ్యానించింది. పేపర్ లీకేజీ ఆరోపణలు వెల్లువెత్తడంతో మీ స్పందన తెలపాలని కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)లను జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లాతో కూడిన సుప్రీంకోర్టు వెకేషన్ బెంచ్ ఆదేశించింది. వైద్యవిద్య ప్రవేశాల కోసం దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్–యూజీ 2024 పరీక్ష పేపర్ లీక్ అయిందని, పరీక్ష నిర్వహణలో అవకతవకలు జరిగాయని విపక్షాలు ఆరోపించడంతోపాటు పలువురు సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడంతో ఈ పిటిషన్‌ను కోర్టు మంగళవారం విచారించింది.

మళ్లీ అడిగితే పిటిషన్‌ను కొట్టేస్తాం

ఎంబీబీఎస్, బీడీఎస్, ఇతర కోర్సుల అడ్మిషన్లను నిలిపేయాలంటూ చేసిన పిటిషనర్ల తరపున న్యాయవాది మ్యాథ్యూస్ జె.నెడుమ్‌పారా చేసిన అభ్యర్థనను కోర్టు తోసిపుచ్చింది. '' ఎగ్జామ్ పేపర్లు లీక్ అయ్యాయి. ముందే ప్రశ్నపత్రం సంపాదించి పరీక్షలో అత్యధిక మార్కులు తెచ్చుకున్నారు. లక్ష సీట్లు ఉంటే 23 లక్షల మంది పరీక్ష రాశారు. అత్యంత కఠినమైన ఈ పరీక్షలో ఏకంగా 67 మంది విద్యార్థులు 720 మార్కులకుగాను సరిగ్గా 720 మార్కులు సాధించారు. ఢిల్లీలోని భారతీయ విద్యాభవన్ మెహతా విద్యాలయలో ప్రశ్నలకు సమాధానాలు వెతికే ముఠాతో ఇద్దరు ఎంబీబీఎస్ విద్యార్థులుసహా నలుగురిని ఇప్పటికే అరెస్ట్‌చేశారు'' అని లాయర్ వాదించారు. ''కౌన్సిలింగ్‌ను ఆపేది లేదు. అడ్మిషన్ల ప్రక్రియ షెడ్యూల్ ప్రకారమే జరుగుతుంది. ఆపాలని మీరు ఇలాగే వాదనలు కొనసాగిస్తే మీ పిటిషన్‌ను కొట్టేస్తాం' అని లాయర్‌ను ధర్మాసనం హెచ్చరించింది. '' మళ్లీ ఎగ్జామ్ నిర్వహించడమంటే ఆ పరీక్ష పవిత్రతను భంగపరచడమే. ఆరోపణలపై మాకు సరైన సమాధానాలు కావాలి' అని కోర్టు వ్యాఖ్యానించింది. కేంద్ర ప్రభుత్వం, ఎన్‌టీఏలతోపాటు పరీక్షకేంద్రంలో అక్రమాలు జరిగాయని ఆరోపణలున్న బిహార్ ప్రభుత్వానికీ కోర్టు నోటీసులు పంపించింది. శివాంగి మిశ్రా, మరో 9 మంది ఎంబీబీఎస్ ఆశావహులు పెట్టుకున్న పిటిషన్ పెండింగ్‌లో ఉండటంతో దీనిపై స్పందన తెలపాలని ఎన్‌టీఏను కోర్టు ఆదేశించింది. కోర్టు వేసవికాల సెలవులు ముగిసే జూలై 8వ తేదీన ఈ కేసు తదుపరి విచారణ చేపడతామని కోర్టు వెల్లడించింది.

ఏటా రెండు సార్లు అడ్మిషన్లు

యూజీసీ చీఫ్ జగదీశ్

న్యూఢిల్లీ: విదేశీ వర్సిటీల తరహాలో భారతీయ విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థలు ఇకపై ఏటా రెండు సార్లు అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టే అవకాశం కల్పిస్తామని విశ్వవిద్యాలయాల నిధుల సంఘం(యూజీసీ) చీఫ్ జగదీశ్ కుమార్ ప్రకటించారు. 2024–25 విద్యాసంవత్సరం నుంచి జూలై–ఆగస్ట్, జనవరి–ఫిబ్రవరి సీజన్లలో ఈ అడ్మిషన్లు ఉంటాయని ఆయన వెల్లడించారు. '' బోర్డ్ పరీక్షల తుది ఫలితాలు ఆలస్యంగా ప్రకటించడం, ఆరోగ్య సమస్యలు, ఇతర వ్యక్తిగత కారణాలతో ఆ ఏడాది అడ్మిషన్‌ను కోల్పోయిన విద్యార్థులకు ఈ కొత్త విధానం ఎంతో ఉపయోగకరం. ప్రస్తుత విద్యాసంవత్సరంలో అడ్మిషన్‌ను పొందే అవకాశం కోల్పోతే తదుపరి అకడమిక్ సంవత్సరందాకా వేచి ఉండాల్సిన పనిలేదు. ఆర్నెల్ల తర్వాత మొదలయ్యే అడ్మిషన్ ప్రక్రియలో సీటు కోసం ప్రయత్నించవచ్చు. ప్రాంగణ నియామకాలు చేపట్టే సంస్థలు, పరిశ్రమలు సైతం ఏటా రెండుసార్లు క్యాంపస్ ప్లేస్‌మెంట్లకు మొగ్గుచూపొచ్చు. దాంతో గ్రాడ్యుయేట్లకు ఉపాధి అవకాశాలు రెట్టింపు అయ్యేసదవకాశం ఉంది' అని జగదీశ్ వివరించారు.

ఎన్నికల ఫలితాలు బీజేపీకి 'రియాలిటీ చెక్'

ఆర్ఎస్ఎస్ పత్రిక ఆర్గనైజర్ ఆక్షేపణ

న్యూఢిల్లీ: అతి విశ్వాసంతో ఉన్న బీజేపీ నేతలు, కార్యకర్తలకు ఈ లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఒక 'రియాలిటీ చెక్' అని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) పత్రిక 'ఆర్గనైజర్' స్పష్టంచేసింది. ప్రధాని నరేంద్ర మోదీ చరిష్మాను చూసి మురిసిపోతూ నీటి బుడగ లోపల ఉండిపోయిన బీజేపీ శ్రేణులు ప్రజల మదిలో ఏముందో తెలుసుకోలేదని, క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను గుర్తించలేదని ఆక్షేపించింది. అందుకే ఆశించిన ఫలితాలు రాలేదని పేర్కొంది. ఈ మేరకు ఆర్గనైజర్ తాజా సంచికలో ఒక వ్యాసం ప్రచురించారు. ఈసారి ఎన్నికల్లో స్వయంసేవకులను బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంప్రదించలేదని, వారి సహకారం తీసుకోలేదని తప్పుపట్టారు. బీజేపీకి ఆర్ఎస్ఎస్ అనేది 'క్షేత్రస్థాయి దళం' కాదని వివరించారు.

విమాన ప్రమాదంలో మలావీ ఉపాధ్యక్షుడు సొలోస్ దుర్మరణం

బ్లాంటైర్: ఆఫ్రికా దేశం మలావీలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. విమాన ప్రమాదంలో దేశ ఉపాధ్యక్షుడు సొలోస్ షిలిమాతోపాటు మరో 9 మంది దుర్మరణం పాలయ్యారు. దేశ ఉత్తర భాగంలోని పర్వత ప్రాంతంలో విమానం శకలాలను గుర్తించినట్లు మలావీ అధ్యక్షుడు లాజరస్ చక్వేరా మంగళవారం వెల్లడించారు. ఈ దుర్ఘటనలో ఎవరూ ప్రాణాలతో మిగల్లేదని అన్నారు. ఉపాధ్యక్షుడు షిలిమా సహా మొత్తం 10 మంది సోమవారం ఉదయం సైనిక విమానంలో మలావీ రాజధాని లిలోంగ్వే నుంచి 370 కిలోమీటర్ల దూరంలోని మజుజు సిటీకి బయలుదేరారు. ముజుజులో ప్రతికూల వాతావరణం వల్ల ల్యాండ్ అయ్యే అవకాశం లేకపోవడంతో వెనక్కి వెళ్లాలని విమానం పైలట్‌కు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్స్ సమాచారం ఇచ్చారు. 45 నిమిషాల తర్వాత విమానంతో సంబంధాలు తెగిపోయాయి. రాడార్ నుంచి విమానం అదృశ్యమైంది.

హత్య కేసులో కన్నడ నటుడు దర్శన్ అరెస్ట్

నటి పవిత్ర గౌడ కూడా..

మైసూరు: బెంగళూరులో జరిగిన ఓ హత్యకు సంబంధించి ప్రముఖ కన్నడ నటుడు దర్శన్ తూగుదీప(47)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి సన్నిహితురాలైన నటి పవిత్ర గౌడనూ అరెస్ట్ చేశారు. కామాక్షిపాళ్యలోని మురుగు కాల్వలో ఈనెల 9న రేణుకాస్వామి అనే వ్యక్తి మృతదేహం బయటపడింది. పోలీసులు సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు వెల్లడించిన సమాచారం ఆధారంగా మంగళవారం మైసూర్ హోటల్‌లో ఉన్న దర్శన్‌ను, అనంతరం పవిత్రను అరెస్ట్ చేశారు. చిత్రదుర్గ జిల్లా కేంద్రానికి చెందిన స్వామి ఓ ఫార్మా కంపెనీలో ఉద్యోగి. సామాజిక మాధ్యమాల్లో ఇటీవల పవిత్రపై అతడు అభ్యంతరకర వ్యాఖ్యలు చేశాడు. ఈ నేపథ్యంలో అతడు హత్యకు గురైనట్లు అనుమానిస్తున్నారు.

తుపాకీ అక్రమ కొనుగోలు కేసు.. హంటర్ బైడెన్‌ను దోషిగా తేల్చిన కోర్టు

విల్మింగ్టన్: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కుమారుడు హంటర్ బైడెన్(54)ను తుపాకీ కొనుగోలు కేసులో మొత్తం మూడు ఆరోపణల్లోనూ కోర్టు దోషిగా తేల్చింది. 2018లో తుపాకీ కొనుగోలు చేసిన సమయంలో డ్రగ్స్‌కు బానిస కాదంటూ ఆయుధ డీలర్ వద్ద అబద్ధం చెప్పారని, ఆ తుపాకీని 11 రోజులపాటు అక్రమంగా తన వద్దే ఉంచుకున్నారని న్యాయమూర్తులు నిర్ధారించారు. కేసు విచారించిన డెలావెర్‌లోని ఫెడరల్ కోర్టు జడ్జి మేరీఎల్లెన్ నొరీకా మాత్రం హంటర్‌కు 120 రోజుల జైలు శిక్ష పడే అవకాశాలున్నాయని, అక్టోబర్‌లో తీర్పు వెలువడుతుందని చెప్పారు. సాధారణంగా ఇలాంటి నేరాలకు గరిష్టంగా 25 ఏళ్ల వరకు జైలు శిక్షపడే అవకాశాలున్నాయి. హంటర్ బైడెన్‌పై మరో కేసుంది. పన్ను ఎగ్గొట్టిన ఆరోపణలపై కాలిఫోర్నియా కోర్టు సెప్టెంబర్‌లో విచారణ జరపనుంది.

49 మంది మృతి.. 140 మంది గల్లంతు

యెమెన్ తీరంలో మునిగిన వలసదారుల పడవ

కైరో: యెమెన్ తీరంలో వలసదారులతో వస్తున్న పడవ మునిగి 49 మంది చనిపోగా మరో 140 మంది గల్లంతయ్యారు. యెమెన్‌కు 320 కిలోమీటర్ల దూరంలోని సోమాలియా తీరం నుంచి బయలుదేరిన ఈ పడవలో 260 మంది సోమాలియన్లు, ఇథియోపియన్లు ఉన్నారని ఐక్యరాజ్యసమితి తెలిపింది. కిక్కిరిసిన వీరి పడవ గల్ఫ్ ఆఫ్ ఏడెన్‌లో సోమవారం మునిగిపోయింది. వీరిలో 71 మందిని రక్షించగలిగామని, మృతుల్లో 31 మంది మహిళలు, ఆరుగురు చిన్నారులు ఉన్నట్లు ఐరాస వివరించింది. గల్లంతైన వారి కోసం గాలింపు కొనసాగుతోందని వెల్లడించింది.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
బుధవారం : 12 : జూన్ : 2024

ప్లాస్టిక్ భూతం పోయేదెలా?

చిక్కమగళూరు వద్ద ముళ్లయ్యనగిరి పర్యాటక స్థలిలో పేరుకుపోయిన ప్లాస్టిక్ సీసాలు. పర్యాటకులు నిత్యం వేలాది బాటిళ్లను పడేస్తుంటారు. దీంతో ఈ చెత్త పెరిగిపోతోంది



న్యూస్‌రీల్

తల్లి శ్రమ అనన్యం



తుమకూరు: కంటికి కనిపించే దేవుడు అమ్మ అని, అందువల్ల ప్రతి ఒక్కరూ అమ్మను గౌరవించాలని, అప్పుడే పుణ్యం దక్కుతుందని యోగా గురువు, సమాజ సేవకురాలు వసంత నారాయణ గౌడ అన్నారు. తుమకూరు నగరంలో శ్రీబైరవేశ్వర ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర చంద్రి మహిళా సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లులు, పరిసర దినోత్సవాలను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఒక సంస్థ కాని, సమాజం కాని నిర్మాణం కావాలి అంటే దాని వెనుకాల అమ్మల శ్రమ చాలా ఉంటుందని అన్నారు. ఇంటి భారం మొత్తం భరించేది తల్లేనని, కుటుంబం సంతోషంగా ఉండడం కోసం శ్రమిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు వృద్ధ మహిళలను సన్మానించారు.

టోల్ ఫీజు వసూలు చేస్తాం

దొడ్డబళ్లాపురం: దొడ్డబళ్లాపురం- దాబస్‌పేట టోల్ రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో ఈనెల 14 నుండి ఈ మార్గంలో టోల్ ఫీజు వసూలు చేస్తామని హైవే అథారిటీ ప్రకటించింది. 42 కిలోమీటర్ల పొడవు గల ఈ రోడ్డు నిర్మాణం ఎన్నో ఏళ్లు కుంటుతూ సాగింది. దొడ్డబళ్లాపురం తాలూకా హులికుంట గ్రామం వద్ద టోల్ ప్లాజా ఏర్పాటు చేయడం జరిగింది. కారుకు వన్‌వే కి రూ.105, 24 గంటలలోపు డబుల్ ట్రిప్‌కు రూ.155 చెల్లించాల్సి ఉంది. ఎస్‌టీఆర్‌ఆర్ హైవే మార్గంలోని నల్లూరు-దేవనహళ్లి మార్గంలో 34.15 కిలోమీటర్ల టోల్ ఫీజు గత ఏడాది నవంబర్ 17 నుండి వసూలు చేస్తున్నారు. మొదటి విడతగా దాబస్‌పేట-హొసకోట మార్గంలో 101 కిలోమీటర్ల మేర ఈ రహదారి నిర్మించారు.

నేత్ర వైద్య శిబిరం



విజయపుర (బెంగళూరు గ్రామీణ): విజయపుర పట్టణంలో ఉన్న రోటరీ పాఠశాలలో మంగళవారం శారదా రోటరీ హెల్త్ కేర్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 95 మంది పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఇందులో 19 మందికి మెరుగైన వైద్యం అవసరమని బెంగళూరుకు తరలించి అక్కడ పెద్ద కంటి ఆస్పత్రిలో కంటి శస్త్రచికిత్సలు చేయించారు. నిర్వాహకురాలు మంజుళ, నేత్రవైద్యులు పాల్గొన్నారు.

కుటుంబం ఆత్మహత్యాయత్నం.. మరొకరు మృతి

మైసూరు: గ్రామంలో కాముకుడు లోకేష్ బెదిరింపుల భయపడి పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఒకే కుటుంబంలో నలుగురు ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబ పెద్ద మహదేవనాయక మరణించడం తెలిసిందే. చికిత్స ఫలించక ఆయన కూతురు లీలావతి కూడా కన్నుమూశారు. మైసూరు జిల్లాలోని కేఆర్ నగర తాలూకా చందగాలు గ్రామానికి చెందిన కుటుంబం చామరాజనగర జిల్లా మలెమహదేశ్వర బెట్టకు వెళ్లి గత శుక్రవారం ఉదయం పురుగుల మందు తాగింది. స్థానికులు గమనించి చామరాజనగర మిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి లీలావతి మంగళవారం చనిపోయింది. మిగతా ఇద్దరు పరిస్థితి కూడా సీరియస్‌గా ఉందని వైద్యులు తెలిపారు. మంత్రులు వెంకటేష్, హెచ్.సి.మహదేవప్ప, ఎమ్మెల్యేలు డి.రవిశంకర్, పుట్టరంగశెట్టి, ఎ.ఆర్.కృష్ణమూర్తి, జిల్లా కలెక్టర్ శిల్పానాగ్, మైసూరు కలెక్టర్ కే.వి.రాజేంద్ర ఆస్పత్రికి చేరుకుని బంధువులను పరామర్శించారు. మిగతా ఇద్దరి ఆరోగ్యం గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

ఖాకీ కస్టడీలో హీరో



సినిమాలో కంటే నిజజీవితంలో జరిగే సంఘటనలే మరింత నాటకీయంగా ఉంటాయని మళ్లీ రుజువైంది. షూటింగ్‌లో ఉండగా ప్రముఖ నటున్ని పోలీసులు అరెస్టు చేయడం, తరువాత ఆయన సన్నిహితురాలిని కూడా నిర్బంధించడం సినీ ఫక్కీలో జరిగిపోయింది. గతంలో కుటుంబ కలహాలతో వార్తల్లోకెక్కిన దర్శన్ ఇప్పుడు హత్య కేసులో నిందితుడు అయ్యాడు.

- హత్య కేసులో చాలెంజింగ్ స్టార్ దర్శన్, నటి పవిత్ర గౌడ అరెస్టు
- మరో 11 మంది నిర్బంధం
- పవిత్రకు అసభ్య మెసేజ్‌లు పంపుతున్నాడని చిత్రదుర్గవాసి హతం
- ఈ నెల 8న బెంగళూరులో ఘటన
- సినీ, రాజకీయ వర్గాల్లో కలకలం



హీరో దర్శన్, నటి పవిత్ర గౌడ (ఫైల్)



మంగళవారం మైసూరు నుంచి బెంగళూరుకు దర్శన్ తరలింపు





దర్శన్, పవిత్రగౌడ, అనూహ్యంగా పెను ఇబ్బందుల్లో చిక్కుకున్నారు





హతుడు రేణుకాస్వామి (ఫైల్)

దొడ్డబళ్లాపురం: ఓ యువకుని హత్యకు సంబంధించి ప్రముఖ హీరో, చాలెంజింగ్ స్టార్ దర్శన్, మరో నటి, ఆయన సన్నిహితురాలు పవిత్రగౌడతో పాటు 10 మంది బౌన్సర్లను బెంగళూరు పోలీసులు అరెస్టు చేశారు. రేణుకాస్వామి అనే యువకుని హత్య కేసులో దర్శన్ ప్రమేయం ఉందని కామాక్షిపాళ్య పోలీసులు మంగళవారం మైసూరులో దర్శన్‌ను అరెస్టు చేసి రాజధానికి తరలించారు. దర్శన్ అరెస్టు విషయం తెలుసుకున్న అభిమానులు కామాక్షిపాళ్య పోలీసు స్టేషన్ వద్దకు చేరుకున్నారు. బాస్.. బాస్.. డి బాస్ అంటూ నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో ఆర్ఆర్ నగరలోని దర్శన్ నివాసంతో పాటు పలుచోట్ల పోలీసులు భద్రతను పెంచారు.

పవిత్రపై అసభ్య మెసేజ్‌లు...

పోలీసు కమిషనర్ బి.దయానంద చెప్పిన ప్రకారం ... సోషల్ మీడియాలో పవిత్రగౌడ ఫోటోలపై రేణుకాస్వామి తరచూ అసభ్యంగా మెసేజ్‌లు పెట్టేవాడు. ఆమె దర్శన్‌కు చెప్పడంతో రేణుకాస్వామిని గుర్తించి పట్టుకుని జూన్ 8న రాత్రి కామాక్షిపాళ్య వద్ద ఉన్న దర్శన్ అనుచరుడు వినయ్‌కు చెందిన షెడ్‌లోకి తీసుకువచ్చి చిత్రహింసలకు గురిచేసి హత్య చేశారు. అప్పుడు దర్శన్ అక్కడే ఉన్నారు. తరువాత మృతదేహాన్ని దగ్గరలో కాలువలోకి విసిరేశారు. జూన్ 9న సుమ్మనహళ్లి వద్ద ఉన్న రాజ కాలువలో రేణుకాస్వామి మృతదేహాన్ని కుక్కలు పీక్కుతింటుండగా చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని రేణుకాస్వామిదిగా గుర్తించి విచారణ చేపట్టారు. ఇంతలో ముగ్గురు వ్యక్తులు డబ్బు గొడవలతో ఈ హత్య చేసినట్టు చెప్పుకుని పోలీసుల వద్ద లొంగిపోయారు. అయితే వారి వాంగ్మూలాలలో తేడా గమనించిన పోలీసులు గట్టిగా ప్రశ్నించగా దర్శన్ పేరు చెప్పారు.

చిత్రదుర్గ నుంచి ఇలా రప్పించారు

చిత్రదుర్గలో కేఈబీ రిటైర్డ్ ఇంజినీర్ కాశినాథ్ శివనగౌడ, రత్నప్రభ దంపతుల కుమారుడు రేణుకాస్వామి. గత ఏడాది సహనా అనే యువతితో పెళ్లయింది. ప్రస్తుతం ఆమె ఐదు నెలల గర్భిణీ. అతడు కూడా దర్శన్‌కు అభిమాని. ఈ నేపథ్యంలో రేణుకాస్వామిని మాయమాటలతో బెంగళూరులో నిందితుల వద్దకు తీసుకువచ్చిన చిత్రదుర్గ దర్శన్ అభిమానుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్రను కూడా పోలీసులు అరెస్టు చేసారు. గత శనివారం దర్శన్ పిలుస్తున్నాడని చెప్పి రేణుకాస్వామిని రాఘవేంద్ర బెంగళూరుకు తీసుకువెళ్లాడు. శనివారం మధ్యాహ్నం తల్లితండ్రులకు ఫోన్ చేసిన రేణుకాస్వామి తాను స్నేహితులతో కలిసి భోజనం చేయడానికి వెళ్తున్నట్టు తెలిపాడు. ఆ తరువాత రేణుకాస్వామి ఇంటికి వెళ్లకపోవడంతో కుటుంబసభ్యుల్లో భయం నెలకొంది. చిత్రదుర్గ చెళ్లకెరె గేట్ వద్ద బాలాజీ బార్ వద్ద బైక్ లభ్యమైంది. సోమవారం మధ్యాహ్నం కామాక్షిపాళ్య పోలీసులు తల్లిదండ్రులకు ఫోన్ చేసి సమాచారం అందించారు. కుమారుని హత్య వార్త తెలిసి వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

పలుచోట్ల భద్రత పెంపు

పోలీసులు దర్శన్, పవిత్ర, ఇతర నిందితులను కట్టుదిట్టమైన భద్రత మధ్య బౌరింగ్ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు జరిపి తరువాత తమ అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 13 మంది నిర్బంధంలో ఉన్నారు. దర్శన్‌ను పోలీసులు అరెస్టు చేయలేదని, విచారణ కోసం మాత్రమే తీసుకెళ్లారని ఆయన లాయర్ నారాయణస్వామి మీడియాకు తెలిపారు. దర్శన్‌ను వెస్ట్ డీసీపీ గిరీశ్ విచారిస్తున్నారని తెలిపారు. మొత్తం ఈ వ్యవహారం రాష్ట్ర సినీ, రాజకీయ రంగాల్లో తీవ్ర సంచలనానికి కారణమైంది. పలువురు సెలబ్రిటీలు విస్మయం వ్యక్తంచేశారు.



పోలీసుల అదుపులో చాలెంజింగ్ స్టార్

దర్శన్ ప్రమేయంపై విచారణ : హోంమంత్రి

శివాజీనగర: ఓ హత్య కేసులో నటుడు దర్శన్ పాత్ర గురించి విచారణ జరుగుతోంది, ఆ తరువాతనే స్పష్టత వస్తుందని హోం మంత్రి జీ.పరమేశ్వర్ తెలిపారు. మంగళవారం నగరంలో ఆయన మాట్లాడుతూ చిత్రదుర్గకు చెందిన ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. పోలీసుల విచారణలో దర్శన్ పేరు వినిపించింది. అందుచేత విచారణ కోసం ఆయనను అరెస్ట్ చేశారు. ఈ కేసులో ముందుగా అరెస్ట్ అయిన నిందితులు దర్శన్ పేరు చెప్పారు. ఏ కారణానికి హత్య జరిగింది? దర్శన్ పేరు ఎందుకు వచ్చింది అనేది దర్యాప్తు తరువాతనే స్పష్టమవుతుంది అని చెప్పారు.

మహిళకు రూ. 22 లక్షలు మస్కా

మైసూరు: పర్యాటక నగరం మైసూరులో ఆన్‌లైన్ మోసాలు హద్దు లేకుండా జరుగుతున్నాయి. సైబర్ దొంగలు షేరు మార్కెట్లో పెట్టుబడి పెడితే దండిగా లాభాలు వస్తాయని నమ్మించి మహిళకు రూ. 22.58 లక్షల టోపీ వేశారు. వివరాలు.. సిద్ధార్థ నగరలో నివాసం ఉంటున్న సౌమ్యా అనే మహిళ ఇన్‌స్టాలో షేర్ మార్కెట్ పోస్టును చూసింది. అందులోని నంబర్‌కు కాల్ చేయగా ఒక యువతి మాట్లాడి.. తమ వద్ద షేర్ మార్కెట్లో డబ్బు పెడితే త్వరలోనే రెండు మూడురెట్లు లాభాలు వస్తాయని చెప్పింది. ఆ మాటలు నమ్మి సౌమ్యా.. విడతల వారి రూ. 22,58,779 ను ఖాతాలకు బదిలీ చేసింది. మళ్లీ ఆ నంబర్‌కు ఫోన్ చేయగా స్పందన లేదు. దీంతో బాధితురాలు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

నెలాఖరుకు వేతన కమిషన్ అమలు!

శివమొగ్గ: జూన్ నెలాఖరు నాటికి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు 7వ వేతనం కమిషన్ నివేదికను అమలు చేయడానికి సిద్ధంగా ఉంది, ప్రభుత్వంపై తమకు నమ్మకం ఉందని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సి.ఎస్.షడక్షరి అన్నారు. మంగళవారం శివమొగ్గలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు జీతాల పెంపు కావాలని అనేక సంవత్సరాల నుంచి డిమాండ్ చేస్తున్నారన్నారు. దాంతో సర్కారు వేతన కమిషన్ ఏర్పాటు చేసిందని చెప్పారు. కమిటీ సభ్యులు అధ్యయనం చేసి నివేదికను సర్కారుకు అందజేశారని, త్వరగా అమలు చేస్తామని మార్చిలో సీఎం సిద్దరామయ్య చెప్పారన్నారు. ఆ ప్రకారం ఈ నెల చివరికి అమలు చేసే ఆస్కారం ఉందని చెప్పారు.

మెట్రో పట్టాలపై దూకి ఆత్మహత్యాయత్నం

బనశంకరి: మెట్రో పట్టాలపైకి దూకి ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించిన ఘటన సోమవారం అర్ధరాత్రి హొసహళ్లి మెట్రోస్టేషన్‌లో చోటుచేసుకుంది. అదృష్టవశాత్తూ బీఎంఆర్‌సీఎల్ సిబ్బంది అప్రమత్తమై యువకుడిని కాపాడారు. సోమవారం అర్ధరాత్రి చల్లఘట్టకు వెళుతున్న మెట్రోరైలు హొసహళ్లి మెట్రోస్టేషన్‌కు చేరుకోగానే యువకుడు ప్లాట్‌ఫాం 2 నుంచి పట్టాలపై దూకి మెట్రోరైలు వద్దకు పరుగులు తీశాడు. తక్షణం ఎవరో అత్యవసరంగా ట్రిప్ సిస్టమ్ బటన్ నొక్కడంతో రైలు తక్షణం నిలిపివేశారు. ఈ ఘటనతో సుమారు అర్ధగంటపాటు రైలు నిలిపివేశారు. ఆత్మహత్యకు ప్రయత్నించిన 34 ఏళ్ల వ్యక్తి కాగా, మానసిక అస్వస్థతతో బాధపడుతున్నారు. ఈ ఘటనతో అతడి తలకు స్వల్పగాయాలు కాగా ప్రాణాలతో బయటపడ్డాడు.

నిబంధనలకు విరుద్ధంగా విదేశీయులకు అద్దె ఇళ్లు

బనశంకరి: చట్టాన్ని ఉల్లంఘించి విదేశీయులకు ఇళ్లను అద్దెకు ఇచ్చిన 20 మంది ఇంటి యజమానులపై ఫారినర్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. నగరంలోని బాణసవాడి, రామమూర్తినగర, కృష్ణరాజపురం, సూలదేవనహళ్లి, బాగలకుంటె, కాడుగోడి, బేగూరు, బొమ్మనహళ్లి, పరప్పన అగ్రహార, విద్యారణ్యపుర, చిక్కజాల పోలీస్‌స్టేషన్ల పరిధిలో సీసీబీ పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా విదేశీ యాక్ట్ నిబంధనలు ఉల్లంఘనకు పాల్పడిన విదేశీయులైన డ్రగ్స్ పెడ్లర్లకు ఇళ్లను అద్దెకు ఇచ్చిన యజమానులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. 2023-24లో ఇళ్లు బాడుగలకు ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు. ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకున్నారు.

లారీ కొనుగోలుపై గొడవ

- తండ్రిని హత్య చేసిన కుమారుడు

దొడ్డబళ్లాపురం: లారీ ఖరీదు విషయంలో తండ్రి, కుమారుని మధ్య ఘర్షణ జరిగి కుమారుడు తండ్రిని హత్య చేసిన సంఘటన హాసన్ జిల్లా ఆలూరు తాలూకా కడబగాల గ్రామంలో చోటుచేసుకుంది. చంద్రశేఖర్ (60) హత్యకు గురైన వ్యక్తి. ఇతడి కుమారుడు సచిన్ (30) నిందితుడు. సచిన్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భూమి అమ్మి లారీ కొనుక్కుందామని సచిన్ తండ్రి వద్ద తరచూ గొడవపడేవాడు. అందుకు తండ్రి సమ్మతించేవాడు కాదు. ఈ క్రమంలో సోమవారం రాత్రి సచిన్ పీకలదాకా తాగి వచ్చాడు. ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఆవేశం పట్టలేక సచిన్ తండ్రి చంద్రశేఖర్‌పై దాడిచేసి హత్య చేసాడు. ఆలూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జూలై 31 వరకు ఓటీఎస్

- బెంగళూరువాసులు ఆస్తి పన్నును చెల్లించాలి: డీసీఎం





మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్

బనశంకరి: ఆస్తిపన్ను చెల్లింపుదారులకు బెంగళూరు మహానగర పాలికె ఇచ్చిన వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) అవకాశం జూలై 31 వరకు మాత్రమే ఉందని, సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్ సూచించారు. మంగళవారం విధాన సౌధలో నగరాభివృద్ధిశాఖ, పాలికె అధికారులతో సమావేశం జరిపారు. తరువాత ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో అధికారుల ఆస్తిపన్ను చెల్లింపు కోసం ప్రజలను ఒత్తిడి చేయలేదన్నారు. ఆస్తిపన్ను బాకీదారులకు పాలికె ఇచ్చిన వన్ టైమ్ సెటిల్‌మెంట్ జూలై 31వ గడువు పొడిగించమన్నారు. 20 లక్షల కట్టడాలు ఆస్తి పన్ను పరిధిలో ఉండగా, ఇంకా అనేకమంది పన్ను పరిధిలో లేరన్నారు. ఆగస్టు 1వ తేదీలోగా పన్ను చెల్లించపోతే డిఫాల్టర్ జాబితాలోకి చేరుస్తామని చెప్పారు.

ఇప్పటికి వసూలైంది తక్కువే

ప్రస్తుతం లెక్క ప్రకారం రూ.5,200 కోట్ల ఆస్తి పన్ను సేకరించాలి, కానీ రూ.1,300 కోట్లు మాత్రమే వసూలయ్యిందని డీసీఎం చెప్పారు. 20 లక్షల ఆస్తుల రికార్డుల డిజిటలీకరణ ప్రక్రియ పూర్తిచేస్తామని తెలిపారు. 14వ తేదీన బాలభవన్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహిస్తామని, బెంగళూరుని హరిత నగరంగా తీర్చిదిద్దడానికి బ్లూ గ్రీన్ ఊరు అనే అభియాన ప్రారంభిస్తామని చెప్పారు. హసిరు రక్షక కార్యక్రమం కింద 2 లక్షలు నాటుతామని తెలిపారు.

ఉదయం నుంచి రాత్రి వరకు పార్కులు

నగరంలో పార్కులను పరిమిత సమయాల్లో మాత్రమే తెరుస్తున్నారని, దీనిపై ప్రజలు ఫిర్యాదు చేశారన్నారు. కాబట్టి ఇకపై ఉద్యానవనాలను ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటలవరకు తెరవాలని నిర్ణయించామన్నారు. కబ్బన్‌పార్కు ఉద్యానవనశాఖ పరిధిలో ఉండటంతో ఈ సమయం ఆ పార్క్‌కు వర్తించదన్నారు. నగరంలో ఫ్లెక్సీల నియంత్రణ బాధ్యత పాలికె అధికారులదేనని చెప్పారు.



నీట్ నిరసన

నీట్ పరీక్షల్లో అక్రమాలు జరిగాయని మంగళవారం స్వతంత్ర పార్కులో వామపక్ష విద్యార్థి సంఘాల ఆందోళన

విద్యుదాఘాతానికి ఏనుగు అశ్వత్థామ బలి

మైసూరు: మైసూరు దసరా సంబరాల్లో పాల్గొనే ఏనుగు అశ్వత్థామ (38) ఇకలేదు. సోలార్ విద్యుత్ తంతి తగిలి షాక్‌తో మృతి చెందిన ఘటన మైసూరు జిల్లా హుణసూరు పిరియా పట్టణ తాలూకా సరిహద్దులోని నాగరహొళె పులుల సంరక్షణ ప్రాంతంలోని ఏనుగుల శిబిరంలో చోటుచేసుకుంది. మంగళవారం అశ్వత్థామ ఆహారం కోసం అడవిలోకి వెళ్లి అక్కడి సోలార్ విద్యుత్ తంతి తగిలి షాక్‌తో ప్రాణాలు విడిచింది. విషయం తెలుసుకున్న అటవీ అధికారులు చేరుకుని అక్కడే ఖననం చేశారు.



దసరా గజరాజు అశ్వత్థామ (ఫైల్)

దొంగల ముఠాల ఆటకట్టు

- పెద్దమొత్తంలో సొత్తు స్వాధీనం





చోరీసొత్తును పరిశీలిస్తున్న కమిషనర్ బీ.దయానంద్, (ఇన్‌సెట్) పట్టుబడిన నిందితులు

బనశంకరి: విలాసవంతమైన జీవనం కోసం బంగారు చైన్లు, ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు మహిళలతో పాటు ఐదుమందిని మంగళవారం బెంగళూరు కుమారస్వామి లేఔట్ పోలీసులు అరెస్ట్‌చేశారు. వీరి వద్ద నుంచి రూ.11 లక్షలు విలువ చేసే 174 గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నట్లు నగర పోలీస్ కమిషనర్ బీ.దయానంద్ తెలిపారు. కేసు వివరాలను వెల్లడించారు. దావణగెరె జిల్లా భరమసాగరవాసి బాబూసాబ్, హుసేన్‌బీ, దాదాపీర్, క్యాసినకెరె గులాబ్‌జాన్ అనే ఐదుమంది పట్టుబడిన దొంగలు. బెంగళూరులో బనశంకరి ఆలయంలో మహిళ మెడలో 24 గ్రాముల బంగారు చైన్‌ను లాక్కెళ్లారు. విచారణ చేపట్టి బనశంకరి మెట్రోస్టేషన్ వద్ద స్విఫ్ట్ కారులో కూర్చుని ఉన్న దొంగల ముఠాను అరెస్టు చేశారు. ఈ ముఠా నుంచి నగలను కొనుగోలు చేసిన బంగారు వ్యాపారులకు నోటీసులు జారీచేశారు.

కోణణకుంటెలో

కోణణకుంటె పోలీసులు ఒక దొంగను అరెస్ట్ చేసి రూ.16.50 లక్షల విలువచేసే నగలను వశపరచుకున్నారు. ఇళ్లు, బస్సుల్లో ఇతర స్థలాల్లో మహిళల నుంచి నగలను కాజేసేవాడు. సుబ్రమణ్యపుర ఏసీపీ గిరీశ్, పోలీసులు దొంగను పట్టుకున్నారు.

మైనర్ల దొంగపనులు

ఇళ్లలో బంగారు నగలను దొంగిలించే ముగ్గురు మైనర్లను పరప్పన అగ్రహార పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రూ.24.50 లక్షల విలువచేసే 380 గ్రాముల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. పరప్పనఅగ్రహార పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీలు పెరగడంతో నిఘా పెంచారు. 60 కి పైగా సీసీ కెమెరాలను పరిశీలించి గాలించగా ముగ్గురు మైనర్లు కారణమని గుర్తించారు. ఈ బాలలు ఒకరి ఇంట్లోనే నగలను కొట్టేయాలని పథకం వేశారు. బురఖా ధరించి ఇంటి తాళం చెవి తీసి బీరువాలో ఉన్న నగదు బంగారు నగలను ఎత్తుకెళ్లారు. మా నాన్న తాగుబోతు, ఫీజు కట్టడానికి డబ్బులు లేవు, ఈ నగలను అమ్మి ఫీజు పట్టుకుని, మిగతా డబ్బులు తమకు ఇవ్వాలని ట్యూషన్‌లో ఉపాధ్యాయునికి ఇచ్చారు. అతన్ని కూడా విచారణ చేపట్టారు.

ఫ్రీ బస్ పథకానికి ఏడాది పూర్తి

శివాజీనగర: రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ పథకాల్లో ఒకటైన నారీ శక్తి- మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ పథకం అమల్లోకి వచ్చి ఒక సంవత్సరం పూర్తయింది. ఇప్పటి వరకు రాష్ట్రంలో మహిళలు 225 కోట్ల సార్లు ఉచితంగా ప్రయాణించినట్లు సర్కారు తెలిపింది. ఇందుకుగాను ప్రభుత్వం మొత్తం రూ.5,481 కోట్ల భారాన్ని భరించింది. పథకం వచ్చాక బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. రాష్ట్రంలో ప్రముఖ పర్యాటక స్థలాలు, అధ్యాత్మిక స్థలాలకు అధిక సంఖ్యలో ప్రయాణం చేశారు. దీంతో దేవాలయాల ఆదాయం కూడా పెరిగింది.

దావణగెరె కెఐఏడీబీ కార్యాలయం జప్తు

యశవంతపుర: భూములను స్వాధీనం చేసుకుని పరిహారం ఇవ్వని కారణంగా దావణగెరెలోని కర్ణాటక పారిశ్రామిక అభివృద్ధి కార్యాలయంలోని (కెఐఏడీబీ) ఫర్నిచర్‌ను కోర్టు ఆదేశాల మేరకు జప్తు చేశారు. వివరాలు... కెఐఏడీబీ పలువురు రైతులకు సుమారు రూ.63 కోట్ల బకాయి ఉంది. బళ్లారి, హావేరి, చిత్రదుర్గ జిల్లాలు దావణగెరె కెఐఏడీబీ పరిధిలోకి వస్తాయి. 2010లో వివిధ సంస్థలకు కెఐఏడీబీ భూమిని స్వాధీనం చేసుకుని అప్పగించింది. ఇందులో బళ్లారి తాలూకా కుడితిని గ్రామంతో పాటు 10 గ్రామాల రైతులు భూమిని ఇచ్చారు. ఎకరాకు రూ. 5 లక్షలు చొప్పున భూమిని కెఐఏడీబీ అమ్మేశారు. ఇలా 15 వందల ఎకరాల భూమిని రైతుల నుంచి స్వాధీనం చేసుకుంది. భూములకు సంబంధించిన పరిహారం రైతులకు ఇవ్వలేదు. దీంతో 2013లో రైతులు కోర్టుకు వెళ్లగా 20223లో రైతులకు పరిహారం ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. కోర్టు ఆదేశాలిచ్చిన అధికారులు పైసా కూడా రైతులకు ఇవ్వలేదు. దీంతో కోర్టు కెఐఏడీబీ కార్యాలయాన్ని జప్తు చేయాలని ఆదేశించడంతో రైతులు ఏకంగా లారీని తీసుకువచ్చి ఫర్నిచర్ తదితర సామగ్రిని తరలించారు.



చిక్కమగళూరులో కొల్లాపురమ్మ ఆలయం జాతరలో నిప్పుల్లో నడుస్తున్న భక్తురాలు

క్లుప్తంగా

కేపీఎస్సీ సభ్యుడిగా శివనగౌడ పాటిల్



శివనగౌడ పాటిల్‌ను అభినందించిన దృశ్యం

రాయచూరు రూరల్: కర్ణాటక పబ్లిక్ సర్వీస్ కమిషన్(కేపీఎస్సీ) సభ్యుడిగా శివనగౌడ పాటిల్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మంగళవారం ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డి.కె.శివ కుమార్‌ల ప్రతిపాదన మేరకు రాష్ట్ర గవర్నర్ ఈమేరకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు రవి ఆయనను అభినందించారు.

ఏఐసీసీ అధ్యక్షుడితో ఎమ్మెల్సీ భేటీ



మల్లికార్జున ఖర్గేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న వసంత్‌కుమార్ తదితరులు

రాయచూరు రూరల్: విధాన పరిషత్‌కు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి కార్యాధ్యక్షుడు వసంత్ కుమార్ నూతన ఎమ్మెల్సీగా ఎంపికైనందున ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి కేసీ వేణుగోపాల్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ నేపథ్యంలో పరిషత్ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొని ప్రజా సమస్యలపై గళం విప్పాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా విధాన పరిషత్ సభ్యుడు శరణే గౌడ బయ్యాపూర్, ఎమ్మెల్యేలు హంపన గౌడ, బసన గౌడ, డీసీసీ అధ్యక్షుడు బసవ రాజ్ పాటిల్ ఇటగి, బసన గౌడలున్నారు.

రాయచూరు ఉత్సవాలు ప్రారంభం



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

రాయచూరు రూరల్: నగరంలో సోమవారం సాయంత్రం రాయచూరు చారిత్రక ఉత్సవాలను కిల్లే బృహన్మఠాధిపతి శాంతమల్ల శివాచార్యులు ప్రారంభించారు. రాష్ట్ర శామియానా, డెకరేటర్స్, సౌండ్, పబ్లిసిటీ క్షేమాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో స్వామీజీ మాట్లాడుతూ ప్రభుత్వం సంఘాన్ని కార్మిక శాఖ ఆధీనంలోకి చేర్చుకుని వారిని గుర్తించి ఆదుకోవాలన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో శామియానా, డెకరేటర్స్, సౌండ్, పబ్లిసిటీ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు లక్ష్మణ్, రాజా సాహెబ్, ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం సంచాలకురాలు స్మిత, అరుణ్, మెహబూబ్, మంజునాథ్, విరుపాక్షి, విజయ్‌కుమార్‌లున్నారు.

నీట్‌లో అక్రమాలపై విచారణకు వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: రాష్ట్రంలో నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై పూర్తి స్థాయిలో ఏకసభ్య న్యాయమూర్తితో విచారణ జరిపించాలని ఏఐడీఎస్ఓ డిమాండ్ చేసింది. మంగళవారం టిప్పుసుల్తాన్ ఉద్యానవనంలో చేపట్టిన ఆందోళననుద్దేశించి అధ్యక్షుడు అయ్యాళప్ప మాట్లాడారు. నీట్ శిక్షణ, కోచింగ్, పరీక్షల విషయంలో అధిక ప్రమాణంలో జరిగిన అక్రమాలపై పూర్తి స్థాయిలో న్యాయమూర్తితో విచారణ జరిపించి తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

డీసీఎంతో చిక్కోడి ఎంపీ భేటీ




డీసీఎం డీకే శివకుమారను కలిసిన ఎంపీ, మంత్రి తదితరులు

రాయచూరు రూరల్: చిక్కోడి లోక్‌సభ స్థానానికి ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన మంత్రి సతీష్ జార్కిహోళి కుమార్తె ప్రియాంక జార్కిహోళి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీ.కే.శివకుమారను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ నేపథ్యంలో లోక్‌సభ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొని ప్రజా సమస్యలపై స్పందించాలని ఆయన సూచించారు.

నేడు చేళ్లగుర్కి ఎర్రితాత మహారథోత్సవం

- కోరిన కోర్కెలు తీర్చే మహిమాన్వితుడు
- రేపు అంగరంగ వైభవంగా పూల రథోత్సవం



చేళ్లగుర్కిలో వెలసిన ఎర్రితాత



చేళ్లగుర్కిలోని ఎర్రితాత ఆలయం

సాక్షి,బళ్లారి: కోరిన కోర్కెలు తీర్చే దైవాంశ సంభూతుడుగా గుర్తింపు పొంది లక్షలాది మంది భక్తులకు కొంగు బంగారంగా నిలిచిన చేళ్లగుర్కి ఎర్రితాత జాతర మహోత్సవాలు కన్నుల పండువగా జరుగుతున్నాయి. ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి చేళ్లగుర్కికి వచ్చి ఇక్కడ స్థిరపడి, జనం మధ్యలో సామాన్యుడిగా తిరుగుతూ, ఎన్నో మహిమలు చూపిన ఎర్రితాతకు కర్ణాటకలోనే కాకుండా పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో లక్షలాది మంది భక్తులు ఉన్నారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ సరిహద్దును ఆనుకుని బళ్లారి తాలూకా చేళ్లగుర్కిలో వెలసిన ఎర్రితాత మహిమలను ఈ ప్రాంత వాసులు కళ్లముందే కనబడుతున్నాయి.

ఏటేటా పెరుగుతున్న రద్దీ

దీంతో ఏటేటా చేళ్లగుర్కికి వచ్చే భక్తులు పెద్ద సంఖ్యలో పెరుగుతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి ఏటా క్రమం తప్పకుండా నిర్వహించే జాతర మహోత్సవాలకే కాకుండా ప్రతి సోమవారం, అమావాస్య, పౌర్ణమి, గురువారం రోజుల్లో పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి స్వామి సమాధిని దర్శించుకుని పునీతులవుతుంటారు. ప్రతి రోజు శ్రీ ఎర్రితాత మఠంలో భక్తులకు అన్నదానం కూడా చేస్తుంటారు. చేళ్లగుర్కి ఎర్రితాత సమాధిని దర్శించుకుంటే కోరిన కోర్కెలే కాదు కష్టాలు, మనశ్శాంతి కూడా ఎంతో లభిస్తుందని భక్తుల్లో ప్రగాఢ విశ్వాసం నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రతి ఏటా నిర్వహించే జాతర మహోత్సవాలకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు.

ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు

ఉత్సవాల్లో భాగంగా రెండు రోజులు అంటే నేడు చేళ్లగుర్కి ఎర్రితాత మహారథోత్సవం, జూన్ 12న సాయంత్రం మహారథోత్సవ కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు తరలిరానుండటంతో అన్ని చర్యలు చేపట్టారు. అదే విధంగా 13వ తేదీన పూల రథోత్సవం కూడా జరపనున్నారు. రెండు రోజుల పాటు రథోత్సవ కార్యక్రమాలు ఉండటంతో ఎర్రితాత మఠం వద్దకు భక్తులు పెద్ద సంఖ్యలో చేరనుండటంతో ముందస్తు చర్యలు తీసుకున్నారు. ఎర్రిస్వామి జీవసమాధి ట్రస్టు అధ్యక్షుడు బాలనగౌడ, అన్నదాన సేవా సంఘం అధ్యక్షుడు పంపనగౌడ నేతృత్వంలో గ్రామస్తులు కలిసికట్టుగా ఎర్రితాత జాతర మహోత్సవాలను విజయవంతం చేయడానికి కృషి చేస్తున్నారు.

భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: నేటి ఆధునిక యుగంలో హిందూ సనాతన సంప్రదాయాలతో లభించే మోక్ష మార్గం స్వామీజీల ఆశీర్వాదం భక్తులకు ఉత్కృష్టమైనవని మడ్డిపేట నీలగిరి సాలి మఠం పీఠాధిపతి సూగూరయ్య మహాస్వామీజీ పేర్కొన్నారు. మంగళవారం నగరంలో మటమారయ్య మహాస్వామీజీ 66వ వర్ధంతిలో భాగంగా జల, క్షీర, భస్మ, గంధాభిషేక, పుష్పాలంకరణలు చేశారు. కార్యక్రమంలో సిద్దనగౌడ, విరుపాక్షయ్య, హరినాథ్, మారెప్ప, బసవ ప్రభు, రవి, అరుణ్, విక్రమ్ గౌడ, ఆత్మకూరు, నాల్వార, యాదగిరి, కలబుర్గి, మాన్విల నుంచి భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు.

పిల్లలు, వృద్ధులకు అన్నదానం

హొసపేటె: వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, కన్నడ, సంస్కృతి శాఖ, కొప్పళ జిల్లా ఇంచార్జి మంత్రి శివరాజ్ తంగడిగి జన్మదిన వేడుక సందర్భంగా గంగావతి నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కార్యకర్తలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రామనగర్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను సందర్శించి ఇన్‌పేషెంట్లకు పండ్లు, బ్రెడ్, పాలు పంపిణీ చేసి ఆరోగ్యం కోసం సెంటర్‌లో మొక్కలు నాటారు. అనంతరం కంప్లి రోడ్డులోని గంగావతి నగర లయన్స్ ఛారిటబుల్ ట్రస్ట్‌లోని బుద్ధిమాంద్యం గల పిల్లల వసతి గృహాన్ని, మరనాథ్ చారిటబుల్ ట్రస్ట్‌కు చెందిన నవ జీవన వృద్ధాశ్రమాన్ని సందర్శించి పిల్లలకు, వృద్ధులకు అన్నదానం చేశారు.

పెంపుడు కుక్క మృతిపై ఘర్షణ

హుబ్లీ: బస్సు ఢీకొని పెంపుడు కుక్క మృతి చెందిన నేపథ్యంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్, కుక్క యజమాని మధ్య ఘర్షణ చోటు చేసుకొని దాడి జరిగిన ఘటన హుబ్లీలో మంగళవారం వెలుగు చూసింది. ఇక్కడి గదగ్ రోడ్డు నివాసి పెంచుకున్న బాక్సర్ జాతి కుక్కపై కలబుర్గి నుంచి హుబ్లీకి వస్తున్న బస్సు హుబ్లీ–గదగ్ రోడ్డులో ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన కుక్క స్థలంలోనే మృతి చెందిన నేపథ్యంలో డ్రైవర్, యజమాని మధ్య ఘర్షణ జరిగి డ్రైవర్ సదరు కుక్క యజమానిపై దాడి చేసినట్లు తెలిసింది.

ఎలుగుబంట్ల దాడిలో చెరుకు పంట నష్టం

హొసపేటె: విజయనగర జిల్లా కూడ్లిగి సమీపంలోని అమరదేవరగుడ్డ గ్రామానికి చెందిన రైతు ధర్మానాయక పొలంలో ఎలుగుబంట్లు దాడి చేసి భారీగా పంట కల్లించాయి. చేతికి వచ్చిన చెరుకు పంట నోటికి అందకుండా చేశాయి. గత సారి కూడా మొక్కజొన్న పంటపై ఎలుగుబంట్లు దాడి చేయగా ఈ సారి ఎలుగుబంట్లు చెరుకు పంటపై దాడి చేసి ధ్వంసం చేశాయి. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతన్నకు ఎలుగుబంట్ల దాడితో పంట నష్టం కావడంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ఎలుగుబంట్ల సంచారాన్ని అరికట్టేందుకు సంబంధిత అటవీ శాఖాధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచండి



వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నేతలు

బళ్లారిఅర్బన్: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో తగినంత వర్షాలు కురిసినందున పత్తి, కంది, జొన్నల విత్తనాలకు తగిన డిమాండ్ ఉందని, రైతులకు అవసరమైన వాటిని నిల్వ ఉంచి రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంచాలని కర్ణాటక రైతు సంఘం, హసిరు సేన జిల్లాధ్యక్షుడు సంగనకల్లు కృష్ణ జిల్లాధికారికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన జిల్లాధికారి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. రైతులకు ఈ సీజన్‌లో సాగు విత్తనాలతో పాటు రసాయనిక ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. మిర్చి విత్తనాలు నాశిరకం కాకుండా చూడాలన్నారు. బ్లాక్ మార్కెట్‌లో విక్రయించకుండా సంబంధిత ఉద్యానవన శాఖ అధికారులు సంబంధిత అంగళ్లలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆ వినతి పత్రంలో కోరారు. కరువు కాలం పంట బీమా ఇప్పటి వరకు రైతుల ఖాతాలోకి జమ కాలేదన్నారు. ఈ విషయంపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలన్నారు. లేకుంటే రైతుల పోరాటం అనివార్యం అవుతుందన్నారు. ప్రస్తుత టీబీ డ్యాంలోకి ప్రవాహం అధికమైందని, ఉత్తమ రీతిలో నీరు నిల్వ అయితే జూలైలో రెండు వైపులా కాలువలకు నీటిని వదిలే నిర్ణయం తీసుకోవాలన్నారు. దీంతో రైతులకు రెండో పంట సాగుకు అనుకూలం అవుతుందని ఆయన కోరారు. ఈ సందర్భంగా కే.మారెణ్ణ, బేవినగిడ ఎర్రిస్వామి, శ్రీరాములు, తిమ్మప్ప, వీ.జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.



బయటపడిన శిలాశాసనం

తుమకూరు: కుమార వ్యాసుడి కర్మభూమి గదగ జిల్లా లక్కుండిలోని హాలుగొండ బసవేశ్వర ఆలయంలో ఒక శిలా శాసనం బయటపడింది. విషయం తెలుసుకున్న తుమకూరు విశ్వవిద్యాలయం చరిత్ర, పురావస్తు అధ్యయన విభాగం ప్రాధ్యాపకుడు డాక్టర్ ఎం.కోట్రేష్, దావణగెరె విశ్వ విద్యాలయం చరిత్ర, పురావస్తు అధ్యయన విభాగం పరిశోధకుడు సుదాజె శిలా శాసనాన్ని పరిశీలించి వెలుగులోకి తీసుకువచ్చారు. ఈ శాసనం కళ్యాణ జాలక్కర 1137–1147 మధ్య జరిగిన పారిపాలన సమయంలో జగదేకమల్లునికి చెందినదిగా గుర్తించారు. కర్నాటక శాసనాలు వరుసలో ఇది కూడా కొత్త శాసనంగా ఉందని ప్రొఫెసర్ ఎం.కొట్రేష్ తెలిపారు.

వినయ్ కులకర్ణికి చుక్కెదురు

హుబ్లీ: ధార్వాడ జెడ్పీ సభ్యుడు యోగీష్‌గౌడ హత్య కేసులో కాంగ్రెస్ మాజీ మంత్రి, ప్రస్తుత ధార్వాడ గ్రామీణ ఎమ్మెల్యే వినయ్ కులకర్ణిపై పెట్టిన కేసులు సబబే అన్న సుప్రీంకోర్టు సీపీఐ ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. విచారణలో ఉన్న కోర్టు తీర్పును గతంలో సమర్థించిన హైకోర్టు ఆ తీర్పులో జోక్యం చేసుకోవడానికి న్యాయమూర్తులు పీవీ సంజయ్ కుమార్, అగస్టిన్ జార్జ్ మసిక్‌లతో కూడిన పీఠం నిరాకరించింది. సీపీఐ ప్రత్యేక కోర్టు ఆదేశాలను కర్ణాటక హైకోర్టు కూడా సమర్థించింది. తమకు వ్యతిరేకంగా పెట్టిన చార్జిషీట్ ప్రత్యేక కోర్టులో జరిగే విచారణ ప్రక్రియను రద్దు చేయాలని కోరుతూ హైకోర్టు వినయ్ కులకర్ణి రిట్ సమర్పించారు. గత ఏప్రిల్ 8న కేసు అర్జీ విచారణ జరిపి తీర్పు రిజర్వు చేసిన న్యాయమూర్తి కృష్ణ ఎస్.దీక్షిత్ ధర్మాసనం ఎమ్మెల్యే వినయ్ కులకర్ణికి వ్యతిరేకంగా చార్జిషీట్ రద్దుకు నిరాకరించింది. దీంతో వినయ్ కులకర్ణి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే సుప్రీం కోర్టు కూడా విచారణ కోర్టు తీర్పునే సమర్థించింది. జెడ్పీ బీజేపీ సభ్యుడు యోగీష్‌గౌడను 2016 జూన్ 15న దారుణంగా హత్య చేశారు. ఈ కేసులో 2020 నవంబర్‌లో వినయ్ కులకర్ణిని అరెస్ట్ చేశారు. ఆయన బెళగావి హిండలగా జైలు కేంద్ర కారాగృహంలో 9 నెలల పాటు జుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ఈ కేసును సీబీఐ దర్యాప్తు చేపట్టి మొత్తం 21 మంది నిందితులకు వ్యతిరేకంగా ప్రత్యేక కోర్టుకు చార్జిషీట్ సమర్పించింది. హత్య కేసులో నిందితుడు నేపథ్యంలో ధార్వాడ జిల్లాలోకి ప్రవేశించకుండా గతంలోనే కోర్టు షరతులతో కూడిన బెయిలు మంజూరు చేసింది. ఒక వేళ ధార్వాడకు వెళితే బెయిలు రద్దు చేస్తామని హెచ్చరికలు జారీ చేసింది. గత అసెంబ్లీ ఎన్నికలలో గెలిచినప్పటికీ వినయ్ కులకర్ణికి ధార్వాడ జిల్లాలోకి ప్రవేశంపై ఉన్న నిర్బంధాన్ని తొలగించలేదు.

డ్రోన్లతో పంటలకు మందుల పిచికారీ

- ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వైపు రైతుల మొగ్గు



డ్రోన్ సహాయంతో మందులు పిచికారీ చేస్తున్న దృశ్యం

కోలారు: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్ది రైతులు కూడా అందుకు అనుగుణంగా వ్యవసాయ పద్ధతుల్లో మార్పులు చేసుకుంటూ వస్తున్నారు. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం వ్యవసాయ రంగాన్ని కూడా ప్రభావితం చేస్తోంది. జిల్లాలో పలువురు రైతులు ఇప్పటికే ఆధునిక సాంకేతికతను ఉపయోగించి వ్యవసాయం చేస్తున్నారు. ఈ మధ్య జిల్లాలో వ్యవసాయ విజ్ఞానులు డ్రోన్ల ద్వారా పంటలకు మందులను పిచికారీ చేయడంలో రైతులకు శిక్షణ నిచ్చారు. బంగారుపేట తాలూకాలోని పలువురు రైతులు డ్రోన్ల ద్వారా పంటలకు మందులను పిచికారీ చేస్తూ డబ్బు, సమయం ఆదా చేసుకుంటున్నారు. వ్యవసాయ కూలీల మాదిరిగా డ్రోన్ కూడా చక్కగా మందులను పంటలకు చల్లగలదు. గతంలో రైతులు వ్యవసాయ కూలి కార్మికుల కోసం వేచి ఉండి పంటలకు కాపాడుకోవడానికి నానా ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ఉపాధి హామీ పథకం వచ్చిన తరువాత వ్యవసాయ కూలీలు దొరకడం కష్టమవుతోంది. అయితే డ్రోన్ల సహాయం వల్ల ఈ సమస్య పూర్తిగా నివారణ అయిందని చెప్పవచ్చు. వ్యవసాయ కూలీల సమస్య మాత్రమే కాకుండా డ్రోన్ల ద్వారా డబ్బు, సమయం కూడా ఆదా అవుతుండడం రైతులకు డ్రోన్‌లు వరంగా పరిణమించాయి.

డ్రోన్లతో పిచికారీకి ఖర్చు కూడా తక్కువే

బంగారుపేట తాలూకాలోని తిమ్మాపుర గ్రామానికి చెందిన రైతు కృష్ణమూర్తి డ్రోన్ సహాయంతో తన క్యాబేజీ పంటకు మందులు చల్లాడు. పంటలకు అంటిన క్రిమి కీటకాలను నాశనం చేయడానికి మందులు చల్లడం తప్పనిసరి. ఈ సమయంలో రైతులు అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఎకరా విస్తీర్ణంలోని పంటకు మందులు చల్లడానికి ఇద్దరు వ్యవసాయ కూలీల అవసరం ఉంది. కూలీలతో మందుల పిచికారీకి కూడా ఎక్కువగా ఖర్చు అవుతుంది. ఒక్కో కూలీకి రూ.500 కూలీ ఇచ్చినా రూ.1000 కూలీ ఇవ్వాల్సి వస్తుంది. కూలీలు రోజంతా పని చేయాల్సి ఉంటుంది. అయితే డ్రోన్ సహాయంతో మందులు చల్లడానికి కేవలం 15 నుంచి నిమిషాల సమయం చాలు. 20 లీటర్ల మందుతో ఎకరా విస్తీర్ణంలో మందు చల్లవచ్చు. దీని వల్ల డబ్బు, సమయం ఆదా అవుతుందని రైతు కృష్ణమూర్తి అంటున్నాడు. తన మూడు ఎకరాల కోసు పంటకు డ్రోన్ ద్వారానే మందు చల్లాడు. బెంగళూరులోని పీఐ సంస్థ సహకారంతో డ్రోన్ ద్వారా మందులు చల్లడానికి ఎకరాకు రూ.350 మాత్రమే ఖర్చు అయింది. డ్రోన్ల వాడకం తమకు ఎంతో సహాయకారి అయిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతను అలవర్చుకోవడం ద్వారా రైతులు ఖర్చును తగ్గించుకోవచ్చు. వ్యవసాయ కూలి కార్మికులపై ఆధారపడడం కూడా తగ్గుతుందని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రతిభ అన్నారు.

మానవ హక్కులపై జాగృతి అవసరం



సన్మానం అందుకున్న శివకుమారగౌడ

శ్రీనివాసపురం: ఇటీవల మానవ హక్కులకు భంగం వాటిల్లుతున్నందున వాటిపై ప్రజలను జాగృతం చేయాల్సిన అవసరం ఉందని జాతీయ మానవ హక్కుల జాగృతి, అవినీతి నిర్మూలన సంస్థ జాతీయ సంస్థాపక అధ్యక్షుడు శివకుమారగౌడ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహంలో నూతన పదాధికారుల ఎంపిక కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. తాలూకాలో అనేక సమస్యలు తాండవిస్తూ అవినీతి, అక్రమాలు పెచ్చుమీరుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం ఇవ్వనిదే ఏ పనీ సక్రమంగా జరగడం లేదు. దీనిపై ప్రజా పోరాటానికి సిద్ధం కావాల్సి ఉందన్నారు. సమాజంలో అవినీతికి అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతో జాతీయ మానవ హక్కుల జాగృతి, అవినీతి నిర్మూలన సంస్థను స్థాపించి రాష్ట్రంలోని అన్ని తాలూకాల్లోనూ పదాధికారులను ఎంపిక చేశామన్నారు. నూతన పదాధికారులు అవినీతి నిర్మూలనే ధ్యేయంగా పని చేయాలన్నారు. తాలూకా కార్మిక విభాగం అధ్యక్షుడిగా హెచ్‌ఎం అరుణ్, తాలూకా గౌరవ అధ్యక్షుడిగా సయ్యద్ యాసిన్, తాలూకా గౌరవ అధ్యక్షుడిగా వాసవి రామణ్ణ, విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా సుమన్‌లను ఎంపిక చేశారు.

అభివృద్ధికే మొదటి ప్రాధాన్యత



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్

కోలారు: కోలారు నియోజకవర్గ అభివృద్ధికే మొదటి ప్రాధాన్యత ఇస్తానని, ప్రభుత్వం నుంచి నిధులు తెచ్చి నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానని, ప్రతిపక్షాల విమర్శలను పట్టించుకునేది లేదని ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ తెలిపారు. మంగళవారం నగరంలోని తన కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం మాట్లాడారు. కోలారమ్మ దేవాలయ రహదారి అభివృద్ధికి ప్రజలు విన్నవించారు. వెంటనే అధికారులకు సూచించి రహదారికి మరమ్మతులు చేయిస్తానన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తేవాలని అధికారులకు సూచించారు. కోలారు నగరంలోని అన్ని రహదారులను దశల వారీగా అభివృద్ధి చేస్తామన్నారు. ముళబాగిలు నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తాను చేసిన అభివృద్ధి కార్యక్రమాలను చూసి కేవలం 20 రోజుల అవధిలో కోలారు ప్రజలు తనను ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు,. ప్రజల రుణం తీర్చుకోవడానికి తాను సదా సిద్ధంగా ఉంటానన్నారు. నియోజకవర్గంలో నిర్వహించే అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కొరత లేదన్నారు. రింగ్ రోడ్డు నిర్మాణానికి ఇప్పటికే డీపీఆర్ సిద్ధం చేశారని, సత్వరం పనులు ప్రారంభిస్తారన్నారు.

కోలారు వార్తలు...

ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించండి



విద్యార్థులకు విద్యా కిట్లను అందిస్తున్న దృశ్యం

మాలూరు: తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలపై వ్యామోహం వీడి ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చదివించాలని ఎమ్మెల్యే కె వై నంజేగౌడ పిలుపు నిచ్చారు. మంగళవారం తాలూకాలోని తాళికుంటె గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు విద్యా శాఖ నుంచి ఇస్తున్న విద్యార్థి కిట్లను అందించి మాట్లాడారు. నేడు పాఠశాలల్లో ప్రభుత్వం, దాతలు కూడా కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరీక్ష ఫలితాలు కూడా ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో కూడా వస్తున్నాయన్నారు. ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధి కోసం వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తోందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, కసాప అధ్యక్షుడు ఎంపీ హనుమంతయ్య, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఫసల్ బీమాకు పేర్లు నమోదు చేసుకోండి



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

కోలారు: ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం కింద లబ్ధి పొందడానికి రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లాధికారి అక్రంపాషా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సభా భవనంలో నిర్వహించిన జిల్లా స్థాయి పంటల బీమా జాయింట్ కమిటీ సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రస్తుత సంవత్సరం ముంగారు పంటలకు బీమా చేయించడానికి బ్యాంకు, సహకార సంఘాల్లో పంటల రుణాలు పొందిన రైతులు బీమా కంతును కూడా తగ్గించి రుణాలు ఇస్తుండడం వల్ల రైతులు బీమా కంతులను ప్రత్యేకంగా కట్టాల్సిన అవసరం లేదన్నారు. ముంగారులో ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని జిల్లాలో వ్యవసాయ శాఖ నుంచి అమలు చేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో రైతులకు నష్ట పరిహారం అందించడం ద్వారా రైతులకు ఆర్థిక భద్రత కల్పిస్తారన్నారు. బీమా చేసిన పంటలకు వర్షాభావం, కరువు వల్ల, వడగండ్ల వాన, గాలివానకు పంట నష్టం జరిగితే బీమా పరిహారం అందిస్తారన్నారు. పంటల బీమాకు వర్షాధారిత పంట అయిన వేరుశెనగకు జూలై 1న, టమాటా, కందులు, వరి పంటలకు జూలై 31 వరకు, నీటిపారుదల సౌలభ్యం కలిగిన పంటలకు ఆగస్టు 16 వరకు బీమా చేయించడానికి అవకాశం ఉంటుందన్నారు. వ్యవసాయ శాఖ జేడీ సుమా, ఉద్యాన శాఖ డీడీ కుమారస్వామి, తాలూకా, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కుమారస్వామికి అభినందన



పుష్పగుచ్ఛంతో కుమారస్వామిని అభినందిస్తున్న దృశ్యం

కోలారు: కేంద్ర కేబినెట్ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో మంగళవారం కోలారు నుంచి వెళ్లిన జేడీఎస్ నాయకులు కేంద్ర మంత్రి కుమారస్వామికి పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందించారు. జిల్లా జేడీఎస్ నాయకుడు సీఎంఆర్ శ్రీనాథ్ మాట్లాడుతూ జిల్లాకు శాశ్వత నీటిపారుదల సౌకర్యాలను కల్పించాలన్నారు. ఉద్యానవన పంటల అభివృద్ధికి కృషి చేయాలని, కేంద్రం నుంచి లభించే నిధులను సరిహద్దు జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలకు అధికంగా వెచ్చించాలని కోరారు. జేడీఎస్ నాయకులు ఎస్.సుధాకర్, రాష్ట్ర ఒక్కలిగ సంఘం డైరెక్టర్ డాక్టర్ రమేష్ తదితరులు ఉన్నారు.

టెన్త్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ అక్రంపాషా

కోలారు: పదో తరగతి పరీక్ష–2ల నిర్వహణకు ఈ నెల 14 నుంచి 22వ తేదీ వరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ అక్రం పాషా తెలిపారు. మంగళవారం నగరంలోని కలెక్టర్ కార్యాలయంలో విద్యా శాఖ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 5346 మంది విద్యార్థులు జిల్లాలోని 17 కేంద్రాల్లో పరీక్షలు రాస్తున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా సువ్యవస్థ, పారదర్శక శాంతియుత పరీక్షల నిర్వహణకు విద్యా, సాక్షరతా శాఖ, బీఈఓల సహకారంతో అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అన్ని కేంద్రాల్లో డెస్కులు, తాగునీరు, మరుగుదొడ్ల వ్యవస్థ కల్పించాలని సూచించారు. పరీక్ష కేంద్రాల చుట్టూ నిషేధాజ్ఞలు జారీ చేయాలని, జిరాక్స్ సెంటర్లను మూసి వేయించాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి అక్రమాలు జరగకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి బందోబస్తును ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షల్లో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జెడ్పీ సీఈఓ పద్మ బసవంతప్ప, డీడీపీఐ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

అక్రమంగా గోవుల రవాణా పట్టివేత

హుబ్లీ: అక్రమంగా గోవులను తరలిస్తున్న వాహనంపై భజరంగదళ్ కార్యకర్తలు సదరు గూడ్స్ వాహనాన్ని అడ్డగించి ధార్వాడ ఉపనగర పోలీసులకు అప్పగించిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. బెళగావి నుంచి రోడ్డు మార్గం మీదుగా క్యాంటర్ వాహనంలో గోవులను రవాణా చేస్తున్నట్లుగా తెలుసుకున్న వీహెచ్‌పీ, భజరంగదళ్ కార్యకర్తలు ఇక్కడి వ్యవసాయ విశ్వవిద్యాలయం వద్ద ఆ వాహనాన్ని నిలిపి తనిఖీ చేశారు. అందులో అక్రమంగా గోవులను తరలిస్తున్నట్లుగా ధృవీకరించుకొని గోవులతో పాటు వాహనాన్ని ఉపనగర పోలీసులకు అప్పగించారు. పోలీసులు ఇద్దరు క్లీనర్లను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. ఆవు దూడలతో పాటు 10కి పైగా గోవులను గోశాలకు తరలించారు.

క్లుప్తంగా

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

గౌరిబిదనూరు: నగర సమీపంలో మరళూరు రోడ్డు ఉదుమలోగు వద్ద నూతనంగా నిర్మించిన కరియమ్మ దేవి ఆలయంలో మంగళవారం కరియమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన వైభవంగా జరిగింది. ఉదయం నుండి వేద పారాయణ, సుప్రభాత సేవ, గోపూజ, కలా హోమం, చండికా హోమం, పూర్ణాహుతి, తీర్థ ప్రసాద వితరణ జరిగింది. సోమ, మంగళ వారాలు జరిగిన ఈ ధార్మిక కార్యక్రమాలు బెంగళూరుకు చెందిన గణేశ్ భట్ బృందం ఆధ్వర్యంలో జరిగింది. ధార్మిక కార్యక్రమాలలో గంగాధరప్ప, మునికృష్ణ, శ్రీనివాస్, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

కబేళాకు ఆవులు, వ్యక్తి అరెస్ట్

మైసూరు: కబేళాకు ఆవులను తరలిస్తున్న వ్యక్తిని బేగూరు పోలీసులు అరెస్ట్ చేశారు. చామరాజనగర జిల్లా గుండ్లుపేట తాలూకా బేగూరులో సంతలో ఐదు ఆవులను కొని గూడ్స్ వాహనంలో తరలిస్తుండగా పోలీసులు గుర్తించి ఐదుగురిపై కేసు నమోదు చేశారు. ఒకరిని అరెస్ట్ చేశారు.

దేవాలయంలో చోరీ



పరిశీలిస్తున్న పోలీసులు

దొడ్డబళ్లాపురం: నెలమంగల తాలూకా సోలదేనహళ్లి గ్రామంలోని మారమ్మ దేవాలయంలో చోరీ జరిగింది. సోమవారం రాత్రి ప్రధాన ద్వారం తాళాలు పగలగొట్టి లోపల జొరబడ్డ దుండగులు రెండు హుండీలతో పాటు మారమ్మ దేవి మెడలో ఉన్న తాళిబొట్టు, నగలు దోచుకున్నారు. వెళ్లేటప్పుడు దేవాలయంలో అమర్చిన సీసీ కెమెరా డీవీఆర్ కూడా పట్టుకుపోయారు. ఇటీవలే మారమ్మదేవి జాతర జరగడంతో హుండీలలో లక్షల్లో నగదు ఉంది. ఈ విషయం గ్రహించిన దుండగులు చోరీకి పాల్పడ్డారు. నెలమంగల రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గంజాయి విక్రేత అరెస్టు

కృష్ణరాజపురం: గంజాయి అమ్ముతున్న వ్యక్తిని గోవిందపురం పోలీసులు అరెస్టు చేసి రూ. 2 లక్షల విలువ చేసే 6 కిలోల సరుకును సీజ్ చేశారు. వయ్యాలి కావల్ లేఔట్‌లో గంజాయిని అమ్ముతుండగా సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి అర్జున్ హరిదాసన్ అనే యువకున్ని అరెస్టు చేశారు. రెండు సంచుల నిండా ఉన్న 6 కిలోల గంజాయి, ఇతర మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అక్షర సందడి



కృష్ణరాజపురం: నటి అక్షర హాసన్ కృష్ణరాజపురంలోని ఓ మాల్‌లో సందడి చేశారు. సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఫోటోలుకు పోజులిచ్చి ఆకట్టుకున్నారు.

ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

● సోదరుడితో కలిసి ప్రియురాలి ఘాతుకం



హత్యకు గురైన రాజేశ్ (ఫైల్)

మైసూరు: మైసూరు జిల్లా నంజనగూడు తాలూకాలో దారుణం చోటుచేసుకుంది. ప్రియుడిని ప్రియురాలు తన సోదరుడితో కలిసి దారుణంగా హత్య చేసిన ఘటన చోటుచేసుకుంది. నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల మేరకు... మైసూరు నగరంలోని క్యాతమారనహళ్లికి చెందిన ప్రేమా 15 ఏళ్ల క్రితం నంజనగూడులోని శ్రీరాంపురకు చెందిన వ్యక్తిని వివాహం చేసుకుంది. నెల రోజుల క్రితం ప్రేమా భర్త మరణించాడు. ప్రేమా భర్తకు రాజేశ్ మంచి మిత్రుడు. తరచూ స్నేహితుడి కోసం రాజేశ్ ఇంటికి వచ్చేవాడు. ఈ క్రమంలో ప్రేమా, రాజేశ్‌ల మధ్య స్నేహం పెరిగి వివాహేతర సంబంధానికి దారితీసింది. అదే సమయంలో ఇద్దరి మధ్య విభేదాలు వచ్చాయి. ప్రేమతో సన్నిహితంగా ఉన్న ఫొటోలు, వీడియోలను చూపిస్తూ రాజేశ్, ప్రేమను బ్లాక్‌మెయిల్ చేశాడు. సోషల్ మీడియాలో వైరల్ చేస్తానని హెచ్చరించాడు. ఈ విషయం ప్రేమ తన సోదరుడు శివుకు చెప్పింది. ఇద్దరు కలిసి పథకం ప్రకారం రాజేశ్‌ను ఇంటికి పిలిపించారు. రాజేశ్, శివు ఇద్దరు తీవ్రంగా ఘర్షణ పడ్డారు. రాజేశ్ పారిపోతుండగా వెంటపడిన శివు, అతని అక్క ప్రేమ దారుణంగా హత్య చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు విచారణ చేసి నిందితులను అరెస్ట్ చేశారు.

హోరెత్తించే గర్జన, నిండైన జలధారలు

● బెంగళూరు సమీపంలో కనువిందు చేసే అద్భుత జలపాతాలు

బనశంకరి: బెంగళూరు నగర సమీపంలో అద్భుత జలపాతాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. ఇవి ప్రకృతి సౌందర్యాన్ని ప్రశాంతతతో మిళితం చేస్తాయి. అన్వేషించడానికి ఇక్కడ కొన్ని ఉత్తమమైన సురక్షితమైన జలపాతాలు సందర్శకులను కనువిందు చేస్తున్నాయి.

చుంచి జలపాతం....

ఆర్కావతి నది ద్వారా చుంచి జలపాతం మేకెదాటు సంగమ మార్గంలో ఉంది. ఇది బెంగళూరు సమీపంలోని అత్యంత సుందరమైన జలపాతాల్లో ఒకటి. సంగమ అంటే మూడు నదులు కలిసి మేకెదాటు అనే రాతి లోయలో ప్రవహించే ప్రదేశం. చుంచి జలపాతానికి వెళ్లేమార్గం చుట్టూ పచ్చదనంతో కూడుకుని ఉంది. ఇది ఒక ఆహ్లాదకరమైన ప్రయాణం. జలపాతం ఎత్తు 197 అడుగులు. సందర్శించడానికి ఉత్తమ సమయం వర్షకాలం, తరువాత శీతాకాలం.

ముత్యాల మడువు....

ముత్యాల మడువు జలపాతం 92 మీటర్లు ఎత్తు నుంచి ప్రవహిస్తుంది. జలపాతం చుట్టూ ఉన్న నిర్మలమైన వాతావరణం పచ్చనిలోయ దీనిని అద్భుత గమ్యస్థానంగా మార్చింది. బెంగళూరు నుంచి ఒకరోజు పర్యటనకు సరైనప్రాంతం. ముత్యాల మడువు జలపాతం బెంగళూరు నుంచి గంట ప్రయాణం ఆనేకల్ సమీపంలో ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు ముత్యాల మడువు జలపాతం పర్యాటకులను కనువిందు చేస్తోంది. ఇక్కడ టూరిజం శాఖ బోటింగ్, డైనింగ్, టెక్‌హబ్‌లు సందడిగా ఉండే నగర జీవితానికి ప్రసిద్ధి చెందింది. నిత్యం యాంత్రిక జీవితంలో సతమతమయ్యే నగరవాసులకు ఆనేకల్ ముత్యాల మడువు జలపాతం ఆహ్లాదాన్ని అందిస్తుంది. జలపాతం చుట్టూ కొద్దిసేపు షికారు చేయవచ్చు.

శివసముద్రం ....

కావేరి నది ఒడ్డున గల శివసముద్రం భరచుక్కి, గగన చుక్కి జలపాతాలతో కూడిన జంట జలపాత వ్యవస్థ. ఈ జలపాతాలు ప్రపంచంలోని అగ్రశేణి జలపాతాల్లో ఒకటి. శక్తివంతమైన కావేరినది రెండు గర్జించే జలపాతాలుగా చీలిపోయి వర్షకాలంలో మంత్రముగ్ధులను చేసే దృశ్యాన్ని సృష్టిస్తుంది.


హొగనేకల్ జలపాతం

హొగనేకల్ జలపాతం భారతదేశం నయాగరా అని పిలుస్తారు. ఇది రాతి భూభాగాన్ని కలిగి ఉంటుంది. ఇది పాలు వంటి తెల్లటి నీటిని అనేక మార్గాల ద్వారా ప్రవహిస్తుంది. ఇది ఒక ప్రత్యేకమైన అనుభవాన్ని అందిస్తూ ఇష్టమైన రుతుపవన గమ్యస్థానం. ఇది బెంగళూ రునుంచి కొద్దిదూరంలో కలదు. జలపాతాలు వద్ద ట్రెక్కింగ్ చేయడం ఒక ఉత్తేకరమైన అనుభూతి కలిగిస్తుంది. ముఖ్యంగా వర్షాకాలంలో పరిసరాలు పచ్చగా ఉత్సాహంగా ఉంటాయి. ఇక్కడ జలపాతాల దగ్గర ట్రెక్కింగ్ మార్గాలు కూడా పర్యాటకులను కనువిందు చేస్తాయి.





చుంచిఫాల్స్ పరవళ్లు. ఎత్తైన కొండల నుంచి కిందకు దుముకుతూ కనువిందు చేస్తున్న చుంచి ఫాల్స్ జలపాతం





హొగనేకల్ వాటర్ ఫాల్స్ వద్ద తెప్పల్లో విహరిస్తున్న పర్యాటకులు, హొగనేకల్ జలపాతం భారత్ నయాగరా అని పిలుస్తారు



శివసముద్రం వాటర్ ఫాల్స్ వద్ద సందర్శకుల సందడి

26 ఎన్‌డీపీఎస్ కేసులు, 40 మంది అరెస్ట్

బనశంకరి: బెంగళూరు నగర పరిధిలో ఏప్రిల్‌లో మాదకద్రవ్యాలు విక్రయాల్లో నిమగ్నమైన నలుగురిపై 26 ఎన్‌డీపీఎస్ కేసులు నమోదు చేసి 40 మందిని అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి 52 కిలోల గంజాయి. 2 కిలోల హాశీశ్ ఆయిల్, 741 గ్రాములు చరస్, 5 గ్రాములు కొకైన్, కిలో ఎండీఎంఏ, 7 ఎల్‌ఎస్‌డీస్ట్రిప్స్ స్వాధీనం చేసుకున్నారు. ఎల్‌పీఆర్ కేసుల్లో పరారీలో ఉన్న 16 మంది ఆచూకీ కనిపెట్టి కోర్టుకు హాజరుపరిచారు. అలాగే పరారీలో ఉన్న 10 మంది రౌడీలను అరెస్ట్ చేసి అందులో ఐదుగురిని నగర బహిష్కరణ చేశారు. సీసీబీ పోలీసులు ముగ్గురు విదేశీయులతో పాటు 8 మంది డ్రగ్స్‌పెడ్లర్లను అరెస్ట్ చేసి రూ.2.74 కోట్ల విలువచేసే మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. మాదక ద్రవ్యాల విక్రయాలకు పాల్పడుతున్న కేరళ వ్యక్తిని డీజే.హళ్లి పోలీసులు అరెస్ట్ చేసి రూ.4.34 లక్షల విలువచేసే మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు.

14 నుంచి ఎస్‌ఎస్‌ఎల్‌సీ సప్లిమెంటరీ పరీక్షలు

మండ్య: ఈనెల 14 నుంచి 22 వరకు ఎస్‌ఎస్‌ఎల్‌సీ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహిస్తున్నట్లు మండ్య జిల్లా అధికారి డాక్టర్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన అధికారుల సమావేశం నిర్వహించారు. జిల్లా నుంచి 5,827 మంది పరీక్షలు రాయనున్నారని, ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

మండ్యలో బీజేపీ ధర్నా



కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

మండ్య: మన్‌ముల్ డైరెక్టర్ రూపను ఆ స్థానం నుంచి తొలగించాలని మండ్య జిల్లా సహకార యూనియన్ సహాయక ఉప అధికారితో కలిసి కాంగ్రెస్ నాయకులు కుట్రలు చేస్తున్నారని ఆరోపిస్తూ నగరంలో మంగళవారం బీజేపీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. నగరంలోని జిల్లా సహకార సమాఖ్య కార్యాలయం ఎదుటకు చేరుకున్న కార్యకర్తలు అక్కడ ధర్నా చేశారు. మండ్య జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి చెలువరాయస్వామి, సమాఖ్య సహాయక ఉప అధికారి అనితకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మండ్య జిల్లా పాల సమాఖ్య డైరెక్టర్ స్థానానికి మద్దూరు తాలూకా నుంచి బీజేపీ తరఫున రూప ఎన్నికయ్యారు. ఈ క్రమంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో రూపను ఆ స్థానం నుంచి తొలగించి, సొంత పార్టీకి చెందిన వారిని డైరెక్టర్‌ను చేయాలని కుట్ర జరుగుతోందని మండిపడ్డారు.

పొలంపై చిరుత దాడి.. కూలీల పరుగులు

మైసూరు: చామరాజనగరజిల్లాలోని హనూరు తాలూకాలోని గుండాల్ డ్యాం వద్ద పొలంలో చిరుతపులి దాడి చేసి మేకను ఎత్తుకెళ్లింది. మహేష్ అనే రైతు మంగళవారం పొలంలో కూలీలతో పనులు చేయిస్తున్నాడు. కొన్ని మేకలను పొలంలో మేపుతున్నాడు. ఇంతలో చిరుత పొలంలోకి దూసుకొచ్చి ఓ మేకను చంపి ఎత్తుకెళ్లింది. పట్టపగలు చిరుతను చూసిన కూలీ మహిళలు పరుగులు పెట్టారు. అటవీ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారువచ్చి చిరుత కోసం గాలింపు చేపట్టారు. సుమారు కిలోమీటరు దూరంలో సగం తినేసిన మేక కళేబరాన్ని పడేసి వెళ్లింది. చిరుత గుబులుతో ప్రజలు పొలాలకు వెళ్లాలంటే భయపడుతున్నారు.

జింక పిల్ల దుర్మరణం

హనూరు దగ్గర వైశంపాళ్య గ్రామం వద్ద రహదారిలో ఏదో వాహనం ఢీకొని జింక పిల్ల చనిపోయింది. వర్షాలు వచ్చి పచ్చటి గడ్డి పెరిగిపోవడంతో జింకలు ఆహారం కోసం తిరుగుతుంటాయి. మంగళవారం తెల్లవారుజామున జింకల మందలో ఓ పిల్లను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో చనిపోయింది. అటవీ సిబ్బంది దానిని తరలించారు.

ఫైర్ శాఖ సమర్థంగా పనిచేయాలి



సిబ్బందికి పతకాలు అందజేస్తున్న హోంమంత్రి

బనశంకరి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి తాలూకాలో ఫైర్ ఆఫీసులను ఏర్పాటు చేసిందని హోంశాఖామంత్రి పరమేశ్వర్ తెలిపారు. మంగళవారం కోరమంగలలో ఫైర్ శిక్షణా అకాడమీలో సిబ్బందికి సీఎం పతకాల ప్రదానోత్సవం నిర్వహించారు. పరమేశ్వర్ పతకాలను ప్రదానం చేసి మాట్లాడారు. అగ్నిమాపకశాఖ, అత్యవసరసేవలు, హోంగార్డులు, రాష్ట్ర విపత్తు నిర్వహణదళం సమర్థంగా పనిచేసి ప్రజలు మన్ననలు పొందాయని అన్నారు. అగ్నిప్రమాదాల్లో మంటలు ఆర్పివేయడానికి ఆధునిక నిచ్చెనలు, ఉపకరణాలను సమకూర్చినట్లు తెలిపారు. ఫైర్ శాఖ వాహనాలకు పెట్రోల్‌కార్డులు సౌలభ్యం కలిప్పించామన్నారు. విధుల్లో క్రమశిక్షణ పాటించడం ద్వారా శాఖకు పేరు తీసుకురావాలని తెలిపారు.

కొనసాగుతున్న వానలు

యశవంతపుర: ముంగారు వానలు కొనసాగుతున్నాయి. రాబోయే రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు వాతావారణశాఖ అధికారులు తెలిపారు. ఐదు జిల్లాల్లో ఆరెంజ్ అలర్టు ప్రకటించారు. మంగళవారం కరావళి జిల్లాలు ఉత్తర కన్నడ, ఉత్తర ఒళనాడు జిల్లాలు బెళగావి, ధారవాడ, గదగ, హావేరి జిల్లాల్లో ఆరెంజ్ అలర్టు ప్రకటించారు. దక్షిణ కన్నడ, ఉడుపి, భాగలకోట, కలబురగి, రాయచూరు, విజయపుర, యాదగిరి, చిక్కమగళూరు, కొడగు, శివమొగ్గ జిల్లాలో ఎల్లో అలర్ట్‌ను ప్రకటించారు.

ఘర్షణ, ఐదుగురు అరెస్ట్

యశవంతపుర: దక్షిణ కన్నడ జిల్లాలో మళ్లీ ఘర్షణలు మొదలయ్యాయి. ప్రధాని మోదీ ప్రమాణ స్వీకారం సందర్భంగా విజయోత్సవాలను ఆచరిస్తుండగా మంగళూరు నగరంలోని బోళియారులో బీజేపీ కార్యకర్తలు భారతమాతకు జై అంటూ నినాదాలు చేసిన ఇద్దరు యువకులపై చాకుతో దాడి చేశారు. ఘటనకు సంబంధించి మంగళూరు కోణాజె పోలీసులు ఐదుగురిని అరెస్ట్ చేశారు. విజయోత్సవాలు నిర్వహించిన ఆరుగురు బీజేపీ కార్యకర్తలపై కూడా కేసు నమోదు చేశారు.

నీట్ రద్దు చేయాలని కాంగ్రెస్ ధర్నా

శివాజీనగర: నీట్ పరీక్షల్లో అక్రమాలు చోటు చేసుకున్న తరుణంలో వెంటనే నీట్‌ను పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ కార్యకర్తలు మంగళవారం నగరంలో ధర్నా నిర్వహించారు. ప్రశ్నాపత్రం లీకైందని విద్యార్థులే దేశ వ్యాప్తంగా ఆందోళన చేపడుతున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ మౌనంగా ఉండటంతో విద్యార్థులకు అనుమానానికి దారితీసిందన్నారు. అదే విధంగా దేశంలో షేరు మార్కెట్‌లో అక్రమంగా లావాదేవీలు జరిపేందుకు, లక్షల కోట్ల సొమ్మును మోసగించిన కేసుపై తక్షణమే జాయింట్ పార్లమెంటరీ కమిటీకి అప్పగించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో కేపీసీసీ ప్రధాన కార్యదర్శి, మైసూరు ఎలక్ట్రికల్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు ఎస్.మనోహర్, కాంగ్రెస్ నాయకులు ఏ.ఆనంద్, పర్యావరణ రామకృష్ణ, హేమరాజ్, ప్రకాశ్, చేతన్, ఉమేశ్, ఆనంద్ కుమార్, నవీన్, పుట్టరాజు, చిన్ని ప్రకాశ్, వాసు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



లోతట్టు ప్రాంతంలో పడిపోయిన బైక్

మండ్య: బైక్ అదుపుప్పి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండ్య జిల్లా శ్రీరంగపట్టణం తాలూకా మరలాగళ గ్రామం వద్ద సోమవారం రాత్రి చోటు చేసుకుంది. తాలూకాలని అరకెరె గ్రామానికి చెందిన మధు (32) మృతి చెందిన వ్యక్తి. మధు సోమవారం రాత్రి బైక్‌పై వెళ్తుండగా రోడ్డు మూల ములుపు వద్ద వేగాన్ని నియంత్రించుకోలేక లోయలో పడి మృతి చెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీసి కేసు నమోదు చేశారు.

పంటనష్టం వివరాలు సేకరించండి



అధికారులతో మాట్లాడుతున్న మంజుల

చిక్కబళ్లాపురం: జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షానికి దెబ్బతిన్న పంటల వివరాలను సేకరించాలని జిల్లా ఇన్‌చార్జ్ కార్యదర్శి డాక్టర్ మంజుల ఆదేశించారు. మంగళవారం ఆమె జెడ్పీ కార్యాలయంలో జిల్లా స్థాయి అధికారుల సమావేశం నిర్వహించారు. జిల్లాలో 39.55 హెక్టార్లలో ద్రాక్ష, మామిడి, టమాటా పంట దెబ్బతినిందని, సాంకేతికంగా వాటి వివరాలు తెలియజేయాలన్నారు. రాబోయే రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, రైతులను అప్రమత్తం చేయాలన్నారు. అదే విధంగా విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ పీఎస్ రవీంద్ర, జెడ్పీ సీఈఓ ప్రకాశ్, ఏడీసీ తిప్పేస్వామి, సబ్ కలెక్టర్ అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.

కుమారుడిని హత్య చేసిన తండ్రి అరెస్ట్

బనశంకరి: కుమారుడిని హత్య చేసిన తండ్రి వెంకటేశ్‌ను మంగళవారం అన్నపూర్ణేశ్వరినగర పోలీసులు అరెస్ట్ చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి వెంకటేశ్ కుమార్తెకు ద్విచక్ర వాహనం కొనిచ్చారు. ఆదివారం సాయంత్రం సోదరి ద్విచక్ర వాహనాన్ని తీసుకెళ్లిన అంజన్‌కుమార్ (24) ఇంటికి వచ్చినప్పుడు వాహనం అక్కడే వదిలిపెట్టి వచ్చారు. సోమవారం ఇదే విషయంపై కుమారుడు అంజన్‌కుమార్‌తో తండ్రి వెంకటేశ్ వాగ్వాదానికి దిగాడు. ఇద్దరి మధ్య తీవ్ర స్థాయిలో ఘర్షణ పడ్డారు. తీవ్ర ఆగ్రహంతో వెంకటేశ్ వంటగదిలో చాకుతో అంజన్‌ను పొడవడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. అన్నపూర్ణేశ్వరి నగర పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితుడు వెంకటేశ్‌ను అరెస్ట్ చేశారు.

హోసూరు వార్తలు..

వివాహిత ఆత్మహత్య

కెలమంగలం: కుటుంబ కలహాలను తాళలేక మహిళ ఆత్మహత్య చేసుకొన్న ఘటన రాయకోట వద్ద జరిగింది. వివరాల మేరకు రాయకోట సమీపంలోని దిన్నూరు గ్రామానికి చెందిన శ్రీనివాసన్ భార్య జయంతి (34), సోమవారం రాత్రి ఇద్దరూ కొట్లాటకు దిగారు. ఆవేశం చెందిన జయంతి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. రాయకోట పోలీసులకు విషయం తెలిసి చేరుకుని శవాన్ని ఆస్పత్రికి తరలించారు.

బస్సు ఢీకొని బైకిస్టు మృతి

హోసూరు: ద్విచక్ర వానాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన సిఫ్‌కాట్ వద్ద చోటు చేసుకొంది. వివరాల మేరకు హోసూరు కార్పొరేషన్ పరిధిలోని అలసనత్తం ప్రాంతానికి చెందిన అరుణ్ (30), సోమవారం సాయంత్రం ద్విచక్రవాహనంలో హోసూరు- బెంగళూరు హైవేలో జూజువాడ్ చెక్‌పోస్ట్ వద్ద వెళుతున్నాడు. ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్ర గాయాలేర్పడిన అరుణ్‌ను స్థానికులు చికిత్స కోసం హోసూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కొంత సేపటికి అతడు చనిపోయాడు. సిఫ్‌కాట్ పోలీసులు కేసు నమోదు చేశారు.

బాలున్ని బలిగొన్న కారు

క్రిష్ణగిరి: ఇంటి ముందు ఆటలాడుకొంటున్న బాలునిపై కారు దూసుకెళ్లడంతో ప్రాణాలు కోల్పోయాడు. మత్తూరు వద్ద ఈ ఘోరం చోటు చేసుకొంది. వివరాల మేరకు క్రిష్ణగిరి జిల్లా మత్తూరు సమీపంలోని కోటూరు గ్రామానికి చెందిన రాధాక్రిష్ణన్ (40) కొడుకు ప్రశాంత్ (7), సమీపంలోని మారియమ్మ ఆలయం వద్ద ఆటలాడుకొంటుండగా ఓ కారు అతని మీద నుంచి వెళ్లింది. తీవ్ర గాయాలేర్పడిన బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మత్తూరు పోలీసులు కేసు నమోదు చేశారు. చిన్నారి మరణంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

ఏనుగుల సంచారం



డెంకణీకోట వద్ద సంచరిస్తున్న ఏనుగులు

కెలమంగలం: అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఏనుగులు డెంకణీకోట దర్గా సమీపంలోని చెరువు ప్రాంతంలో మకాం వేశాయి, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అటవీశాఖాధికార్లు తెలిపారు. పిల్ల ఏనుగుతో కలిసి మూడు ఏనుగులు సోమవారం రాత్రి నుంచి దర్గా చెరువు ప్రాంతంలో సంచరిస్తూ చెరువులో జలకాలాడుతూ గడుపుతున్నాయి. పట్టణ వాసులు, సమీపంలోని రంగసంద్రం, తావరకెరె, హొసట్టి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ప్రకటించారు.

న్యాయవాదిపై తప్పుడు కేసు బనాయించారు



ఆందోళన నిర్వహిస్తున్న పీఎంకే నాయకులు, కార్యకర్తలు

హోసూరు: నగదు మోసం కేసులో పీఎంకే నేత, న్యాయవాదిపై పోలీసులు తప్పుడు కేసు బనాయించారని, వెంటనే ఆ కేసు నుంచి న్యాయవాది పేరును తొలగించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మధ్యాహ్నం హోసూరు తాలూకా కార్యాలయం ముందు పీఎంకే పార్టీ ఆందోళన చేపట్టింది. హోసూరుకు చెందిన పీఎంకే పార్టీ న్యాయవిభాగ కార్యదర్శి కదిరవన్‌పై పోలీసులు నగదు మోసం కేసు నమోదు చేశారని, ఆయనపై నమోదు చేసిన తప్పుడు కేసును తొలగించాలని డిమాండ్ చేశారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గోవిందరాజ్ అధ్యక్షతన ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో న్యాయవాది అరక్కోణం శరవణన్, ఊత్తంగేరి మూర్తి, రాజశేఖర్, ఖాదర్‌బాషా, ధర్మలింగం, క్రిష్ణన్, అరుణ్, పీఎంకే నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

భార్య చేతిలో భర్త హతం

కెలమంగలం: తాగేందుకు డబ్బులడగడంతో గొడవ జరిగి భర్తను భార్య చంపివేసింది. వివరాల మేరకు డెంకణీకోట సమీపంలోని కళుగోపసంద్రం గ్రామానికి చెందిన పాపిరెడ్డి (48). ఇతని భార్య మంజుల (37), వీరికి పునీత్‌రెడ్డి (12) అనే కొడుకు ఉన్నాడు. పాపిరెడ్డికి తాగుడు అలవాటుండడంతో రోజూ మద్యం తాగి ఇంటికెళ్లి భార్యతో గొడవపడేవాడు. సోమవారం మద్యం మత్తులో ఇంటికెళ్లిన పాపిరెడ్డి మద్యం తాగడానికి భార్య వద్ద డబ్బులడిగాడు. ఇవ్వకపోవడంతో దాడికి యత్నించాడు. వెంటనే తిగరగబడిన భార్య మంజుల కట్టెతో దాడి చేసింది. ఈ ఘటనలో స్పృహకోల్పోయి కిందపడిన పాపిరెడ్డి మరణించాడు. డెంకణీకోట పోలీసులు చేరుకొని శవాన్ని ఆస్పత్రికి తరలించారు. మంజుళను అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు.

కార్యకర్తల వేడుకలు



మండ్య: జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామి కేంద్రమంత్రి అయిన సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు మండ్య జిల్లాలో సంబరాలు చేసుకున్నారు. మళవళ్ళి పట్టణంలో అనంత్ రామ్ కూడలిలో 101 కొబ్బరికాయల కొట్టారు. పురసభ సభ్యుడు టి.నందకుమార్, కార్యకర్తలు టపాసులు కాల్చారు.

ఇద్దరు దుర్మరణం

క్రిష్ణగిరి: హోసూరు- క్రిష్ణగిరి జాతీయ రహదారిపై మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. వివరాలు.. సూళగిరి నుంచి క్రిష్ణగిరి వైపు వెళుతున్న ద్విచక్ర వాహన్ని సామలపల్లం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనింది. బైక్‌పై వెళ్తున్న ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. సూళగిరి పోలీసులు చేరుకొని శవాలను క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతులు ఉత్తర భారతదేశానికి చెందినవారని, వివరాలు కోసం ప్రయత్నిస్తున్నట్లు సూళగిరి పోలీసులు తెలిపారు.

విపరీతంగా వాహన రద్దీ

హైవేలో క్రిష్ణగిరి సమీపంలోని బోలుపల్లి ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రి, ప్రాంతంలో, సూళగిరి సమీపంలోని సామలపల్లం, అద్దగురికి, గోపసంద్రం, పేరండపల్లి ప్రాంతాల్లో ఫ్లైఓవర్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీని వల్ల జాతీయ రహదారిపైకి అధిక వాహనాలు వస్తున్నాయి. కిలోమీటర్ల కొద్దీ తీవ్ర ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. వాహనదారులు అతివేగంగా వెళ్లడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేశారు.



జాతీయ రహదారిపై మృతదేహాలు

ఐదుగురు పోలీసుల సస్పెండ్



సస్పెండైన పోలీసులు



తుమకూరు: పోలీస్‌శాఖకు చెందిన రహస్య వివరాలను బయటకు చేరవేసిన ఐదుగురు పోలీసులను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. తుమకూరు నగరంలోని క్యాత్సంద్ర పోలీస్ స్టేషన్‌కు చెందిన మంజు, అహోబల నరసింహమూర్తి, జయనగర స్టేషన్ కానిస్టేబుల్ మనుగౌడ, ట్రాఫిక్ కానిస్టేబుల్ రామకృష్ణ, ఎస్పీ కార్యాలయ సిబ్బంది సురేశ్‌లను సస్పెండ్ చేస్తూ ఎస్పీ అశోక్ సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. రెండు కేసులకు సంబంధించి దర్యాప్తు వివరాలు ఇతరులకు చేరవేశారనే ఆరోపణలపై వీరిని సస్పెండ్ చేశారు.

క్లుప్తంగా...

తాడిగడప జంక్షన్‌లో వైఎస్ విగ్రహం తొలగింపు

శిలాఫలకం ధ్వంసం


వైఎస్సార్ విగ్రహం తొలగించి పెట్టిన మరో నేత విగ్రహం

పెనమలూరు: పెనమలూరు నియోజకవర్గంలో అధికార పార్టీ కూటమి నేతల ఆగడాలు కొనసాగుతున్నాయి. తాడిగడప జంక్షన్‌లో బందరు కాలువకట్టపై ఇటీవల ఏర్పాటు చేసిన పలువురు నేతల విగ్రహాల్లో మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం ఒకటి. దాన్ని సోమవారం రాత్రి కొందరు దుండగులు గుట్టుచప్పుడు కాకుండా తొలగించారు. శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. వైఎస్సార్ విగ్రహం స్థానంలో మరో నేత విగ్రహం పెట్టారు. గతంలో ఇక్కడ విగ్రహాలను ఏర్పాటు చేసినా వాటిని ఇప్పటివరకు ఆవిష్కరించలేదు. ఈలోగానే ఈ దుశ్చర్యలకు పాల్పడ్డారు. వైఎస్సార్ విగ్రహం తొలగింపుపై ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఈ ఘటనను వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు తీవ్రంగా ఖండించారు.

సర్పంచ్ ఇంటిపై టీడీపీ దాడి.. చంపేస్తామని బెదిరింపులు


టీడీపీ కార్యకర్తలు నరికివేసిన అరటి చెట్లు

సాక్షి నెట్‌వర్క్ (చిత్తూరు జిల్లా): చిత్తూరు జిల్లా రామకుప్పం మండలం 89 పెద్దూరులో వైఎస్సార్‌సీపీకి చెందిన సర్పంచ్ మల్లిక ఇంటిపై టీడీపీ కార్యకర్తలు సోమవారం రాత్రి దాడిచేశారు. ఒక్కసారిగా వచ్చిన నలుగురు వ్యక్తులు సీసీ కెమెరాలను ధ్వంసం చేయడంతోపాటు నానా దుర్భాషలాడారు. చంపుతామని బెదిరించారు. అదేవిధంగా పంచాయితీ వార్డు సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రకాష్ అరటి తోటలో వందకుపైగా చెట్లను నరికేశారు. ఈ విధ్వంసాలపై సర్పంచ్, వార్డు సభ్యుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అంకిరెడ్డిపల్లెలో టీడీపీ అరాచకం

కొలిమిగుండ్ల: నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం అంకిరెడ్డిపల్లెలో మంగళవారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు శేఖర్, ఖలీందర్‌పై టీడీపీ కార్యకర్తలు దాడిచేశారు. బస్టాప్ సమీపంలో కూర్చున్న శేఖర్, ఖలీందర్, మరికొందరిపై టీడీపీ వర్గీయులు ఒక్కసారిగా దాడిచేశారు. మిగిలినవారు తప్పించుకోగా శేఖర్, ఖలీందర్‌లను కొట్టారు. రెండు రోజుల కిందట పెట్రోలు పోసి వైఎస్సార్‌సీపీ కార్యకర్త యర్రగుడి శంకర్‌రెడ్డి కారుకు నిప్పు పెట్టారు.

జొన్నవాడలో టీడీపీ కార్యకర్తల వీరంగం

వైఎస్సార్‌సీపీ నేతలపై దాడి


గాయపడిన గిరికృష్ణ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడలో సోమవారం రాత్రి టీడీపీ కార్యకర్తలు వీరంగం చేశారు. వైఎస్సార్‌సీపీ నేతలు గిరికృష్ణ, మురళీకృష్ణ ఇంటిపై 15 మందికిపైగా టీడీపీ కార్యకర్తలు దాడిచేశారు. తీవ్రంగా కొట్టి భయానక వాతావరణం సృష్టించారు. బాధితుడు గిరికృష్ణ తెలిపిన వివరాల మేరకు.. సోమవారం రాత్రి తొమ్మిది గంటలకు 15 మందికిపైగా టీడీపీ కార్యకర్తలు బైక్‌లపై వారి ఇంటిముందు పెద్ద శబ్దాలు చేస్తూ.. బయటకు రా నీ అంతు చూస్తామంటూ బెదిరించారు. తమ తల్లి గుండెజబ్బుతో బాధపడుతోందని చెప్పినా, వినిపించుకోకుండా పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి ఇంటిపై వేశారు. అనంతరం రాత్రి 11గంటల సమయంలో మరోసారి వచ్చి కర్రలతో గిరికృష్ణను తీవ్రంగా కొట్టారు. గిరికృష్ణ అరుపులతో మురళీకృష్ణ, ఇంటిపక్కన ఉన్న కొందరు వచ్చి ఆయన్ని కాపాడారు. అనంతరం టీడీపీ కార్యకర్తలు మండపం వద్ద నుంచి భయానక వాతావరణం సృష్టిస్తూ ఇంటిపైకి రాళ్లు విసిరారు. తొందర్లోనే చంపేస్తామని బెదిరించారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గిరికృష్ణ చెప్పారు. టీడీపీ కార్యకర్తల దాడిని మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సర్పంచ్ సొంత స్థలంలో కట్టుకున్న ప్రహరీ కూల్చివేత

ఒంగోలు: వైఎస్సార్ సీపీకి చెందిన సర్పంచ్ తన సొంత స్థలంలో నిర్మించుకున్న ప్రహరీని టీడీపీ వర్గీయులు కూల్చివేశారు. ఈ ఘటన ప్రకాశం జిల్లా కొండపి మండలంలోని పెద్దకండ్లగుంట గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామ సర్పంచ్ భువనగిరి సత్యన్నారాయణ రెండు నెలల క్రితం తన సొంత స్థలంలో ప్రహరీని నిర్మించారు. అయితే అధికారం తమ చేతికొచ్చిందన్న అహంకారంతో టీడీపీ కార్యకర్తలు సర్పంచ్ లేని సమయం చూసి ప్రహరీని కూల్చేశారు. రూ.5లక్షల ఆస్తినష్టం జరిగిందని సత్యనారాయణ చెప్పారు. రాజకీయకక్షతోనే ప్రహరీని కూల్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

కొనసాగుతున్న శిలాఫలకాల ధ్వంసం

నవరత్నాల స్థూపం, బోర్డులు కూడా..

- జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ లైటింగ్ బోర్డు ధ్వంసం
- ఆర్బీకేలో ఫ్యాను అపహరణ
- వైఎస్సార్‌సీపీ జెండా దిమ్మె తొలగింపు



చల్లచింతలపూడి సచివాలయం బోర్డును కూల్చేస్తున్న టీడీపీ కార్యకర్త


ఆత్మకూరులో టీడీపీ ధ్వంసం చేసిన రైతు భరోసా కేంద్రం శిలాఫలకం

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రంలో టీడీపీ నేతలు, కార్యకర్తల విధ్వంసకాండ కొనసాగుతోంది. పలుచోట్ల మంగళవారం ఇష్టారీతిన వ్యవహరించారు. పలు ప్రభుత్వ కార్యాలయాలపై పేర్లను తొలగించారు. ప్రగతిపనుల శిలాఫలకాలను ధ్వంసం చేశారు. అధికారం పార్టీ ఆగడాలతో ప్రజలు భయపడుతున్నారు.

- జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయ లైటింగ్ సైన్ బోర్డును ధ్వంసం చేశారు. నూతనంగా నిర్మించిన జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయానికి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మున్సిపల్ కార్యాలయంగా పేరును నిర్ధారిస్తూ లైటింగ్ నేమ్ బోర్డును కార్యాలయ భవనంపై ఏర్పాటు చేశారు. ఈ లైటింగ్ బోర్డును టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ, మరో ఎనిమిదిమంది ధ్వంసం చేశారు. నిచ్చెనలు వేసుకుని కర్రలతో కొట్టి ధ్వంసం చేయగా, నేలరాలిన అక్షరాలతో ఆ ప్రాంతం చిందర వందరగా తయారైంది. ఘటనపై మున్సిపల్ కార్యాలయ మేనేజర్ కె.వి.రమణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- దెందులూరు మండలం పోతునూరులోని సచివాలయం, రైతుభరోసా కేంద్రం, రోడ్డు వద్ద ఉన్న శిలాఫలకం, చల్లచింతలపూడిలోని సచివాలయం వద్ద నవరత్నాలతో ఉన్న బోర్డులను టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. ఈ సంఘటనల్ని పోతునూరు సర్పంచ్ బోదుల స్వరూప్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత డి.ఎస్.వి.డి.ప్రసాద్ తప్పుబట్టారు.
- తిరుపతిలో ఒక శిలాఫలకంపై మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి పేరును కొందరు ధ్వంసం చేశారు. తిరుపతి నగరంలో గతంలో ఎమ్మెల్యే హోదాలో భూమన కరుణాకర్ రెడ్డి ఆవిష్కరించిన శిలాఫలకాన్ని మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి చేసిన భూపిరాట్టి మార్గాన్ని గత ఏడాది నవంబర్ 26వ తేదీన అప్పటి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి నగర మేయర్ డాక్టర్ శిరీషతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకంపై భూమన కరుణాకర్‌రెడ్డి పేరును కొందరు ధ్వంసం చేశారు.
- శ్రీ పొట్టిశ్రీరాములు జిల్లా ఉలవపాడు మండలం ఆత్మకూరు పంచాయతీలో నిర్మించిన రైతుభరోసా కేంద్రం వద్ద శిలాఫలకాన్ని గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం అర్ధరాత్రి ధ్వంసం చేశారు. గది తాళాన్ని పగలగొట్టి లోపల ఉన్న ఫ్యాన్‌ను అపహరించారు. టీడీపీ కార్యకర్తలు ఈ పనిచేసి ఉండొచ్చని, దీనిపై ఫిర్యాదు చేస్తామని కాంట్రాక్టర్ తెలిపారు. మండలంలో గతంలో ఎప్పుడూ ఇలాంటి ఘటనలు జరగలేదని వైఎస్సార్‌సీపీ కన్వీనర్ పోతురాజు, జేసీఎస్ కన్వీనర్ ధనకోటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు.
- బాపట్ల జిల్లా వేమూరు బస్టాండ్ సెంటర్‌లోని నవరత్నాల స్థూపాన్ని టీడీపీ దుండగులు సోమవారం అర్ధరాత్రి కూల్చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో నవరత్న పథకాలు ప్రజలకు గుర్తుండేలా వేమూరు బస్టాండ్ సెంటరులో పంచాయతీ అనుమతితో స్థూపం నిర్మించారు. ఈ నెల 7వ తేదీన స్థూపం కూల్చేసేందుకు జేసీబీతో ప్రయత్నించారు. సిమెంట్ కాంక్రీట్‌తో గట్టిగా నిర్మించడం వల్ల జేసీబీ వల్ల కాలేదు. పంచాయతీ అధికారులు, ఎంపీడీవో దగ్గర ఉండి, స్థూపంపై ఉన్న శిలాఫలకాలు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నందిగం సురేష్, మేరుగ నాగార్జున బొమ్మలను పూర్తిగా తొలగించారు. తిరిగి సోమవారం రాత్రి యంత్రాన్ని తీసుకొచ్చి స్థూపాన్ని పూర్తిగా తొలగించారు. తెల్లవారుజామున సెంటరుకు వచ్చిన ప్రజలు స్థూపం కూల్చివేసి ఉండడాన్ని గమనించి ఆశ్చర్యపోయారు.
- చిత్తూరు జిల్లా చౌడేపల్లె ప్రవేటు బస్టాండు ప్రాంతంలో ఏర్పాటుచేసిన వైఎస్సార్‌సీపీ జెండా దిమ్మెను గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం రాత్రి తొలగించారు. కూడలి సమీపంలో ఏర్పాటుచేసిన జెండా దిమ్మెను జేసీబీ సహాయంతో పెకలించినట్లు వైఎస్సార్‌సీపీ నేతలు తెలిపారు. ఈవిషయమై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.
- అనకాపల్లి జిల్లా నాతవరం మండలంలో శృంగవరం గ్రామ సచివాలయంపై టీడీపీ కార్యకర్తలు దాడిచేశారు. సచివాలయంపై ఉన్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ బొమ్మలతో పాటు నవరత్నాల పోస్టర్‌ను ధ్వంసం చేశారు. ఈ విధ్వంసం హేయమైన చర్య అని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గసభ్యుడు, సర్పంచ్ భర్త ఉలబాల శ్రీనువాసు పేర్కొన్నారు. కోర్టు వివాదంలో ఉన్న ప్రభుత్వ భవనం తాళం విరగొట్టి టీడీపీ కార్యకర్తలు ప్రవేశించటం కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించడమేనని చెప్పారు.



టీడీపీ కార్యకర్తల దాడిలో ధ్వంసమైన జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయ లైటింగ్ సైన్ బోర్డు


చౌడేపల్లెలో కూల్చివేసిన వైఎస్సార్‌సీపీ జెండా దిమ్మె


వేమూరు బస్టాండ్ సెంటర్‌లో టీడీపీ శ్రేణులు కూల్చివేసిన నవరత్నాలు స్థూపం శిథిలాలు

చంపుతామని టీడీపీ.. ఊరొదిలి పెట్టమని పోలీసులు

- మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌పై 'అధికార' జులుం
- కౌంటింగ్ రోజు మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ ఇంటిపై టీడీపీ రాళ్ల దాడి
- చంపుతామంటూ పొలికేకలు..
- గన్‌మెన్లు నిలువరించే ప్రయత్నం చేసినా బరితెగింపు
- ఇంట్లో ఉన్న గోరంట్ల మాధవ్ కాలికి గాయం
- వారం అవుతున్నా పురోగతి లేని కేసు దర్యాప్తు
- మరోపక్క ఊరొదిలి వెళ్లిపొమ్మని మాధవ్‌పై పోలీసుల ఒత్తిడి
- ససేమిరా అంటున్న మాజీ ఎంపీ
- కార్యకర్తలు అధైర్యపడొద్దు.. పార్టీ అండగా ఉంటుంది: మాధవ్


టీడీపీ కార్యకర్తల రాళ్ల దాడిలో పగిలిన గోరంట్ల మాధవ్ ఇంటి అద్దాలు


మంగళవారం గోరంట్ల మాధవ్‌ను కలిసిన సీఐలు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : రేయ్.. మాధవ్.. నిన్ను చంపుతాం అంటూ టీడీపీ నాయకులు, ఊరొదిలి వెళ్లిపోవాలంటూ పోలీసు అధికారులు నిన్నటి వరకు ఎంపీ అయిన గోరంట్ల మాధవ్‌పై అధికార జులుం ప్రదర్శిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ రోజున అనంతపురం నగరంలో మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ ఇంటిపై టీడీపీ శ్రేణులు దాడి చేశారు. 'రేయ్ మాధవ్ నిన్ను చంపుతాం' అంటూ కేకలు వేస్తూ రాళ్లతో దాడి చేశారు. ఈ ఘటనపై నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇప్పటికి వారం అవుతున్నా పోలీసులు కనీస చర్యలు తీసుకోలేదు. దాడికి పాల్పడిన టీడీపీ కార్యకర్తలపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా పోలీసులపై అధికార పార్టీ నుంచి పెద్దఎత్తున ఒత్తిళ్లు వస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పైగా, నిన్నటి వరకు ఎంపీ అయిన మాధవ్‌నే ఊరొదిలి వెళ్లిపోవాలని పోలీసు అధికారులు ఒత్తిడి చేయడం గమనార్హం. అయితే, ఇందుకు మాధవ్ ససేమిరా అంటున్నారు. కార్యకర్తలకు అండగా ఇక్కడే ఉంటానని కరాఖండిగా చెబుతున్నారు.

ఆరోజు ఏమి జరిగిందంటే..

ఈ నెల 4న ఎన్నికల కౌంటింగ్ జరిగింది. మధ్యాహ్నానికి రాష్ట్రంలో కూటమి మెజార్టీ సీట్లు గెలుచుకోవడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు రెచ్చిపోయారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో నగర శివారులోని మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ ఇంటి వద్ద కొందరు టీడీపీ కార్యకర్తలు వీరంగం చేశారు. ఇంటి మీద రాళ్ల వర్షం కురిపించారు. ఆ సమయంలో మాధవ్ దంపతులు ఇంట్లోనే ఉన్నారు. ఇంటిపై భాగంలోని అద్దాలు పగిలిపోయాయి. ఒక రాయి మాధవ్ కుడికాలి పాదం వద్ద బలంగా తాకడంతో గాయమైంది. చుట్టుపక్కల వాళ్లు తీవ్ర భయాందోళనకు గురై ఇళ్లకు తలుపులు వేసుకున్నారు. మాధవ్ గన్‌మెన్లు నిలువరించే ప్రయత్నం చేసినా ఉపయోగం లేకపోయింది. 'రేయ్.. మా ప్రభుత్వం వస్తోంది. మాధవ్‌గాడిని చంపుతాం. నీకు ఎవరు దిక్కు వస్తారురా' అంటూ కేకలు వేశారు. పోలీసులు అక్కడికి చేరుకోవడంతో 'నిన్ను ఎప్పటికైనా హత మారుస్తాం' అంటూ వెళ్లిపోయారు. ఎస్పీ గౌతమిశాలి స్వయంగా ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అల్లరిమూకలో ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. గోరంట్ల మాధవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కానీ కేసులో ఇప్పటిదాకా ఎలాంటి పురోగతీ లేదు.

ఊరొదిలి పోవాలని పోలీసులు ఒత్తిడి చేస్తున్నారు : మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్

తనను ఊరు వదిలి పోవాలంటూ పోలీసులు ఒత్తిడి చేస్తున్నారని మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ చెప్పారు. మంగళవారం సాయంత్రం ఇద్దరు సీఐలు తన నివాసానికి వచ్చి ఈ విషయం చెప్పారని తెలిపారు. అనంతపురం డీఎస్పీ కూడా ఇదే రకమైన ఒత్తిడి చేస్తున్నారన్నారు. తాను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇల్లు వదిలిపెట్టి వెళ్లబోనని, తమ పార్టీ కార్యకర్తల కోసం అండగా ఉంటానని స్పష్టంచేశారు. అవసరమైతే తనను అరెస్టు చేసుకోవాలన్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని టీడీపీ సద్వినియోగం చేసుకుని వారికి మంచి చేయాలి కానీ ఇలా ఇళ్లపై దాడులు చేయడం హేయమని అన్నారు. ఎప్పుడూ లేని విధంగా కౌంటింగ్ రోజు నుంచే గ్రామాల్లో దాడులకు తెగబడుతున్నారన్నారు. టీడీపీ నాయకుల దాడులకు తట్టుకోలేక చాలా మంది ఊళ్లు వదిలారని, కార్యకర్తలెవరూ అధైర్యపడొద్దని, పార్టీ పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని చెప్పారు. పార్టీ అధినేత సూచనలతో త్వరలోనే బాధితులను కలిసి భరోసా ఇస్తామన్నారు.

ఊరూరా విధ్వంసాలు, వేధింపులు

సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్రంలో టీడీపీ నేతలు, కార్యకర్తల ఆగడాలకు అడ్డే లేకుండా పోయింది. వారం రోజులుగా జరిగిన వందలాది ఘటనల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తీవ్ర గాయాలపాలయ్యారు. పెద్ద ఎత్తున ప్రభుత్వ ఆస్తులకు నష్టం వాటిల్లింది. ప్రధానంగా గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలను లక్ష్యంగా చేసుకుని విధ్వంసం సృష్టిస్తున్నారు. శిలాఫలకాలను ధ్వంసం చేస్తూ.. వైఎస్సార్ విగ్రహాలను కూలదోస్తున్నారు. పోలింగ్ ముగిసినప్పటి నుంచి దాడులు, దౌర్జన్యాలు, విధ్వంసాలు మొదలైనప్పటికీ.. ఫలితాల వెల్లడి తర్వాత పరిస్థితి శ్రుతిమించి పోయింది. ఎక్కడికక్కడ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను దారి కాచి దాడులు చేస్తున్నారు. గ్రామాల్లో ఇళ్లలోకి దూరి కొడుతున్నారు. వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారన్న అనుమానంతో సామాన్యులను సైతం కక్ష సాధింపుతో వేధిస్తున్నారు. 'ఇదేం అన్యాయం.. కాపాడండయ్యా..' అంటూ బాధితులు పోలీస్‌స్టేషన్‌కు పరుగులు తీస్తున్నా.. ఆ ఖాకీలు మాత్రం వృత్తి ధర్మాన్ని మరచి చోద్యం చూస్తున్నారు. తాజాగా అనంతపురంలో హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను చంపుతామని బెదిరించారు. ఊరు వదిలి వెళ్లాలని సాక్షాత్తు పోలీసు అధికారులే ఉచిత సలహా ఇస్తుండటం నివ్వెరపరుస్తోంది. తెనాలిలో వైఎస్సార్‌సీపీ నేత కాళిదాసు సత్యంపై, పల్నాడు జిల్లా బట్లూరులో ఆర్‌ఎంపీ వైద్యుడు శివయ్యపై హత్యాయత్నం చేశారు. రోజురోజుకూ పెరుగుతున్న టీడీపీ నేతలు, కార్యకర్తల అరాచకం.. దౌర్జన్యం.. కనుసైగ చేసి దాడులను ప్రోత్సహిస్తున్న ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు, లోకేశ్‌ల తీరుపై రాష్ట్రపతికి నివేదించాలని వైఎస్సార్‌సీపీ నిర్ణయించింది. ఇందులో భాగంగా పార్టీ ఎంపీల బృందం మంగళవారం రాత్రి ఢిల్లీ చేరుకుంది. రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కోరింది. రాష్ట్రంలో విధ్వంసకాండ గురించి బుధవారం జాతీయ మీడియాకు కూడా వివరించనుంది. ఇదే విషయమై సుప్రీంకోర్టును ఆశ్రయించగా, హైకోర్టుకు వెళ్లాలని సూచించింది. ఆ మేరకు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ నెల 13న ఈ పిటిషన్ విచారణకు రానుంది.

బట్లూరులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై కత్తితో దాడి

- వైఎస్సార్‌సీపీ కార్యకర్త శివయ్య ఇంటి వద్ద అర్ధరాత్రి టీడీపీ నాయకుల దాష్టీకం
- కాళ్లతో గేటు తన్ని పెద్దగా కేకలు
- బయటకు వచ్చిన శివయ్యపై కత్తితో దాడి.. చేతికి తీవ్ర గాయం
- దాడి మొత్తం సీసీ టీవీ ఫుటేజీలో రికార్డు
- నిందితుల్లో ఒకరు కట్టమూరు గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం బట్లూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త, ఆర్‌ఎంపీ వైద్యుడు పొట్లూరి శివయ్యపై టీడీపీ నాయకులు సోమవారం అర్ధరాత్రి మారణాయుధాలతో హత్యాయత్నం చేశారు. బట్లూరుకు చెందిన శివయ్య సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కోసం పని చేశాడనే కోపంతో గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు అతన్ని మట్టుబెట్టాలని నిర్ణయించుకున్నారు. గ్రామంలో సోమవారం విజయోత్సవం నిర్వహించి కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. అయినప్పటికీ వైఎస్సార్‌సీపీ నాయకులు సంయమనం పాటించారు. రాత్రి 12.10 గంటల సమయంలో టీడీపీ నాయకులు శాఖమూరి నరేష్, కట్టమూరు సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తూమాటి గోపీకృష్ణ, మందడపు హరి సూర్యనారాయణ ద్విచక్ర వాహనంపై గ్రామంలోని శివయ్య ఇంటికి వెళ్లారు. నరేష్, గోపీకృష్ణ పెద్దగా కేకలు వేస్తూ కాళ్లతో శివయ్య ఇంటి గేటును బలంగా తన్నారు. పెద్ద శబ్దంతో గేటు తెరుచుకోవడంతో శివయ్య బయటకు వచ్చాడు. వెంటనే వారిద్దరూ బూతులు తిడుతూ శివయ్యపై దాడి చేశారు. శివయ్యను తూమాటి గోపీకృష్ణ పట్టుకోగా శాఖమూరి నరేష్ కత్తితో దాడి చేశాడు. శివయ్య కుడి చేతికి కత్తిపోటు తగిలి గాయమైంది. ఇంట్లో నిద్రిస్తున్న శివయ్య భార్య నాగమణి, కుమార్తె హెప్సిబా బయటికి వచ్చి పెద్ద పెట్టున కేకలు వేయడంతో టీడీపీ వారు అక్కడి నుంచి పరారయ్యారు. అరేయ్.. బతికిపోయానని అనుకోకు.. అంటూ కులం పేరుతో దూషిస్తూ, మా అధికారం అయిపోయేలోపు నిన్ను చంపేస్తామంటూ హెచ్చరిస్తూ బైక్‌పై వెళ్లిపోయారు. ఈ ఘటన మొత్తం శివయ్య ఇంటి సమీపంలో ఉన్న సీసీ కెమెరాలో రికార్డయింది. శివయ్యను సత్తెనపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించగా, ప్రాథమిక చికిత్స అనంతరం సత్తెనపల్లి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు నామమాత్రంగా వివరాలు సేకరించారే తప్ప కేసు నమోదు చేయలేదని, తనపై హత్యాయత్నానికి వచ్చిన వారు బహిరంగంగా తిరుగుతున్నారని శివయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. జిల్లా ఎస్పీ మలికా గార్గ్‌కు ఈ ఘటన గురించి వివరించేందుకు బాధితుడు శివయ్యతోపాటు ఎంపీటీసీ సైదారావు, మాజీ ఎంపీటీసీ కోటేశ్వరరావు, దాసరి విజయ్‌కుమార్ తదితరులు మంగళవారం నరసరావుపేట ఎస్పీ కార్యాలయానికి వెళ్లి టీడీపీ దాడికి సంబంధించిన సీసీ టీవీ ఫుటేజీ, ఫిర్యాదును ఇచ్చారు.

జగన్ ఓటమిని జీర్ణించుకోలేక.. కుటుంబ సమేతంగా ఆత్మహత్యాయత్నం

భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి గోదావరిలో దూకేందుకు ఓ వ్యక్తి ప్రయత్నం.. రక్షించిన కొవ్వూరు పోలీసులు

కొవ్వూరు : సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పరాజయం పాలుకావడం ఆ వీరాభిమాని జీర్ణించుకోలేకపోయాడు. భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకోవాలని భావించాడు. మొన్నటి ఎన్నికల్లో ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసి ఉంటారని.. తన ఆవేదనను రాష్ట్రపతి దృష్టికి వెళ్తే మళ్లీ ఎన్నికలు నిర్వహిస్తారని భావిస్తూ మిత్రులకు పంపిన వీడియో సందేశంలో వివరించాడు. తూర్పుగోదావరి జిల్లా గోదావరి నదిపై ఉన్న గామన్ బ్రిడ్జిపై మంగళవారం ఉదయం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఏమిటంటే.. తూర్పు గోదావరి జిల్లా చాగల్లు మండలం బ్రాహ్మణగూడెం గ్రామానికి చెందిన తాళ్లూరి రాజు, తన భార్య నాగలక్ష్మి, కుమార్తె హర్షిత, కుమారుడు మోక్షిత్‌తో కలిసి మంగళవారం గోదావరి నదిలో దూకి ఆత్మహత్య కోవాలని నిర్ణయించుకున్నాడు. కొవ్వూరు–కాతేరు మధ్య గోదావరిపై ఉన్న గామన్ బ్రిడ్జి పైకి వేకువజామునే చేరుకున్నాడు. తాను, తన కుటుంబమంతా గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకుంటున్నామని మిత్రులకు వీడియో సందేశం పెట్టాడు. పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, రాజు కుటుంబ సభ్యులు, కొవ్వూరు పట్టణ పోలీసులు ఈ సమాచారం తెలుసుకుని వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. బ్రిడ్జిపై రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌పై ఉన్న రాజుకు, ఆయన కుటుంబ సభ్యులకు వైఎస్సార్‌సీపీ కార్యకర్త చిన్నం హరిబాబు, కొవ్వూరు పట్టణ సీఐ వి. జగదీశ్వరరావు, ఇతర సిబ్బంది నచ్చజెప్పి బయటకు తీసుకుకొచ్చారు.

ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసి ఉంటారు..

అనంతరం.. రాజు మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఏ ఒక్కరిని అడిగినా వైఎస్సార్‌సీపీకే ఓటు వేశామంటున్నారని, కానీ, జగన్ ఎలా ఓటమి పాలయ్యారో తెలీడంలేదని ఆవేదన వ్యక్తంచేశాడు. తన కుటుంబ చావుతోనైన ఎన్నికల్లో చోటు చేసుకున్న అవకతవకలపై విచారణ చేస్తారని ఆశిస్తున్నానన్నాడు. ఈవీఎంల ట్యాంపరింగ్ చేసి ఉంటారని, బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహిస్తే మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి అవుతారని రాజు చెప్పాడు. తన ఆవేదనను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దృష్టికి తీసుకువెళ్తే రీపోలింగ్‌కు ఆదేశిస్తారన్న ఉద్దేశంతో వీడియో ద్వారా తన సందేశాన్ని తెలిపి కుటుంబ సమేతంగా ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నానన్నాడు. తన కుటుంబం చావు ద్వారా జగనన్నకు మేలు చేకూరితే చాలని కన్నీటి పర్యంతమయ్యాడు.


రాజు, నాగలక్ష్మి దంపతులు, వారి పిల్లలతో పోలీసులు

ఇంత మంచి చేసిన జగన్ ఓడిపోతారనుకోలేదు..

తనకు రెండుసార్లు యాక్సిడెంట్ అయితే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్యం చేశారని.. కాలులో స్టీల్‌రాడ్లు వేసి, వైద్యం చేసి, ఇంటికి పంపించారని రాజు తనకు జరిగిన మేలును వివరించాడు. మంచంపై ఉన్న రెండు నెలలూ తన కుటుంబ పోషణకు వైఎస్సార్ ఆసరా పేరిట ఆర్థిక సాయం చేశారని.. అలాగే, తనకు ఏళ్ల తరబడి సొంతిల్లు లేదని, జగనన్న దయతో ఇంటి స్థలం ఇచ్చారని, ఇల్లు కట్టుకుంటున్నానని చెప్పాడు. ఈ ఏడాది తన కుమార్తె చదువుకు అమ్మఒడి సొమ్ము పడుతుందని ఆశపడ్డానని, తన తమ్ముడికీ అమ్మఒడి సాయం అందుతోందని తెలిపాడు. అలాగే, నాన్నమ్మకు రూ.3 వేల పింఛను అందిస్తున్నారని, అందరికీ ఇంత మంచి చేసిన జగన్ ఘోరంగా ఓటమి పాలవుతారని కలలో కూడా ఊహించలేదని కన్నీటితో చెప్పాడు. ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుంచీ తనకు కంటి మీద కునుకులేదని, జగనన్న ఓటమి నిరంతరం తనను కలచివేస్తోందని ఆవేదన చెందాడు. ఏదో మోసం జరిగిందనేదే తన బాధ అని, ఈ ఎన్నికలపై విచారణ చేయిస్తే వాస్తవాలు బయటపడతాయన్నాడు. ఇక బుధవారం చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేస్తే ఎన్నికలపై విచారణకు అవకాశం ఉండదన్నారు. అందుకనే తెల్లవారుజామున 5.30 గంటలకు భార్యాపిల్లల్ని తీసుకుని ఆత్మహత్య చేసుకునేందుకు బ్రిడ్జిపైకి వచ్చానని చెప్పాడు. రాజు, ఆయన భార్యకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి, కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వైఎస్సార్‌సీపీ నేత కాళిదాసు సత్యంపై హత్యాయత్నం

- తెనాలి నడిబొడ్డులో పట్టపగలు కత్తితో టీడీపీ కార్యకర్త దాడి
- స్నేహితుడు అడ్డుకోవటంతో తప్పిన ప్రాణాపాయం
- తొమ్మిది కత్తిపోట్లతో ఆసుపత్రిలో సత్యం

తెనాలి రూరల్: తెనాలి పట్టణంనడిబొడ్డులో పట్టపగలే తెలుగుదేశం పార్టీ కార్యకర్త వైఎస్సార్‌సీపీ నేతపై హత్యాయత్నానికి తెగబడ్డాడు. హోటల్‌లో టీ తాగి బయటకు వచ్చి బైక్ ఎక్కిన వైఎస్సార్‌సీపీ నేతపై వెనుక నుంచి వచ్చిన దుండగుడు వందలాది మంది ముందే నడిరోడ్డుపై కత్తితో దాడి చేశాడు. బాధితుడు, పోలీసుల కథనం ప్రకారం.. తెనాలికి చెందిన కాళిదాసు సత్యనారాయణ (సత్యం) 16వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి. ఆయన భార్య ఆ వార్డు మాజీ కౌన్సిలర్. ఆయన రోజులాగే మంగళవారం కూడా స్నేహితులతో కలిసి వాకింగ్ అనంతరం ఉదయం 8.30 గంటల సమయంలో పెమ్మసాని థియేటర్ సమీపంలోని హోటల్‌కు టీ తాగేందుకు వచ్చారు. బయటే టీ తాగి, ఇంటికి వెళ్లేందుకు బైక్‌పై కూర్చున్న సత్యంపై వెనకవైపు నుంచి వచ్చిన టీడీపీ కార్యకర్త షేక్ అబ్దుల్లా కత్తితో విచక్షణారహితంగా దాడిచేశాడు. ఆకస్మిక దాడికి బిత్తరపోయిన సత్యం వెంటనే తేరుకొని ప్రతిఘటించాడు. కిందపడిపోయిన సత్యంపై అబ్దుల్లా అందిన చోటల్లా కత్తితో దాడి చేశాడు. దూరం నుంచి ఈ దాడిని గమనించిన సత్యం స్నేహితులు వచ్చి అడ్డుకునే ప్రయత్నం చేశారు. చేతికి అందిన కర్రతో అబ్దుల్లాను కొట్టినా వదిలిపెట్టలేదు. చివరకు అబ్దుల్లాను గట్టిగా పట్టుకుని చేతిలో కత్తిని లాక్కొన్నారు. దీంతో అబ్దుల్లా అక్కడ్నుంచి పరారయ్యాడు. ఒంటి నిండా గాయాలు, రక్తంతో ఉన్న సత్యంను హుటాహుటిన జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆయనకు సర్జరీ చేశారు. సత్యంపై హత్యాయత్నం జరిగిన విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు వందలాదిగా ఆసుపత్రికి చేరుకున్నాయి. మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సత్యంను పరామర్శించి ధైర్యం చెప్పారు.

పథకం ప్రకారమే దాడి

సత్యం రోజూ వాకింగ్ అనంతరం ఆ హోటల్ వద్దకు వస్తాడని తెలుసుకున్న అబ్దుల్లా పక్కా ప్రణాళికతోనే మాటు వేసి కత్తితో దాడిచేశాడు. సత్యంకు పొట్ట, ఛాతీ, చేతులు, కాళ్లపై తొమ్మిది కత్తిపోట్లు పడ్డాయి. 16వ వార్డుకే చెందిన అబ్దుల్లా రేషన్ డీలరని, పక్కా టీడీపీ కార్యకర్త అని చెబుతున్నారు. గతంలో ఇద్దరూ టీడీపీలోనే ఉన్నారు. 2019లో కాళిదాసు సత్యం వైసీపీలో చేరాక, తనపై పిటిషన్లు పెట్టారన్న అక్కసుతో కూటమి అధికారంలోకి రాగానే సత్యం అడ్డు తొలగించుకోవాలని దాడి చేసినట్లు స్థానికులు చెబుతున్నారు.

మూడు రోజుల ముందే వార్నింగ్

మూడురోజుల కిందట అబ్దుల్లా, తన ఇంటి ముందుకొచ్చి చంపుతానని వార్నింగ్ ఇచ్చినట్టు సత్యం ఆసుపత్రిలో విలేకరులతో చెప్పారు. తాము వెంటబడటంతో పరారైనట్టు తెలిపారు. ఈ విషయాన్ని స్థానిక పోలీసులకు ఫోనులో తెలిపామన్నారు. అబ్దుల్లాకు రేషను డీలర్‌షిప్‌కు రికమండ్ చేసింది తానే అని చెప్పారు. వ్యక్తిగత కక్షలతోనే ఈ హత్యాయత్నం జరిగిందని భావిస్తున్నట్టు వన్‌టౌన్ సీఐ జి.దశరథరామారావు తెలిపారు.

సంప్రదాయానికి ప్రతీకగానే కాదు...
దక్షిణాసియా అంతటా సొగసైన వైభవంగా
ఐకానిక్ సిక్స్ యార్డ్‌గా పేరొందింది చీరకట్టు.
ఈ ఎవర్‌గ్రీన్ చీర కట్టును సాహసోపేతమైన
క్రీడల ప్రపంచంలోనూ వాడచ్చని నిరూపిస్తోంది అఫ్సానా బేగం.
జపాన్‌లోని చిబా విశ్వవిద్యాలయంలో డాక్టోరల్ విద్యార్థి అఫ్సానా
దక్షిణాసియాలోని సాంస్కృతిక వారసత్వాన్ని సగర్వంగా ప్రదర్శిస్తోంది.
చీరకట్టుతో సైక్లింగ్, స్కై డైవింగ్, సర్ఫింగ్, గ్లైడింగ్..
వంటి క్రీడల్లో పాల్గొంటోంది.

చీర... శక్తికి చిహ్నం





చీర కట్టుతో అఫ్సానా బేగం సాహస క్రీడలు



'క్రీడలకు నిర్దిష్ట యూనిఫాం అవసరమనే సంప్రదాయాన్ని చీరకట్టుతో సవాల్ చేస్తున్నాను. తరతరాలుగా చీర మన సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తోంది. దక్షిణాసియా అంతటా ఉత్సవ వైభవంతో వెలిగిపోతుంటుంది. అయినప్పటికీ, స్నోబోర్డింగ్, స్కైడైవింగ్ వంటి సాహసోపేతమైన క్రీడల కోసం ఈ ఐకానిక్ సిక్స్- యార్డ్ ఫాబ్రిక్ ఎంపిక చేయదగిన వస్త్రం కాదనే అపోహ ఉంది. దీనిని ఎలా ఉపయోగించవచ్చో చూపాలనుకున్నాను. మన సాంస్కృతిక వారసత్వాన్ని ప్రదర్శిస్తూనే, సాహసోపేతమైన క్రీడల ప్రపంచంలో చీర బలం, బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శించాలనుకున్నాను.



చరిత్రలో బలమైన శక్తి

నాకు సైకిల్ తొక్కడం వంటి యాక్టివిటీస్ అంటే చాలా ఇష్టం. మా యూనివర్శిటీలో చీరకట్టుతో సైక్లింగ్ చేస్తుంటాను. అయితే, రైడింగ్ టైమ్‌లో చీరలు అంత అనుకూలమైనవి కావని నా స్నేహితులు అందులోని అసౌకర్యాన్ని ఫీలవుతుండేవారు. పైగా ఏవేవో కామెంట్స్ చేస్తుండేవారు. ఈ దృక్పథాన్ని మార్చాలనే ఆలోచన రోజు రోజుకూ పెరుగుతూ వచ్చింది. 'చీర' మన రోజువారీ కార్యకలాపాలలో ఒక చైతన్యాన్ని తీసుకువస్తుంది. దక్షిణాసియాలో ముఖ్యమైన సాంస్కృతిక, రాజకీయ ఉద్యమాల సమయాల్లో చరిత్రలో మహిళలు ఈ వస్త్రాన్ని ఎలా ధరించారో నాకు తెలుసు. చీర ఎప్పుడూ నాకు శక్తికి చిహ్నంగా ఉంది. ఈ విషయాన్ని నా 30వ పుట్టినరోజు సందర్భంగా అసౌకర్యాన్ని సౌకర్యంగా, అత్యంత శక్తిమంతంగా ఎలా చూపించవచ్చో క్రీడల్లో ఆధునిక వస్త్రధారణ విధానాలను ఎలా సవాల్ చేయచ్చో నిరూపించాలనుకున్నాను. చీరలో స్కై డైవింగ్ చేసి ఆ శక్తిని చూపాను. దీంతో మా యూనివర్శిటీ విద్యార్థులందరికీ ఈ నా సవాల్ వెనక ఉన్న అంతరార్థం అర్థం అయ్యింది.

మార్పు కోసమే సవాల్

నేను పుట్టి పెరిగింది బంగ్లాదేశ్‌లో. అక్కడ సంప్రదాయ దుస్తులకు చాలా ప్రాధాన్యత ఉంటుంది. నేను జపాన్‌లోనూ నా సంప్రదాయ దుస్తుల్లోనే కాలేజీకి వెళ్లడం, రోజువారి కార్యకలాపాల్లో పాల్గొనడం చేసేదాన్ని అయితే, ఇక్కడి వారిలో చీర పైన సరైన అవగాహన లేదు. దాంతో నా చుట్టూ ఉన్న వారి నుంచే కొన్ని కామెంట్స్ ఎదుర్కొనేదాన్ని. చీరకట్టు వల్ల కలిగే శక్తి, ప్రయోజనాల గురించి చాలా చెప్పాల్సి వచ్చేది. వాదించాల్సి వచ్చేది. ఇక్కడ మార్పు తీసుకురావాలనుకున్నాను.

ముందుగా ప్రజా రవాణాలో చీరకట్టుకు గౌరవం పెరగడానికి కృషి చేశాను. అదే ఇప్పుడు సాహసోపేతమైన క్రీడలలో పాల్గొనేలా చేసింది. ఢాకా యూనివర్శిటీ విద్యార్థిగా అండర్ గ్రాడ్యుయేట్ చదువుతున్న రోజుల్లో చీరతోనే నా ప్రయాణం మొదలైంది. ప్రెజెంటేషన్‌ల కోసం సంప్రదాయ దుస్తులను ధరించమని నా స్నేహితులను ప్రోత్సహించేదాన్ని. అసౌకర్యం అంటూ అయిష్టత చూపేవారు కూడా అర్థం చేసుకోవాల్సిన విషయం ఏంటంటే ఎలాంటి కుట్టు లేకుండా తన అసమానమైన శక్తిని మనలోకి చేర్చే గుణం చీరకు ఉంది.

భద్రతా సమస్యలను సవాల్ చేస్తూ!

సాహసోపేతమైన క్రీడలలో భద్రత చాలా ముఖ్యమైనది. కోచ్‌లు కూడా తమ ప్రోటోకాల్స్ దృష్ట్యా వారు సూచించిన దుస్తులనే ధరించాలంటారు. కానీ, భద్రతా సమస్యలను పరిష్కరించడానికే నేను చీరకట్టుతో సవాల్ చేస్తున్నాను అనే విషయం పట్ల అవగాహన కలిగించి, మరీ ఈ డ్రెస్‌ను ధరించాను. నా అభిరుచి కూడా ఇలాగే కొనసాగుతుంది. స్కైడైవింగ్ సమయంలో చీరకట్టుపై నుంచి బెల్ట్‌తో సెట్ చేసుకున్నాను. పెటికోట్‌కు బదులుగా జీన్స్ ధరించాను. స్నోబోర్డింగ్‌లో నా కదలికకు చీర అంతరాయం కలిగించకుండా, వెచ్చగా ఉండటానికి వేడిచేసిన గేర్ ధరించాను. ఈ జాగ్రత్తల మార్పుతో భద్రతకు భరోసానిస్తూ సాంస్కృతిక ప్రామాణికతను కాపాడుకోవడానికి అనుమతి లభించింది.

ప్రయత్నాలకు ప్రతిస్పందన

చీరతో సాహసోపేతమైన క్రీడా ప్రయత్నాలకు మంచి ప్రతిస్పందన, ప్రశంసలు లభించింది. నా ప్రయత్నం ప్రపంచ వ్యాప్తంగా మంచి ఉత్సుకత రేకెత్తించింది. చాలా మంది ఆశ్చర్యపోయారు. తెల్లటి మంచులో ప్రకాశవంతమైన రంగుల చీరను చూసి ఎంతో మంది అభినందించారు. ఒకసారి, కిమోనోస్‌లో స్నోబోర్డింగ్ చేస్తున్నప్పుడు జపనీస్ జంటను ఎదురుపడింది. వారు ఎన్ని ప్రశ్నలు అడిగారో! 'సాంస్కృతిక వస్త్రధారణ ఏదైనా అభిరుచిలో భాగమ'ని వారితో నా అనుభవాలను పంచుకున్నాను.

భవిష్యత్తు కోసం

వాటర్ స్కీయింగ్ లేదా చీరలో సర్ఫింగ్ వంటి మెరైన్ స్పోర్ట్స్ గురించి ఆలోచిస్తున్నాను. సాంస్కృతిక వారసత్వాన్ని అత్యాధునిక క్రీడలతో మిళితం చేసి కొనసాగించే అవకాశాలు చాలా ఉన్నాయి. ఆధునిక, అసాధారణమైన మార్గాల్లో సంప్రదాయాలను పరిచయం చేయడానికి, ఎంతోమందిలో స్ఫూర్తి నింపడమే నా లక్ష్యం. దీని వల్ల ఈ సాంస్కృతిక వైభవం ప్రపంచ వస్త్రాలలోనే సుసంపన్నం అవుతుంది. ఇతరులను శక్తివంతం చేయడానికి నా సాహసాన్ని అంకితం చేస్తున్నాను. మహిళలు తమ సాంస్కృతిక దుస్తులను ధరిస్తూనే అసాధారణ క్రీడల్లో పాల్గొనవచ్చు. ఎవరికైనా వారి సొంత ఎంపిక చాలా ముఖ్యం. వారి కంఫర్ట్ జోన్ నుండి బయటపడి కొత్తదాన్ని ప్రయత్నించేలా నా ఈ ప్రయత్నం ఉపయోగపడితే అది వారి వ్యక్తిగత వృద్ధికి దారితీస్తుందని నమ్ముతాను.

సంప్రదాయం మనల్ని బంధించదు. కొత్త మార్గాల్లో ప్రయత్నించేందుకు కొత్త శక్తిని ఇస్తుంది'' అంటుంది అఫ్సానా.

బ్యూటిప్స్

స్కిన్‌కేర్ ప్యాక్‌లు

- కోడిగుడ్డు సొనలో రెండు టీ స్పూన్ల పన్నీరు, ఒక టీ స్పూన్ తేనె కలిపి ప్యాక్ వేసి ఆరిన తర్వాత వేడినీటితో శుభ్రం చేయాలి. ఇది జనరల్ ప్యాక్. చర్మానికి పోషణను, నునుపుదనాన్ని ఇస్తుంది. ఈ ప్యాక్‌ను వారానికి ఒకసారి వేస్తే చాలు.
- ముడతలు ఉంటే... కోడిగుడ్డులోని తెల్ల సొనను మాత్రమే తీసుకుని చిలికి అందులో మూడు టీ స్పూన్ల ఓట్ పౌడర్, ఒక స్పూను తేనె కలిపి అప్లయ్ చేసి ఆరిన తర్వాత కడిగేయాలి.
- 50 గ్రాముల సోయాబీన్స్‌ను రాత్రంతా నానబెట్టి, ఉదయం గ్రైండ్ చేసి, అందులో ఒక టేబుల్ స్పూన్ పచ్చిపాలను, ఒక టీ స్పూన్ ఆల్మండ్ ఆయిల్ కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు అప్లయ్ చేసి ఆరిన తర్వాత చన్నీటితో కడగాలి. సోయాబీన్స్‌కు బదులుగా మసూర్ దాల్ వాడవచ్చు.



- ఒక టేబుల్ స్పూన్ శనగపిండిలో చిటికెడు పసుపు, అర టీ స్పూన్ తేనె, అర టీ స్పూన్ ఆలివ్ ఆయిల్ కలిపి ప్యాక్ వేసి ఆరిన తర్వాత చన్నీటితో కడగాలి. ఇది మైల్డ్ బ్లీచ్‌గా పని చేస్తుంది. ముఖానికి నునుపుదనాన్నిస్తుంది. క్రమం తప్పకుండా వారానికి కనీసం రెండుసార్ల చొప్పున వేస్తుంటే అవాంఛిత రోమాలు రాలిపోతాయి.

కిచెన్ టిప్స్

- ఉడికించి దించిన తర్వాత కోడిగుడ్లను ఐదు నిమిషాల సేపు చన్నీటిలో ఉంచితే పెంకు సులభంగా వస్తుంది.
- గుడ్లు ఎక్కువ రోజులు నిలవ ఉండాలంటే... ఒక పాత్రలో గుడ్లను ఉంచి అవి మునిగే వరకు చన్నీటిని పోసి ఫ్రిజ్‌లో పెట్టాలి.
- ఉడికించిన గుడ్లను ముక్కలు చేయాలంటే... కోసేముందు చాకును వేడి నీటిలో ముంచాలి. అప్పుడు గుడ్డు పలుకులుగా ఊడిపోకుండా కరెక్ట్‌గా కట్ అవుతుంది.



యూత్ ప్లస్

సోషల్ మీడియాతో యువతరాన్ని విడదీసి చూడలేని కాలం ఇది. 'డిజిటల్ నెటిజన్స్'గా పేరున్న యువతరానికి సోషల్ మీడియాకు సంబంధించి ఎలాంటి ఆసక్తులు ఉన్నాయి? కంటెంట్ క్రియేషన్‌ను ఇష్టపడుతున్నారా? 'వ్యూయర్'గా ఉండడానికి ఇష్టపడుతున్నారా? బలం తెచ్చుకుంటున్నారా? బలహీనపడుతున్నారా?

వెలుగు నీడల దారుల్లో....



సోషల్ మీడియా అనేది యువత దైనందిన జీవితంలో విడదీయరాని భాగం అయింది. 'మా పిల్లలు సోషల్ మీడియాకు ఎడిక్ట్ అవుతున్నారు' అంటున్న తల్లిదండ్రుల సంఖ్య తక్కువేమీ లేదు.

'సోషల్ మీడియాలో ఎంత టైమ్ గడుపుతున్నారు?' అనేది ఒక కోణం అయితే అసలు అక్కడ ఏం చేస్తున్నారు? అనేది మరో కోణం. ఈ అంశంపై కొన్ని డిజిటల్ మార్కెటింగ్ ప్లాట్‌ఫామ్స్ సర్వే నిర్వహించాయి.

తమ సొంత కంటెంట్‌ను పోస్ట్ చేయడం కంటే యువతలో ఎక్కువమంది ఇతరుల పోస్టులను చదవడం, కామెంట్ చేయడంపై ఆసక్తి చూపిస్తున్నారు. 21 శాతం మాత్రమే కంటెంట్ క్రియేటర్‌లుగా ఉండడానికి ఇష్టపడుతున్నారు. 79 శాతం మంది 'వ్యూయర్స్'గా ఉండడానికి ఇష్టపడుతున్నారు. కంటెంట్‌ను పోస్టు చేస్తున్న వారిలో రోజూ పోస్ట్ చేస్తున్న వారి సంఖ్య తక్కువగా ఉంటోంది.

పర్సనల్ గ్రోత్, కెరీర్ ఎంపిక... మొదలైన వాటి విషయంలో సోషల్ మీడియాలోని కంటెంట్ ఆధారంగానే నిర్ణయాలు తీసుకుంటున్నారు కొందరు. రకరకాల డొమైన్స్‌లో కొత్తగా వస్తున్న ట్రెండ్స్ గురించి తెలుసుకోవడానికి ఇష్టపడుతున్నారు. సోషల్ మీడియాకు సంబంధించి మిగిలిన దేశాలతో పోల్చితే మన దేశంలో యువ 'స్పోర్ట్స్ సూపర్ ఫ్యాన్స్' ఎక్కువ. ఈ సూపర్ ఫ్యాన్స్ క్రికెట్‌కు మాత్రమే పరిమితం కావడం లేదు. ప్రపంచంలోని ఎన్నో ఆటల గురించి ఆసక్తిగా తెలుసుకుంటున్నారు.

'సోషల్ మీడియాను యూత్ ఎలా ఉపయోగించుకుంటుంది?' అనేదాన్ని పక్కన పెడితే... సోషల్ మీడియా ఎడిక్షన్ విషయంలో 'ఎవరో చెప్పేవరకు ఎందుకు... మన గురించి మనం తెలుసుకుందాం' అనే ధోరణి యువతలో పెరుగుతుండడం శుభసూచకం.

'సోషల్ మీడియాలో ఎంత ఎక్కువ సేపు ఉంటే అంత అప్‌డేట్ అవుతాం' అనే భ్రమకు దూరంగా జరుగుతున్నారు.

'ప్రతి అంశానికి మంచి, చెడులు ఉంటాయి. మనం ఎలా ఉపయోగించుకుంటున్నాం అనేదాని పైనే మంచి, చెడు ఆధారపడి ఉంటాయి' అంటుంది ఎంబీఏ స్టూడెంట్ తాన్వీ అగర్వాల్.

ముంబైకి చెందిన తాన్వీ ఒకప్పుడు సోషల్ మీడియానే ప్రపంచంగా ఉండేది. తాను సోషల్ మీడియాకు ఎడిక్ట్ అవుతున్న విషయం గ్రహించాక 'ఒకరోజులో ఇంత సమయం మాత్రమే' అని టైమ్ సెట్ చేసుకుంది.

'సోషల్ మీడియాకు ఎడిక్ట్ కావడం వల్ల నా చదువు దెబ్బతింది. చదివే సమయంలో సోషల్ మీడియాలో చదివిన పోస్టులు, చూసిన వీడియోలు గుర్తుకు వస్తుంటాయి. ఆలోచనలు అటు వైపు మళ్లుతుంటాయి. ఏకాగ్రత దెబ్బతింటుంది' అంటుంది తాన్వీ అగర్వాల్.

సోషల్ మీడియాను ఎంతసేపు, ఎలా వాడుకోవాలి అనేది ఒక కోణం అయితే 'నైతికత' అనేది మరో కోణం.

లక్నోకు చెందిన వైశాలి ఒకప్పుడు మీమ్స్‌ను తెగ ఎంజాయ్ చేసేది. అయితే 'బ్యాడ్ టేస్ట్ ఇన్ మీమ్స్' అనే పోస్ట్ చదివిన తరువాత ఆమెలో మార్పు వచ్చింది.

ఇప్పుడు ఆమె రిలేటబుల్ కంటెంట్, గుడ్ మీమ్స్‌ను మాత్రమే ఇష్టపడుతుంది.

'మీమ్స్ ద్వారా క్రూరత్వాన్ని ప్రదర్శించవద్దు. మీమ్స్ అనేవి హాయిగా నవ్వుకునేలా ఉండాలి' అంటుంది వైశాలి.

బ్రాండ్ల ఎంపికకు సంబంధించి సోషల్ మీడియాపై ఎక్కువ ఆధారపడుతుంది యువతరం. కాస్తో కూస్తో వచ్చిన మార్పు ఏమిటంటే ఇప్పుడు బ్రాండ్‌ల నుంచి జవాబుదారీతనాన్ని ఆశిస్తున్నారు. ఫలానా బ్రాండ్ పర్యావరణం హితం అంటే ఆ బ్రాండ్ వైపు మొగ్గుచూపుతున్నారు.

స్థూలంగా చెప్పాలంటే... 'సోషల్ మీడియాతో బలం తెచ్చుకుంటున్నామా? బలహీనపడుతున్నామా?' అనేది పూర్తిగా మన అవగాహన, ఆలోచన ధోరణి మీదే ఆధారపడుతుంది. ఉదాహరణకు... ఫోర్బ్స్ హెల్త్ అండ్ వన్‌పోల్ సర్వే ప్రకారం సోషల్ మీడియాలో 53 శాతం మంది తమ నవ్వును ఇతరులతో పోల్చి చూసుకుంటున్నారు.

'అయ్యో! అలా అందంగా నవ్వలేక పోతున్నానే' అని అవతలి వ్యక్తితో పోల్చుకొని బాధ పడుతున్న వారే ఎక్కువ.

పలువురు అందంగా కనిపించడానికి సోషల్ మీడియాలోని తమ ఫొటోలను ఎడిట్ చేస్తున్నవారు, పలువురు బాగోలేదని ఫొటోను హైడ్ చేస్తున్నవారూ ఉన్నారు.

'నవ్వు విషయంలో నా ఆత్మవిశ్వాసాన్ని సోషల్ మీడియా దెబ్బతిస్తోంది' అంటున్నారు 45 శాతం మంది.

సోషల్ మీడియా అనే ప్రపంచంలో ...చిన్న నవ్వు విషయంలోనూ ఆత్మవిశ్వాసం లోపించిన వారు ఉన్నారు. ప్రయోజనకర కంటెంట్‌తో తిరుగులేని ఆత్మవిశ్వాసంతో తమను తాము నిరూపించుకొని ఉన్నత శిఖరాలకు చేరుకున్నవారు ఉన్నారు. ఏ దారిలో వెళుతున్నామనేది పూర్తిగా మన ఆలోచనలపై ఆధారపడి ఉంటుంది. మార్పు గురించి చెప్పుకోవాల్సి వస్తే... 'నేను ఏ దారిలో వెళుతున్నాను. ఇది సరియైనదేనా?' అనే స్వీయ విశ్లేషణ ధోరణి యువతరంలో పెరుగుతోంది.

నేడు అనీ ఫ్రాంక్ జయంతి

నీ గొంతు ఇప్పుడూ అవసరమే

'నేను నా చుట్టూ ఉన్న వాళ్లనే కాదు...
ఎప్పుడూ ఎరగని వాళ్లను కూడా సంతోషంగా
ఉంచదలుచుకున్నాను'
అని రాసుకుంది అనీ ఫ్రాంక్.
యూదుల మీద హిట్లర్ దమనకాండ సాగిస్తున్నప్పుడు
14 ఏళ్ల యూదు బాలిక అనీ ఫ్రాంక్ రాసిన
జగద్విఖ్యాత డైరీనే 'అనీ ఫ్రాంక్ డైరీ'.
ఇవాళ పాలస్తీనా మీద ఇజ్రాయిల్ దాడి
ఉక్రెయిన్ మీద రష్యా దాడి
ఇవన్నీ పిల్లల్ని పౌరుల్ని దారుణంగా చంపుతున్నప్పుడు
'మానవత్వం కోసం అనీ చేసిన ప్రార్థన'
గుర్తు చేసుకోక తప్పదు.




అనీ ఫ్రాంక్

అనీ ఫ్రాంక్ పుట్టింది జూన్ 12, 1929లో. ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి వలస వచ్చి ఆమ్‌స్టర్‌డామ్‌లో స్థిరపడ్డ యూదు కుటుంబం వారిది. చిన్నప్పటి నుంచి ఎంతో చురుకైన పిల్ల అనీ ఫ్రాంక్. ఆమె పదమూడవ జన్మదినాన- అంటే జూన్ 12, 1942న తండ్రి ఆమెకు ఒక డైరీని కానుకగా ఇచ్చాడు. పుట్టిన రోజుకు ముందు ఆమ్‌స్టర్‌డామ్‌లో తండ్రితో షాపింగ్‌కి వెళ్లిన అనీకి బౌండ్ చేసిన నోట్‌బుక్ కనిపించింది. 'అది నాకు అది కావాలి నాన్నా' అని తండ్రిని అడిగితే బర్త్ డే గిఫ్ట్‌గా కొనిచ్చాడు. ఆ నోట్‌బుక్‌ని ఎంతో ఇష్టపడ్డ అనీ దానినే డైరీగా భావించి రోజూ రాయడం మొదలుపెట్టింది.

రహస్య జీవితం

రెండో ప్రపంచ యుద్ధం మొదలైన మూడేళ్లకు హిట్లర్ సేన నెదర్లాండ్స్‌ను హస్తగతం చేసుకుంది. ఆమ్‌స్టర్‌డామ్‌లో ఉన్న యూదులను అరెస్ట్ చేస్తున్నారు. అది తెలిసిన వెంటనే- జూలై 5, 1942 రాత్రి అనీ తల్లిదండ్రులు పిల్లలను తీసుకుని అదే ఆమ్‌స్టర్‌డామ్‌లోని ఒక దినుసుల కర్మాగారంలో రహస్య గదుల్లోకి చేరారు. దాని యజమాని యూదుల సానుభూతి పరుడు. కొంతమంది మిత్రులు రహస్యంగా అందించే ఆహారాన్ని వాడుకుంటూ అనీ ఫ్రాంక్ కుటుంబం నాజీ పోలీసులకు పట్టుబడే వరకు అంటే ఆగస్టు 4, 1944 వరకు- రెండేళ్ల 35 రోజులు రహస్య గదుల్లోనే గడిపింది. ఆ మొత్తం రోజులూ అనీ ఫ్రాంక్ డైరీ రాసింది.



పట్టుబడ్డాక అనీ ఫ్రాంక్‌ను నవంబర్ 1, 1944న కాన్సన్‌ట్రేషన్ క్యాంపుకు తరలించారు. తీవ్రమైన ఆకలితో, చలికి వణుకుతూ కాన్సన్‌ట్రేషన్ క్యాంపులో 1945 ఫిబ్రవరి-మార్చిల మధ్యన విష జ్వరంతో మరణించింది అనీ ఫ్రాంక్.

ది డైరీ ఆఫ్ ఎ యంగ్ గర్ల్

అనీ రాసిన డైరీ తొలిసారి 1946లో మార్కెట్‌లో విడుదలై సంచలనం రేపింది. డైరీ ఆఫ్ ఎ యంగ్ గర్ల్' పేరుతో ప్రతి దేశంలో ప్రతి భాషలో అనువాదం అయ్యింది. తాను డైరీ రాస్తున్న కాలంలో నాజీలు యూదులను దారుణంగా హతమారుస్తున్నా, రహస్య స్థలంలో తాము తిండికీ బట్టకూ అల్లాడుతున్నా అనీ ఎవరినీ ద్వేషించలేదు. అడుగడుగునా మనిషి మీద నమ్మకం ఉంచింది. 'ఇంత చేస్తున్నా మనిషి మంచివాడనే నేను నమ్ముతాను' అని రాసుకుంది. 'నేను బాగా చదువుకోవాలి. జర్నలిస్టును కావడం నా లక్ష్యం. ఒకవేళ నాకు వార్తాపత్రికలకు రాసే ప్రావీణ్యం లేకున్నా నా కోసం నేను రాసుకుంటాను. చాలామంది ఆడవాళ్లలా శ్రమకు ఏమాత్రం గుర్తింపు లేని ఇంటి పని చేయలేను. భర్తకు, పిల్లలకు జీవితాన్ని అంకితం చేయడం కన్నా ఇంకా ఎక్కువగా నాకు నా జీవితం కావాలి. సమాజానికి నేనేదైనా చేయాలి. మనుషుల సంతోషానికి నేనొక కారణం కావాలి. చనిపోయాక కూడా నేను జీవించే ఉండాలి' అని రాసుకుంది అనీ.

ద్వేషం వద్దనేదే ఆనా సందేశం

మనిషికి సాటి మనిషి మీద ద్వేషం ఎంతదూరమైనా తీసుకెళుతుందని రెండో ప్రపంచ యుద్ధం నిరూపించింది. హిట్లర్ విద్వేష ప్రభావానికి లోనైన నాజీలు 1941-1945 మధ్య 60 లక్షల మంది యూదులను నిర్మూలించారు. గ్యాస్ చాంబర్స్‌లో వేసి చంపారు. ఏ యూదులైతే నాజీల వల్ల కష్టాలు పడ్డారో అదే యూదులు నేడు పాలస్తీనా బాలల శోకానికి కారణం కావడం విషాదం. అక్కడ వేలాది మంది చిన్నారులు మరణించారు, తల్లిదండ్రులను కోల్పోయారు. ఆ పిల్లలు ఎందరు అనీ ఫ్రాంక్‌లా భవిష్యత్తులో తమ డైరీలను ప్రపంచానికి చాటుతారో!

ఈ ప్రపంచాన్ని పిల్లలకు యోగ్యమైనదిగా పెద్దలు అనుక్షణం తీర్చిదిద్దుతూ ఉండాలి. పిల్లలు ఇష్టపడేది ప్రేమనే. అంటే ప్రపంచాన్ని ప్రేమతో నింపాలి. ఇక్కడ ద్వేషానికి చోటు లేదని నిరూపించాలి. అది జరిగేంత వరకూ మబ్బుల చాటున దాగి ఆనా తన సందేశం వినిపిస్తూనే ఉంటుంది.



యూకీ-ఒలివెట్టి జోడీ సంచలనం

స్టుట్‌గార్ట్‌లో జరుగుతున్న బాస్ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో యూకీ బాంబ్రీ (భారత్)-అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) జోడీ 6-4, 6-2తో రెండో సీడ్ నీల్ స్కుప్‌స్కీ (బ్రిటన్)-మైకేల్ వీనస్ (న్యూజిలాండ్) జోడీని బోల్తా కొట్టించింది. 63 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ ద్వయం ఐదు ఏస్‌లు సంధించి, మూడు బ్రేక్ పాయింట్లు సాధించింది.

క్రీడా మంత్రిగా మన్‌సుఖ్ బాధ్యతల స్వీకరణ



కేంద్ర ప్రభుత్వంలో కొత్త క్రీడల మంత్రిగా నియమితులైన మన్‌సుఖ్ మాండవియా మంగళవారం న్యూఢిల్లీలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా ప్రపంచంలో భారత్‌ను మరింత ఉన్నత స్థితికి తీసుకెళ్లేందుకు పూర్తి నిబద్ధతతో పనిచేస్తానని వ్యాఖ్యానించారు. 52 ఏళ్ల మన్‌సుఖ్ గుజరాత్‌లోని పోర్‌బందర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. గత ప్రభుత్వంలో క్రీడా శాఖ మంత్రిగా ఉన్న అనురాగ్ ఠాకూర్ ఈసారి ఎన్నికల్లో నెగ్గినా ఆయనకు మంత్రి పదవి దక్కలేదు.



బయటకు వెళ్లిన బంతిని వెనక్కి పంపిన ఖతర్ ప్లేయర్

భారత్ ఆశలు ఆవిరి

ఖతర్ చేతిలో పరాజయం • మూడో రౌండ్‌కు చేరలేకపోయిన టీమిండియా

దోహా: ఫుట్‌బాల్ ప్రపంచకప్-2026 ఆసియా జోన్ క్వాలిఫయర్స్‌లో భారత జట్టు మూడో రౌండ్‌కు అర్హత సాధించలేకపోయింది. గ్రూప్ 'ఎ'లో భాగంగా ఆసియా చాంపియన్ ఖతర్ జట్టుతో మంగళవారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో భారత జట్టు 1-2 గోల్స్ తేడాతో ఓడిపోయింది. మూడో రౌండ్‌కు చేరాలంటే భారత జట్టు ఈ మ్యాచ్‌లో తప్పనిసరిగా గెలవాల్సింది. కానీ భారత జట్టు విజయాన్ని అందుకోలేకపోయింది. మరోవైపు అఫ్గానిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో కువైట్ జట్టు 1-0తో గెలిచింది. దాంతో గ్రూప్ 'ఎ' నుంచి 16 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచిన ఖతర్... 7 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచిన కువైట్ మూడో రౌండ్‌కు అర్హత సాధించాయి. 5 పాయింట్లతో భారత్, అఫ్గానిస్తాన్ సంయుక్తంగా మూడో స్థానంలో నిలువగా... మెరుగైన గోల్స్ సగటుతో భారత్‌కు మూడో స్థానం, అఫ్గానిస్తాన్‌కు నాలుగో స్థానం లభించాయి.

రిఫరీ చెత్త నిర్ణయం...

ఖతర్‌తో మ్యాచ్‌లో భారత జట్టుకు 37వ నిమిషంలో లాలియన్‌జువాల్ చాంగ్టె గోల్‌తో భారత్ 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. 73 నిమిషాల వరకు భారత్ ఈ ఆధిక్యాన్ని కాపాడుకుంది. ఈ దశలో రిఫరీ చెత్త నిర్ణయం కారణంగా ఖతర్ జట్టు ఖాతాలో గోల్ చేరి స్కోరు సమమైంది. 73వ నిమిషంలో యూసుఫ్ ఐమన్ కొట్టిన హెడర్‌ను భారత గోల్‌కీపర్, కెప్టెన్ గుర్‌ప్రీత్ సింగ్ నిలువరించాడు. ఆ తర్వాతి బంతి గోల్ లైన్ దాటి బయటకు వెళ్లింది. కానీ అక్కడే ఉన్న ఖతర్ ఆటగాడు హాష్మీ అల్ హుస్సేన్ బంతిని వెనక్కి పంపించగా, యూసుఫ్ ఆ బంతిని లక్ష్యానికి చేర్చాడు. రిఫరీ దీనిని గోల్‌గా ప్రకటించాడు. దాంతో భారత ఆటగాళ్లు నివ్వెరపోయి రివ్యూ చేయాలని రిఫరీని కోరినా ఆయన అంగీకరించకుండా గోల్ సరైనదేనని ప్రకటించాడు. టీవీ రీప్లేలో బంతి గోల్ లైన్ దాటి బయటకు వెళ్లిందని స్పష్టంగా కనిపించినా భారత ఆటగాళ్ల మొరను రిఫరీ ఖాతరు చేయలేదు. ఈ సంఘటనతో భారత బృందం ఏకాగ్రత చెదిరింది. 85వ నిమిషంలో అహ్మద్ అల్‌రావి గోల్‌తో ఖతర్ 2-1తో ఆధిక్యంలోకి వెళ్లి చివరి నిమిషం వరకు దీనిని కాపాడుకొని విజయాన్ని అందుకుంది.

'హ్యాట్రిక్'పై భారత్ గురి

అమెరికాతో నేడు రోహిత్ బృందం 'ఢీ'

- రెండు విజయాలతో జోరు మీదున్న ఆతిథ్య జట్టు
- పటిష్టమైన బలగంతో టీమిండియా
- రాత్రి 8 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం



న్యూయార్క్: 'హ్యాట్రిక్' విజయంపై గురి పెట్టిన భారత్ దీంతో పాటే టి20 ప్రపంచకప్‌లో 'సూపర్-8' దశకు దర్జాగా చేరుకోవాలనుకుంటుంది. గ్రూప్ 'ఎ'లో బుధవారం జరిగే మ్యాచ్‌లో టీమిండియా... ఆతిథ్య అమెరికాతో తలపడుతుంది. ఈ గ్రూప్‌లో ఇరు జట్లు కూడా ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ నెగ్గి అజేయంగా ఉన్నాయి. రోహిత్ బృందం వరుస విజయాలు సాధించడంలో పెద్ద విశేషమైతే లేదు కానీ... అమెరికాలాంటి కూన ఓ మాజీ చాంపియన్ పాకిస్తాన్‌ను అదికూడా... 'సూపర్ ఓవర్' దాకా లాక్కొచ్చి మరీ ఓడించడమే పెద్ద సంచలనం. ఎప్పుడైనాగానీ సూపర్ ఓవర్ అనేది మేటి జట్టుకే ఎక్కువ సానుకూలంగా ఉంటుంది. అలాగని భారత్‌పై కూడా మరో సంచలనం కొనసాగిస్తుందని చెప్పలేం. కానీ ఈ మ్యాచ్‌లో ఎవరు గెలిచినా వారికి 'హ్యాట్రిక్' విజయంతో పాటు 'సూపర్-8' బెర్త్ కూడా దక్కుతుంది.

సూపర్ ఫామ్‌లో...

బంగ్లాదేశ్‌తో మొదలుపెట్టిన ప్రాక్టీస్ మొదలు చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్ దాకా భారత్ విజయవంతమైంది. ఐర్లాండ్‌తో జరిగిన తొలి లీగ్‌లో ప్రత్యర్థి తక్కువ లక్ష్యం నిర్దేశించడంతో కెప్టెన్ రోహిత్, రిషభ్ పంత్‌ల జోరుతో సులువుగానే ఛేదించారు. అయితే తొలి రెండు మ్యాచ్‌ల్లో 'కింగ్' కోహ్లి, టి20 స్పెషలిస్టు సూర్యకుమార్ యాదవ్ ఏమాత్రం మెరిపించలేకపోయారు. గత రెండు మ్యాచ్‌లకు బాకీ పడిన పరుగుల వానను బహుశా ఈ మ్యాచ్‌లో వడ్డీతో సహా తీర్చేస్తారేమోనని అమెరికాలోని భారత అభిమానులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. బుమ్రా, సిరాజ్, అర్ష్‌దీప్‌లతో కూడిన పేస్ త్రయానికి, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్‌ల స్పిన్ ద్వయానికి అమెరికా ఎదురునిలవడం అంత సులువు కాదు.

సర్వశక్తులతో...

ఆడుతోంది తొలి వరల్డ్‌కప్పే అయినా అమెరికా ఆట మాత్రం అద్భుతం. కెనడా, పాక్‌లపై సాధించిన విజయాలు ఏమాత్రం గాలివాటం కాదు. మొదట కెనడాపై 195 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించి మరీ గెలిచింది. ఆండ్రీస్ గౌస్, ఆరోన్ జోన్స్ భారీ షాట్లతో విరుచుకుపడ్డారు. మళ్లీ పాక్‌తో రెండో మ్యాచ్‌లో కెప్టెన్ మోనంక్ పటేల్ అర్ధసెంచరీతో ఆకట్టుకుంటే గౌస్, జోన్స్ 'టై' అయ్యేదాకా పటిష్టమైన పాక్ బౌలింగ్‌ను ఎదుర్కొన్నారు. ఇటు బౌలింగ్‌లోనూ కెంజిగే, సౌరభ్ నేత్రవాల్కర్, అలీఖాన్, జస్‌దీప్‌లు ఫామ్‌లో ఉండటంతో భారత్‌పై పైచేయి సాధించలేకపోయినా... ఆల్‌రౌండ్ వనరులతో గట్టి పోటీ ఇవ్వాలనే పట్టుదలతో అమెరికా బృందం ఉంది.



పిచ్, వాతావరణం

న్యూయార్క్ పిచ్‌లో ఏ మార్పు లేదు. తక్కువ స్కోర్లే తప్ప మెరుపులకు అంతగా అవకాశమైతే ఉండదు. చేజింగ్ కష్టం కావడంతో టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్‌కే మొగ్గు చూపడం ఖాయం. వర్షంతో పూర్తిగా ముప్పయితే లేకపోయినా... అంతరాయం తప్పదు.

జట్లు (అంచనా)

భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), కోహ్లి, పంత్, సూర్యకుమార్, శివమ్ దూబే, హార్దిక్, జడేజా, అక్షర్, బుమ్రా, సిరాజ్, అర్ష్‌దీప్. **అమెరికా:** మోనంక్ పటేల్ (కెప్టెన్), స్టీవెన్ టేలర్, ఆండ్రీస్ గౌస్, ఆరోన్ జోన్స్, నితీశ్ కుమార్, కోరె అండర్సన్, హర్మీత్ సింగ్, జస్‌దీప్ సింగ్, కెంజిగె, సౌరభ్, అలీఖాన్.

10 అమెరికాలో భారత జట్టు ఆడిన మొత్తం టి20 మ్యాచ్‌లు. ఇందులో ఎనిమిది మ్యాచ్‌లు ఫ్లోరిడా రాష్ట్రంలోని లాడర్‌హిల్ పట్టణంలో వెస్టిండీస్‌తో జరిగాయి. ఆ ఎనిమిది మ్యాచ్‌ల్లో ఐదింటిలో భారత్ గెలిచి, రెండింటిలో ఓడిపోయింది. మరో మ్యాచ్ రద్దయింది. ప్రస్తుత ప్రపంచకప్‌లో న్యూయార్క్ వేదికగా ఐర్లాండ్‌తో, పాకిస్తాన్‌తో భారత్ ఒక్కో మ్యాచ్ విజయం సాధించింది.

టి20 ప్రపంచకప్‌లో నేడు

శ్రీలంక X నేపాల్
వేదిక: ఫ్లోరిడా : ఉదయం గం. 5 నుంచి

ఆస్ట్రేలియా X నమీబియా
వేదిక: నార్త్ సౌండ్: ఉదయం గం. 6 నుంచి

భారత్ X అమెరికా
వేదిక: న్యూయార్క్ : రాత్రి గం. 8 నుంచి

స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

గెలిచి నిలిచిన పాక్

రాణించిన రిజ్వాన్, ఆమిర్



రిజ్వాన్

న్యూయార్క్: హమ్మయ్య... పాకిస్తాన్ ఊపిరి పీల్చుకుంది. టి20 ప్రపంచకప్‌లో 'సూపర్-8' దశకు చేరుకునే అవకాశాన్ని సజీవంగా నిలబెట్టుకుంది. గ్రూప్ 'ఎ'లో మంగళవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో పాకిస్తాన్ 7 వికెట్ల తేడాతో కెనడాపై విజయం సాధించింది. టాస్ నెగ్గిన పాక్ ఫీల్డింగ్ ఎంచుకోగా... మొదట బ్యాటింగ్‌కు దిగిన కెనడా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 106 పరుగులు చేసింది. ఓపెనర్ ఆరోన్ జాన్సన్ (44 బంతుల్లో 52; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) ఒంటరి పోరాటం చేశాడు. తర్వాత బ్యాటింగ్ వరుసలో నవ్‌నీత్ (4), పర్గత్ (2), నికోలస్ (1), మొవ్వ శ్రేయస్ (2), రవీందర్‌పాల్ (0) పాక్ బౌలర్లకు దాసోహమయ్యారు. జాన్సన్ 39 బంతుల్లో అర్ధసెంచరీ చేసుకున్నాడు. 14వ ఓవర్లో జట్టు స్కోరు 73 పరుగుల వద్ద ఆరో వికెట్‌గా నిష్క్రమించిన ఆరోన్ ఒక్కడి స్కోరే 52 పరుగులుండటం విశేషం! కెప్టెన్ సాద్ బిన్ జాఫర్ (10), కలీమ్ (13 నాటౌట్) డబుల్ డిజిట్ స్కోరు చేశారు. ప్రత్యర్థి బౌలర్లలో హారిస్ రవూఫ్, మొహమ్మద్ ఆమిర్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన పాకిస్తాన్ 17.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 107 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లలో సయిమ్ అయూబ్ (6) విఫలమవగా.... ఇన్నింగ్స్‌ను నడిపించే బాధ్యతను మొహమ్మద్ రిజ్వాన్ (53 బంతుల్లో 53 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) ఆఖరి దాకా మోశాడు. కెప్టెన్ బాబర్ ఆజమ్ (33 బంతుల్లో 33; 1 ఫోర్, 1 సిక్స్)తో కలిసి రెండో వికెట్‌కు 63 పరుగులు జోడించాడు. ఫఖర్ జమాన్ (4)తో జట్టు స్కోరును 100 పరుగులు దాటించాడు. 52 బంతుల్లో రిజ్వాన్ ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. గెలుపు వాకిట ఫఖర్ నిష్క్రమించగా, ఉస్మాన్ ఖాన్ (2 నాటౌట్)తో కలిసి మిగతా లాంఛనాన్ని పూర్తి చేశాడు. ప్రస్తుతం ఈ గ్రూప్‌లో భారత్, అమెరికా చెరో 4 పాయింట్లతో తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి. పాక్ (2), కెనడా (2) మూడు, నాలుగో స్థానంలో ఉన్నాయి.

పారిస్ ఒలింపిక్స్‌కు ఇషా సింగ్



న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్ క్రీడల్లో పాల్గొనే భారత రైఫిల్, పిస్టల్ షూటింగ్ జట్టును మంగళవారం ప్రకటించారు. రెండు విభాగాల్లో కలిపి మొత్తం 15 మంది షూటర్లు విశ్వ క్రీడల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తారు. తెలంగాణ అమ్మాయి ఇషా సింగ్ మహిళల 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ వ్యక్తిగత ఈవెంట్‌లో పోటీపడనుంది. గత ఆసియా క్రీడల్లో, ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 19 ఏళ్ల ఇషా సింగ్ 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో స్వర్ణ పతకాలు గెలిచింది. ఇటీవల నిర్వహించిన ట్రయల్స్‌లో కనబరిచిన ప్రదర్శన ఆధారంగా ఈ బృందాన్ని ఎంపిక చేశారు. షూటింగ్ క్రీడాంశంలో అందుబాటులో ఉన్న 24 బెర్త్‌లకుగాను భారత షూటర్లు 21 బెర్త్‌లు గెల్చుకున్నారు. షాట్‌గన్ విభాగంలో పాల్గొనే భారత జట్టును జూన్ 18న ఇటలీలో ప్రపంచకప్ ముగిశాక ప్రకటిస్తారు.

సినిమా

దీపావళికి కుబేర?



• నాగార్జున

ఈ దీపావళికి థియేటర్స్‌లోకి రానున్నాడట 'కుబేర'. ధనుష్, నాగార్జున లీడ్ రోల్స్‌లో నటిస్తున్న చిత్రం 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్నారు. సోనాలీ నారంగ్ సమర్పణలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. నాగార్జున-ధనుష్ పాల్గొనగా ఓ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్నారట. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఏకకాలంలో చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమాను ఈ ఏడాది దీపావళికి రిలీజ్ చేసే ఆలోచనలో యూనిట్ ఉందని తెలిసింది.

జ్ఞానం కోసం వెతకండి



• సమంత

'మీకు జ్ఞానం కావాలంటే ఈ ప్రపంచాన్ని వెతకండి' అంటున్నారు సమంత. ఆ మధ్య వరుస సినిమాలతో ఫుల్ స్వింగ్‌లో ఉన్న ఆమె కొంత కాలంగా తరచుగా ఆధ్యాత్మిక చింతనలో కనిపిస్తున్నారు. తెలుగులో 'ఖుషి' (2023) మూవీ తర్వాత ప్రస్తుతం సమంత ఏ సినిమాలోనూ నటించడం లేదు. గతేడాది మయోసైటిస్ వ్యాధి నుంచి కోలుకున్న ఆమె పూర్తిగా ఆరోగ్యంపైనే దృష్టి పెట్టారు. అందులో భాగంగానే ఆధ్యాత్మిక సేవను అనుసరిస్తున్నారు. తరచుగా తమిళనాడులోని కోయంబత్తూర్‌లో ఉన్న ఇషా ఫౌండేషన్‌కి వెళుతుంటారు సమంత. తాజాగా ఇషా ఫౌండేషన్‌లో నిర్వహించిన రిలాక్సింగ్ సెషన్‌లో పాల్గొన్న ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసి, తన అనుభవాలను పంచుకున్నారు సమంత. ''మనలో చాలామంది మంచి గురువు కోసం వెతుకుతాం. మన జీవితంలో వెలుగులు నింపి మనల్ని సరైన మార్గంలో నడిపించే వ్యక్తిని కనుగొనడానికి మించిన ప్రత్యేకమైనది మరొకటి ఉండదు. ఎందుకంటే వాళ్ల జ్ఞానం మనల్ని ఎంతగానో ప్రభావితం చేస్తుంది. అయితే జ్ఞానం కావాలంటే ప్రపంచం నలుమూలలా వెతకాల్సిందే. దైనందిన జీవితంలో పడి చాలా విషయాల గురించి మనం తెలుసుకోం. కానీ, సరైన జ్ఞానాన్ని కలిగి ఉండాల్సిన అవసరం ఉంది. అలాగే జ్ఞానం గురించి తెలుసుకుంటే సరిపోదు. మనం నేర్చుకున్న జ్ఞానాన్ని నిజ జీవితంలో ఉపయోగించుకోవడం చాలా ముఖ్యం'' అంటూ పోస్ట్ చేశారు సమంత. ఇదిలా ఉంటే తన నిర్మాణ సంస్థ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్‌పై 'మా ఇంటి బంగారం' అనే చిత్రాన్ని నిర్మించనున్నట్లు ఏప్రిల్‌లో సమంత ప్రకటించిన విషయం తెలిసిందే.



• ధ్యానంలో...

హిట్ జోడీ షురూ



• రవితేజ, శ్రీలీల

హీరో రవితేజ 75వ సినిమా షురూ అయింది. ఈ చిత్రం ద్వారా రచయిత భాను భోగవరపు దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. 'ధమాకా' వంటి బ్లాక్ బస్టర్ హిట్ మూవీ తర్వాత హీరో రవితేజ, హీరోయిన్ శ్రీలీల ఈ చిత్రం కోసం రెండోసారి జోడీ కట్టారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రం మంగళవారం ప్రారంభమైంది. ముహూర్తపు షాట్‌కి శ్రీలీల క్లాప్ కొట్టగా, భాను దర్శకత్వం వహించారు. ''వినోదంతో కూడిన పూర్తి స్థాయి మాస్ పాత్రలో రవితేజను చూడాలని అభిమానులు ఎంతగానో ఎదురు చూస్తున్నారు. 'ఆర్‌టీ 75' చిత్రంతో అభిమానుల ఆకాంక్ష నెరవేరుతుంది. 'ధమాకా' విజయంలో కీలక పాత్ర పోషించిన సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో 'ఆర్‌టీ 75'కి సంగీతాన్ని సమకూరుస్తున్నారు'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: విధు అయ్యన్న.

నెమలి కనబడటం నాకో పాజిటివ్ సైన్!



• జ్ఞాన శేఖర్

సుధీర్‌బాబు హీరోగా జ్ఞానసాగర్ దర్శకత్వంలో సుమంత్ జి. నాయుడు నిర్మించిన యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'హరోం హర'. ఈ చిత్రం ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో జ్ఞానశేఖర్ మాట్లాడుతూ -''కుప్పం నేపథ్యంలో సాగే పీరియాడికల్ ఫిల్మ్ ఇది. కుప్పంలో ల్యాబ్ అసిస్టెంట్‌గా పని చేసే ఓ మామూలు కుర్రాడు సుబ్రహ్మణ్యం ఎందుకు గన్స్ మేకింగ్‌లో ఇన్‌వాల్వ్ కావాల్సి వచ్చింది? ఆ తర్వాత అతని జీవితం ఏ విధంగా మలుపు తిరిగింది? అన్నదే ఈ సినిమా కథ. ఈ కథలో చాలా లేయర్స్ ఉన్నాయి. మంచి ఫాదర్ ఎమోషన్ కూడా ఉంది. నేను సుబ్రహ్మణ్యేశ్వర స్వామి భక్తుణ్ణి. అందుకే ఈ సినిమాకు 'హరోం హర' టైటిల్, హీరోకు సుబ్రహ్మణ్యం అని పేరు పెట్టాను. ఈ సినిమా షూటింగ్ జరిగిన ప్రతి లొకేషన్‌లో మాకు నెమలి కనిపించింది. దీన్ని ఓ పాజిటివ్ సైన్‌గా తీసుకున్నాను. సుధీర్‌బాబుగారు అద్భుతంగా నటించారు. కథని నమ్మి, గ్రాండ్‌గా నిర్మించిన నా ఫ్రెండ్ సుమంత్‌కి ధన్యవాదాలు. ఈ సినిమాను ముందు పాన్ ఇండియాగానే అనుకున్నాం. అయితే ఇతర భాషల్లో డైలాగ్స్ సరిగ్గా కుదరలేదనిపించింది. నాకు నాలుగు భాషలు వచ్చు. నేనే కూర్చుని, పర్ఫెక్ట్‌గా చేయించాలంటే సినిమా రిలీజ్‌కు చాలా టైమ్ పడుతుంది. అందుకే పాన్ ఇండియా రిలీజ్ వద్దనుకున్నాం'' అన్నారు.

తెరపైకి కిరణ్ బేడీ జీవితం



• కుశాల్ చావ్లా

భారతదేశపు తొలి మహిళా ఐపీఎస్ ఆఫీసర్ కిరణ్ బేడీ జీవితం వెండితెరపైకి రానుంది. 'బేడీ: ది నేమ్ యు నో.. ది స్టోరీ యూ డోన్ట్' అనే టైటిల్‌తో ఆమె బయోపిక్ తెరకెక్కనుంది. 'వన్ వే, అనదర్ టైమ్' వంటి చిత్రాలతో అంతర్జాతీయ స్థాయిలో ప్రసంశలు అందుకున్న దర్శక-నిర్మాత, రచయిత కుశాల్ చావ్లా ఈ బయోపిక్‌కు దర్శకత్వం వహించనున్నారు. డ్రీమ్ స్లేట్ పిక్చర్స్ పతాకంపై గౌరవ్ చావ్లా ఈ సినిమాను నిర్మించనున్నారని, వచ్చే ఏడాది ఈ సినిమా విడుదయ్యేలా ప్లాన్ చేస్తున్నారని టాక్. ''కిరణ్ బేడీగారు జీవితంలో ఎదుర్కొన్న సవాళ్ల గురించి మాత్రమే కాదు... ఆమె జీవితంలోని వ్యక్తిగత, వృత్తిపరమైన అంశాలను కూడా ఈ సినిమాలో చూపించబోతున్నాం'' అని మేకర్స్ పేర్కొన్నారు. ఇక 1966లో జాతీయ జూనియర్ టెన్నిస్ చాంపియన్‌గా వార్తల్లో నిలిచారు కిరణ్ బేడీ. ఆ తర్వాత ఐపీఎస్ ఆఫీసర్‌గా ఎన్నో సంస్కరణలు చేశారు. పాండిచ్చేరికి లెఫ్టినెంట్ గవర్నర్‌గా చేశారు. అలాగే రామన్ మెగసెసే అవార్డ్స్‌తో పాటు ఎన్నో జాతీయ, అంతర్జాతీయ అవార్డులు అందుకున్నారు కిరణ్ బేడీ. ఇక వెండితెరపై ఆమె పాత్రను ఎవరు చేస్తారు? అనేది చిత్రబృందం ప్రకటించలేదు.

ఈ టీమ్‌ని చూస్తే ముచ్చటేసింది

- విశ్వక్ సేన్




• విశ్వక్ సేన్, చాందిని, నవదీప్

''ప్రతిభ ఉన్న యువతకు సీ స్పేస్ అనే సంస్థ ద్వారా మంచి వేదిక సృష్టించాడు నవదీప్. నా తోటి నటీనటుల్లో నేను గౌరవించే వాళ్లలో చాందినీ చౌదరి ఒకరు. తను ఎప్పుడూ టెన్షన్ పడుతుంటుంది. 'యేవమ్'తో తనకి ఆ భయం పోయింది'' అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. చాందినీ చౌదరి, వశిష్ఠ సింహా, భరత్ రాజ్, అషు రెడ్డి ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'యేవమ్'. ప్రకాశ్ దంతులూరి దర్శకత్వంలో నవదీప్, పవన్ గోపరాజు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి అతిథిగా హాజరైన విశ్వక్ సేన్ మాట్లాడుతూ- ''యేవమ్' లాంటి ఫీమేల్ ఓరియంటెడ్ చిత్రానికి మహిళా సంగీత దర్శకురాలు, మహిళా ఎడిటర్ పని చేయడం హ్యాపీగా ఉంది. ఈ టీమ్‌కి ఈ చిత్రం మంచి బ్రేక్ అవ్వాలి'' అన్నారు. ''యేవమ్' చూశాను. ఇంటర్వెల్, పతాక సన్నివేశాలు మైండ్ బ్లోయింగ్‌గా ఉంటాయి'' అన్నారు మరో అతిథి, డైరెక్టర్ సందీప్ రాజ్. ''ఈ మూవీలో నాది పోలీస్ పాత్ర అనగానే యాక్షన్ ఓరియంటెడ్ అనుకున్నాను. అయితే యాక్షన్‌తో పాటు అన్ని షేడ్స్ నా పాత్రలో ఉన్నాయి'' అన్నారు చాందిని. ''మంచి ఇంటెన్స్‌తో నిజాయితీగా చేసిన సినిమా 'యేవమ్'' అన్నారు నవదీప్. ''ఇదొక ఇంట్రెస్టింగ్ ఎంటర్‌టైనింగ్ థ్రిల్లర్'' అన్నారు ప్రకాశ్ దంతులూరి.



నటుడు అర్జున్ కుమార్తె, నటి ఐశ్వర్య వివాహ బంధంలోకి అడుగు పెట్టారు. తమిళ నటుడు, దర్శకుడు తంబి రామయ్య కుమారుడు, యువ నటుడు ఉమాపతితో ఐశ్వర్య వివాహం జరిగింది. కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితుల సమక్షంలో చెన్నైలోని హనుమాన్ ఆలయంలో మంగళవారం ఈ వేడుక జరిగింది. ఐశ్వర్య-ఉమాపతిలది ప్రేమ వివాహం. వీరి పెళ్లికి ఇరు కుటుంబాలు అంగీకరించడంతో గత ఏడాది అక్టోబర్‌లో నిశ్చితార్థం జరిగింది. కాగా ఈ నెల 14న చెన్నై లీలా ప్యాలెస్‌లో ఐశ్వర్య-ఉమాపతిల వివాహ రిసెప్షన్ జరగనుంది.



• క్వెంటిన్ టరంటినో



• మెస్కల్



• మోరెనో

అక్టోబరులో అకాడమీ వేడుక

లాస్ ఏంజిల్స్‌లో ఈ ఏడాది అక్టోబరులో జరగనున్న నాలుగో అకాడమీ మ్యూజియమ్ గాలా వేడుకలో దర్శకుడు క్వెంటిన్ టరంటినో, నటుడు పాల్ మెస్కల్, నటి రీటా మోరెనో అవార్డులు అందుకోనున్నారు. వాంటేజ్ అవార్డుకు మెస్కల్, ఐకాన్ అవార్డు కోసం మోరెనో, ల్యూమినరీ అవార్డుకు క్వెంటిన్‌ను ఎంపిక చేశారు. ''తరాలుగా ప్రపంచవ్యాప్త సినిమాకు సేవలందిస్తూ, ఆర్టిస్టులకు, ఫిల్మ్ మేకర్స్‌కు ప్రేరణగా నిలుస్తున్న ఈ ముగ్గురినీ ఈ ఏడాది సత్కరించనున్నాం. అక్టోబరు 19న ఈ వేడుక జరుగుతుంది'' అని అకాడమీ మ్యూజియమ్ గాలా అధ్యక్షురాలు అమీ హోమ్మా పేర్కొన్నారు. కాగా ఈ అకాడమీ మ్యూజియమ్ గాలా అవార్డులను విరాళాల సేకరణ కోసం ఆరంభించారు. 2021లో ఈ మ్యూజియమ్ ఆరంభమైంది. గడచిన మూడేళ్లుగా అవార్డులు ప్రదానం చేస్తున్నారు. ఈ వేడుక నుంచి లభించిన నగదును స్వచ్ఛంద సంస్థలకు విరాళంగా అందిస్తారు. ఇక లాస్ ఏంజిల్స్‌లో ఉన్న ఈ మ్యూజియమ్‌లో సినిమాల కోసం ప్రముఖ హాలీవుడ్ స్టార్స్ వాడిన ప్రత్యేకమైన దుస్తులు, ఆయుధాలు, ఇతర వస్తువులను సందర్శనకు ఉంచారు.

రాజా వస్తున్నాడు



• నార్నే నితిన్

హీరో ఎన్టీఆర్ బావమరిది నార్నే నితిన్ హీరోగా నటించిన చిత్రం 'శ్రీశ్రీశ్రీ రాజావారు'. ఈ చిత్రంలో సంపద హీరోయిన్. సతీష్ వేగేశ్న దర్శకత్వంలో చింతపల్లి రామారావు, ఎమ్. సుబ్బారెడ్డి నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధం అవుతోంది. ఈ సందర్భంగా చింతపల్లి రామారావు మాట్లాడుతూ- ''అన్ని కమర్షియల్ హంగులు ఉన్న సినిమా ఇది. సెన్సార్ పూర్తయింది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది. రావు రమేశ్, నరేష్, రఘు కుంచె, ప్రవీణ్, రచ్చ రవి కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు సంగీతం: కైలాష్ మీనన్, కెమెరా: దాము నర్రావుల.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ △
33	6
76,457	23,265

విదేశీ సూచీలు (సోమ వారం రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	17,235	△	30
డోజోన్స్	38,584	▽	285
ఎఫ్‌టీఎస్ఈ 100	8,148	▽	81
డాక్స్	18,370	▽	125
షాంఘై	3,028	▽	23
నికాయ్	39,135	△	97

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)		
71,445	△	269
బంగారం (99.5 స్వచ్ఛత)		
71,159	△	268
వెండి (కేజీ)		
87,708	▽	1,220

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		81.74	85.42
£	బ్రిటన్ పౌండ్		104.05	108.97
€	యూరో		87.48	91.98
¥	జపాన్ ఎన్ (100)		40.00	66.00
AUS	ఆస్ట్రేలియా డాలర్		52.72	57.56
S$	సింగపూర్ డాలర్		59.43	64.11
SAR	సౌదీ రియాల్		21.39	22.95
UAE D	యూఏఈ దిర్హామ్		21.87	23.65
¥	చైనా యువాన్		10.40	12.47

సీసీఐఎల్ ఐఎఫ్ఎస్‌సీలో బీవోఐకు 6 శాతం వాటాలు



న్యూఢిల్లీ: గిఫ్ట్ సెజ్‌లో లిస్టయిన సీసీఐఎల్ ఐఎఫ్ఎస్‌సీలో 6.125 శాతం వాటా కొనుగోలు చేసినట్లు ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీవోఐ) ఈడీ (ఇంటర్నేషనల్ ఆపరేషన్స్) సుబ్రత్ కుమార్ తెలిపారు. ఇందు కోసం రూ. 6.125 కోట్లు వెచ్చించినట్లు వివరించారు. క్లియరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రమోట్ చేస్తున్న సీసీఐఎల్ ఐఎఫ్ఎస్‌సీ సంస్థ.. గిఫ్ట్ సిటీలో రియల్ టైమ్ కరెన్సీ సెటిల్మెంట్ సిస్టమ్‌ను రూపొందించి, నిర్వహించాల్సి ఉంటుంది. ఇది గిఫ్ట్ సిటీకి క్లియరింగ్ హౌస్, సిస్టమ్ ఆపరేటర్‌గా వ్యవహరిస్తుంది.

ఇండిగోలో ప్రమోటర్ వాటాల విక్రయం



న్యూఢిల్లీ: ఇండిగో మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ ప్రమోటర్ ఇంటర్‌గ్లోబ్ ఎంటర్‌ప్రైజెస్.. కంపెనీలో తనకున్న వాటాల్లో 2 శాతాన్ని ఓపెన్ మార్కెట్ లావాదేవీ ద్వారా విక్రయించింది. ఈ వాటా విలువ రూ. 3,367 కోట్లు. బీఎస్‌ఈలో బల్క్ డీల్ డేటా ప్రకారం ఇంటర్‌గ్లోబ్ ఎంటర్‌ప్రైజెస్ 77,19,573 షేర్లను (1.99 శాతం) ఒక్కో షేరుకు సగటున రూ. 4,362.04 రేటుతో విక్రయించింది. దీనితో సంస్థలో ఇంటర్‌గ్లోబ్ ఎంటర్‌ప్రైజెస్ వాటా 37.75 శాతం నుంచి 35.76 శాతానికి తగ్గింది. మరోవైపు, సిటీ గ్రూప్ గ్లోబల్ మార్కెట్స్ మారిషస్ 31.23 లక్షల షేర్లను కొనుగోలు చేసింది.

మంగళవారం ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ షేరు 4 శాతం క్షీణించి రూ. 4,368 వద్ద క్లోజయ్యింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

12-6-2024	
విశాఖ	530-00
చిత్తూరు	593-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525-00
విజయవాడ	530-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	525-00
వరంగల్	527-00
రిటైల్ ధర	5.85

కాగ్నిజెంట్ చేతికి బెల్కాన్

డీల్ విలువ రూ.10,861 కోట్లు



న్యూఢిల్లీ: ఐటీ రంగంలో ఉన్న యూఎస్ సంస్థ కాగ్నిజెంట్ తాజాగా డిజిటల్ ఇంజనీరింగ్ కంపెనీ బెల్కాన్‌ను కొనుగోలు చేస్తున్నట్టు ప్రకటించింది. డీల్ విలువ రూ.10,861 కోట్లు. బెల్కాన్‌ను ప్రైవేట్ ఈక్విటీ కంపెనీ ఏఈ ఇండస్ట్రియల్ పార్ట్‌నర్స్ ప్రమోట్ చేస్తోంది. ఈ డీల్ ద్వారా 190 బిలియన్ డాలర్ల ఇంజనీరింగ్ రీసెర్చ్, డెవలప్‌మెంట్ (ఈఆర్అండ్‌డీ) సర్వీసెస్ రంగంలో విస్తరించాలన్నది కాగ్నిజెంట్ ఆలోచన. అలాగే ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్, మెరైన్ రంగాల్లో అడుగుపెట్టాలని భావిస్తోంది. ఈఆర్అండ్‌డీ సర్వీసుల మార్కెట్లో సంస్థ స్థానం మరింత బలపడుతుందని కాగ్నిజెంట్ సీఈవో ఎస్.రవి కుమార్ తెలిపారు. కాగ్నిజెంట్‌కు ఇది రెండవ అతిపెద్ద డీల్‌గా నిలిచింది. 2014లో హెల్త్‌కేర్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ట్రైజెట్టో కొనుగోలుకు 2.7 బిలియన్ డాలర్లు వెచ్చించింది. ఇక బెల్కాన్‌కు అంతర్జాతీయంగా 60 ప్రాంతాల్లో 10,000 పైచిలుకు ఉద్యోగులు ఉన్నారు. బోయింగ్, జనరల్ మోటార్స్, రోల్స్ రాయిస్, యూఎస్ స్పేస్ ఏజెన్సీ అయిన నాసా, యూఎస్ నేవీ వంటి దిగ్గజ సంస్థలకు సేవలు అందిస్తోంది.

నిలకడగా భారత్ వృద్ధి




ప్రపంచ బ్యాంక్ రిపోర్టు

న్యూఢిల్లీ: అధిక బేస్‌తో పోలిస్తే కాస్త నెమ్మదించినప్పటికీ ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందే ఎకానమీగా భారత్ కొనసాగుతుందని ప్రపంచ బ్యాంక్ ఒక నివేదికలో పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సహా వచ్చే మూడేళ్ల పాటు నిలకడగా 6.7 శాతం వృద్ధి నమోదు చేయగలదని తెలిపింది. పెట్టుబడుల వృద్ధి కాస్త నెమ్మదించినా గతంలో అంచనా వేసిన దానికన్నా పటిష్టంగానే ఉండొచ్చని ప్రపంచ బ్యాంకు తెలిపింది. 2023-24లో భారత్ వృద్ధి రేటు 8.2 శాతంగా నమోదైంది. మరోవైపు, 2024లో ప్రపంచ వృద్ధి రేటు 2.6 శాతంగా ఉండొచ్చని, 2025-26లో స్వల్పంగా 2.6 శాతం స్థాయికి చేరవచ్చని నివేదిక తెలిపింది. కోవిడ్-19కి ముందు దశాబ్దంలో నమోదైన 3.1 శాతం సగటుతో పోలిస్తే ఇది తక్కువే కావడం గమనార్హం. దక్షిణాసియా ప్రాంతంలో వృద్ధి 2023లో నమోదైన 6.6 శాతంతో పోలిస్తే ఈ ఏడాది కొంత తగ్గి 6.2 శాతంగా ఉండొచ్చని అంచనా. ఇటీవలి కాలంలో సాధించిన అధిక వృద్ధి రేటు బేస్‌తో పోలిస్తే భారత్ వృద్ధి కొంత నెమ్మదించే అవకాశాలు ఇందుకు కారణమని నివేదిక వివరించింది.

రైల్ షేర్ల పరుగు- మార్కెట్ ఫ్లాట్

- సెన్సెక్స్ 33 పాయింట్లు డౌన్
- నిఫ్టీ 6 పాయింట్లు ప్లస్
- 76,457- 23,265 వద్ద ముగింపు



ముంబై: గత వారం సరికొత్త రికార్డులు నెలకొల్పుతూ ర్యాలీ చేసిన దేశీ స్టాక్ మార్కెట్లు మంగళవారం ఫ్లాట్‌గా ముగిశాయి. సెన్సెక్స్ 33 పాయింట్లు క్షీణించి 76,457 వద్ద నిలవగా.. 6 పాయింట్లు పుంజుకున్న నిఫ్టీ 23,265 వద్ద స్థిరపడింది. అయితే ఆటుపోట్ల మధ్య కదిలిన మార్కెట్లు మిడ్‌సెషన్‌కల్లా జోరందుకున్నాయి. సెన్సెక్స్ 370 పాయింట్లు ఎగసి 76,861కు చేరగా.. నిఫ్టీ 130 పాయింట్లు బలపడి 23,389ను అధిగమించింది. ఒక దశలో సెన్సెక్స్ 76,297, నిఫ్టీ 23,207 పాయింట్ల దిగువన కనిష్టాలను తాకాయి. ఎన్ఎస్ఈలో మీడియా, ఆయిల్, రియల్టీ 2-1 శాతం మధ్య వృద్ధి చూపగా.. హెల్త్‌కేర్ 0.5 శాతం తగ్గింది. బ్లూచిప్స్‌లో ఓఎన్‌జీసీ 5.7 శాతం జంప్‌చేయగా.. టాటా మోటార్స్, ఎల్అండ్‌టీ, అదానీ పోర్ట్స్, మారుతీ, అల్ట్రాటెక్ 2-1 శాతం మధ్య ఎగశాయి. మరోపక్క కొటక్ బ్యాంక్, దివీస్, ఐటీసీ, రిలయన్స్, డాక్టర్ రెడ్డీస్, సన్ ఫార్మా 1.3-0.8 శాతం మధ్య డీలాపడ్డాయి.

చిన్న షేర్లు అప్

అశ్వినీ వైష్ణవ్ రైల్వే మంత్రిగా కొనసాగనుండటంతో రైల్వే రంగ కౌంటర్లు స్పీడందుకున్నాయి. ఎన్ఎస్ఈలో రైల్‌టెల్ 9%, ఇర్కాన్ 8%, టెక్స్‌మాకో 7 శాతం, జూపిటర్ వేగన్స్ 6%, ఐఆర్‌సీటీసీ, ఆర్‌వీఎన్ఎల్ 4 శాతం, ఐఆర్ఎఫ్‌సీ 2 శాతం చొప్పున ఎగశాయి. అయితే కెర్నెక్స్ మైక్రో 4.2 శాతం పతనమైంది. కాగా, బీఎస్ఈలో మిడ్, స్మాల్ క్యాప్స్ దాదాపు 1 శాతం బలపడ్డాయి.

కొత్త కనిష్టానికి రూపాయి @ 83.59

దేశీ కరెన్సీ డాలరుతో మారకంలో కొత్త కనిష్టానికి చేరింది. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో 9 పైసలు నీరసించి 83.59 వద్ద ముగిసింది. 83.49 వద్ద ప్రారంభమైన రూపాయి ఇంట్రాడేలో 83.59కు జారింది. అక్కడే స్థిరపడింది. ప్రపంచ కరెన్సీలతో మారకంలో డాలరు బలపడటానికితోడు.. చమురు ధరలు, దిగుమతిదారుల నుంచి డాలర్లకు పెరిగిన డిమాండ్ ప్రభావం చూపింది.

నోకియా 3210 రీఎంట్రీ



25 ఏళ్ల తర్వాత తిరిగి మార్కెట్లోకి
విక్రయ ధర రూ.3,999

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: నోకియా 3210.. సంచలనం సృష్టించిన ఈ మాస్ మార్కెట్ ఫీచర్ ఫోన్ 25 ఏళ్ల తర్వాత తిరిగి రీఎంట్రీ ఇచ్చింది. 2.4 అంగుళాల టీఎఫ్‌టీ ఎల్‌సీడీ స్క్రీన్ సహా హెచ్ఎండీ గ్లోబల్ సరికొత్త ఫీచర్లతో నోకియా 3210 4జీ మోడల్‌కు రూపకల్పన చేసింది. 9.8 గంటలపాటు కాల్స్ చేసుకోవచ్చు. యూట్యూబ్, యూట్యూబ్ షాట్స్, న్యూస్, యూపీఐ, స్నేక్ గేమ్ వంటి హంగులను జోడించింది. మూడు రంగుల్లో తయారైంది. హెచ్ఎండీ, అమెజాన్ పోర్టల్స్‌లో లభిస్తుంది. 1999 మార్చిలో మార్కెట్లోకి వచ్చిన నోకియా 3210 ఫోన్‌ను ప్రపంచవ్యాప్తంగా 16 కోట్లకుపైచిలుకు మంది కస్టమర్లు కొనుగోలు చేశారు. పాత ఫోన్‌కు 1.5 అంగుళాల స్క్రీన్ ఉండేది.

సెబీ.. ఇన్వెస్టర్ సర్టిఫికేషన్

ఉచిత స్వచ్ఛంద ఆన్‌లైన్ పరీక్షకు సై



న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ వ్యక్తిగత ఇన్వెస్టర్లకు సర్టిఫికేషన్ పరీక్షను నిర్వహించనుంది. దీంతో ఉచితంగా స్వచ్ఛంద పద్ధతిలో ఇన్వెస్టర్లు ఆన్‌లైన్‌లో పరీక్షను రాయడం ద్వారా సర్టిఫికేషన్‌ను అందుకునేందుకు వీలుంటుంది. తద్వారా రిటైల్ ఇన్వెస్టర్లు స్టాక్ మార్కెట్లో పెట్టుబడులకు సంబంధించి సమగ్ర విజ్ఞానాన్ని పొందవచ్చని ఒక ప్రకటనలో సెబీ పేర్కొంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్స్ (ఎన్ఐఎస్ఎం) సహకారంతో అభివృద్ధి చేసిన సర్టిఫికేషన్‌ను సెబీ జారీ చేయనుంది. వెరసి ఇన్వెస్టర్లు స్వచ్ఛందంగా మార్కెట్లు, పెట్టుబడుల విషయంలో తమ విజ్ఞానాన్ని పరీక్షించుకునేందుకు వీలుంటుందని పేర్కొంది. రిటైల్ ఇన్వెస్టర్లు దేశీ సెక్యూరిటీల మార్కెట్లో ప్రావీణ్యాన్ని పెంచుకునేందుకు పరీక్ష ఉపయోగపడుతుందని తెలియజేసింది.

టెక్నాలజీ, తయారీపై ప్రభుత్వం ఫోకస్

కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం టెక్నాలజీ, తయారీ రంగంపై ప్రత్యేకంగా దృష్టి పెడుతోందని ఎలక్ట్రానిక్స్, ఐటీ తదితర శాఖల మంత్రిగా మంగళవారం బాధ్యతలు చేపట్టిన అశ్విని వైష్ణవ్ తెలిపారు. సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీతో పాటు టెక్నాలజీ, డిజిటల్ హబ్‌గా భారత్‌ను తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. జన్‌ధన్, ఆధార్ తదితర ప్రోగ్రామ్‌ల ద్వారా గత పదేళ్లుగా సామాన్యులకు డిజిటల్ ఇండియా కార్యక్రమం సాధికారత కల్పించిందని మంత్రి చెప్పారు. టెక్నాలజీతో ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తెచ్చేందుకు, కొత్త తరం సాంకేతికతతో యువతకు ఆశావహమైన భవిష్యత్తును అందించేందుకు తాను కృషి చేస్తానని వివరించారు. ''డిజిటల్ టెక్నాలజీల ద్వారా ప్రజల జీవితాల్లో పరివర్తన తెచ్చే దిశగా నరేంద్ర మోదీ ప్రభుత్వం కొనసాగుతుంది. సెమీ కండక్టర్లు, టెలికం టెక్నాలజీ, తయారీ టెక్నాలజీ వంటి రంగాల్లో భారత్ అగ్రగామిగా ముందుంటుంది'' అని వైష్ణవ్ చెప్పారు.

ప్యాసింజర్ వెహికిల్స్ విక్రయాల్లో వృద్ధి



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా మే నెలలో తయారీ కంపెనీల నుంచి డీలర్లకు చేరిన ప్యాసింజర్ వెహికిల్స్ సంఖ్య 3,47,492 యూనిట్లుగా ఉంది. 2023 మే నెలతో పోలిస్తే ఇది 4 శాతం అధికం. టూవీలర్లు 10 శాతం పెరిగి 16,20,084, త్రిచక్ర వాహనాలు 15 శాతం ఎగసి 55,763 యూనిట్లకు చేరుకున్నాయని సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ (సియామ్) తెలిపింది.

హ్యుందాయ్ మోటార్ డిజిటల్ ఫ్లోట్స్



హైదరాబాద్: స్మార్ట్ మొబిలిటీ సొల్యూషన్స్ సంస్థ హ్యుందాయ్ మోటార్ తమ గ్రామీణ ప్రాంతాల అవుట్‌లెట్స్‌లో కొత్తగా డిజిటల్ ఫ్లోట్స్‌ను ప్రారంభించింది. కొనుగోలుదారులు తమ ఇంటి దగ్గరే, తమ వీలును బట్టి హ్యుందాయ్ కార్లలో ప్రయాణ అనుభూతిని తెలుసుకునేందుకు ఇది ఉపయోగపడనుంది. ఇందుకోసం నేరుగా కొనుగోలుదారుల ఇంటి వద్దకే 'గ్రాండ్ ఐటీ నియోస్' హ్యాచ్‌బ్యాక్, 'ఎక్స్‌టర్, వెన్యూ' ఎస్‌యూవీలను సంస్థ చేరుస్తుంది. సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో కస్టమర్లకు మరింత చేరువయ్యేందుకు ఈ ఫ్లోట్స్ ఉపయోగపడనున్నాయి. 4 డిజిటల్ ఫ్లోట్స్‌ను ఏర్పాటు చేసినట్లు, వీటి ద్వారా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో 75 పైచిలుకు గ్రామాల్లో కస్టమర్లను చేరుకోవాలని నిర్దేశించుకున్నట్లు సంస్థ తెలిపింది. ఈ వాహనాలను ప్రమోట్ చేసేందుకు రెండు రాష్ట్రాల్లో పర్యటించే డిజిటల్ వ్యాన్లను హ్యుందాయ్ మోటార్ ఇండియా ఆర్ఎస్‌హెచ్ జి. రామ్‌కుమార్, ఆర్‌పీసీహెచ్ స్వప్నిల్ చౌదరి, ఆర్ఎస్‌వో మేనేజర్లు రోహిత్, హరితేజ్, మార్కెటింగ్ మేనేజర్ రాజేశ్ సాహా తదితరులు ఆవిష్కరించారు.

భవిత

జాబ్ పాయింట్

బీఎస్ఎఫ్‌లో 1,526 ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్ పోస్టులు

బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్).. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్, హెడ్ కానిస్టేబుల్, వారెంట్ ఆఫీసర్, హవల్దార్(క్లర్క్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. అస్సాం రైఫిల్ ఎగ్జామినేషన్-2024 ద్వారా ఖాళీలు భర్తీ చేయనున్నారు. అర్హులైన పురుష/మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
» మొత్తం పోస్టుల సంఖ్య: 1,526.

పోస్టుల వివరాలు

» హెడ్ కానిస్టేబుల్(హెచ్‌సీ)(మినిస్టీరియల్/కంబాటెంట్ మినిస్టీరియల్),హవల్దార్(క్లర్క్)-1283
» అసిస్టెంట్ సబ్-ఇన్‌స్పెక్టర్(ఏఎస్సై)-(స్టెనోగ్రాఫర్/కంబాటెంట్ స్టెనోగ్రాఫర్), వారెంట్ ఆఫీసర్(పర్సనల్ అసిస్టెంట్)-243.
» అర్హత: పోస్టును అనుసరించి 12వ తరగతి ఉత్తీర్ణులవ్వాలి. టైపింగ్,స్టెనోగ్రఫీ సర్టిఫికేట్, నిర్దిష్ట శారీరక/వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ట్రేడ్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 09.06.2024.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 08.07.2024
» వెబ్‌సైట్: https://rectt.bsf.gov.in

ఐబీపీఎస్-ఆర్ఆర్‌బీల్లో 9,995 గ్రూప్-ఏ, గ్రూప్-బీ పోస్టులు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్(ఐబీపీఎస్).. రీజనల్ రూరల్ బ్యాంక్(ఆర్ఆర్‌బీ)ల్లో కామన్ రిక్రూట్‌మెంట్ ప్రాసెస్-గీఐఐఐ(సీఆర్‌పీ) ద్వారా గ్రూప్ ఎ-ఆఫీసర్(స్కేల్-1, 2, 3), గ్రూప్ బి-ఆఫీస్ అసిస్టెంట్(మల్టీ పర్పస్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» గ్రామీణ బ్యాంక్‌లు: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, కర్ణాటక గ్రామీణ బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, విదర్భ కొంకణ్ గ్రామీణ బ్యాంక్ తదితరాలు.
» మొత్తం పోస్టుల సంఖ్య: 9,995.
» పోస్టుల వివరాలు: ఆఫీస్ అసిస్టెంట్(మల్టీపర్పస్)-5,585, ఆఫీసర్ స్కేల్ 1-3499, ఆఫీసర్ స్కేల్ 2(అగ్రికల్చర్ ఆఫీసర్)-70, ఆఫీసర్ స్కేల్ 2(లా)-30, ఆఫీసర్ స్కేల్ 2(సీఏ)-60, ఆఫీసర్ స్కేల్ 2(ఐటీ)-94, ఆఫీసర్ స్కేల్ 2(జనరల్ బ్యాంకింగ్ ఆఫీసర్)-496, ఆఫీసర్ స్కేల్ 2(మార్కెటింగ్ ఆఫీసర్)-11, ఆఫీసర్ స్కేల్ 2(ట్రెజరీ మేనేజర్)-21, ఆఫీసర్ స్కేల్ 3-129.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ, సీఏ, ఎంబీఏ ఉత్తీర్ణులై ఉండాలి. వయసు: 01.06.2024 నాటికి ఆఫీసర్ స్కేల్-1(అసిస్టెంట్ మేనేజర్) 18 నుంచి 30 ఏళ్లు, ఆఫీసర్ స్కేల్-2(మేనేజర్) 21 నుంచి 32 ఏళ్లు, ఆఫీసర్ స్కేల్-3(సీనియర్ మేనేజర్) 21 నుంచి 40 ఏళ్లు, ఆఫీస్ అసిస్టెంట్(మల్టీపర్పస్) 18 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
» ఎంపిక విధానం: పోస్టును అనుసరించి ప్రిలిమ్స్ రాత పరీక్ష, మెయిన్స్ రాత పరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు: 07.06.2024 నుంచి 27.06.2024 వరకు.
» ఆన్‌లైన్ దరఖాస్తు ఫీజు చెల్లింపు తేదీలు: 07.06.2024 నుంచి 27.06.2024 వరకు.
» ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష కాల్ లెటర్ డౌన్‌లోడ్: జులై/ఆగస్ట్ 2024.
» ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష తేది: ఆగస్ట్, 2024.
» ఆన్‌లైన్ మెయిన్స్/సింగిల్ పరీక్ష తేది: సెప్టెంబర్/అక్టోబర్ 2024.
» ఇంటర్వ్యూ తేదీలు(ఆఫీసర్స్ స్కేల్ 1, 2, 3): నవంబర్, 2024.
» ప్రొవిజనల్ అలాట్‌మెంట్: జనవరి, 2025.
» వెబ్‌సైట్: https://www.ibps.in

ఎస్‌బీఐలో 150 ట్రేడ్ ఫైనాన్స్ ఆఫీసర్ పోస్టులు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) సెంట్రల్ రిక్రూట్‌మెంట్-ప్రమోషన్ డిపార్ట్‌మెంట్, కార్పొరేట్ సెంటర్..రెగ్యులర్ ప్రాతిపదికన స్పెషలిస్ట్ క్యాడర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
» మొత్తం పోస్టుల సంఖ్య: 150
» పోస్టుల వివరాలు: ట్రేడ్ ఫైనాన్స్ ఆఫీసర్(ఎంఎంజీఎస్-2)-మిడిల్ మేనేజ్‌మెంట్ గ్రేడ్-స్కేల్2-150.
» అర్హత: ఏదైనా విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. ఐఐబీఎఫ్ ఫారెక్స్ సర్టిఫికేట్‌తో పాటు ట్రేడ్ ఫైనాన్స్ ప్రాసెసింగ్‌లో రెండేళ్ల పని అనుభవం ఉండాలి. వయసు: 31.12.2023 నాటికి 23 నుంచి 32 ఏళ్ల మధ్య ఉండాలి. » పే స్కేల్: నెలకు రూ.48,170 నుంచి రూ. 69,810 లభిస్తుంది.
» ఎంపిక విధానం: అప్లికేషన్ షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 27.06.2024
» వెబ్‌సైట్: https://sbi.co.in

విద్యా రుణం.. భవితకు వరం!

నచ్చిన కోర్సుల్లో, మెచ్చిన ఇన్‌స్టిట్యూట్‌లో చేరి.. బంగారు భవితకు బాటలు వేసుకోవాలని, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆశించే వారెందరో! కానీ.. భారీ ఫీజుల కారణంగా కోరుకున్న కోర్సులో చేరలేకపోతున్నారు. ఎంతో ప్రతిభ ఉన్నా.. రూ.లక్షల్లో ఫీజులు కట్టలేక అడ్మిషన్ వదులుకుంటున్నారు. ఇలాంటి వారికి అండగా నిలుస్తున్నాయి బ్యాంకుల ఎడ్యుకేషన్ లోన్స్! 2024-25 విద్యా సంవత్సరానికి ఇంజనీరింగ్ తదితర కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో.. విద్యారుణాలపై ప్రత్యేక కథనం..

» ఉన్నత విద్యకు ఊతంగా విద్యా రుణాలు
» ప్రతిభావంతులకు సులభంగానే బ్యాంకు రుణం
» రీ పేమెంట్ విధానంలోనూ పలు వెసులుబాట్లు
» విద్యాలక్ష్మీ పోర్టల్‌తో సింగిల్ విండో దరఖాస్తు



హయ్యర్ ఎడ్యుకేషన్

ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో ప్రముఖ కళాశాలల్లో కన్వీనర్ కోటాలో చేరాలంటే.. ఏడాదికి రూ.60 వేల నుంచి రూ.లక్షన్నరకుపైగా ఫీజు ఉంది. జాతీయ స్థాయిలో ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్ ఐఐటీల్లో సెమిస్టర్‌కు రూ.లక్ష వరకు; ఎన్ఐటీల్లో సెమిస్టర్‌కు రూ.65 వేల నుంచి రూ.70 వేల వరకు ఫీజు వసూలు చేస్తున్నారు. మేనేజ్‌మెంట్ విద్యకు సంబంధించి దేశంలోని ప్రముఖ బీస్కూల్స్ ఐఐఎంల్లో ఎంబీఏ ప్రోగ్రామ్‌కు రూ.20 లక్షలకు పైగానే ఫీజు ఉంది. సంప్రదాయ డిగ్రీ కోర్సులకు కూడా పేరున్న కాలేజీలో రూ.50 వేల వరకు ఫీజు చెల్లించాల్సి వస్తోంది. ఇక విదేశీ విద్యకు సగటున ఏడాదికి రూ.50 లక్షల వరకు వ్యయం అవుతోంది. ఇలా లక్షల్లో ఉన్న ఫీజులు చెల్లించలేక ఇబ్బందిపడుతున్న విద్యార్థులకు బ్యాంకులు చేయూతనందిస్తున్నాయి. విద్యా రుణాలు మంజూరు చేస్తూ వారి ఉన్నత విద్యకు సహకరిస్తున్నాయి.

అర్హతలు

ఎంట్రన్స్ టెస్టులో ఉత్తీర్ణత సాధించి కన్వీనర్ కోటాలో సీటు పొందిన విద్యార్థులకే విద్యా రుణ దరఖాస్తుకు బ్యాంకులు అర్హత కల్పిస్తున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వరంగ బ్యాంకులు ఎంట్రన్స్‌లో మెరిట్ పొందిన వారికే విద్యా రుణ మంజూరులో ప్రాధాన్యం ఇస్తున్నాయి. పలు ప్రైవేట్ బ్యాంకులు మాత్రం మేనేజ్‌మెంట్ కోటాలో ప్రవేశం పొందిన వారికి కూడా విద్యా రుణ దరఖాస్తుకు అవకాశం కల్పిస్తున్నాయి. ఆయా బ్యాంకులు తమ అంతర్గత విధి విధానాలకు అనుగుణంగా రుణాలు మంజూరు చేస్తున్నాయి.

గుర్తింపు తప్పనిసరి

విద్యా రుణాలను మంజూరుకు బ్యాంకులు నిర్దిష్ట నిబంధనలను అనుసరిస్తున్నాయి. ఏఐసీటీఈ, యూజీసీ, విద్యాశాఖ గుర్తింపు ఉన్న కళాశాలలు, కోర్సులనే విద్యా రుణ మంజూరులో పరిగణనలోకి తీసుకుంటున్నాయి. గుర్తింపున్న ఇన్‌స్టిట్యూట్‌లలో, కోర్సుల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకే విద్యా రుణం కోసం దరఖాస్తుకు అర్హత కల్పిస్తున్నాయి.

విదేశీ విద్యకు సైతం

విదేశీ విద్య అభ్యర్థులు కూడా విద్యారుణాలు పొందే అవకాశం ఉంది. దేశంలోని ఇన్‌స్టిట్యూట్‌లలో ప్రవేశం పొందిన విద్యార్థులకు గరిష్ఠంగా రూ.పది లక్షల వరకూ రుణం లభిస్తోంది. అదేవిధంగా విదేశీ ఇన్‌స్టిట్యూట్‌లలో అడ్మిషన్ లభించిన వారికి గరిష్ఠంగా రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నారు.

మూడు శ్లాబ్‌లు

- ఎడ్యుకేషన్ లోన్స్ మంజూరుకు బ్యాంకులు మూడు శ్లాబ్‌ల విధానాన్ని అమలు చేస్తున్నాయి.
- శ్లాబ్-1లో.. రూ.4 లక్షల రుణ మొత్తంగా నిర్ధయించారు. ఈ శ్లాబ్‌లో రుణ మంజూరుకు విద్యార్థులు ఎలాంటి హామీ ఇవ్వక్కర్లేదు.
- శ్లాబ్-2లో.. రూ.4 లక్షల నుంచి రూ.7.5 లక్షల వరకు రుణ మొత్తాన్ని కేటాయిస్తున్నారు. ఇందు కోసం తల్లిదండ్రుల హామీ, థర్డ్ పార్టీ గ్యారెంటీ పత్రం ఇవ్వాల్సి ఉంటుంది.
- శ్లాబ్-3లో.. రూ.7.5 లక్షలకు పైగా రుణ మొత్తం ఉంటోంది. దీనికి దరఖాస్తు చేయాలనుకుంటే ఈ మొత్తానికి సరిపడే కొల్లేటరల్ సెక్యూరిటీ (స్థిరాస్థి పత్రాలను) చూపాల్సి ఉంటుంది.

మార్జిన్ మనీ

విద్యార్థులు తాము దరఖాస్తు చేసుకున్న రుణ మొత్తంలో కొంత మొత్తాన్ని మార్జిన్ మనీగా సమకూర్చుకోవాల్సి ఉంటుంది. రూ.4 లక్షల వరకు ఎలాంటి మార్జిన్ మనీ అవసరం లేదు. కాని రూ.4 లక్షలు దాటితే మాత్రం స్వదేశంలో చదివే విద్యార్థులు అయిదు శాతం, విదేశీ విద్య విద్యార్థులు 15 శాతం మార్జిన్ మనీని సమకూర్చుకోవాలి.

రుణం.. ఈ వ్యయాలకే

కోర్సు ట్యూషన్ ఫీజు, హాస్టల్ ఫీజు, ఎగ్జామినేషన్/లైబ్రరీ/లేబొరేటరీ ఫీజు, విదేశీ విద్య ప్రయాణ ఖర్చులు, పుస్తకాలు, యూనిఫామ్, ఇతర అకడమిక్ సంబంధిత పరికరాల కొనుగోలుకు అయ్యే ఖర్చు, కంప్యూటర్ కొనుగోలు వ్యయం, స్టడీ టూర్స్, ప్రాజెక్ట్ వర్క్స్, ఇన్‌స్టిట్యూట్‌లు వసూలు చేసే కాషన్ డిపాజిట్, బిల్డింగ్ ఫండ్, రిఫండబుల్ డిపాజిట్‌లకు సంబంధించిన వ్యయాలకు విద్యా రుణాలు మంజూరు చేస్తున్నారు.

టాప్ ఇన్‌స్టిట్యూట్స్‌కు మినహాయింపు

ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ నిబంధనల ప్రకారం-గరిష్ఠ రుణ మొత్తం మంజూరులో నిర్దిష్ట నిబంధనలు ఉన్నప్పటికీ.. విద్యార్థులు ప్రతిష్ఠాత్మక ఇన్‌స్టిట్యూట్‌లలో ప్రవేశం పొందితే గరిష్ఠ రుణ మొత్తాన్ని పెంచే విచక్షణాధికారం బ్యాంకులకు కల్పించింది. ఉదాహరణకు ఐఐఎంలు, ఐఐటీల వంటి ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లలో రూ.పది లక్షల కంటే ఎక్కువ ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. ఇలాంటి ఇన్‌స్టిట్యూట్‌లలో ప్రవేశం పొందిన వారికి గరిష్ఠ రుణం విషయంలో సడలింపు ఇచ్చే అవకాశం ఉంది.

నిరంతర సమీక్ష

విద్యా రుణం మంజూరు చేసిన బ్యాంకులు.. వాటిని విడతల వారీగా ఆయా ఇన్‌స్టిట్యూట్స్‌కు నేరుగా చెల్లిస్తాయి. తొలి దశలో విద్యార్థులు సొంతంగా ఫీజు చెల్లించి ఉంటే.. సంబంధిత రశీదుల ఆధారంగా తొలిదశ ఫీజును విద్యార్థికి అందిస్తాయి. ఆ తర్వాత నుంచి ఇన్‌స్టిట్యూట్‌కు నేరుగా పంపుతాయి. అంతకుముందు సంవత్సరంలో సదరు విద్యార్థి అకడెమిక్‌గా చూపిన ప్రతిభ గురించి సమీక్ష చేస్తున్నాయి. దీని ఆధారంగా మిగతా రుణం చెల్లింపుపై నిర్ణయం తీసుకుంటున్నాయి.

రీ పేమెంట్ హాలిడే

ఎడ్యుకేషన్ లోన్ తిరిగి చెల్లించే విషయంలో బ్యాంకులు రీ పేమెంట్ హాలిడే పేరుతో వెసులుబాటు కల్పిస్తున్నాయి. కోర్సు పూర్తి చేసుకున్న సంవత్సరం తర్వాత లేదా ఉద్యోగం లభించినప్పటి నుంచి వాయిదాల పద్ధతిలో రుణం తిరిగి చెల్లించే అవకాశం ఉంది. ఇలా గరిష్ఠంగా 15 ఏళ్ల వ్యవధిలో ఈఎంఐ విధానంలో రుణం చెల్లించొచ్చు. మహిళా విద్యార్థులకు వడ్డీ రేట్లలో 0.5 శాతం నుంచి ఒక శాతం వరకు రాయితీ ఇస్తున్నాయి.

పూర్తి అవగాహన

ఎడ్యుకేషన్ లోన్స్ ద్వారా ఉన్నత విద్యను అభ్యసించాలని కోరుకునే విద్యార్థులు పలు జాగ్రత్తలు తీసుకోవాలి. ముందుగా ఆయా బ్యాంకుల నిబంధనలు, వడ్డీ రేట్లపై స్పష్టత ఏర్పరచుకోవాలి. దీంతో పాటు రీపేమెంట్ విధానం గురించి తెలుసుకోవాలి. అదేవిధంగా తమకు ప్రవేశం ఖరారు చేసిన ఇన్‌స్టిట్యూట్‌కు ఏఐసీటీఈ, యూజీసీ తదితర నియంత్రణ సంస్థల గుర్తింపు గురించి వాకబుచేయాలి.

దరఖాస్తుకు జత చేయాల్సిన పత్రాలు

- ప్రవేశ ధ్రువీకరణ పత్రం, అకడమిక్ అర్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు; తల్లిదండ్రుల ఆదాయ ధ్రువీకరణ; తల్లిదండ్రుల ఆదాయ స్థితిగతుల వివరాలు; బ్యాంకు అకౌంట్ స్టేట్‌మెంట్స్; నివాస ధ్రువీకరణ; థర్డ్‌పార్టీ ఆదాయ ధ్రువీకరణ; కోర్సు వ్యయానికి సంబంధించి ఇన్‌స్టిట్యూట్‌ల నుంచి అధీకృత లెటర్స్.
- వివరాలకు వెబ్‌సైట్: www.iba.org.in

విద్యా లక్ష్మి పోర్టల్

ఎడ్యుకేషన్ లోన్స్‌కు దరఖాస్తు చేసుకునే విద్యార్థుల సౌలభ్యం కోసం కేంద్ర ప్రభుత్వం సింగిల్ విండో విధానాన్ని అమలు చేస్తోంది. విద్యార్థులు బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా.. విద్యా లక్ష్మి పేరుతో ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. అభ్యర్థులు ఈ పోర్టల్‌లో లాగిన్ అయి.. కామన్ ఎడ్యుకేషనల్ లోన్ అప్లికేషన్ ఫామ్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. గరిష్ఠంగా మూడు బ్యాంకులకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఇలా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల దరఖాస్తులను.. ప్రాధమ్యంగా పేర్కొన్న బ్యాంకులకు పంపిస్తారు. ఆ తర్వాత దశలో సదరు బ్యాంకులు దరఖాస్తును పరిశీలించి సంతృప్తి చెందితే.. ఏ బ్రాంచ్‌లో సంప్రదించాలి, ఏ ఏ పత్రాలు తీసుకెళ్లాలి అనే వివరాలను విద్యార్థులకు పంపుతాయి. విద్యాలక్ష్మి పోర్టల్ విద్యా రుణాల విషయంలో విద్యార్థులకు, బ్యాంకులకు అనుసంధానకర్తగా ఉంటోంది.

- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.vidyalakshmi.co.in

టీడీపీ ఒత్తిళ్లతో వార్తా ఛానెళ్ల నిలిపివేత

▶ మొదటి పేజీ తరువాయి

ఎన్టీవీ, 10టీవీల ప్రసారాలు శాశ్వతంగా నిలిపివేయాలని ఏపీ కేబుల్ టీవీ ఆపరేటర్స్ అసోసియేషన్ తీర్మానం చేసినట్లు టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్)కు మంగళవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ ఎస్. నిరంజన్‌రెడ్డి లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. స్టార్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వర్సెస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్, ప్రమోషన్–2019 2ఎస్‌సీసీ 104 కేసులో సుప్రీంకోర్టు ఎయిర్‌వేవ్, ఫ్రీక్వెన్సీలు పబ్లిక్ ప్రాపర్టీగా తన తీర్పులో పేర్కొందని, తద్వారా వాటిని వినియోగించుకోవడం ప్రతీ పౌరుడి హక్కు అనే విషయాన్ని ట్రాయ్ దృష్టికి ఆయన తీసుకెళ్లారు. చట్టానికి లోబడి సహేతుకమైన ఆంక్షలు విధించొచ్చని, అయితే ఎలాంటి కారణాలు లేకుండా ఏజెన్సీలు ఛానెళ్లను ఏకపక్షంగా తొలగించడం ఉల్లంఘన కిందకి వస్తుందని ఆయన స్పష్టం చేశారు. ట్రాయ్ నిబంధనలు ఏం చెబుతున్నాయనే విషయాన్ని ఫిర్యాదులో ఉటంకించారు.

నోటీసు ఇవ్వకుండా సిగ్నల్ ఆపకూడదు..

ప్రతిపాదిత డిస్‌కనెక్షన్‌కు కారణాలు స్పష్టంగా పేర్కొంటూ ప్రభావిత సర్వీస్ ప్రొవైడర్‌కు కనీసం మూడు వారాల నోటీసు ఇవ్వకుండా ఏ సర్వీస్ ప్రొవైడర్ టెలివిజన్ ఛానళ్ల సిగ్నల్‌ను డిస్‌కనెక్ట్ చేయరాదని 2017 నిబంధనల్లోని 17వ నిబంధన స్పష్టంచేస్తోందని.. కానీ, ప్రస్తుతం ఏపీలో ఈ నిబంధన తుంగలో తొక్కారని నిరంజన్‌రెడ్డి తెలిపారు. నూతన–ంగా ఏర్పాటవుతున్న ప్రభుత్వ ఆదేశాల మేరకు కేబుల్ టీవీ ఆపరేటర్ల సంఘం పలు వార్తా ఛానళ్లపై ఏకపక్ష నిర్ణయం తీసుకుందన్నారు. నోటీసు జారీచేయకుండానే ఇలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం ఏపీలో కేబుల్ టీవీ ఆపరేటర్ల అసోసియేషన్ ప్రజాస్వామ్య ప్రాథమిక సూత్రంపై ప్రత్యక్షంగా దాడిచేసినట్లేనన్నారు. కొత్తగా ఏర్పాటవుతున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా భావించే వార్తా ఛానళ్లను ఏకపక్షంగా నిరోధించడం ద్వారా ప్రభుత్వ కార్యకలాపాలపై స్వతంత్ర నివేదికలు, విమర్శనాత్మక విశ్లేషణలు అందించే పత్రికా స్వేచ్ఛను హరిస్తున్నారని నిరంజన్‌రెడ్డి ఆ ఫిర్యాదులో ఆరోపించారు. ఈ తరహా జోక్యం పత్రికా స్వేచ్ఛను నిరుత్సాహపరచడమేనని.. ఇది పాత్రికేయ స్వేచ్ఛను అణచివేయడమేనన్నారు. పౌరులకు భిన్నమైన, అవసరమైన సమాచారం అందించే అవకాశం మీడియా కోల్పోతుందన్నారు. ఛానెళ్లు మ్యూట్ చేయడమంటే అసమ్మతి గళం సహించబోమనే సందేశం ప్రజల్లోకి పంపుతోందన్నారు. దీనిద్వారా జర్నలిస్టులు, మీడియా సంస్థలు వివాదాస్పద అంశాలు కవర్ చేయడం తగ్గుతుందని, కేవలం ప్రభుత్వ అనుకూల కథనాలే ప్రసారమవుతాయని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ తరహా చర్యలవల్ల పత్రికా స్వేచ్ఛపై పడే ప్రభావాలను ట్రాయ్ తక్షణమే గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని నిరంజన్‌రెడ్డి కోరారు.

సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి..

ఇక ట్రాయ్ నిబంధనలు అమలుచేయడంతోపాటు ప్రభుత్వ ప్రభావం నుంచి మీడియాను రక్షించడానికి నిర్ణయాత్మకంగా వ్యవహరించాలని ఆయన కోరారు. ఏపీ కేబుల్ టీవీ ఆపరేటర్ల అసోసియేషన్ న్యూస్ ఛానళ్లను అక్రమంగా బ్లాక్ చేయడంపై సమగ్ర విచారణ జరపాలని, ట్రాయ్ 2017 నిబంధనల్లోని 17వ నిబంధన ఉల్లంఘించిన వారిపై అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రెస్ స్వతంత్ర సూత్రాలను సమర్థించి మీడియా, బ్రాడ్‌కాస్టింగ్ సర్వీస్‌లపై ప్రభుత్వ ప్రభావం లేకుండా చూడాలని ఆ ఫిర్యాదులో నిరంజన్‌రెడ్డి కోరారు. తన ఫిర్యాదులోని అంశాన్ని అత్యవసరంగా తీసుకుని వీలైనంత త్వరగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

క్యాష్ 'హంట్..'



- బస్టాండ్, స్ట్రీట్ డస్ట్‌బిన్, పార్కు ఇలా అక్కడక్కడా డబ్బులు పెడుతున్న వ్యక్తులు
- ఆ డబ్బుల కోసం ఎగబడుతున్న ఫాలోవర్స్.. ఇదంతా వీడియో తీసి ఇన్‌స్ట్రాగామ్, ఫేస్‌బుక్‌లో పోస్టులు..
- లక్షల్లో వ్యూస్ కోసమే..
- సిటీలో సరికొత్త ట్రెజర్ హంటింగ్

→ జనాలతో సందడిగా ఉండే ప్రాంతం అది..ఒక వ్యక్తి తొందరతొందరగా వచ్చి ఫుట్ పాత్‌పై ఉన్న చెత్తకుండీకి అంటించి ఉన్న కవర్ తీసుకొని అందులోని 500రూపాయల నోట్ జేబులో పెట్టుకొని వెళ్లిపోయాడు.

→ మనుషులే లేని మరో నిర్మానుష్య ప్రాంతంలోని పాడుబడిన పాతబస్టాండ్‌లోకి వేగంగా వెళ్లి ఇనుప చువ్వలో దాచిన వెయ్యి రూపాయలు తీసుకొని వెళ్లాడు మరొకతను.



సాక్షి, హైదరాబాద్: నగరంలోని ట్యాంక్‌బండ్, సచివాయం, అసెంబ్లీ, క్రికెట్ స్టేడియం వంటి పరిసర ప్రాంతాలతోపాటు బస్టాండ్‌లు, పార్కులు, ఫ్లైఓవర్లు ఇలా ఎక్కడ పడితే అక్కడ డబ్బులు దొరుకుతున్నాయి. నగరంలో న్యూ ట్రెండ్‌గా మారింది ఈ తరహా ట్రెజర్.. కాదుకాదు క్యాష్ హంటింగ్. నగరంలోనే కాదు..నగరం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే బస్సులు, రైళ్లలో సైతం మనీ హంటింగ్ కొనసాగించడం విశేషం. కొందరు వ్యక్తులు ఇలా డబ్బులను వివిధ ప్రాంతాల్లో పెట్టి అంతా వీడియో తీసి సోషల్‌మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. వీటి కోసం ఇన్‌స్టా, ఫేస్‌బుక్ వేదికగా ప్రత్యేకంగా సైట్లు, సోషల్ పేజ్‌లు తయారు చేసుకున్నారు. ఇందులోని ఫాలోవర్స్ వీడియో పోస్ట్ చేసిన నిమిషాల్లో అక్కడకు చేరుకొని డబ్బులు సొంతం చేసుకుంటున్నారు. సోషల్ మీడియాలో ఇప్పుడిది కొత్త ట్రెండ్. మరికొందరు యాక్సెసరీస్ ప్యాక్ చేసి పెట్టి వారి స్టోర్ లేదా బ్రాండ్‌లను ప్రమోట్ చేసుకుంటున్నారు. ఈ తరహా సోషల్ మీడియా అకౌంట్లకు పెద్దఎత్తున ఫాలోవర్స్ ఉండటం విశేషం.

వ్యూస్, లైక్స్ కోసమేనా??

సోషల్‌మీడియా వేదికగా అత్యధిక ఫాలోవర్స్‌ను ఆకర్షించడం, వ్యూస్, లైక్స్ సంఖ్య పెంచుకోవడానికి ఈ తరహా ట్రెజర్ హంటింగ్ నిర్వహిస్తున్నారని పలువురు చెబుతున్నారు. ఎక్కువ ఫాలోవర్స్ ఉంటే సోషల్‌మీడియాలో ఫేమ్‌తో పాటు యాడ్స్ రూపంలో ఆర్థిక వెసులుబాటు కూడా లభిస్తుంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఎప్పుడెప్పుడు హంట్ వీడియో పెడతారా అని ఫాలోవర్స్ చేతిలో ఫోన్ పట్టుకొని కూర్చుంటున్నారు. ఇలా ఎవరు ముందు వచ్చి ఈ డబ్బులు తీసుకున్నారనేది కూడా వీడియో తీసి అదే సోషల్ సైట్లలో పెడుతుంటే వాటికి కూడా లక్షల్లో వ్యూస్ వస్తున్నాయి.

ఎన్‌డీఏ పాలనా విధానాలను ప్రశ్నించాలి

మావోయిస్టు పార్టీ ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేష్

జి.మాడుగుల (అల్లూరి సీతారామరాజు జిల్లా): కేంద్రంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏర్పడిన ఎన్‌డీఏ సంకీర్ణ ప్రభుత్వాలు అనుసరించబోయే రాజకీయ, ఆర్థిక, పాలనా విధానాలను ప్రజలు ప్రశ్నించాలని సీపీఐ మావోయిస్టు పార్టీ ఆంధ్ర–ఒడిశా బోర్డర్ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేష్ మంగళవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. '18వ లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో అవకాశవాద రాజకీయ పార్టీలతో కలగూర గంపగా ఎన్‌డీఏ ప్రభుత్వం కొలువుదీరింది. ఎన్నికలకు ముందు ఎన్‌డీఏ కూటమిలోని పార్టీలకు ఉమ్మడి ఏజెండా లేదు. చంద్రబాబు ఎన్‌డీఏ సంకీర్ణ ప్రభుత్వంలో ఏ ప్రాతిపదికన చేరారో ప్రకటించకపోవడం గమనార్హం. 2014 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేస్తారా? రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వలేదన్న కారణంతో 2018లో టీడీపీ చంద్రబాబు ఎన్‌డీఏ నుంచి వైదొలగారు. తిరిగి ఇప్పుడు ఎన్‌డీఏలో భాగస్వామి అయ్యారు.. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని కేంద్రం హామీ ఇచ్చిందా? అనేది ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నాం. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీని అమలు చేస్తారా? విశాఖ ఉక్కు పరిశ్రమను కేంద్రం అమ్మకానికి పెట్టింది.. ఆ నిర్ణయాన్ని మార్చుకుంటారా? రాష్ట్రంలో లక్షలాదిమంది నిరుద్యోగులకు ఉపాధి విధానం ప్రకటించాలి. ఎన్నికలకు ముందు అన్ని రంగాల ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ చేసిన డిమాండ్లపై ప్రభుత్వ వైఖరి తెలియజేయాలి. ముస్లింలకు కేటాయించిన 6 శాతం రిజర్వేషన్ అమలు చేస్తారా? మతప్రాతిపదికన పౌరసత్వాన్ని కల్పించే సీఏఏను రాష్ట్రంలో అమలు చేస్తారా? వ్యతిరేకిస్తారా? తెలపాలి. షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీ నిరుద్యోగులకు 100 శాతం ఉపాధ్యాయ పోస్టులు కేటాయించాలన్న జీవో 3పై ఏపీ ప్రభుత్వ వైఖరి ఏమిటి? రాష్ట్రంలో ప్రజాస్వామిక హక్కులు అమలు చేస్తారా? ప్రత్యామ్నాయ విప్లవ రాజకీయాలపై నిషేధాన్ని ఎత్తి వేస్తారా?' అంటూ ఆ ప్రకటనలో మావోయిస్టు నేత ప్రశ్నించారు.


భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
కేంద్రంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ ఏర్పడిన ఎన్‌డీఏ సంకీర్ణ ప్రభుత్వాలు
అవి అనుసరించబోయే రాజకీయ, ఆర్థిక, పాలనా విధానాలను
ప్రజలు ప్రశ్నించాల్సిందిగా కోరుతున్నాం!

మావోయిస్టుల ప్రకటన

బీసీలకు 12 మంత్రి పదవులివ్వాలి

బీఎస్పీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ డాక్టర్ పూర్ణచంద్రరావు డిమాండ్

సాక్షి, అమరావతి: కొత్తగా ఏర్పాటయ్యే కూటమి ప్రభుత్వంలో జనాభా దామాషా ప్రకారం బీసీలకు 12 మంత్రి పదవులు ఇవ్వాలని విశ్రాంత ఐపీఎస్ అధికారి, బీఎస్పీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ డాక్టర్ పూర్ణచంద్రరావు డిమాండ్ చేశారు. ఆ పార్టీ సెంట్రల్ జోన్ జిల్లాల అధ్యక్షుల సమావేశం విజయవాడలో మంగళవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. కమ్మ, రెడ్లు ఎంతమంది ఉంటే అంత మంది యాదవులు, గౌడలు ఉన్నారని, వారికి రెండేసి చొప్పున మంత్రి పదవులు ఇవ్వాలని కోరారు. ఇంత వరకూ మంత్రి పదవి దక్కని కులాలకు కేబినేట్‌లో చోటు కల్పించాలన్నారు. ఎస్సీలకు ఐదు మంత్రి పదవులు జగన్ ఇచ్చారని, అలాగే చంద్రబాబూ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఏజెన్సీతో పాటు మైదాన ప్రాంత ఎస్టీలకు కూడా మంత్రివర్గంలో స్థానం కల్పించాలన్నారు. ముస్లింలకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కులానికి చెందిన వారికి మంత్రి పదవి ఇవ్వకూడదన్నారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బక్కా పరంజ్యోతి, కార్యవర్గ సభ్యులు ఎల్ వందన కుమార్, గురప్ప, ఉమ్మడి ప్రకాశం, గుంటూరు, కృష్ణ, పశ్చిమ గోదావరి జిల్లాల బీఎస్పీ నేతలు పాల్గొన్నారు.

ఆస్తి కోసం అక్కను చంపాడు

2021లో ఘటన.. తాజా నివేదికతో బయటపడిన నిజం

పెనుబల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న అక్క ఆస్తిని సొంతం చేసుకోవాలన్న కుట్రతో కూల్‌డ్రింక్‌లో విషం కలిపి హత్య చేశాడు ఓ వ్యక్తి. దీనిని సాధారణ మృతిగా నమ్మించినా ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదికతో అసలు నిజం బయటపడింది. దీంతో మూడేళ్ల తర్వాత పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. ఫోరెన్సిక్ ల్యాబ్ నుంచి తాజాగా నివేదిక రావడంతో అనుమానాస్పద మృతి కేసును హత్య కేసుగా మార్చినట్లు సత్తుపల్లి రూరల్ సీఐ ఎస్.వెంకటేశ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం రామచందర్‌రావు బంజర్‌కు చెందిన దూదిపాళ్ల కనకమ్మ (70)కు యుక్తవయస్సులో వివాహమైనా భర్త ఆమెను వదిలేసి మరో పెళ్లి చేసుకున్నాడు. కనకమ్మ పేరిట మూడెకరాలు, ఆమె తల్లి పేరిట మూడెకరాల భూమి ఉండగా తల్లి పోషణను ఆమే చూసుకోవడంతో ఆరెకరాల భూమి సంక్రమించింది. ఈ క్రమంలో వృద్ధాప్యం బారిన పడిన కనకమ్మ పేరిట ఉన్న భూమిని కాజేయడానికి ఆమె సోదరుడు కోమటి వెంకటేశ్వరరావు నిర్ణయించుకున్నాడు. 2021 సంవత్సరంలో కూల్‌డ్రింక్‌లో విషం కలిపి అక్కకు తాగించగా చనిపోయింది. అయితే, కనకమ్మ అనారోగ్యంతో మృతి చెందినట్లు బంధువులు, గ్రామస్తులను నమ్మించినా, మరో సోదరుడు కోమటి నాగేశ్వరరావు వీఎం బంజర్‌లో పోలీసులకు ఫిర్యాదు చేయగా అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అనంతరం పోస్టుమార్టం చేయించి ల్యాబ్‌కు శరీర భాగాలను పంపించగా ఇటీవల నివేదిక అందింది. ఇందులో విషప్రయోగంతోనే కనకమ్మ మృతి చెందినట్లు నివేదిక రావడంతో హత్య కేసుగా మార్చి కోమటి వెంకటేశ్వరరావును సోమవారం అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం సత్తుపల్లి కోర్టులో హాజరుపర్చగా 15 రోజుల రిమాండ్ విధించారని సీఐ తెలిపారు.

మోత్కూరు పీఏసీఎస్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

మోత్కూరు: యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్ కంచర్ల అశోక్‌రెడ్డి (బీఆర్ఎస్)పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ఓటింగ్ కోసం వైస్‌చైర్మన్ పీలవుడు వెంకటేశ్వర్లుతో పాటు తొమ్మిది మంది డైరెక్టర్లు మే 21న జిల్లా సహకార శాఖ అధికారికి తీర్మాన పత్రాన్ని అందజేశారు. దీంతో మంగళవారం సంఘం కార్యాలయంలో అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహించారు. 13 మంది డైరెక్టర్లకు గాను అవిశ్వాస తీర్మానంపై సంతకాలు చేసిన వైస్ చైర్మన్‌తో పాటు తొమ్మిది మంది డైరెక్టర్లు హాజరయ్యారు. చైర్మన్ మాత్రం ఒక్కరే హాజరయ్యారు. ఆయనకు అనుకూలంగా ఉన్న ముగ్గురు డైరెక్టర్లు గైర్హాజరయ్యారు. తొమ్మిది మంది డైరెక్టర్లు చైర్మన్‌పై అవిశ్వాసానికి మద్దతుగా చేతులు ఎత్తడంతో అవిశ్వాసం నెగ్గినట్లు అధికారి ప్రకటించారు. రెండు రోజుల్లో నూతన చైర్మన్ ఎన్నికను చేపడుతామని తెలిపారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా

కేపీఎస్‌సీ సభ్యుడిగా శివనగౌడ పాటిల్


శివనగౌడ పాటిల్‌ను అభినందించిన దృశ్యం

రాయచూరు రూరల్: కర్ణాటక పబ్లిక్ సర్వీస్ కమిషన్(కేపీఎస్‌సీ) సభ్యుడిగా శివనగౌడ పాటిల్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మంగళవారం ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్‌ల ప్రతిపాదన మేరకు రాష్ట్ర గవర్నర్ ఈమేరకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు రవి ఆయనను అభినందించారు.

ఏఐసీసీ అధ్యక్షుడితో ఎమ్మెల్సీ భేటీ


మల్లికార్జున ఖర్గేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న వసంత్‌కుమార్ తదితరులు

రాయచూరు రూరల్: విధాన పరిషత్‌కు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి కార్యాధ్యక్షుడు వసంత్ కుమార్ నూతన ఎమ్మెల్సీగా ఎంపికైనందున ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి కేసీ వేణుగోపాల్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ నేపథ్యంలో పరిషత్ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొని ప్రజా సమస్యలపై గళం విప్పాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా విధాన పరిషత్ సభ్యుడు శరణే గౌడ బయ్యాపూర్, ఎమ్మెల్యేలు హంపన గౌడ, బసన గౌడ, డీసీసీ అధ్యక్షుడు బసవ రాజ్ పాటిల్ ఇటగి, బసన గౌడలున్నారు.

రాయచూరు ఉత్సవాలు ప్రారంభం


కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

రాయచూరు రూరల్: నగరంలో సోమవారం సాయంత్రం రాయచూరు చారిత్రక ఉత్సవాలను కిల్లే బృహన్మఠాధిపతి శాంతమల్ల శివాచార్యులు ప్రారంభించారు. రాష్ట్ర శామియానా, డెకరేటర్స్, సౌండ్, పబ్లిసిటీ క్షేమాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో స్వామీజీ మాట్లాడుతూ ప్రభుత్వం సంఘాన్ని కార్మిక శాఖ ఆధీనంలోకి చేర్చుకుని వారిని గుర్తించి ఆదుకోవాలన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో శామియానా, డెకరేటర్స్, సౌండ్, పబ్లిసిటీ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు లక్ష్మణ్, రాజా సాహెబ్, ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం సంచాలకురాలు స్మిత, అరుణ్, మెహబూబ్, మంజునాథ్, విరుపాక్షి, విజయ్‌కుమార్‌లున్నారు.

నీట్‌లో అక్రమాలపై విచారణకు వినతి


వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: రాష్ట్రంలో నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై పూర్తి స్థాయిలో ఏకపీఠ న్యాయమూర్తితో విచారణ జరిపించాలని ఏఐడీఎస్‌ఓ డిమాండ్ చేసింది. మంగళవారం టిప్పుసుల్తాన్ ఉద్యానవనంలో చేపట్టిన ఆందోళననుద్దేశించి అధ్యక్షుడు అయ్యాళప్ప మాట్లాడారు. నీట్ శిక్షణ, కోచింగ్, పరీక్షల విషయంలో అధిక ప్రమాణంలో జరిగిన అక్రమాలపై పూర్తి స్థాయిలో న్యాయమూర్తితో విచారణ జరిపించి తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.


డీసీఎంతో చిక్కోడి ఎంపీ భేటీ


డీసీఎం డీకే శివకుమారను కలిసిన ఎంపీ, మంత్రి తదితరులు

రాయచూరు రూరల్: చిక్కోడి లోక్‌సభ స్థానానికి ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన మంత్రి సతీష్ జార్కిహోళి కుమార్తె ప్రియాంక జార్కిహోళి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీ.కే.శివకుమారను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ నేపథ్యంలో లోక్‌సభ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొని ప్రజా సమస్యలపై స్పందించాలని ఆయన సూచించారు.

నేడు చేళ్లగుర్కి ఎర్రితాత మహారథోత్సవం

- కోరిన కోర్కెలు తీర్చే మహిమాన్వితుడు
- రేపు అంగరంగ వైభవంగా పూల రథోత్సవం


చేళ్లగుర్కిలో వెలసిన ఎర్రితాత


చేళ్లగుర్కిలోని ఎర్రితాత ఆలయం

సాక్షి,బళ్లారి: కోరిన కోర్కెలు తీర్చే దైవాంశ సంభూతుడుగా గుర్తింపు పొంది లక్షలాది మంది భక్తులకు కొంగు బంగారంగా నిలిచిన చేళ్లగుర్కి ఎర్రితాత జాతర మహోత్సవాలు కన్నుల పండువగా జరుగుతున్నాయి. ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి చేళ్లగుర్కికి వచ్చి ఇక్కడ స్థిరపడి, జనం మధ్యలో సామాన్యుడిగా తిరుగుతూ, ఎన్నో మహిమలు చూపిన ఎర్రితాతకు కర్ణాటకలోనే కాకుండా పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో లక్షలాది మంది భక్తులు ఉన్నారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ సరిహద్దును ఆనుకుని బళ్లారి తాలూకా చేళ్లగుర్కిలో వెలసిన ఎర్రితాత మహిమలను ఈ ప్రాంత వాసులు కళ్లముందే కనబడుతున్నాయి.

ఏటేటా పెరుగుతున్న రద్దీ

దీంతో ఏటేటా చేళ్లగుర్కికి వచ్చే భక్తులు పెద్ద సంఖ్యలో పెరుగుతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి ఏటా క్రమం తప్పకుండా నిర్వహించే జాతర మహోత్సవాలకే కాకుండా ప్రతి సోమవారం, అమావాస్య, పౌర్ణమి, గురువారం రోజుల్లో పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి స్వామి సమాధిని దర్శించుకుని పునీతులవుతుంటారు. ప్రతి రోజు శ్రీ ఎర్రితాత మఠంలో భక్తులకు అన్నదానం కూడా చేస్తుంటారు. చేళ్లగుర్కి ఎర్రితాత సమాధిని దర్శించుకుంటే కోరిన కోర్కెలే కాదు కష్టాలు, మనశ్శాంతి కూడా ఎంతో లభిస్తుందని భక్తుల్లో ప్రగాఢ విశ్వాసం నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రతి ఏటా నిర్వహించే జాతర మహోత్సవాలకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు.

ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు

ఉత్సవాల్లో భాగంగా రెండు రోజులు అంటే నేడు చేళ్లగుర్కి ఎర్రితాత మహారథోత్సవం, జూన్ 12న సాయంత్రం మహారథోత్సవ కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు తరలిరానుండటంతో అన్ని చర్యలు చేపట్టారు. అదే విధంగా 13వ తేదీన పూల రథోత్సవం కూడా జరపనున్నారు. రెండు రోజుల పాటు రథోత్సవ కార్యక్రమాలు ఉండటంతో ఎర్రితాత మఠం వద్దకు భక్తులు పెద్ద సంఖ్యలో చేరనుండటంతో ముందస్తు చర్యలు తీసుకున్నారు. ఎర్రిస్వామి జీవసమాధి ట్రస్టు అధ్యక్షుడు బాలనగౌడ, అన్నదాన సేవా సంఘం అధ్యక్షుడు పంపనగౌడ నేతృత్వంలో గ్రామస్తులు కలిసికట్టుగా ఎర్రితాత జాతర మహోత్సవాలను విజయవంతం చేయడానికి కృషి చేస్తున్నారు.

విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచండి


వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నేతలు

బళ్లారిఅర్బన్: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో తగినంత వర్షాలు కురిసినందున పత్తి, కంది, జొన్నల విత్తనాలకు తగిన డిమాండ్ ఉందని, రైతులకు అవసరమైన వాటిని నిల్వ ఉంచి రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంచాలని కర్ణాటక రైతు సంఘం, హసిరు సేన జిల్లాధ్యక్షుడు సంగనకల్లు కృష్ణ జిల్లాధికారికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన జిల్లాధికారి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. రైతులకు ఈ సీజన్‌లో సాగు విత్తనాలతో పాటు రసాయనిక ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. మిర్చి విత్తనాలు నాశిరకం కాకుండా చూడాలన్నారు. బ్లాక్ మార్కెట్‌లో విక్రయించకుండా సంబంధిత ఉద్యానవన శాఖ అధికారులు సంబంధిత అంగళ్లలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆ వినతి పత్రంలో కోరారు. కరువు కాలం పంట బీమా ఇప్పటి వరకు రైతుల ఖాతాలోకి జమ కాలేదన్నారు. ఈ విషయంపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలన్నారు. లేకుంటే రైతుల పోరాటం అనివార్యం అవుతుందన్నారు. ప్రస్తుత టీబీ డ్యాంలోకి ప్రవాహం అధికమైందని, ఉత్తమ రీతిలో నీరు నిల్వ అయితే జూలైలో రెండు వైపులా కాలువలకు నీటిని వదిలే నిర్ణయం తీసుకోవాలన్నారు. దీంతో రైతులకు రెండో పంట సాగుకు అనుకూలం అవుతుందని ఆయన కోరారు. ఈ సందర్భంగా కే.మారెణ్ణ, బేవినగిడ ఎర్రిస్వామి, శ్రీరాములు, తిమ్మప్ప, వీ.జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

వినయ్ కులకర్ణికి చుక్కెదురు

హుబ్లీ: ధార్వాడ జెడ్పీ సభ్యుడు యోగీష్‌గౌడ హత్య కేసులో కాంగ్రెస్ మాజీ మంత్రి, ప్రస్తుత ధార్వాడ గ్రామీణ ఎమ్మెల్యే వినయ్ కులకర్ణిపై పెట్టిన కేసులు సబబే అన్న సుప్రీంకోర్టు సీబీఐ ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. విచారణలో ఉన్న కోర్టు తీర్పును గతంలో సమర్థించిన హైకోర్టు ఆ తీర్పులో జోక్యం చేసుకోవడానికి న్యాయమూర్తులు పీవీ సంజయ్ కుమార్, అగస్టిన్ జార్జ్ మసిక్‌లతో కూడిన పీఠం నిరాకరించింది. సీబీఐ ప్రత్యేక కోర్టు ఆదేశాలను కర్ణాటక హైకోర్టు కూడా సమర్థించింది. తమకు వ్యతిరేకంగా పెట్టిన చార్జిషీట్ ప్రత్యేక కోర్టులో జరిగే విచారణ ప్రక్రియను రద్దు చేయాలని కోరుతూ హైకోర్టు వినయ్ కులకర్ణి రిట్ సమర్పించారు. గత ఏప్రిల్ 8న కేసు అర్జీ విచారణ జరిపి తీర్పు రిజర్వు చేసిన న్యాయమూర్తి కృష్ణ ఎస్.దీక్షిత్ ధర్మాసనం ఎమ్మెల్యే వినయ్ కులకర్ణికి వ్యతిరేకంగా చార్జిషీట్ రద్దుకు నిరాకరించింది. దీంతో వినయ్ కులకర్ణి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే సుప్రీం కోర్టు కూడా విచారణ కోర్టు తీర్పునే సమర్థించింది. జెడ్పీ బీజేపీ సభ్యుడు యోగీష్‌గౌడను 2016 జూన్ 15న దారుణంగా హత్య చేశారు. ఈ కేసులో 2020 నవంబర్‌లో వినయ్ కులకర్ణిని అరెస్ట్ చేశారు. ఆయన బెళగావి హిండలగా జైలు కేంద్ర కారాగృహంలో 9 నెలల పాటు జుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ఈ కేసును సీబీఐ దర్యాప్తు చేపట్టి మొత్తం 21 మంది నిందితులకు వ్యతిరేకంగా ప్రత్యేక కోర్టుకు చార్జిషీట్ సమర్పించింది. హత్య కేసులో నిందితుడు నేపథ్యంలో ధార్వాడ జిల్లాలోకి ప్రవేశించకుండా గతంలోనే కోర్టు షరతులతో కూడిన బెయిలు మంజూరు చేసింది. ఒక వేళ ధార్వాడకు వెళితే బెయిలు రద్దు చేస్తామని హెచ్చరికలు జారీ చేసింది. గత అసెంబ్లీ ఎన్నికలలో గెలిచినప్పటికీ వినయ్ కులకర్ణికి ధార్వాడ జిల్లాలోకి ప్రవేశంపై ఉన్న నిర్బంధాన్ని తొలగించలేదు.

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ


టోర్నీ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

బళ్లారిఅర్బన్: కంటోన్మెంట్ ఎన్‌సీసీ మైదానంలో ఈ నెల 13 నుంచి నాలుగు రోజుల పాటు జిల్లా వృత్తి నిరత ఛాయాగ్రాహకులు, వీడియో గ్రాఫర్స్ అండ్ స్టూడియో యజమానుల సంఘం ఆధ్వర్యంలో విక్కీ బాల్ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని ఆ సంఘం అధ్యక్షుడు నాడగౌడ చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం స్థానిక నారాయణరావ్ పార్క్‌లో టోర్నమెంట్‌పై సన్నద్ధత సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. ఫోటో గ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు, చక్కటి శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు వృత్తి పర ఒత్తిళ్ల నుంచి బయటకు రావడానికి ప్రతి ఏడాది జిల్లాలో టోర్నమెంట్ నిర్వహిస్తున్నామన్నారు. ఆ క్రమంలోనే ఈ సారి టోర్నమెంట్‌ను బళ్లారిలో నిర్వహిస్తున్నామన్నారు. టోర్నమెంట్‌లో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి సుమారు 18 జట్లు పాల్గొంటున్నాయన్నారు. విజేత జట్టుకు తొలి బహుమతిగా రూ.40 వేలు, రెండో బహుమతిగా రూ.25 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేల నగదుతో పాటు ట్రోఫీని అందజేస్తామన్నారు. సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బీ.గోపాల్, ఉపాధ్యక్షుడు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున ఉపాధ్యక్షుడు ఖాదర్‌బాషా, వీరేష్, జీటీ రమేష్, కోశాధికారి సుభాన్‌సాబ్, రాఘవేంద్రతో పాటు పలువురు వీడియోగ్రాఫర్లు, ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

తృణధాన్యాలతో ఆరోగ్యకర జీవితం


మాట్లాడుతున్న మనోజ్ తదితరులు

హొసపేటె: మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే చిరుధాన్యాలు అవసరమని, వ్యాధి రహితంగా జీవించవచ్చని, రైతులు చిరుధాన్యాలను ఎక్కువగా పండించేలా ప్రోత్సహించాలని ధర్మస్థళ గ్రామీణాభివృద్ధి యోజన కేంద్ర కార్యాలయం వ్యవసాయ సంచాలకులు మనోజ్ తెలిపారు. విజయనగర జిల్లా కూడ్లిగిలోని శ్రీక్షేత్ర ధర్మస్థళ గ్రామాభివృద్ధి యోజన ప్రణాళిక కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధర్మస్థళానికి చెందిన 20 సంస్థల నుంచి జొన్నలు పండించే రైతులను సంప్రదించి నేరుగా వినియోగదారులకే విక్రయించేలా, కార్పొరేట్ రైతుల నుంచి నేరుగా సేకరించిన తృణధాన్యాలు వినియోగదారులకే విక్రయించేలా ఏర్పాట్లు చేశామన్నారు. కార్పొరేట్ రైతుల నుంచి నేరుగా సేకరించిన తృణధాన్యాలు వినియోగదారులకు ఉత్తమమైన, ఆకర్షణీయమైన ధరలకు అందుబాటులో ఉంచుతామన్నారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ మనోజ్ మెనేజ్, వ్యవసాయ ప్రాజెక్టు అధికారి జయానంద్, కూడ్లిగి తాలూకా ప్రాజెక్టు అధికారి సంతోష్‌కుమార్, మహాలింగయ్య, మేనేజర్ రేవణ్ణ, ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నీట్‌లో ర్యాంకుల పంట


విద్యార్థులతో ఇనిస్టిట్యూట్ ప్రముఖులు

సాక్షి,బళ్లారి: ఇటీవల వెలువడిన నీట్‌లో ఆకాష్ ఇనిస్టిట్యూట్‌కు ర్యాంకుల పంట పండిందని ఆ సంస్థ ప్రముఖులు అభిషేక్, ప్రజ్వల్ కుమార్ తెలిపారు. మంగళవారం నగరంలోని పార్వతీనగర్‌లోని ఆకాష్ ఇనిస్టిట్యూట్ కార్యాలయంలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను సన్మానించి మాట్లాడారు. దేశ వ్యాప్తంగా నీట్‌లో ర్యాంకులు సాధించిన వారిలో 720 మార్కులకు గాను 720 మార్కులు సాధించిన వారు 21 మంది విద్యార్థులు ఉన్నారని గుర్తు చేశారు. బళ్లారికి చెందిన ఆకాష్ ఇనిస్టిట్యూట్ విద్యార్థులైన ఉత్కర్ష సింగ్ 680, వీపీ పాటిల్ 627, మహమ్మద్ సయ్యద్ 615, వరుణ్‌గౌడ 615, శివకుమార్ 606, సంతోష్ 594, కీర్తి 587 మార్కులు సాధించడంతో పాటు పలువురికి కూడా మంచి మార్కులు వచ్చినందున ఎంబీబీఎస్‌లో సీట్లు లభిస్తాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పత్తి సాగులో మెళకువలపై జాగృతి శిబిరం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రముఖులు

బళ్లారిఅర్బన్: బళ్లారి, రాయచూరు, కొప్పళ, విజయనగర జిల్లాల్లో పత్తి సాగు ప్రముఖమైందని, వాతావరణానికి అనుగుణంగా రైతులు ఏ విత్తనాలను సాగు చేయాలనే విషయంపై అవగాహన పెంచుకోవాలని, ఆ మేరకు విత్తనాలు సాగు చేస్తే నష్టం నుంచి తప్పించుకోవడానికి సహకారం అవుతుందన్న ఉద్దేశంతో ఈ జాగృతి శిబిరం చేపట్టామని వ్యవసాయ శాఖ జేడీ కెంగేగౌడ తెలిపారు. ఈ శిబిరంలో సమగ్రమైన సమాచారం ఇవ్వడానికి నిపుణులైన శాస్త్రవేతలు ఉన్నారని, తమ సమస్యలను వివరించి పరిష్కరించుకోవాలని సూచించారు. ఏపీఎంసీ ఆవరణలో మంగళవారం జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్, కర్ణాటక కాటన్ అసోసియేషన్ తదితర సంఘాల ఆధ్వర్యంలో రైతులకు పత్తి పంట సాగుపై జాగృతి శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రముఖులు బీ.మహారుద్రగౌడ మాట్లాడుతూ జిల్లాలో విత్తనాలు, ఎరువులు తగినంత నిల్వ ఉన్నాయన్నారు. పత్తి సాగులో పలు సమస్యలపై కొత్త కొత్త పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. రైతులు పంట బీమా చేయిస్తే పంట నష్టం జరిగితే పరిహారం పొందే అవకాశం ఉంటుందన్నారు. సంబంధిత శాస్త్రజ్ఞులు డాక్టర్ ఏజీ శ్రీనివాస్, డాక్టర్ జేఎం నిడగుంది మాట్లాడుతూ పత్తి సాగుపై అన్నదాతలకు పలు విషయాల గురించి సూక్ష్మంగా వివరించారు. కార్యక్రమంలో రాయచూరు జిల్లా కాటన్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ 65 కాటన్ మిల్లులు ఉన్నాయి. అయినా పత్తిసాగు ఏటేటా తగ్గు ముఖం పడుతోందని, పరిస్థితి ఇలాగే కొనసాగితే పత్తి పరిశ్రమలను మూసివేసే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రముఖులు శాంతిలాల్, దొడ్డనగౌడ, చిదానందప్ప, గణపాల్ ఐనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కులపై జాగృతి అవసరం


సన్మానం అందుకున్న శివకుమారగౌడ

శ్రీనివాసపురం: ఇటీవల మానవ హక్కులకు భంగం వాటిల్లుతున్నందున వాటిపై ప్రజలను జాగృతం చేయాల్సిన అవసరం ఉందని జాతీయ మానవ హక్కుల జాగృతి, అవినీతి నిర్మూలన సంస్థ జాతీయ సంస్థాపక అధ్యక్షుడు శివకుమారగౌడ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహంలో నూతన పదాధికారుల ఎంపిక కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. తాలూకాలో అనేక సమస్యలు తాండవిస్తూ అవినీతి, అక్రమాలు పెచ్చుమీరుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం ఇవ్వనిదే ఏ పనీ సక్రమంగా జరగడం లేదు. దీనిపై ప్రజా పోరాటానికి సిద్ధం కావాల్సి ఉందన్నారు. సమాజంలో అవినీతికి అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతో జాతీయ మానవ హక్కుల జాగృతి, అవినీతి నిర్మూలన సంస్థను స్థాపించి రాష్ట్రంలోని అన్ని తాలూకాల్లోనూ పదాధికారులను ఎంపిక చేశామన్నారు. నూతన పదాధికారులు అవినీతి నిర్మూలనే ధ్యేయంగా పని చేయాలన్నారు. తాలూకా కార్మిక విభాగం అధ్యక్షుడిగా హెచ్‌ఎం అరుణ్, తాలూకా గౌరవ అధ్యక్షుడిగా సయ్యద్ యాసిన్, తాలూకా గౌరవ అధ్యక్షుడిగా వాసవి రామణ్ణ, విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా సుమన్‌లను ఎంపిక చేశారు.

ట్రాఫిక్ కానిస్టేబుళ్ల సేవాభావం భేష్


అడ్డదిడ్డంగా పడ్డ రాళ్లను సరిచేస్తున్న పోలీసులు

రాయచూరు రూరల్: నగరంలో ట్రాఫిక్ కానిస్టేబుళ్లు స్వచ్ఛందంగా రోడ్డు మరమ్మతు పనులను చేపట్టారు. మంగళవారం నగరంలోని బసవేశ్వర సర్కిల్‌లో డివైడర్లు చిందర వందరగా పడ్డాయి. వాటిని హెడ్ కానిస్టేబుల్ ఈరప్ప జాధవ్, సిద్దలింగప్ప నాయక్ సర్దిపెట్టారు. వానా కాలంలో వాహనాలు అధిక స్పీడుతో వెళుతుంటాయి. నగర సభ అధికారులు, చెత్తను తొలగించే పారిశుధ్య కార్మికులు నిర్లక్ష్యం వహించారు. బసవేశ్వర సర్కిల్‌లో చిందర వందరగా పడిన డివైడర్లను ఒక చోటకు చేర్చి వాటిని సరి చేశారు.

అభివృద్ధికే మొదటి ప్రాధాన్యత


ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్

కోలారు: కోలారు నియోజకవర్గ అభివృద్ధికే మొదటి ప్రాధాన్యత ఇస్తానని, ప్రభుత్వం నుంచి నిధులు తెచ్చి నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తానని, ప్రతిపక్షాల విమర్శలను పట్టించుకునేది లేదని ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ తెలిపారు. మంగళవారం నగరంలోని తన కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం మాట్లాడారు. కోలారమ్మ దేవాలయ రహదారి అభివృద్ధికి ప్రజలు విన్నవించారు. వెంటనే అధికారులకు సూచించి రహదారికి మరమ్మతులు చేయిస్తానన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తేవాలని అధికారులకు సూచించారు. కోలారు నగరంలోని అన్ని రహదారులను దశలవారీగా అభివృద్ధి చేస్తామన్నారు. ముళబాగిలు నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తాను చేసిన అభివృద్ధి కార్యక్రమాలను చూసి కేవలం 20 రోజుల అవధిలో కోలారు ప్రజలు తనను ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు,. ప్రజల రుణం తీర్చుకోవడానికి తాను సదా సిద్ధంగా ఉంటానన్నారు. నియోజకవర్గంలో నిర్వహించే అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కొరత లేదన్నారు. రింగ్ రోడ్డు నిర్మాణానికి ఇప్పటికే డీపీఆర్ సిద్ధం చేశారని, సత్వరం పనులు ప్రారంభిస్తారన్నారు.

సరళంగా మారెమ్మ ఉత్సవాలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


ఊయల సేవలో పాల్గొన్న భక్తులు

రాయచూరు రూరల్: నగరంలో సరళంగా మారెమ్మ ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. మంగళవారం నగరంలోని కంచుగడ్డ మారెమ్మ ఆలయంలో అభిషేకం, పాదుకాపట్ట, జలాభిషేకం, పుష్పాలంకరణ చేశారు. భక్తులు దేవి ఆలయంలో విశేష పూజలు చేశారు. భక్తులు తెల్లవారు జామున ఊయల సేవలను చేపట్టారు.

ఈ సందర్భంగా నగరసభ సభ్యుడు పవన్ కుమార్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రవీంద్ర జాలదార్, భరత్‌లున్నారు.

భక్తులకు అన్నదానం


అన్నదానం చేస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: నేటి ఆధునిక యుగంలో హిందూ సనాతన సంప్రదాయాలతో లభించే మోక్ష మార్గం స్వామీజీల ఆశీర్వాదం భక్తులకు ఉత్కృష్టమైనవని మడ్డిపేటె నీలగిరి సాలి మఠం పీఠాధిపతి సూగూరయ్య మహాస్వామీజీ పేర్కొన్నారు. మంగళవారం నగరంలో మటమారయ్య మహాస్వామీజీ 66వ వర్ధంతిలో భాగంగా జల, క్షీర, భస్మ, గంధాభిషేక, పుష్పాలంకరణలు చేశారు. కార్యక్రమంలో సిద్దనగౌడ, విరుపాక్షయ్య, హరినాథ్, మారెప్ప, బసవ ప్రభు, రవి, అరుణ్, విక్రమ్ గౌడ, ఆత్మకూరు, నాల్వార, యాదగిరి, కలబుర్గి, మాన్వి, తెలంగాణల నుంచి భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు.

పిల్లలు, వృద్ధులకు అన్నదానం

హొసపేటె: వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, కన్నడ, సంస్కృతి శాఖ, కొప్పళ జిల్లా ఇంచార్జి మంత్రి శివరాజ్ తంగడిగి జన్మదిన వేడుక సందర్భంగా గంగావతి నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కార్యకర్తలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రామనగర్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను సందర్శించి ఇన్‌పేషంట్లకు పండ్లు, బ్రెడ్, పాలు పంపిణీ చేసి ఆరోగ్యం కోసం సెంటర్‌లో మొక్కలు నాటారు. అనంతరం కంప్లి రోడ్డులోని గంగావతి నగర లయన్స్ ఛారిటబుల్ ట్రస్ట్‌లోని బుద్ధిమాంద్యం గల పిల్లల వసతి గృహాన్ని, మరనాథ్ చారిటబుల్ ట్రస్ట్‌కు చెందిన నవజీవన వృద్ధాశ్రమాన్ని సందర్శించి పిల్లలకు, వృద్ధులకు అన్నదానం చేశారు.

పెంపుడు కుక్క మృతిపై ఘర్షణ

హుబ్లీ: బస్సు ఢీకొని పెంపుడు కుక్క మృతి చెందిన నేపథ్యంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్, కుక్క యజమాని మధ్య ఘర్షణ చోటు చేసుకొని దాడి జరిగిన ఘటన హుబ్లీలో మంగళవారం వెలుగు చూసింది. ఇక్కడి గదగ్ రోడ్డు నివాసి పెంచుకున్న బాక్సర్ జాతి కుక్కపై కలబుర్గి నుంచి హుబ్లీకి వస్తున్న బస్సు హుబ్లీ-గదగ్ రోడ్డులో ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన కుక్క స్థలంలోనే మృతి చెందిన నేపథ్యంలో డ్రైవర్, యజమాని మధ్య ఘర్షణ జరిగి డ్రైవర్ సదరు కుక్క యజమానిపై దాడి చేసినట్లు తెలిసింది.

ఎలుగుబంట్ల దాడిలో చెరుకు పంట నష్టం

హొసపేటె: విజయనగర జిల్లా కూడ్లిగి సమీపంలోని అమరదేవరగుడ్డ గ్రామానికి చెందిన రైతు ధర్మానాయక పొలంలో ఎలుగుబంట్లు దాడి చేసి భారీగా పంట కల్లోలం చేశాయి. చేతికి వచ్చిన చెరుకు పంట నోటికి అందకుండా చేశాయి. గత సారి కూడా మొక్కజొన్న పంటపై ఎలుగుబంట్లు దాడి చేయగా ఈ సారి ఎలుగుబంట్లు చెరుకు పంటపై దాడి చేసి ధ్వంసం చేశాయి. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతన్నకు ఎలుగుబంట్ల దాడితో పంట నష్టం కావడంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ఎలుగుబంట్ల సంచారాన్ని అరికట్టేందుకు సంబంధిత అటవీ శాఖాధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

అక్రమంగా గోవుల రవాణా పట్టివేత

హుబ్లీ: అక్రమంగా గోవులను తరలిస్తున్న వాహనంపై భజరంగదళ్ కార్యకర్తలు సదరు గూడ్స్ వాహనాన్ని అడ్డగించి ధార్వాడ ఉపనగర పోలీసులకు అప్పగించిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. బెళగావి నుంచి రోడ్డు మార్గం మీదుగా క్యాంటర్ వాహనంలో గోవులను రవాణా చేస్తున్నట్లుగా తెలుసుకున్న వీహెచ్‌పీ, భజరంగదళ్ కార్యకర్తలు ఇక్కడి వ్యవసాయ విశ్వవిద్యాలయం వద్ద ఆ వాహనాన్ని నిలిపి తనిఖీ చేశారు. అందులో అక్రమంగా గోవులను తరలిస్తున్నట్లుగా ధృవీకరించుకొని గోవులతో పాటు వాహనాన్ని ఉపనగర పోలీసులకు అప్పగించారు. పోలీసులు ఇద్దరు క్లీనర్లను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. ఆవు దూడలతో పాటు 10కి పైగా గోవులను గోశాలకు తరలించారు.

డ్యాంకు పెరుగుతున్న వరద


తుంగభద్ర డ్యాం

హొసపేటె: కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల పలు జిల్లాల ప్రజలు, రైతులకు తాగు, సాగు నీరందించే ప్రధాన జలాశయం తుంగభద్ర డ్యాంకు మంగళవారం సుమారు 5 వేల క్యూసెక్కులకు పైగా వరద నీరు వచ్చి చేరింది. ప్రస్తుతం నైరుతి రుతుపవనాల రాకతో డ్యాంకు ఎగువన కురుస్తున్న వర్షాలతో డ్యాంలోకి ఇన్‌ఫ్లో ప్రారంభమైంది. దీంతో ఆయకట్టు రైతులు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని రోజుల్లో డ్యాంకు మరింత వరద నీరు వచ్చే అవకాశం ఉందని సమాచారం. ప్రస్తుతం డ్యాంలో నీటిమట్టం 1580.90 అడుగులు, నీటినిల్వ 4.924 టీఎంసీలు ఉందని అధికారులు తెలిపారు.

నిప్పంటుకుని కారు దగ్ధం

హుబ్లీ: నలవడి టోల్‌గేట్ దగ్గర కారుకు ఆకస్మికంగా నిప్పు రాజుకొని దగ్ధమైన ఘటన సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గదగ్ రెవెన్యూ శాఖలో ఎఫ్‌డీఏగా పని చేస్తున్న సునీల్ పాటిల్‌కు చెందిన కారు హుబ్లీకి వచ్చి తిరిగి వెళుతుండగా నలవడి టోల్‌గేట్ వద్ద ఈ ప్రమాదానికి జరిగింది. నిప్పు రాజుకొని కారు పూర్తిగా కాలిపోయింది. ఘటనపై అణ్ణిగేరి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.